
'రాష్ట్రంలో నిరుపేదలెవరూ డబ్బులేని కారణంగా ఉన్నత విద్యకు దూరం కాకూడదు. అందుకే ఫీజుల చెల్లింపు పథకాన్ని చేపట్టాం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 16
సంచిక: 312

గురువారం 25-7-2024



విజయోస్తు..
ఒలింపిక్స్‌కు భారత్ బలగం రెడీ..
16 క్రీడాంశాల్లో 117 మంది పోటీ -12లో



భవిత 'బంగారమే'
ఇప్పుడు తగ్గినా.. పసిడి ధరలు
మున్ముందు పైపైకే - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

టీడీపీ హింసాకాండకు సంబంధించిన దృశ్యాలను చూస్తున్న యూపీ మాజీ సీఎం అఖిలేశ్‌యాదవ్, వైఎస్ జగన్, ఐయూఎంఎల్ ఎంపీ వాహబ్ తదితరులు





నరమేధంపై కన్నెర్ర

అరాచకాన్ని అడ్డుకుందాం

ప్రజాస్వామ్య పరిరక్షణకు అండగా నిలవండి
జాతీయ మీడియాతో మాజీ సీఎం వైఎస్ జగన్

- ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది
- 30కి పైగా హత్యలు.. 1000కి పైగా దాడులు
- వందల్లో హత్యాయత్నాలు, ఊరూరా విధ్వంసాలు
- ఎంపీలే బయట తిరగలేని పరిస్థితి
- దమనకాండకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు వీక్షించండి
- ఇలాంటివి ప్రజాస్వామ్య వ్యవస్థలో కొనసాగొచ్చా?

2లో

ఏపీలో ఆటవిక పాలనపై జాతీయ పార్టీల ఆగ్రహం

చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండపై హోరెత్తిన ఢిల్లీ

- టీడీపీ కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు.. మరో మణిపూర్‌గా మారకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి
- దారుణకాండపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలి
- ఆ ప్రభుత్వాన్ని ఎందుకు బర్తరఫ్ చేయకూడదు?
- సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, శివసేన (ఉద్ధవ్), ఆప్, ఏఐఏడీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఐయూఎంఎల్, ఎంఐఎం, వీసీకే సహా పలు పార్టీల మండిపాటు
- విధ్వంసకాండకు సంబంధించిన వీడియో, ఫొటో ప్రదర్శనలు తిలకించిన నేతలు
- రాష్ట్రంలో పరిస్థితులపై జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతల విస్మయం
- వైఎస్సార్‌సీపీ పోరాటాలకు మద్దతుగా ఉంటామని హామీ
- ఏపీలో అరాచకాన్ని చూసి విస్తుపోయిన జాతీయ మీడియా

2లో



ఇలాగైతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండరు

"పట్టపగలే దాడులు, హత్యలు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం, ప్రజా ప్రతినిధులపై ఏకంగా హత్యాయత్నం చేయడం.. ఇలాంటి బుల్డోజర్ సంస్కృతితో ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు? ఇలాగైతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండరు.
- ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ నేత అఖిలేశ్‌యాదవ్



ఒక్కరోజు కూడా పాలించే అర్హత లేదు

"ఆంధ్రప్రదేశ్‌లో అరాచకం రాజ్యమేలుతోంది. అక్కడ అసలు ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉన్నాయా? ఏపీ ప్రభుత్వానికి ఒక్క రోజు కూడా పాలించే హక్కు లేదు.
- శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్



ఏపీలో పరిస్థితి దిగ్భ్రాంతికరం

"ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి చూసి దిగ్భ్రాంతికి గురయ్యా. ఏ స్థాయిలో దౌర్జన్యాలు జరిగాయో చూస్తే బాధ అనిపిస్తోంది. - తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్

ఇది ప్రభుత్వ ఉగ్రవాదం

"ఏపీలో ప్రభుత్వమే స్వయంగా ఉగ్రవాదానికి పాల్పడుతోంది. ప్రభుత్వ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న జగన్‌కు అండగా నిలుస్తాం.
- ఐయూఎంఎల్ ఎంపీ వాహబ్



కేంద్రం జోక్యం చేసుకోవాలి

"ప్రజలందరినీ రక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంటుంది. కానీ, ఏపీలో అది జరగడం లేదు. దౌర్జన్యాలు, అరాచకాలను కేంద్రం అడ్డుకోవాలి
- ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదొరై



శాంతి భద్రతలను కాపాడాలి

"రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యాలపై ఫొటోలు, వీడియోలు చూశాం. అక్కడి పరిస్థితి చాలా దారుణంగా ఉంది. ఈ ఘటనలను మా పార్టీ ఖండిస్తోంది.
- వీసీకే అధినేత తిరుమావలవన్



వారికీ, దేశద్రోహులకు తేడా ఏముంది?

"ఇది చాలా బాధాకరం. ఎన్నికల్లో గెలిచిన పార్టీ, ఓడిన వారిపై దాడులు చేసి ప్రాణాలు తీయడం ఏంటి? వారికి, దేశద్రోహులకు తేడా ఏముంది?
- ఆప్ ఎమ్మెల్యే రాజేంద్రపాల్‌గౌతమ్



- వివరాలు 2,5,10లో

దమనకాండకు ఇవిగో సాక్ష్యాలు

- ఏపీలో కూటమి ప్రభుత్వ అరాచకాలను కళ్లకు కట్టిన ఫొటో ఎగ్జిబిషన్
- దమనకాండ గురించి వివరిస్తూ వైఎస్ జగన్ భావోద్వేగం
- ఫొటో ఎగ్జిబిషన్‌పై జాతీయ మీడియా ప్రత్యేక కథనాలు
- ఏపీలో ఏం జరుగుతోందని ఉత్తరాది ప్రజల్లో చర్చ

- వివరాలు 10లో

మందు 'బాబు' దందానే!

2014–19లో టీడీపీ సిండికేట్ గుప్పిట్లోనే మద్యం.. ఆ ఐదేళ్లలో రూ.12.50 లక్షల కోట్ల దోపిడీ

- ఊరూ పేరూ లేని బ్రాండ్లు తెచ్చిందే బాబు
- పచ్చ నేతల గుప్పిట్లోనే డిస్టిలరీలు
- మద్యం దందాపై వైఎస్సార్‌సీపీ ఉక్కుపాదం
- నాణ్యతా ప్రమాణాల కోసం అధునాతన ల్యాబ్‌లు
- 2019–24 మధ్య రాష్ట్రంలో గణనీయంగా తగ్గిన విక్రయాలు
- తేల్చి చెప్పిన ఎక్సైజ్ గణాంకాలు, కేంద్ర హోంశాఖ నివేదిక



సాక్షి, అమరావతి: శాసనసభ సాక్షిగా 'పచ్చ' దయ్యాలు వేదాలు వల్లించాయి! మద్యం సిండికేట్‌ను గుప్పిట్లో పెట్టుకుని గతంలో ఐదేళ్లు యథేచ్ఛగా దోపిడీకి పాల్పడ్డ చంద్రబాబు బృందం నీతులు వల్లిస్తోంది! ఎన్నికల హామీలను అమలు చేయలేక సాకులు అన్వేషిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు శ్వేతపత్రాల నాటకంలో బుధవారం మరో అంకానికి తెర తీశారు. ఎక్సైజ్ శాఖపై శ్వేతపత్రం పేరుతో అవాస్తవాలు, అభూత కల్పనలు జోడించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసేందుకు యత్నించారు. కానీ 2014–19 మధ్య టీడీపీ హయాంలో ఏకంగా రూ.12.50 లక్షల కోట్లు కొల్లగొట్టిన టీడీపీ నేతల మద్యం దోపిడీ బహిరంగ రహస్యమే. ఎన్నికల మేనిఫెస్టోకు కట్టుబడి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం 2019–24 వరకు

మిగతా 14వ పేజీలో ▶

మద్యం పేదల వ్యసనం

- శ్వేతపత్రం విడుదల సందర్భంగా సీఎం చంద్రబాబు
- గత ప్రభుత్వ పాలసీతో తెలంగాణ, కర్ణాటక ఆదాయం పెరిగింది
- ధరలు పెంచేసి అందుబాటులో లేకుండా చేశారు
- సీబీడీ, ఈడీతో దర్యాప్తు చేయిస్తాం

14లో

ఘటనా స్థలిలో సిబ్బంది సహాయక చర్యలు



నేపాల్‌లో కూలిన విమానం

- 18 మంది మృతి, పైలట్‌కు గాయాలు
- కఠ్మాండ్ టీఐఏలో టేకాఫ్ అవుతుండగా ఘటన
- విచారణకు ఆదేశించిన ప్రభుత్వం
- నేపాల్‌లో 61 ఏళ్లలో 72 విమాన ప్రమాదాలు.. 935 మంది మృత్యువాత

6లో



ఇనంజగత్



మళ్లీ వర్షాల ముప్పు

27న బంగాళాఖాతంలో మరో అల్పపీడనం



సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రానికి మళ్లీ వర్షాల ముప్పు పొంచి ఉంది. ఇంతకుముందు ఏర్పడిన వాయుగుండం బలహీనపడినా.. అల్పపీడనంగా మారి ఉత్తర ఒడిశా, ఛత్తీస్‌గఢ్ మీదుగా కొనసాగుతోంది. మరోవైపు పశ్చిమ బెంగాల్ సముద్ర తీరంలో 26వ తేదీ రాత్రి లేదా 27న అల్పపీడనం ఏర్పడే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ అల్పపీడనం ఒడిశా మీదుగా ఆంధ్రప్రదేశ్ వైపు పయనించనుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుతం ఛత్తీస్‌గఢ్, దక్షిణ ఒడిశా మీదుగా కొనసాగుతున్న అల్పపీడనంలో విలీనమై మరింత బలపడనుంది. దీని ప్రభావం ఉత్తరాంధ్ర మినహా.. రాష్ట్రంపై అంతగా ఉండదని అంచనా వేస్తున్నారు. 27వ తేదీ సాయంత్రం నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు పడే సూచనలున్నాయి. మరోవైపు.. ఏపీపై రుతుపవనాలు బలంగా విస్తరించిన నేపథ్యంలో రాత్రి సమయాల్లో వర్షాలు 2 రోజుల పాటు కొనసాగనున్నాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు పడే అవకాశాలున్నాయని వెల్లడించారు. తీరం వెంబడి గంటకు 30 నుంచి 40 కి.మీ. వేగంతో బలమైన ఈదురుగాలులు వీస్తాయని.. మత్స్యకారులు 4 రోజులపాటు వేటకు వెళ్లొద్దని అధికారులు హెచ్చరించారు. కాగా.. ఆగస్టు మొదటి వారంలో ఏపీ మీదుగా మరో అల్పపీడనం ఏర్పడే అవకాశాలు కనిపిస్తున్నాయని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

తల్లికి వందనం ఇప్పుడే కాదు



- 'తల్లికి వందనం' ఇప్పట్లో ఉండదని పరోక్షంగా చెప్పిన మంత్రి లోకేశ్
- విధివిధానాల తయారీకి సమయం పడుతుందని మండలిలో వెల్లడి
- గత ప్రభుత్వం నాడు–నేడు కింద వందల కోట్లు ఖర్చు పెట్టిన మాట వాస్తవమని అంగీకారం
- టీచర్ల భర్తీ వచ్చే సంవత్సరానికి పూర్తి చేస్తామన్న మంత్రి

- వివరాలు 14లో

దళితులపై దాష్టీకం


ధర్మవరంలో దళిత మహిళలను చిత్రహింసలు పెట్టిన టీడీపీ నేతలు



అనంతపురం ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు పద్మ

- ఆలస్యంగా వెలుగు చూసిన దారుణం
- అనంతపురం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులు
- ఫిర్యాదు ఇచ్చినా కేసు నమోదు చేయని పోలీసులు
- రక్షించండంటూ మంత్రి సత్యకుమార్‌కు బాధితుల వేడుకోలు

3లో




సింగపూర్ పాస్‌పోర్టు పవర్‌ఫుల్
సింగపూర్ పాస్‌పోర్టు చేతిలో ఉంటే 195 దేశాలకు వెళ్లొచ్చు. 'పాస్‌పోర్టు ఇండెక్స్'లో ఇండియాకు 82వ స్థానం దక్కింది.
వివరాలు 6లో ▶



రూ.10 లక్షల జరిమానా
పరీక్షల్లో అక్రమాలు, లీకేజీల అడ్డుకట్టకు బిహార్ కీలక బిల్లు తెచ్చింది. అక్రమాలకు పాల్పడితే 10 లక్షల జరిమానా విధిస్తారు.
వివరాలు 6లో ▶



లాలూకు అస్వస్థత
ఆర్జేడీ చీఫ్ లాలూప్రసాద్ యాదవ్ ఆరోగ్యం క్షీణించింది. ఆయనను ఢిల్లీ ఎయిమ్స్‌కు తరలించి చికిత్స అందిస్తున్నారు.
వివరాలు 6లో ▶



అపనమ్మకమే అసలు సమస్య
ప్రభుత్వం–రైతుల మధ్య అపనమ్మకాన్ని తొలగించేందుకు ఒక కమిటీని వేయాలని పంజాబ్, హరియాణాకు సుప్రీం సూచించింది.
వివరాలు 6లో ▶



ఢిల్లీ ధర్నాకు 9 పార్టీల సంఘీభావం

- సమాజ్‌వాదీ
- శివసేన (ఉద్ధవ్ థాక్రే)
- ఏఐఏడీఎంకే
- తృణమూల్ కాంగ్రెస్
- ఆమ్ ఆద్మీ
- వీసీకే
- ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్
- జేఎంఎం
- ఎంఐఎం


సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్‌ను ఆప్యాయంగా పలుకరిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్. చిత్రంలో ఎంపీలు.. మద్దిల గురుమూర్తి, మిథున్ రెడ్డి, ఆర్.కృష్ణయ్య


శివసేన (యూబీటీ), తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ ఎంపీలు ప్రియాంక చతుర్వేది, నదీముల్ హక్, రాంగోపాల్ యాదవ్‌లకు టీడీపీ దాడుల గురించి వివరిస్తున్న వైఎస్ జగన్

నరమేధంపై కన్నెర్ర

ఏపీలో ఆటవిక పాలనపై జాతీయ పార్టీల ఆగ్రహం

చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దమనకాండపై హోరెత్తిన ఢిల్లీ

- టీడీపీ కూటమి ప్రభుత్వానికి పాలించే అర్హత లేదు..
- మరో మణిపూర్‌గా మారకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలి
- దారుణకాండపై సుప్రీంకోర్టు సుమోటోగా కేసు నమోదు చేయాలి
- ఆ ప్రభుత్వాన్ని ఎందుకు బర్తరఫ్ చేయకూడదు?
- సమాజ్‌వాదీ పార్టీ, టీఎంసీ, శివసేన (ఉద్ధవ్), ఆప్, ఏఐడీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఐయూఎంఎల్, ఎంఐఎం, వీసీకే సహా పలు పార్టీల మండిపాటు
- విధ్వంసకాండకు సంబంధించి వీడియో, ఫొటో ప్రదర్శనలు తిలకించిన నేతలు
- రాష్ట్రంలో పరిస్థితులపై జాతీయ, ప్రాంతీయ పార్టీల నేతల విస్మయం
- వైఎస్సార్‌సీపీ పోరాటాలకు మద్దతుగా ఉంటామని హామీ
- ఏపీ ఇలా మారిపోయిందా అంటూ విస్తుపోయిన జాతీయ మీడియా


జాతీయ మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న నరమేధం, ఆటవిక పాలన, హత్యా రాజకీయాలకు నిరసనగా దేశ రాజధాని ఢిల్లీలో వైఎస్సార్‌సీపీ కదంతొక్కింది. కూటమి ప్రభుత్వ ఏర్పాటు తర్వాత రాష్ట్రంలో టీడీపీ కొనసాగిస్తున్న మారణహోమంపై కన్నెర్ర జేసింది. ప్రతిపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలే లక్ష్యంగా సాగుతున్న హత్యలు, విధ్వంసకాండకు వ్యతిరేకంగా జంతర్‌మంతర్ వేదికగా బలంగా గళమెత్తింది. హత్యా రాజకీయాలకు ఫుల్ స్టాప్ పడేలా రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన పెట్టాలన్న డిమాండ్‌తో హోరెత్తించింది. టీడీపీ అరాచకంపై పిడికిలి బిగించిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, టీఎంసీ, శివసేన (ఉద్ధవ్ థాక్రే), ఆప్, ఏఐడీఎంకే, జార్ఖండ్ ముక్తి మోర్చా, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్, వీసీకే సహా పలు పార్టీల ఎంపీలు సంఘీభావం తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్య పరిరక్షణకు చేస్తున్న పోరాటానికి సంపూర్ణంగా మద్దతు ఇస్తామని ప్రకటించారు.

పిడికిలి బిగించి, గళమెత్తి..

రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులపై సాగుతున్న హత్యలు, హత్యాచారాలు, దాడులు, ఆస్తుల విధ్వంసాలను యావత్తు దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో జంతర్‌మంతర్ వేదికగా బుధవారం వైఎస్ జగన్ చేపట్టిన ధర్నాకు మంచి స్పందన లభించింది. బుధవారం ఉదయం ధర్నాకు ముందు ఢిల్లీలో భారీ వర్షం కాస్త కలవరపాటుకు గురిచేసినా, ఉదయం 11 గంటలకు ముందే పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు ధర్నా స్థలికి చేరుకున్నారు. ధర్నా ప్రాంతానికి వైఎస్ జగన్ వచ్చే సమయానికే ఆ ప్రాంతమంతా ఆ పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, రాష్ట్రం నలుమూలల నుంచి వచ్చిన వేలాది మంది నేతలు, కార్యకర్తలతో నిండిపోయింది. వైఎస్ జగన్ ధర్నా వేదికపైకి వచ్చిన వెంటనే ఆయన్ను కలిసేందుకు నేతలు పోటీపడ్డారు. ఫొటో గ్యాలరీని వైఎస్ జగన్ తిలకిస్తున్న సమయంలో 'సేవ్ ఏపీ.. ఫ్రమ్ టీడీపీ', 'నరరూప రాక్షసుడు.. నారా బాబు' అంటూ నేతలు, కార్యకర్తలు బిగ్గరగా నినాదాలు చేశారు. కార్యక్రమం ఆసాంతం నేతలు, కార్యకర్తలు టీడీపీ పాలనకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూనే ఉన్నారు. టీడీపీ పాలనపై వైఎస్ జగన్ చేసే పోరాటాలకు వెన్నంటి ఉంటామని పిడికిలి బిగించి మద్దతు పలికారు. సాయంత్రం నాలుగు గంటలకు ధర్నా ముగిసేంత వరకు ఆ ప్రాంగణం నేతలతో కిక్కిరిసిపోయింది. భారీగా నేతలు, కార్యకర్తలు తరలిరావడంతో వందల సంఖ్యలో ఢిల్లీ పోలీసులు.. పెద్ద సంఖ్యలో బారికేడ్లు ఏర్పాటు చేశారు.

దమనకాండను కళ్లకు కట్టిన పోస్టర్లు

ధర్నా వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన ఫొటో గ్యాలరీ రాష్ట్రంలో సాగుతున్న దమనకాండను కళ్లకు కట్టింది. నంద్యాల, పల్నాడు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా నెల్లూరు సహా వివిధ జిల్లాల్లో టీడీపీ కొనసాగించిన విధ్వంసకాండ, హత్యలు, దాడుల ఫొటోలు హత్యా రాజకీయాలను అద్దంలా చూపాయి. ధర్నాకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఫొటోలను వీక్షించి తీవ్ర ఉద్వేగానికి లోనయ్యారు. కొందరు ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు వారి వారి జిల్లాల్లో జరిగిన దాడుల ఫొటోలను ఇతర జిల్లాల నేతలకు చూపిస్తూ, టీడీపీ నేతల అరాచకాన్ని తూర్పారబట్టారు. ధర్నాను కవర్ చేసిన జాతీయ మీడియా సైతం ఫొటో గ్యాలరీని తమ తమ ఛానళ్లలో చూపించేందుకు ప్రాధాన్యమిచ్చింది. సభా వేదికపై ప్రదర్శించిన వీడియోలు సైతం కార్యక్రమానికి వచ్చిన వారిని తీవ్ర ఉద్వేగానికి గురిచేశాయి. ముఖ్యంగా పల్నాడు జిల్లా వినుకొండలో ఇటీవల హత్యకు గురైన రషీద్ వీడియోను చూసిన వారంతా ఒక్కసారి ఖిన్నులైపోవడం కనిపించింది. ఇంత దారుణాన్ని తమ జీవితంలో చూడలేదని అభిప్రాయపడ్డారు. నరమేధానికి సంబంధించిన ఫొటోలు, ప్లకార్డులను సైతం నేతలు, కార్యకర్తలు చేత పట్టుకొని జంతర్ మంతర్ చుట్టూతా ప్రదర్శన నిర్వహించారు.

కదిలివచ్చి మద్దతు పలికిన పార్టీలు

వైఎస్ జగన్ ధర్నాకు మద్దతుగా సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్, ఆ పార్టీ సీనియర్ ఎంపీ రాంగోపాల్ యాదవ్, శివసేన (ఉద్ధవ్ థాక్రే)పార్టీ ఎంపీలు సంజయ్ రౌత్, ప్రియాంక చతుర్వేది, అరవింద్ సావంత్, ఏఐఏడీఎంకే సీనియర్ ఎంపీ తంబిదొరై, మరో ఎంపీ నటరాజన్ చంద్రశేఖరన్, తృణముల్ కాంగ్రెస్ ఎంపీ నదీముల్ హక్, వీసీకే పార్టీ అధ్యక్షుడు తిరుమా వలవన్, ఆ పార్టీ ఎంపీ రవికుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ నేత రాజేంద్రపాల్ గౌతమ్, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ఎంపీలు అబ్దుల్ వాహబ్, హ్యారిస్ బీరన్, జేఎంఎం ఎంపీ విజయ్ హన్సక్ తదితరులు వైఎస్ జగన్ ధర్నాకు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా అఖిలేశ్ యాదవ్ సహా మిగతా నేతలంతా సభా వేదికపై ప్రదర్శించిన వీడియోలను, ఫొటో గ్యాలరీని వీక్షించారు. ఏపీలోని వివిధ జిల్లాల్లో జరిగిన దమనకాండను వైఎస్ జగన్ స్వయంగా నేతలకు వివరించారు. పార్టీ కార్యాలయాలపై బుల్డోజర్‌లతో దాడులు, వైఎస్సార్ విగ్రహాల విధ్వంసం, కార్యకర్తలను నడిరోడ్డుపై నరికి చంపుతున్న దృశ్యాలను చూసిన నేతలు ఒక్కసారిగా విస్మయం వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తల ఇళ్లలోకి చొరబడి సైతం దాడులకు తెగబడ్డ వైనాలు, స్వయంగా ఎంపీ మిథున్‌రెడ్డిపై జరిగిన దాడి దృశ్యాలను చూసి రాష్ట్రంలో అసలు శాంతిభద్రతలు ఉన్నాయా? అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఈ దృశ్యాలను చూసిన అనంతరం మాట్లాడిన నేతలు రాష్ట్రంలో ఆటవిక పాలన కొనసాగుతోందని, కేంద్రం చొరవ చూపి ఈ దమనకాండను ఆపాలని డిమాండ్ చేశారు. ప్రజాస్వామ్యంలో నరమేధానికి చోటు లేదని, నేరమయ రాజకీయాలు మానుకుంటేనే పార్టీలు మనుగడ సాధిస్తాయని అఖిలేశ్ యాదవ్ పేర్కొన్నారు. బుల్డోజర్ సంస్కృతిని పెంచి పోషిస్తూ, ప్రజలకు ఏం సందేశం ఇవ్వాలనుకుంటున్నారని టీడీపీ ప్రభుత్వాన్ని నిలదీశారు. అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడుతున్న వైఎస్ జగన్‌కు అండగా ఉంటామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని టీడీపీ ప్రభుత్వానికి కనీసం ఒక్క రోజు కూడా అధికారంలో కొనసాగే హక్కులేదని ఉద్ధవ్ శివసేన ఎంపీ సంజయ్ రౌత్ స్పష్టం చేశారు. రాష్ట్ర పరిస్థితులపై కేంద్ర హోం శాఖ మంత్రి వెంటనే స్పందించి, ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపాలని డిమాండ్ చేశారు. ఇదే పార్టీకి చెందిన మరో ఎంపీ అరవింద్ సావంత్ సైతం టీడీపీ మంత్రి నారా లోకేశ్ తీరును తూర్పారబట్టారు. 'ఏపీలో సీఎం కొడుకు ఏకంగా రెడ్‌బుక్ పట్టుకొని తిరుగుతున్నాడు. విపక్షంపై దాడులను ప్రోత్సహిస్తున్నాడు. ప్రజాస్వామ్యంలో ఈ తరహా విధానం ఎంత వరకు సమంజసం?' అని నిలదీశారు. మిగతా పార్టీల ఎంపీలు సైతం టీడీపీ అరాచకాలను ఖండించారు. నరమేధాన్ని అడ్డుకునే చర్యల్లో భాగంగా వైఎస్ జగన్ చేసే ప్రతి పోరాటానికి మద్దతుగా ఉంటామని సభా వేదికగా ప్రకటించారు. కాగా, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ ఈ కార్యక్రమం అనంతరం వైఎస్ జగన్‌ను విడిగా కలిసి సంఘీభావం తెలిపారు.

జగన్ ఇంటర్వ్యూకు పోటాపోటీ

టీడీపీ అరాచక పాలనపై గళమెత్తిన వైఎస్ జగన్ ఇంటర్వ్యూలను తీసుకునేందుకు జాతీయ మీడియా పోటీ పడింది. ఏఎన్ఐ, పీటీఐ, రిపబ్లిక్ టీవీ, ఇండియా టుడే, ఎన్‌డీటీవీ సహా పలు ఛానళ్లు ఇంటర్వ్యూలు తీసుకున్నాయి. సాయంత్రం 4 గంటలకు సైతం ఇంకా చాలా మంది జర్నలిస్టులు ఇంటర్వ్యూలకు పోటీ పడుతుండటంతో మిగతా వారికి మరో సమయంలో ఇస్తామని నేతలు సర్ది చెప్పాల్సి వచ్చింది.


ఐయూఎంఎల్ ఎంపీ అబ్దుల్ వాహబ్, ఆ పార్టీ నేత హ్యారిస్ బీరన్‌లను ఆప్యాయంగా పలుకరిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్


శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌కు టీడీపీ దాడుల గురించి వివరిస్తున్న వైఎస్ జగన్

అరాచకాన్ని అడ్డుకుందాం

- ప్రజాస్వామ్య పరిరక్షణకు అండగా నిలవండి
- జాతీయ మీడియాతో మాజీ సీఎం వైఎస్ జగన్
- ఏపీలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది
- 30కి పైగా హత్యలు.. 1000కి పైగా దాడులు

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో క్షీణించిన శాంతి భద్రతలు, కక్షసాధింపు చర్యలు, దాడులు, అరాచకాలపై అందరూ గళం విప్పాలని, ప్రజాస్వామ్యాన్ని కాపాడటంలో అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరారు. ప్రజాస్వామ్యవాదులందరితో కలసి అరాచకాన్ని అడ్డుకుందామన్నారు. 'ఎవరో గుర్తు తెలియని వ్యక్తి మీ ఇంట్లోకి చొరబడి దాడి చేస్తే ఎలా ఉంటుంది? దాన్ని మీరెలా ఎదుర్కొంటారు? దానిపై మీరెలా స్పందిస్తారు? దయచేసి ఇక్కడి గ్యాలరీలో ఫొటోలు, వీడియోలు చూడండి. ఆంధ్రప్రదేశ్‌లో దారుణ పరిస్థితి గురించి తెలుసుకోండి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో అండగా నిలవండి' అని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో విధ్వంసకాండను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలోని జంతర్‌మంతర్‌లో ధర్నా, దాడుల తాలూకు ఫొటో గ్యాలరీని ప్రారంభించిన సందర్భంగా ఆయన జాతీయ మీడియాతో మాట్లాడారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి, చట్టం ముందు అందరూ సమానులే అన్న స్ఫూర్తికి విఘాతం కలిగిన నేపథ్యంలో రాష్ట్రంలో పరిస్థితిని యావత్ దేశం దృష్టికి తెచ్చేందుకు ఇక్కడ నిరసన చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అరాచక, ఆటవిక పాలన సాగుతోందని, అంతులేని దారుణాలు జరుగుతున్నాయని చెప్పారు. అరాచకాలు, అమానవీయ ఘటనలకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు చూపుతూ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటివి కొనసాగడం సబబేనా అని ఆలోచించాలన్నారు.

యథేచ్ఛగా దాడులు, విధ్వంసాలు

రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయని వైఎస్ జగన్ తెలిపారు. యథేచ్ఛగా హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, ఆస్తుల విధ్వంసం సాగుతోందన్నారు. వైఎస్సార్‌సీపీని అణగదొక్కడమే ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని మండిపడ్డారు. ఇందులో భాగంగానే హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రోత్సహిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. 36 హత్యలు, 300 మందిపై హత్యాయత్నాలు, 560 చోట్లకు పైగా ప్రైవేటు, 490 చోట్లకు పైగా ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేశారన్నారు. 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు చేశారని చెప్పారు. చీనీ తోటలు కూడా ధ్వంసం చేశారన్నారు. నారా లోకేశ్ ఒక మంత్రిగా ఉండి.. రెడ్‌బుక్ పేరిట హోర్డింగ్‌లు పెట్టారని, ఎవరెవరి మీద దాడులు చేయాలి.. ఎవరిని ఎలా వేధించాలన్న వివరాలు అందులో రాసినట్లు స్వయంగా ప్రకటించారని తెలిపారు. అధికార పార్టీ శ్రేణులు ఎలాంటి దాడులు, ఆస్తుల విధ్వంసం చేసినా, ఏ చర్యా తీసుకోవద్దని రాష్ట్ర పోలీసులకు స్పష్టంగా నిర్దేశించారని చెప్పారు. ఆ రెడ్‌బుక్‌ను రాష్ట్రంలో అంతటా హోర్డింగ్‌ల ద్వారా ప్రదర్శించడమే కాకుండా, దాన్ని గ్రామ స్థాయి వరకు తీసుకెళ్లారన్నారు. ఆ విధంగా రాష్ట్రంలో ఇప్పుడు భారత రాజ్యాంగం కాకుండా, రెడ్‌బుక్ రాజ్యాంగం పని చేస్తోందని తెలిపారు.

మేం దాడులను ప్రోత్సహించలేదు

గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి ఘటనలేవీ జరగలేదని వైఎస్ జగన్ గుర్తు చేశారు. హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, ఇళ్లలోకి చొరబడి వేధింపులు, దాడులు ఎక్కడా జరగలేదని.. పౌర హక్కులకు భంగం కలిగించలేదని వివరించారు. కానీ, ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలన, విధ్వంసాన్ని ప్రశ్నించకపోతే, వాటన్నింటినీ వెంటనే ఆపలేకపోతే.. ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేమన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, చీనీ తోటల ధ్వంసం.. వీటన్నింటిపై ఫొటో గ్యాలరీతో పాటు వీడియోలు కూడా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. 'దయచేసి ఒక్కసారి ఈ ఫొటోలు, వీడియోలు చూడండి. రాష్ట్రంలో దారుణ పరిస్థితిని అర్థం చేసుకోండి. మా పార్టీ ప్రజా ప్రతినిధులు.. చివరకు ఒక ఎంపీ కూడా తన నియోజకవర్గంలో తిరగలేని పరిస్థితి. ఎంపీ మిథున్‌రెడ్డిపై పట్టపగలే రాళ్లతో దాడి చేసి వాహనాలు ధ్వంసం చేశారు. ఇన్ని జరుగుతున్నా, పోలీసులు ప్రేక్షకపాత్ర పోషిస్తున్నారు. ఆ విధంగా రాజ్యాంగ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారు' అని చెప్పారు. రాష్ట్రంలో అరాచకం సృష్టిస్తున్న వారి నుంచి బాధితులను కాపాడకపోగా, తిరిగి బాధితులపైనే కేసులు నమోదు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంత కంటే దారుణం ఎక్కడైనా ఉంటుందా? అని ప్రశ్నించారు. ఇలాంటి దుస్థితి ప్రజాస్వామ్య వ్యవస్థలో కొనసాగడం సబబేనా? అన్నది ఆలోచించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమానికి అండగా నిలవకపోతే ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేమన్నారు.


ఢిల్లీ ధర్నాకు హాజరైన వైఎస్సార్‌సీపీ పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజలు

మద్దతిచ్చిన వారందరికీ కృతజ్ఞతలు

ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితిపై ఫొటో, వీడియోల ప్రదర్శన అనంతరం కార్యక్రమానికి వచ్చిన వారందరికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. 'నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి సోదరుడు, స్నేహితుడు, అక్క, చెల్లెమ్మకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు. మరోవైపు ఇక్కడికి రాలేకపోయినప్పటికీ రాష్ట్ర వ్యాప్తంగా సంఘీభావం తెలిపిన అక్కచెల్లెమ్మలకు, అన్నదమ్ములకు, అవ్వాతాతలు అందరికీ మనసారా కృతజ్ఞతలు. నిరసన ప్రదర్శనకు వచ్చి వాస్తవాలు తెలుసుకోవడంతోపాటు వాటిపై అభిప్రాయాలు తెలిపి మనకు సంఘీభావం తెలిపిన ప్రతి పార్టీకి, ఆయా పార్టీల నేతలకు వైఎస్సార్‌సీపీ తరఫున కృతజ్ఞతలు. మీడియా సంస్థల నుంచి వచ్చిన జర్నలిస్టులు ఏపీలో జరుగుతున్న దమనకాండ గురించి తెలుసుకున్నారు కాబట్టి, ఆ హేయమైన పనుల మీద గళం విప్పాలని విన్నవిస్తున్నా. జర్నలిస్టులందరికీ మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు' అని అన్నారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

ఏపీ, తెలంగాణల్లో పెరుగుతున్న సైబర్ నేరాలు

రాజ్యసభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు కేంద్రం సమాధానం



సాక్షి, న్యూఢిల్లీ: ఏపీ, తెలంగాణల్లో ఏటేటా సైబర్ నేరాలు పెరుగుతున్నాయని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ తెలిపారు. ఏపీలో 2018లో 1,207, 2019లో 1,886, 2020లో 1,899, 2021లో 1,875, 2022లో 2,341 సైబర్ నేరాలు నమోదయ్యాయని వివరించారు. రాజ్యసభలో బుధవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిచ్చారు. సైబర్ నేరాలపై ఫిర్యాదులకు 1930 టోల్‌ఫ్రీ నంబరు ఏర్పాటు చేశామన్నారు. నేషనల్ సైబర్ క్రైం రిపోర్టింగ్ పోర్టల్‌లో దేశవ్యాప్తంగా ఈ ఏడాది తొలి నాలుగు నెలల్లో 6.56 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయని తెలిపారు.

రెండుదశల్లో అనంతపురం-గుంటూరు రహదారి



అనంతపురం-గుంటూరు నాలుగు లేన్ల జాతీయ రహదారి పనుల్ని రెండుదశల్లో అభివృద్ధి చేసినట్లు కేంద్ర జాతీయ రహదారులశాఖ మంత్రి నితిన్‌గడ్కరీ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. అనంతపురం బుగ్గ సెక్షన్ నుంచి 69 కిలోమీటర్లు, అక్కడి నుంచి గుంటూరు సెక్షన్ వరకు రెండు లేన్లు/రెండు లేన్లు చొప్పున రహదారిపై నీరు నిలవకుండా ఉండేలా అభివృద్ధి చేసినట్లు వివరించారు.

కేజీబీవీల్లో 345 ఖాళీలు



ఆంధ్రప్రదేశ్‌లోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాల్లో (కేజీబీవీల్లో) 345 టీచరు పోస్టులు భర్తీచేయాల్సి ఉందని వైఎస్సార్‌సీపీ ఎంపీ ఆర్.కృష్ణయ్య ప్రశ్నకు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌధరి సమాధానమిచ్చారు.

ఏపీలో 17,675 కోఆపరేటివ్ సొసైటీలు



ఏపీలో 17,675 కోఆపరేటివ్ సొసైటీలు రిజిస్టర్ అయినట్లు కేంద్ర సహకారశాఖ మంత్రి అమిత్‌షా తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పరిమళ్ నత్వానీ ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. సొసైటీల్లో కంప్యూటరైజేషన్ నిమిత్తం 2022–23లో రూ.14.93 కోట్లు, 2023–24లో రూ.3.74 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు.

2023లోనే మత్స్యకారుల సమస్య పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం కృషి

ఏపీ, తమిళనాడు మత్స్యకారుల మధ్య సమస్య పరిష్కారానికి ఏపీ ప్రభుత్వం 2023లోనే కృషిచేసిందని కేంద్ర మత్స్యశాఖ మంత్రి రాజీవ్‌రంజన్ సింగ్ తెలిపారు. రెండు రాష్ట్రాల మధ్య దీర్ఘకాలంగా ఉన్న ఈ సమస్యపై రీజినల్ ఫిషరీస్ మేనేజ్‌మెంట్ కౌన్సిల్ సమావేశం సందర్భంగా రెండు రాష్ట్రాలు కలిసి చర్చించుకుందామని ఏపీ ప్రభుత్వం తమిళనాడు ప్రభుత్వాన్ని కోరిందని వైఎస్సార్‌సీపీ ఎంపీ బీద మస్తాన్‌రావు ప్రశ్నకు సమాధానమిచ్చారు. ఈ నేపథ్యంలో సమస్య పరిష్కారానికి తమిళనాడులోని తిరువళ్లూర్, చెన్నై, చెంగల్పట్టు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు, ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో కలెక్టర్ల నేతృత్వంలో కమిటీ ఏర్పాటు చేయాలని తమిళనాడు ప్రభుత్వం కోరిందని తెలిపారు.

దళితులపై దాష్టీకం

ధర్మవరంలో టీడీపీ నేతల దుర్మార్గం.. దళిత మహిళలపై చిత్రహింసలు

ధర్మవరం: శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరంలో టీడీపీ నాయకుల దాష్టీకాలు మరింత పెచ్చుమీరాయి. దళిత మహిళలను అకారణంగా చిత్రహింసలకు గురిచేసి తీవ్రంగా గాయపరిచారు. ఆలస్యంగా వెలుగుచూసిన ఈ ఘటన వివరాల్లోకి వెళితే.. ధర్మవరం పట్టణంలోని లక్ష్మీనగర్ బండగుంత వద్ద దళిత మహిళలు పద్మ, కల్పన నివాసం ఉంటున్నారు. ఇంటికి ఎదురుగా ఉన్న కంపచెట్ల వల్ల ఇళ్లలోకి పాములు చేరుతున్నాయని, వాటిని తొలగించాలని మునిసిపల్ అధికారులకు విజ్ఞప్తి చేశారు. దీంతో మునిసిపల్ సిబ్బంది సోమవారం కంపచెట్లు తొలగించేందుకు పూనుకున్నారు. విషయం తెలుసుకున్న 34వ వార్డు టీడీపీ ఇన్‌చార్జ్ ముతుకూరు బీబీ.. 'వాళ్లు వైఎస్సార్‌సీపీ వలంటీర్లుగా పనిచేశారు. వాళ్లు చెబితే కంపచెట్లు ఎలా తొలగిస్తార'ంటూ మునిసిపల్ సిబ్బందిపై దౌర్జన్యం చేశారు. దీంతో దళిత మహిళలకు, టీడీపీ వార్డు ఇన్‌చార్జ్ ముతుకూరు బీబీకి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. బీబీ దళిత మహిళలపై చేయి చేసుకుంది. దీంతో వారు కూడా ఆమెను ప్రతిఘటించారు. దీన్ని అవమానంగా భావించిన బీబీ తన సోదరుడైన నాగూర్ హుస్సేన్‌కు జరిగిన విషయం చెప్పింది. దీంతో అతను అనుచరగణంతో దళిత మహిళలను ఇష్టానుసారం చితకబాదారు. మహిళల ఛాతి, తలపై దాడి చేశారు. కొట్టొద్దంటూ కాళ్లు పట్టుకుని వేడుకున్నా కనికరించలేదు. నాగూరు హుస్సేన్ గతంలో నేరచరితుడు కావడంతో మహిళల హాహాకారాలు విన్న స్థానికులు కనీసం విడిపించే ప్రయత్నం కూడా చేయలేదు. చివరకు బాధిత మహిళలు ఘటనా స్థలంలోనే అపస్మారక స్థితిలో పడిపోయారు.



తమను కాపాడాలని సెల్ఫీ వీడియో ద్వారా వేడుకుంటున్న పద్మ

పట్టించుకోని పోలీసులు

ఈ అమానుష దాడి సోమవారం జరిగింది. తీవ్రగాయాలతో ఉన్న బాధిత మహిళలు పద్మ, కల్పనను బంధువులు ధర్మవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి నుంచి అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. బాధితుల బంధువులు ధర్మవరం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినప్పటికీ పట్టించుకున్న పాపాన పోలేదు. ప్రభుత్వాస్పత్రిలో సైతం ఎంఎల్‌సీ (మెడికో లీగల్ కేస్) నమోదు చేయాల్సి ఉన్నప్పటికీ అక్కడా పట్టించుకోలేదు.

'చంపేస్తారు.. కాపాడండి'

'సార్.. మేం దళిత మహిళలం. ఇంటి ముందు కంపచెట్లు తొలగించమని మునిసిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినందుకు టీడీపీ నాయకులు చెప్పుకోలేని రీతిలో కులం పేరుతో తిడుతూ ఇష్టానుసారం చిత్రవధ చేసి కొట్టారు. పోలీసులకు చెబితే ఎవరూ పట్టించుకోలేదు. మేం సాధారణ మహిళలం. భవిష్యత్‌లో మమ్మల్ని బతకనిస్తారన్న నమ్మకం లేదు. కచ్చితంగా చంపేస్తారు. దయవుంచి కాపాడండి' అంటూ ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్యకుమార్‌ను, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌ను సెల్ఫీ వీడియో ద్వారా వేడుకుంటూ బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు. బాధితులు ధర్మవరం టూటౌన్ పోలీస్ స్టేషన్‌లో నాగూర్‌హుస్సేన్, ముతుకూరు బీబీ, స్టాలిన్, జగ్గు, కుళ్లాయప్ప, జగదీష్, అల్లాబకాష్ తమపై దాడి చేసినట్టు ఫిర్యాదు చేశారు. ఈ విషయమై వివరణ కోరేందుకు టూటౌన్ సీఐ అశోక్‌కుమార్‌ను సంప్రదించేందుకు ప్రయత్నించగా.. ఆయన అందుబాటులోకి రాలేదు.

ఏపీలో దాడులపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు ఫిర్యాదు

ఐక్యరాజ్యసమితికి కూడా..

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో ఎన్‌డీఏ కూటమి అధికారంలోకి వచ్చాక గత 40 రోజులుగా ప్రజలపై జరుగుతున్న అఘాయిత్యాలు, అత్యాచారాలు, హత్యలు, దాడులపై అమెరికాలోని తెలుగు ఎన్‌ఆర్‌ఐలు ప్రపంచ మానవహక్కుల సంఘమైన ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌లో ఫిర్యాదు చేశారు. భారత కాలమానం ప్రకారం మంగళవారం ఐక్యరాజ్య సమితి (యూఎన్) స్పెషల్ కన్సల్టేటివ్ స్టేటస్ సభ్యుడు ఉన్నవ షకిన్‌కుమార్ ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ న్యూజెర్సీ కన్వీనర్, 'యాత్ర' చిత్ర నిర్మాత మేకా శివ, టెకీలు చంద్రమౌళిరెడ్డి, మోహిత్‌రెడ్డి, అమెరికా పౌరులు నిత్యారెడ్డి, నరేష్‌రెడ్డి ఫిర్యాదు చేశారు. జూన్ 2024 నుంచి ఏపీలో ఎక్కడ చూసినా మానవహక్కుల ఉల్లంఘన జరుగుతోందని, పేద ప్రజలపై దాడులు జరుగుతున్నాయని, దాడుల నుంచి ప్రాణాలు రక్షించుకునేందుకు ప్రజలు ఇతర రాష్ట్రాలకు వలసపోయే దారుణ పరిస్థితులు తలెత్తాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇప్పటి వరకు పౌరులపై జరిగిన దాడుల సంఖ్యపై ఐక్యరాజ్యసమితికి, సమితి ఆర్థిక, సామాజిక మండలికి నివేదించినట్లు షకిన్‌కుమార్ తెలిపారు. జెనీవాలోని ఐక్యరాజ్య సమితి మానవహక్కుల మండలికి ఏపీ పరిస్థితిపై సవివరమైన నివేదిక సమర్పిస్తానని, మహిళలు, బాలికలపై జరిగిన అఘాయిత్యాల వివరాలను ఐక్యరాజ్యసమితి మహిళా విభాగానికి ఇస్తానని చెప్పారు. ఏపీలో టీడీపీ చేస్తున్న దారుణాలపై బుధవారం మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఢిల్లీలో చేసిన ధర్నాకు మద్దతుగా న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయం వద్ద ప్లకార్డులను ప్రదర్శించారు.



న్యూయార్క్‌లోని యూఎన్‌వో ప్రధాన కార్యాలయం వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తున్న షకిన్, శివ తదితరులు



అమరావతి పనులపై టెక్నికల్ కమిటీ

సాక్షి, అమరావతి: అమరావతి ప్రాంతంలో గతంలో నిలిచిపోయిన పనులను పరిశీలించి తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చేందుకు మున్సిపల్ శాఖ కమిటీని నియమించింది. ఈమేరకు బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్ ఆదేశాలు జారీ చేశారు. పబ్లిక్ హెల్త్ ఈఎన్‌సీ చైర్మన్‌గా ఏడుగురు అధికారులతో కమిటీ ఏర్పాటు చేయనున్నారు. ఇందులో ఆర్ అండ్ బీ, వీఎంసీ, ఏపీసీపీడీసీఎల్, ఏపీసీఆర్డీఏ, ఏడీసీఎల్ చీఫ్ ఇంజనీర్లు, విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం నుంచి ఒక్కరు సభ్యులుగా నియమించారు. ఏపీసీఆర్డీఏలో పనులకు సీఆర్డీఏ సీఈ కన్వీనర్‌గాను, ఏడీసీఎల్ పనులకు ఏడీసీఎల్ సీఈ కన్వీనర్‌గా ఉంటారు. రాజధాని ప్రాంతంలో 2019 మే నుంచి నిలిచిన పనులు, వాటి కొనసాగింపు అంశంతో పాటు తొమ్మిది అంశాలపై ఈ టెక్నికల్ కమిటీ అధ్యయనం చేసి ప్రభుత్వానికి నెలరోజుల్లో నివేదిక ఇవ్వనుంది.

అప్పుడు పోలవరం.. బాబుకు ఏటీఎం అన్నారుగా!

సాక్షి, న్యూఢిల్లీ: చంద్రబాబుకు పోలవరం ప్రాజెక్టు ఏటీఎంలా మారిందంటూ మీరు చేసిన వ్యాఖ్యలు గుర్తున్నాయా? అని ప్రధాని మోదీని తమిళనాడుకు చెందిన డీఎంకే ఎంపీ దయానిధి మారన్ లోక్‌సభలో ప్రశ్నించారు. 2019లో రాజమండ్రిలో జరిగిన సభలో ప్రధాని మోదీ మాట్లాడుతూ.. పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు ఏటీఎంలా మారిందని.. నిధులను దోచుకున్నారని చెప్పారు. ఈ వ్యాఖ్యలను దయానిధి మారన్ లోక్‌సభలో ప్రస్తావించారు. 'గతంలో పోలవరం ప్రాజెక్టు చంద్రబాబుకు ఏటీఎం అని వ్యాఖ్యానించిన ప్రధాని.. ఇప్పుడు ఆ విషయాన్ని మరిచిపోయారా? ఆ ఏటీఎం కాస్తా ఇప్పుడు ప్రధానికి 'ఇంపార్టెంట్ మిషన్'గా మారిందా?' అని ఎద్దేవా చేశారు. 2014లో ఎన్డీఏ మిత్రపక్షంగా ఉన్న చంద్రబాబుకు నాలుగు నెలల పాటు ప్రధాని మోదీ అపాయింట్‌మెంట్ కూడా ఇవ్వలేదన్నారు. ప్రధాని మోదీ రాజకీయ అవసరాల కోసం ఒకటి, రెండు రాష్ట్రాలకే నిధులు కేటాయిస్తున్నారని విమర్శించారు. పదేళ్లుగా తమ రాష్ట్రానికి సహాయం చేయాలని కోరుతున్నా మోదీ పట్టించుకోవడం లేదని మండిపడ్డారు.

ఇంకా అధ్యయన దశలోనే 'ఉచిత బస్సు'

సాక్షి, అమరావతి: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంపై అధ్యయనం, విధివిధానాల పేరుతో రాష్ట్ర ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఈ అంశం ఇంకా పరిశీలన దశలోనే ఉందని.. విధివిధానాల రూపకల్పన కోసం అధ్యయనం చేస్తున్నట్లు ప్రభుత్వం వెల్లడించింది. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యేలు విరూపాక్షి, చంద్రశేఖర్, సుధలు అడిగిన ప్రశ్నకు ప్రభుత్వం బుధవారం శాసనసభలో ఈ మేరకు జవాబిచ్చింది. అలాగే పౌరసరఫరాల శాఖకు సంబంధించిన పలు ప్రశ్నలకు మంత్రి నాదెండ్ల మనోహర్ జవాబిచ్చారు. 'ఉచిత గ్యాస్ సిలిండర్ల హామీపై విధివిధానాలను రూపొందిస్తున్నాం. త్వరలో నిర్ణయం తీసుకుంటాం. ప్రధానమంత్రి ఉజ్వల్ పథకం కింద ఉచితంగా ఒక సిలిండర్‌తో ఎల్‌పీజీ కనెక్షన్ ఇస్తున్నారు. ఈ ప్రయోజనాన్ని 2016–2024 మధ్య 9,65,361 మంది వినియోగించుకున్నారు. ఇక 2023–24 రబీ ధాన్యం సేకరణకు రూ.1,674 కోట్లు రైతులకు చెల్లించాల్సి ఉండగా.. 50 వేల మంది రైతులకు ఇప్పటికే రూ.వెయ్యి కోట్ల మేర చెల్లింపులు జరిగాయి. మరో 10 రోజుల్లో రూ.674 కోట్లు చెల్లిస్తాం. పౌరసరఫరాల కార్పొరేషన్ రూ.39,550 కోట్ల అప్పుల్లో ఉంది. అందులో రూ.10 వేల కోట్ల అప్పును వచ్చే మార్చి 31లోగా తీర్చడానికి చర్యలు చేపట్టాం' అని నాదెండ్ల చెప్పారు. కాగా.. విశాఖపట్నంలో పరిశ్రమలు, కార్గో రవాణా ద్వారా వెలువడే వాయు కాలుష్య ఉద్గారాలను నియంత్రించేందుకు కాలుష్య నియంత్రణ బోర్డు చర్యలు తీసుకుంటోందని ఓ ప్రశ్నకు డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ జవాబిచ్చారు.

మత్స్యకారులకు ఉరితాడులా జీవో 217

రాష్ట్ర మత్స్యకారులకు ఉరితాడులా తయారైన జీవో 217ను వచ్చే కేబినెట్‌లో రద్దు చేస్తామని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు చెప్పారు. 2014–19 మధ్య అమలు చేసిన మత్స్యకారులకు చేప పిల్లలు, వలలు, ఐస్ బాక్స్‌లు, బైక్‌లు, నాలుగు చక్రాల వాహనాల పంపిణీ పథకాలను మళ్లీ పునరుద్ధరిస్తామన్నారు. 2019–24 మధ్య రోడ్లకు అత్యవసర మరమ్మతుల కోసం రూ.1,100 కోట్లు, రోడ్ల పునరుద్ధరణకు రూ.950 కోట్లు ఖర్చు చేశారని మంత్రి జనార్దన్‌రెడ్డి తెలిపారు. న్యూ డెవలప్‌మెంట్ బ్యాంక్ నిధులు రూ.3,014 కోట్లతో 1,244 కిలోమీటర్ల మేర రోడ్ల బలోపేతం చేసినట్లు చెప్పారు.

2014–19 మధ్య అమలు చేసిన ఇసుక విధానమే

గత ప్రభుత్వం జేపీ వెంచర్స్ సంస్థ ద్వారా ఇసుక విక్రయాలు చేసి పెద్ద దోపిడీకి పాల్పడిందని గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఆరోపించారు. ఈ వ్యవహారం మీద విచారణ జరుగుతోందన్నారు. ప్రజలు ఇసుక కోసం ఇబ్బందులు పడకూడదని 2014–19 మధ్య అమలు చేసిన విధానాన్నే మళ్లీ అమల్లోకి తెచ్చామన్నారు.

ప్యాకేజీ తేల్చాకే సీడ్ యాక్సెస్ రోడ్డు పనులు

తాడేపల్లి రూరల్: రాజధాని అమరావతి ముఖద్వారమైన ఉండవల్లిలో ప్రభుత్వం చేపట్టిన సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణానికి బుధవారం కొలతలు వేసేందుకు వచ్చిన సీఆర్డీఏ అధికారులను రైతులు అడ్డుకున్నారు. సీఆర్డీఏ డిప్యూటీ కమిషనర్ విశ్వేశ్వరరావు నాయుడుతో వాగ్వాదానికి దిగారు. ఎకరం రూ.3 లక్షలు ఉన్నచోట, ఎకరం రూ.30 లక్షలు ఉన్నచోట ఒకే తరహా పరిహార ప్యాకేజీ ఇస్తామంటే ఎలాగని రైతులు ప్రశ్నించారు. గతంలో ఏర్పాటు చేసిన గ్రీన్ జోన్, యూ–1 జోన్లను వెంటనే ఎత్తివేయాలని, సీడ్ యాక్సెస్ రోడ్డు నిర్మాణంలో పొలాలు కోల్పోయిన వారికి ఉండవల్లిలోనే ప్లాట్లు కేటాయించాలని, ప్యాకేజీ గురించి తేల్చాకే రోడ్డు పనులు చేపట్టాలని స్పష్టం చేశారు. దీనిపై ప్రభుత్వంతో చర్చలు జరిపేందుకు వీలుగా ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అపాయింట్‌మెంట్ కావాలని కోరారు. రైతుల డిమాండ్లను ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళతామని సీఆర్డీఏ డిప్యూటీ కమిషనర్ విశ్వేశ్వరరావు హామీ ఇచ్చారు.



డిప్యూటీ కమిషనర్‌తో మాట్లాడుతున్న ఉండవల్లి రైతులు

మదనపల్లె సబ్-కలెక్టరేట్‌లో కొనసాగిన దర్యాప్తు

ప్రమాద కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ


మదనపల్లె: అన్నమయ్య జిల్లా మదనపల్లె సబ్-కలెక్టరేట్ అగ్నిప్రమాద ఘటనపై మూడోరోజైన బుధవారం దర్యాప్తు ముమ్మరంగా కొనసాగింది. ఇందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సిసోడియా, కలెక్టర్ చామకూరి శ్రీధర్, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్ మదనపల్లె మండలంలోని సచివాలయాలు, సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాన్ని పరిశీలించారు. మండలంలోని వెంకప్పకోట పంచాయతీలో మ్యాపింగ్ చూసే సర్వే రాళ్లను పరిశీలించారు. వెంకప్పకోట, చిన్నతిప్పసముద్రం-1 గ్రామ సచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేసి అక్కడ ఉన్నటువంటి ఎఫ్ఎల్ఆర్ రిజిస్టర్, ఆర్ఓఆర్, 1బి, 10 (1) అడంగల్, డిజిటల్ సర్వీసులకు సంబంధించిన రికార్డులు ఎలా నమోదు చేస్తున్నారని సచివాలయ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. సబ్-రిజిస్ట్రార్ కార్యాలయంలో భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఎలా జరుగుతున్నదని ఇన్‌చార్జ్ సబ్-రిజిస్ట్రార్ రాజును అడిగి తెలుసుకున్నారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రమాద కారణాలపై పూర్తిస్థాయిలో విచారణ చేస్తున్నామని, వీలైనంత త్వరగా దర్యాప్తు పూర్తి చేస్తామన్నారు. తహసీల్దార్ రమాదేవి, సర్వేయర్లు, వీఆర్‌ఓలు, డిజిటల్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఏకీకృత ఎక్సైజ్ నిర్ణయంపై ఉద్యోగుల సంఘం హర్షం

సాక్షి, అమరావతి: ఎక్సైజ్ శాఖను ఏకీకృతం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించడంపై రాష్ట్ర ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.నరసింహులు హర్షం వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిగణనలోకి తీసుకుని సానుకూల నిర్ణయం తీసుకున్నందుకు ఆయన బుధవారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో, ఎక్సైజ్ శాఖలను విభజిస్తామన్న నిర్ణయంతో ఉద్యోగుల డిమాండ్ నెరవేరుతుందని పేర్కొన్నారు.

రైతులు విల'వెల'

కోకో ధర పతనం



50 శాతం మేర తగ్గిన ధర

- ఫిబ్రవరిలో కిలో రూ.1,050
- ప్రస్తుతం రూ.450 నుంచి రూ.500
- ఉమ్మడి జిల్లాలో 39 వేల ఎకరాల్లో సాగు
- ఏడాదికి 12 వేల టన్నుల దిగుబడి
- కొత్తగా అందుబాటులోకి 18 లక్షల మొక్కలు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: చాక్లెట్ల తయారీలో కీలకంగా వినియోగించే కోకో పంట ధర తిరోగమనం బాట పట్టింది. గతేడాది నుంచి షేర్ మార్కెట్‌లో పోటీపడుతూ రికార్డు స్థాయిలో పెరిగిన ధర ప్రస్తుతం 50 శాతం మేర క్షీణించింది. అంతర్జాతీయ మార్కెట్‌లో ఇతర దేశాల పంట అందుబాటులోకి రావడం, పలు కారణాలతో దేశంలో కోకోకు గిరాకీ తగ్గింది. అయితే దీర్ఘకాలం దిగుబడి వచ్చే పంట కావడం, పెట్టుబడులు తక్కువగా ఉండటంతో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరిలో కిలో కోకో రూ.1,050 ధర పలకగా ప్రస్తుతం కిలో రూ.450 నుంచి రూ.500 మధ్య సాగుతోంది.

అంతర పంటగా సాగు

జిల్లాలో ఉద్యాన పంటల్లో ఆయిల్‌పామ్ అగ్రస్థానంలో కొనసాగుతుంది. ప్రధానంగా ఆయిల్‌పామ్, కొబ్బరిలో అంతర పంటగా కోకోను పండిస్తున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో ఆయిల్‌పామ్ కంటే కోకోకు ఎక్కువ డిమాండ్ ఉంది. గతేడాది ఫిబ్రవరిలో కిలో కోకో ధర రూ.240 పలకగా ఈ ఏడాది అదే సమయంలో రూ.1,050కు చేరింది. తాజాగా జూన్ నుంచి తిరోగమన బాటపట్టి కిలో రూ.450 నుంచి రూ.500కు చేరింది. కోకో ఎగుమతులు తగ్గడం ధరల పతనానికి కారణంగా చెబుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం కోకోను ప్రోత్సహించడానికి గత మూడేళ్లుగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తోంది. సాగైన కోకోను నిల్వ చేయడానికి వీలుగా జిల్లాలో మినీ కోల్డ్ స్టోరేజీలు, కోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్ జాగ్రత్తలపై అవగాహనా కార్యక్రమాలు నిర్వహిస్తోంది. అలాగే డ్రైయింగ్ యూనిట్లు ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తోంది.

ఎగుమతులు లేవు

జిల్లాలో సగటున ఏడాదికి 12 వేల టన్నుల కోకో దిగుబడి వస్తుంది. కొబ్బరిలో అంతర పంటగా ఉండే కోకో సగటున 3 నుంచి 4 క్వింటాళ్లు, ఆయిల్‌పామ్‌లో అంతర పంటగా ఉన్న కోకో సగటున 1 నుంచి 2 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది. జిల్లా నుంచి ప్రస్తుతం ఎలాంటి ఎగుమతులు లేవు. స్థానిక మార్కెట్ అవసరాలకే దిగుబడి సరిపోని పరిస్థితి. ప్రధానంగా జిల్లాలో హిందుస్థాన్ లీవర్, క్యాడ్బరీస్‌తో పాటు మరో రెండు చాక్లెట్ల కంపెనీలు కోకో పంటను పూర్తిస్థాయిలో కొనుగోలు చేస్తున్నాయి. ప్రస్తుతం ఉన్న ధర మరో రెండు, మూడు నెలలు కొనసాగే అవకాశం ఉంది.

హెక్టారుకు రూ.20 వేల సబ్సిడీ

ఏలూరు జిల్లాలో 35,324.33 ఎకరాల్లో, పశ్చిమగోదావరి జిల్లాలో 4 వేల ఎకరాల్లో కోకో సాగు ఉంది. ఉద్యాన సాగుకు హెక్టారుకు రూ.20 వేల సబ్సిడీని ఉద్యాన శాఖ అందిస్తోంది. దీనిలో భాగంగా మొక్కలు, ఎరువులు కోసం మొదటి ఏడాది రూ.12 వేలు, రెండు, మూడు సంవత్సరాల్లో రూ.4 వేల చొప్పున ఇస్తున్నారు. 4వ ఏడాది నుంచి దిగుబడి ప్రారంభమై 35 ఏళ్ల వరకు మంచి దిగుబడులు ఉండటంతో పాటు మొక్క జీవితకాలం 40 ఏళ్లు. వాస్తవానికి దేశవ్యాప్తంగా ఏటా 2 లక్షల టన్నుల కోకో అవసరం కాగా ఉత్పత్తి మాత్రం 30 వేల టన్నులు ఉంది. దానిలో అత్యధిక శాతం ఏలూరు జిల్లా కాగా కేరళ, కర్ణాటక నుంచి మిగిలిన దిగుబడి ఉంది. తమిళనాడులో మూడేళ్ల నుంచి కోకో సాగు మొదలైంది.

పెరుగుతున్న విస్తీర్ణం

అంతర పంట కావడంతో మార్కెట్ ధరతో సంబంధం లేకుండా కోకో సాగు విస్తీర్ణం పెరుగుతోంది. మూడేళ్లలో 3 వేల హెక్టార్ల సాగు విస్తీర్ణం పెరిగింది. ఏటా సగటున వెయ్యి హెక్టార్లు పెరుగుతుండగా ఈ ఒక్క ఏడాదే 2 వేల హెక్టార్లు పెరుగుతుందన్న అంచనా వేసి దానికి అనుగుణంగా 15 లక్షల మొక్కలను అధికారులు అందుబాటులోకి తీసుకురాగా, రైతులు, యూనివర్సిటీ సహకారంతో మరో 3 లక్షల మొక్కలు అందుబాటులో తెచ్చారు.



దీర్ఘకాలిక పంట

అంతర పంటగా ఉన్న కోకో మంచి లాభాలు ఇస్తుంది. భవిష్యత్‌లో 30 ఏళ్లకుపైగా మంచి డిమాండ్ ఉంది. దేశీయ చాక్లెట్ల కంపెనీ అవసరాల్లో 30 శాతం కూడా స్థానికంగా ఉత్పత్తి జరగని పరిస్థితి. దీంతో రానున్న కాలంలో అంతర పంటగా సాగును మరింత ప్రోత్సహిస్తాం.

–రామ్మోహన్, డీడీ, ఉద్యానవనశాఖ

'మత్తు'లో పాముకే చుక్కలు చూపించాడు

పాము కనిపిస్తే చాలు అమ్మో..అంటూ ప్రాణ భయంతో ఆమడదూరం పరిగెడతాం. అలాంటిది ఓ వ్యక్తి మద్యం మత్తులో పాముకే చుక్కలు చూపించాడు. ప్రాణభయంతో పరుగులు పెట్టాల్సిన దీన పరిస్థితి కల్పించాడు. ఈ ఆసక్తికరమైన ఘటన శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలో బుధవారం జరిగింది. వివరాల్లోకి వెళితే... కదిరి-అనంతపురం ప్రధాన రహదారిపై ఓ పాము వెళ్తుంది. నాగరాజు అనే యువకుడు దాని వద్దకు వెళ్లి కాలితో తన్నుతూ.. చేతితో కొడుతూ నానారకాలుగా హింసించాడు. కొద్దిసేపు మెడలో వేసుకుని రోడ్డుపై అటు ఇటు తిరిగాడు. అటుగా వెళ్లే వారు ఎంత వారించినా వినలేదు. పాము పలుమార్లు కాటేసినా పట్టించుకోలేదు. సుమారు గంట పాటు పాముకు చుక్కలు చూపించి వదిలేశాడు. ఈ దృశ్యాన్ని చూసి అక్కడి వారు భయాందోళనకు గురయ్యారు. అయితే ప్రస్తుతం అతని పరిస్థితి ఎలా ఉందో తెలియరాలేదు. **-కదిరి టౌన్**

పాముతో చెలగాటమాడుతున్న నాగరాజు



పొలాల్లో పసుపు బెకబెకలు

అనకాపల్లి జిల్లా బుచ్చెయ్యపేట మండలంలోని లూలూరు పంట పొలాల్లో పసుపు రంగు కప్పలు కనువిందు చేస్తున్నాయి. ఈ ప్రాంతంలో ఏనాడూ కనిపించని వీటిని రైతులు వింతగా చూస్తున్నారు. వ్యవసాయ సాగుకు ముందు పసుపు రంగులో ఉన్న కప్పలు కనిపించడం శుభదాయకమని, వర్షాలు కురిసి పాడి పంటలు బాగుంటాయని రైతుల విశ్వాసం. **- బుచ్చెయ్యపేట**





కొన్నిసార్లు కనీసం బతకడం కూడా దానికదే ఒక సాహసోపేత చర్య.
– సెనెకా

సాక్షి
గురువారం, 25 జూలై 2024

నెత్తుటి పాలనపై రణభేరి!

'వెయ్యిమంది పాలకుల నిరంకుశాధికారం కూడా ఒక వ్యక్తిమాత్రుడి హేతువు ముందు దూదిపింజెలా కొట్టుకుపోతుంద'ంటాడు ఇటాలియన్ ఖగోళ శాస్త్రవేత్త గెలీలియో గెలీలి. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు వెలువడిన క్షణం నుంచి గూండా మూకల్ని మందలుగా వదుల్తూ హత్యలూ, విధ్వంసాలతో ప్రజానీకాన్ని భయభ్రాంతులకు గురిచేస్తున్న టీడీపీ నేతృత్వంలోని అధికార ఎన్డీయే కూటమికి ఈ జ్ఞానం తలకెక్కే సమయం ఆసన్నమైంది. దేశ రాజధాని ఢిల్లీలో బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాకు వివిధ జాతీయ పార్టీల నాయకులు హాజరై మద్దతు తెలపడం, హింసాకాండపై ప్రదర్శించిన వీడియోనూ, ఛాయా చిత్రాలనూ చూసి దిగ్భ్రాంతి చెందటం దీన్నే చాటుతోంది. ఏపీలో ఇంత దారుణమైన పరిస్థితులున్నాయని ఇన్నాళ్లుగా తెలియదని సమాజ్‌వాదీ, ఉద్ధవ్ శివసేన, ఆప్, తృణమూల్, ఐయూఎంఎల్, అన్నా డీఎంకే, వీసీకే పార్టీల నేతలు ప్రకటించారు. ఒకటా రెండా... గత యాభై రోజులుగా రాష్ట్రంలో చిత్తూరు మొదలుకొని శ్రీకాకుళం వరకూ ఏదోమూల పాలకపక్ష మూకలు మారణహోమాన్ని సృష్టిస్తున్నాయి. నడిరోడ్లపై పట్టపగలు హత్యలకు పాల్పడుతున్నాయి. కత్తులు, కొడవళ్లు, గొడ్డళ్లు, రాళ్లతో ఇళ్లపైకి పోయి వీరంగం వేస్తున్నాయి. బుల్‌డోజర్లతో నివాసగృహాలను నేలమట్టం చేస్తున్నాయి. ఇంతవరకూ 36 మంది ప్రాణాలను పొట్టనబెట్టుకున్నాయి. 300 మందిపై హత్యాయత్నాలు, మొత్తంగా వెయ్యికి పైగా దాడులు జరిగాయి. వీరి ఆగడాలు తట్టుకోలేక దాదాపు 4,000 మంది స్వస్థలాలు విడిచిపోయారు. 30 మంది వరకూ బలవన్మరణాలకు పాల్పడ్డారు. ఈ ముఠాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రిగా కూడా బాధ్యతలు వెలగబెడుతున్న ఆయన పుత్రరత్నం లోకేశ్ వెనకుండి ప్రోత్సహిస్తుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నిమ్మకు నీరెత్తినట్టు మిగిలిపోయారు. పశ్చిమ బెంగాల్ వంటిచోట్ల జరిగిన స్వల్ప స్థాయి సంఘటనలకే కేంద్ర బలగాలను పంపి హడావిడి చేసిన కేంద్రం ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న అరాచకాలను చూసీచూడనట్టు వదిలేసింది. ఎన్డీయే వంచనా శిల్పం ఎంతటిదో చెప్పటానికి మంగళవారం నాటి ఉదంతాలు తార్కాణం. పార్లమెంటులో బడ్జెట్‌ను ప్రవేశపెడుతూ పల్లెసీమల్లో, పట్టణాల్లో భూ యాజమాన్య హక్కులను నిర్ధారించాలని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ రాష్ట్రాలకు సూచించారు. ఇంచుమించు అదే సమయంలో ఆ కూటమి నేతృత్వంలోనే ఉన్న ఏపీ ప్రభుత్వం గతంలో జగన్ ప్రభుత్వం తీసుకొచ్చిన భూహక్కు చట్టాన్ని రద్దు చేస్తూ బిల్లు ప్రవేశపెట్టింది. అంతకుముందు ఎన్నికల ప్రచారఘట్టంలో సైతం ఈ చట్టంపై టీడీపీ, జనసేన అధినేతలు అవాకులూ చవాకులూ మాట్లాడుతుంటే బీజేపీ గుడ్లప్పగించి చూస్తూ ఉండిపోయింది. రాజకీయాల్లో కనీస నైతిక విలువలు పాటించాలన్న స్పృహలేని ఇలాంటి పార్టీలు పాలన చేజిక్కించుకోవటం మన ప్రజాస్వామ్య ప్రారబ్ధం.

'సూపర్ సిక్స్' పేరుతో ప్రజానీకాన్ని వంచించి, ఎన్నికల సంఘాన్ని చెప్పుచేతల్లో పెట్టుకుని సాధించిన గెలుపును చూసి బలుపని భ్రమపడుతున్న కూటమి నేతలు ఇంతవరకూ వాగ్దానాల అమలు ఊసెత్తడం లేదు. వాటి సంగతేం చేయాలో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఫలితాలు వెలువడుతుండగానే ప్రారంభమైన దాడులను కొనసాగించి జనం దృష్టి మళ్లించకపోతే తమకు రాజకీయ మనుగడ లేదన్న నిర్ణయానికొచ్చి ఈ రాక్షసకాండకు తెరలేపారు. వినుకొండలో పట్టపగలు అందరూ చూస్తుండగా టీడీపీ కార్యకర్త జిలానీ వైఎస్సార్ కాంగ్రెస్ కార్యకర్త రషీద్‌ను కత్తితో నరికి చంపితే కనీసం ప్రాథమిక దర్యాప్తు కూడా జరపకుండా పల్నాడు జిల్లా ఎస్పీ వ్యక్తిగత కక్షలే ఈ హత్యకు కారణమని ప్రకటించారు. ఇలాంటి అధికారుల కారణంగానే మారణాయుధాలతో రౌడీ మూకలు రెచ్చిపోతున్నాయి. ఈ హింసాత్మక వాతావరణం పర్యవసానంగానే పసిపిల్లలు మొదలుకొని అనేకమందిపై అత్యాచారాలు సాగుతున్నాయి. హత్యలు జరుగుతున్నాయి. ఆడపిల్లలపై ఎవరు అకృత్యాలకు పాల్పడినా వెంటనే వచ్చి వాలతానని, దుండగులను పట్టి బంధిస్తామని ఎన్నికల ప్రచార సమయంలో పెద్ద కబుర్లు చెప్పిన పవన్ పత్తాలేరు.

దాడులకు, హత్యలకు పాల్పడుతుంటే సాధారణ ప్రజానీకం భయపడి వాగ్దానాలపై తమను నిలదీయటానికి సాహసించరని కూటమి పాలకులు భ్రమపడుతున్నట్టుంది. ఢిల్లీ ధర్నాలో సమాజ్ వాదీ పార్టీ నాయకుడు అఖిలేశ్ యాదవ్ చెప్పినట్టు బుల్డోజర్ పాలన ఎల్లకాలం సాగదు. యూపీలో ఈ తరహా పాలనే సాగిస్తున్న యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి మొన్నటి పార్లమెంటు ఎన్నికల్లో జనం గట్టిగా బుద్ధి చెప్పారు. కాస్తయినా ఇంగితజ్ఞానం ఉంటే గతం కన్నా తాము మెరుగైన పాలన అందిస్తున్నామని నిరూపించుకోవటానికి కృషి చేయాలి. సకాలంలో హామీలు నెరవేర్చి ప్రజల మన్ననలు పొందాలి. కానీ జరుగుతున్నదంతా అందుకు భిన్నం. బడులు తెరిచి నెల్లాళ్లయినా ఇంతవరకూ 'అమ్మకు వందనం' లేదు. సాగుబడి మొదలై నెల కావస్తున్నా 'రైతు భరోసా' జాడలేదు. నిరుద్యోగులకు నెలకు రూ. 3,000, మహిళలకు నెలకు రూ. 1,500, ఇంటింటికీ మూడు ఉచిత సిలిండర్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కబుర్లు ఎటు పోయాయో తెలియదు. తెల్లారిలేస్తే మారణకాండే పాలకులకు నిత్యకృత్యమైంది. ఇలాంటి ప్రభుత్వానికి కనీసం ఒక్కరోజైనా అధికారంలో కొనసాగే నైతిక హక్కుంటుందా? కేంద్రం కళ్లు తెరవాలి. ఈ అరాచకానికి అడ్డుకట్ట వేయాలి. ఉపేక్షిస్తే సర్వోన్నత న్యాయస్థానంతో చెప్పించుకునే స్థితి వస్తుందని గుర్తించాలి.

యూపీఎస్సీపై మరక తొలగేదెలా?

ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్ వివాదం యూపీఎస్సీ ఎంపిక ప్రక్రియలోని లోపాలను ఎత్తిచూపింది. పదవిలో ఉన్నప్పుడే కాకుండా, పదవీ అనంతరం కూడా ఎన్నో అత్యున్నత నియామకాలను సివిల్ సర్వీసెస్ వాళ్లు పొందుతున్నారు. అలాంటప్పుడు ఇందులోకి ఎలాగోలా ప్రవేశించడానికి న్యాయమో, అన్యాయమో ఒక కోటాను వాడుకోవడానికి అవకాశం ఉంది. బుగ్గకారు, అధికారిక వసతి వంటి అప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే స్వార్థపరులకు ఈ వ్యవస్థ తలుపులు తెరిచి ఉంచింది. అన్ని దశలలో క్లిష్టమైన మానసిక సామర్థ్యాలు అవసరమయ్యే సివిల్ సర్వీస్ కోసం వైకల్యం కోటాలో మానసిక వైకల్యాన్ని అనుమతించడంలోని హేతుబద్ధతను సిబ్బంది–శిక్షణా సంస్థ(డీఓపీటీ) తప్పనిసరిగా వివరించాలి. వ్యవస్థను సంస్కరించడానికీ, ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికీ నిర్మాణాత్మకమైన బహుముఖ విధానం అవసరం.

ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్ చుట్టూ అలుముకున్న వివాదం ఏమిటంటే, ట్రెయినీ ఐఏఎస్‌గా పుణె కలెక్టరేట్‌లో నియమితురాలైన ఆమె బంగ్లా, కారు లాంటివి కావాలని అల్లరి చేయడమే! ఇది తెలిసి మన అత్యున్నత శిక్షణా విభాగం అంతా బాగానే ఉందా అని ప్రజలు ఆశ్చర్యపోయారు. నేడు అందరి దృష్టీ ఖేడ్కర్ మీద ఉంది. కానీ ఈ ఉదంతంపై త్వరలోనే సిబ్బంది, శిక్షణా విభాగం(డీఓపీటీ) అదనపు కార్యదర్శి నివేదిక వెల్లడించిన తర్వాత, యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) స్వయంగా దీనిపై వివరణ ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ ఉదంతాన్ని ఖేడ్కర్‌తో ప్రారంభించాలంటే, రెండు వేర్వేరు పేర్లతో వైకల్య ధ్రువీకరణ కోసం దరఖాస్తు చేస్తున్నప్పుడు ఆమె మనస్సులో ఏముంది అనేది ఆలోచించాలి. ఆమె మొదటి సందర్భంలో ఏ విభాగపు వైకల్యం కోసం దరఖాస్తు చేసుకున్నారు? కొన్ని మీడియా వార్తలు సూచించినట్లుగా ఆమె వాస్తవానికి మరొకదానికి మారారా లేక మరో వక్రమార్గాన్ని జోడించారా? ఆమె తండ్రి ప్రకటించిన వార్షిక ఆదాయం 8 లక్షల రూపాయల గరిష్ఠ పరిమితి కంటే ఎక్కువగా ఉన్నప్పుడు కూడా, నాన్–క్రీమీలేయర్ ఇతర వెనుకబడిన తరగతుల (ఓబీసీ) ధ్రువీకరణను ఎలా పొందగలిగారు? అక్కడి తహసీల్దార్ కూడా ఖేడ్కర్ తండ్రీ కూతుళ్ల కోరిక మేరకు ఈ సృజనాత్మక రచనలో తన సముచిత వాటాను పూర్తి చేసినట్లు తెలుస్తోంది.

వైకల్యాలున్న వ్యక్తుల హక్కుల (ఆర్‌పీడబ్ల్యూడీ) చట్టం– 2016, దీర్ఘకాలిక ప్రాతిపదికన ఒక నిర్దిష్ట విభాగంలో కనీసం 40 శాతం వైకల్యం ఉన్నట్లుగా, వైద్యాధికారి ధ్రువీకరించిన వ్యక్తినే 'బెంచ్‌మార్క్ వైకల్యం' ఉన్న వ్యక్తిగా నిర్వచించింది. 'మానసిక వికలాంగుల' విభాగంలో ఉపాధి కోసం ఆమోదించబడిన వైకల్యపు కనీస శాతం 35. ఖేడ్కర్ ఉదంతంలో చాలామంది ఆమె 35 శాతం మానసిక వైకల్యం సమీపంలో కూడా లేదనీ, తన కేసును ముందుకు తీసుకురావడానికి ఆమె ఉదహరించిన రెండు వైకల్యాల్లో ఇది ఒకటనీ హామీపూర్వకంగా చెబుతున్నారు.

పూజా ఖేడ్కర్ కేసు సముద్రంలో నీటిబొట్టంతే కావచ్చు. సివిల్ సర్వీసెస్ ఎంపిక ప్రక్రియ నిస్సందేహంగా, కొన్ని వందల ఉద్యోగాల కోసం లక్షకుపైబడిన వార్షిక దరఖాస్తుదారులతో తీవ్రాతితీవ్రమైన పోటీతో కూడి ఉంటుంది. అభ్యర్థులు వాస్తవానికి, డబ్బు, సమయం పరంగా భారీగా పెట్టుబడి పెడతారు. సగటున, వారు తమ అమూల్యమైన కాలంలో రెండు–మూడు సంవత్సరాలు కేవలం సన్నాహకాల్లోనే గడుపుతారు. ఉత్తమంగా ప్రయత్నాలు చేసినప్పటికీ, దానిని సాధించే విషయంలో అత్యంత చురుకైన వారికి కూడా ఎలాంటి హామీ ఉండదు. అటువంటి అత్యున్నత ప్రయోజనాలతో కూడిన వ్యవస్థలో న్యాయమో, అన్యాయమో వైకల్యం సహా వివిధ కోటాలను పోస్టుకు హామీగా ఉపయోగించుకోవడానికి చాలామంది ఆకర్షితులు కావచ్చు.



వివాదాస్పద ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్

విచారణ పరిధిని విస్తరించడానికి అన్ని వైకల్య కేసులను ఈ దృక్కోణం నుండి చూడటం సిబ్బంది–శిక్షణా సంస్థ(డీఓపీటీ)కి మంచిది.

సివిల్ సర్వీసెస్‌లోకి ప్రవేశించడానికి అభ్యర్థులు ఎంత దూరమైనా వెళతారు అనేందుకు తగు కారణాలు స్పష్టంగా ఉన్నాయి. ఇది సర్వీసులో ఉన్నప్పుడు మాత్రమే కాకుండా పదవీ విరమణ తర్వాత కూడా ప్రతిష్ఠాత్మకమైన, సవాలుతో కూడిన కెరీర్ ఎంపికలను వాగ్దానం చేస్తుంది. చాలామంది మాజీ సివిల్ సర్వెంట్లను ప్రభుత్వం ట్రిబ్యునళ్లు, కమిషన్లు, రెగ్యులేటరీ అథారిటీలు, గవర్నర్ పదవులకు కూడా నియమిస్తుంటుంది. పలువురు వ్యక్తులు ప్రైవేట్ రంగంలో కూడా అత్యున్నత నియామకాలను అందుకుంటారు. అతి పెద్ద కన్సల్టింగ్ సంస్థలు ఇప్పుడు నయా ట్రెండ్! ప్రభుత్వం లోపల తమ నెట్‌వర్క్‌లను ప్రభావితం చేయాలనే ఆశ వీరికుంటుంది.

సర్వీసులో ఉండగానే వీరు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో కీలక పదవులు నిర్వహిస్తున్నారు. ఇరవైల మధ్య నుండి చివరి వరకు మాత్రమే వయస్సు గల ఒక వ్యక్తి తరచుగా చిన్న ఐరోపా దేశాల పరిమాణంలో ఉన్న జిల్లాకు ప్రపంచంలో మరెక్కడైనా నాయకత్వం వహించగలరా?

అన్ని దశలలో క్లిష్టమైన మానసిక సామర్థ్యాలు అవసరమయ్యే సివిల్ సర్వీస్ కోసం వైకల్యం కోటాలో మానసిక వైకల్యాన్ని అనుమతించడంలోని హేతుబద్ధతను సిబ్బంది, శిక్షణా సంస్థ(డీఓపీటీ) తప్పనిసరిగా వివరించాలి. కీలకమైన మరొక ప్రశ్న ఏమిటంటే యూపీఎస్సీ పరీక్ష సమర్థత గురించి! పునరావృత అభ్యసన, అర గంట ఇంటర్వ్యూలకు ప్రాధాన్యత ఇవ్వడమే అభ్యర్థులను ఎంపిక చేయడానికి ఉత్తమమైన మార్గమా? సమగ్రత, సహానుభూతి, సానుకూల నాయకత్వం, సమస్య పరిష్కారం వంటి లక్షణాలను అస్సలు అంచనా వేయలేము. డిఫెన్స్ సర్వీసెస్ విషయంలో లాగా కాకుండా, ఇక్కడ యోగ్యతా పరీక్ష లేదు. తత్ఫలితంగా, మన సివిల్ సర్వీసులను నిర్వహించే విషయంలో ప్రస్తుత సందర్భంలో లాగా, మనకు తక్కువ భావోద్వేగాలు ఉన్న వ్యక్తులు ఉన్నారు. బుగ్గకారు, అధికారిక వసతి వంటి అప్రధాన అంశాలకు ప్రాధాన్యం ఇచ్చే స్వార్థపరులకు ఈ వ్యవస్థ తలుపులు తెరిచి ఉంచింది.

దరఖాస్తుదారులకు ప్రయోజనాలను తగ్గించడానికీ, తద్వారా మోసం, రిగ్గింగ్ అవకాశాలను తగ్గించడానికీ ఒక మార్గం ఏమిటంటే ఎంపిక ప్రక్రియ వ్యవధిని తగ్గించడం. బహుశా సాంకేతికతను ఉపయోగించడం. ప్రతి దశలో మూల్యాంకన ప్రమాణాలు, మార్కింగ్ ప్రమాణాలు, ఇతర సంబంధిత సమాచారాన్ని బహిర్గతం చేయడం ద్వారా పారదర్శకతను పెంచడం అవసరం. తద్వారా సవాళ్లు అధిగమించబడతాయి, పరిష్కరించబడతాయి. వాస్తవానికి, అడ్మినిస్ట్రేటివ్ స్థానాల్లోకి అధిక అర్హత కలిగిన నిపుణులు, డొమైన్ నిపుణుల ప్రవేశం కేవలం పేరును బట్టి ఉండకూడదు. బలమైన పార్శ్వ ప్రవేశ ప్రక్రియ సివిల్ సర్వీసును దాని యథాస్థానంపై నిలిపి ఉంచుతుంది.

యూపీఎస్సీ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన తర్వాత దేశ సివిల్ సర్వెంట్లు వారి ఉద్యోగాల కోసం శిక్షణ పొందే లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్ భారీ పాత్రను పోషించాలి. రెండు సంవత్సరాల శిక్షణ ఒక అధికారి భవిష్యత్తుకు, ఆమె/అతను పరిస్థితులతో వ్యవహరించే విధానానికి పునాది వేస్తుంది. పేద గిరిజన రైతు జక్కు గోండ్‌పై కార్యకర్త హర్ష్ మందర్ చేసిన కేస్ స్టడీలు నేటికీ చాలామంది మనస్సులలో నిలిచిపోయాయి. పేదరికానికి సంబంధించిన సమస్యలతో వ్యవహరించడంలో ఇవి ఒక తరం అధికారులను ప్రభావితం చేస్తూ వచ్చాయి.

విచ్ఛిన్నమైన వ్యవస్థలతో పోరాడటం కంటే మనం వాటిని సరిదిద్దాలి. ఒక ప్రక్రియపై, దాని న్యాయబద్ధతపై మనకు విశ్వాసం ఉంటే, మనం ఫలితాలను ఆమోదించగలము. ఏదైనా వ్యవస్థను సంస్కరించడానికీ, ఆచరణాత్మక సమస్యలను పరిష్కరించడానికీ నిర్మాణాత్మకమైన బహుముఖ విధానం అవసరం. రోజులు గడుస్తున్నకొద్దీ, ఎంపిక ప్రక్రియను మోసగించిన అధికారుల ప్రవేశానికీ, ఇటీవలి నీట్ వైఫల్యానికి దారితీసిన లోపాలకూ మధ్య వింతైన సారూప్యత నొక్కి చెప్పబడుతోంది. ఫలితంగా ఈ దేశవ్యాప్త పరీక్షలపై ప్రజల విశ్వాసం సన్నగిల్లింది. ఇలాంటివి జరగకుండా చేయలేని మన లాంటి విశాల దేశానికి ఇది దురదృష్టకరం. వ్యవస్థను సరిగ్గా అమర్చడంలో, దానిపై విశ్వాసాన్ని పునరుద్ధరించడంలో డీఓపీటీ, యూపీఎస్సీ సరిగ్గా వ్యవహరిస్తాయని ఆశిద్దాము.

– అశోక్ ఠాకూర్ । కేంద్ర మాజీ విద్యా కార్యదర్శి
– ఎస్.ఎస్. మంథా । 'ఏఐసీటీఈ' మాజీ ఛైర్మన్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

నిరాశపూరిత తీర్పు



ప్రాణాన్ని కాపాడటానికి అత్యంత అవసరమైన శస్త్ర చికిత్స చేయడానికి బదులుగా, 'నీట్' మీద సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మహా అయితే పట్టీ మాత్రమే! మోసాలు, లీకులు కొనసాగకుండా నిరోధం ఏమీలేదు. కోచింగ్ సెంటర్లకు శుభదినమే కానీ ప్రజలకు నిరాశాపూరితం.

– కె. సుజాతా రావు, కేంద్ర మాజీ ఉన్నతాధికారి

ఊహించలేరు!



దేశంలోని టాప్ 10 శాతం ధనికులు తాము దేశంలోని ఒక శాతం ధనికులమని అనుకోవడం నాకెప్పుడూ సరదాగా అనిపిస్తుంటుంది. దేశంలోని ఒక శాతం ధనవంతులు ఎంత ధనవంతులో వీళ్ల ఊహకు కూడా అందదు.

– సుఖద, వ్యాఖ్యాత

ఎందుకు చేయలేదు?



5,07,656 మంది ఆర్ఎస్ఎస్ వలంటీర్లు 92,656 కోవిడ్ రిలీఫ్ కేంద్రాలు నెలకొల్పి, 4.663 కోట్ల ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. వాళ్లు ఇవన్నీ చేస్తున్నప్పుడు కూడా ప్రభుత్వ ఉద్యోగులు ఆర్ఎస్ఎస్ కార్యకలాపాల్లో పాల్గొనడం మీద నిషేధం ఉంది. అలాంటప్పుడు మీకు (బీజేపీకి) అవకాశం ఉండీ ఈ నిషేధాన్ని (గతంలో) ఎత్తేయనప్పుడు, కాంగ్రెస్‌ను ఎందుకు నిందించడం?

– ఆనంద్ రంగనాథన్, 'స్వరాజ్య' గౌరవ సంపాదకుడు

'దక్షిణ' అమెరికా



మొత్తంగా అమెరికాలో దక్షిణ భారత పోటీ నడుస్తోంది. తమిళనాడు (కమలా హారిస్) వర్సెస్ ఆంధ్రప్రదేశ్(ఉషా వాన్స్). ఒకవేళ ఏదైనా జరిగి వివేక్ రామస్వామి (కేరళ) కూడా రంగంలోకి దిగాడంటే, అప్పుడూ దక్షిణ భారత పోటీయే అవుతుంది. ఏమైనా ఉత్తర భారతీయులు ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన విషయం ఇది.

– ఇయాన్ హాల్, హానరరీ ఫెలో

అందరికీ అంతేనా?



మతాలు, జాతులు, కులాలతో నిమిత్తం లేకుండా అందరినీ ఉమ్మడిగా నిరాశలో ఉంచడానికి మనకు నిర్మలా సీతారామన్ లాంటి మరింత మంది నాయకులు కావాలి! (వ్యంగ్యంగా)

– ఆస్థా, కంటెంట్ క్రియేటర్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

కోపానికి మహోగ్ర రూపం... మౌనం!

కామెంట్



కరణ్ థాపర్

మనుషులు భిన్న వైరుధ్యాలతో ఉంటారు. ఉన్నవారు, లేనివారు అని మాత్రమే కాదు. మంచివాళ్లు, చెడ్డవాళ్లు; రూపసులు, కురూపులు; ఇంకా... ఉల్లాసంగా ఉండేవాళ్లు, ఉసూరుమంటూ పడివుండే వాళ్లు; ఆలోచనాపరులు, ఉద్వేగప్రాణులు; తియ్యగా మాట్లాడేవారు, మాటలసలే రానివాళ్లు, అలాగే ఉత్తి పుణ్యానికి భగ్గుమనేవారు కొందరైతే, కోపమే తెచ్చుకోని వారు మరికొందరు. ఈ జాబితాలోని చివరి వైరుధ్యం గురించే నేను ఈ వారం మాట్లాడబోతున్నది. దీనికి కారణం ఏమిటంటే, నేను ఇట్టే చికాకు పడిపోతాను. మర్యాదస్తుల సమాజం నన్ను 'షార్ట్ టెంపర్డ్' అంటుంది. అయితే మీరు నన్ను ఓర్పు లేని, సహనం లేని మనిషి అనవచ్చు. చివరికి కోపధారి అని కూడా.

నాలోని వైరుధ్యం ఏమిటంటే... శాంతంగా ఉండేందుకు నేను ప్రయత్నిస్తున్నానని నాకు అనిపించటంతోనే నేను నా ప్రసన్నతను కోల్పోతూ ఉంటాను. ఎంతగానంటే కోపాన్ని అణచుకోవటం నాకు అలవిమాలిన సవాలుగా అనిపిస్తుంది. ఉదాహరణకు, ఒక వ్యక్తి ఇంగితజ్ఞానం లేకుండా, ఉద్దేశపూర్వకంగా నన్ను రెచ్చగొడుతున్నప్పుడు కొద్ది నిముషాలు మాత్రమే నన్ను నేను నిగ్రహించుకుని ఉండగలను. తర్వాత, హఠాత్తుగా పెను వేగంతో నా చిరునవ్వు మాయమవటం మొదలై, నా మెదడు పదునైన మాటలతో పొంగిపొర్లి దెబ్బకు దెబ్బా తిప్పికొట్టటానికి నేను సిద్ధమౌతాను. ఒక మెరుపుదాడిలా నా కోపం బయటికి బద్ధలౌతుంది.

వెసూవియస్ అగ్నిపర్వతంలా అది సత్వరమే చిత్రంగా అంతటా వ్యాప్తి అవుతుంది. అదృష్టవశాత్తూ మరిగి ఉన్న టీ పాత్రలా నేను వేగంగా చల్లబడతాను. కానీ మళ్లీ లావా లాగా – లేదా, చింది పడిన వేడి నీళ్ల మాదిరిగా – ఆ నష్టం చాలా ఎక్కువ కాలం ఉంటుంది. దురదృష్టం ఏమిటంటే నేను కోపం ప్రదర్శించిన వ్యక్తులు గుంభనంగా ఉండిపోతారు. వాళ్లు అంత తేలిగ్గా బద్దలవరు. నిజానికి వాళ్లు అలా బద్దలవటానికి సిద్ధపడేముందు చాలా సమయం తీసుకుంటారు. ఒకసారి బద్దలయ్యాక రోజుల పాటు వారు రగిలిపోతూ ఉంటారు. వెంటనే చల్లారటం ఉండదు.

అలాంటి మనిషి నా భార్య నిషా. మా తొలి తగాదా చాలా చిన్నదైన ఒక విషయం మీద జరిగింది. అది ఇలా సాగింది: తన ధ్యాస నాపై ఉండటాన్ని నేను కోరుకుంటానన్న సంగతి నిషాకు బాగా తెలుసు. నేను ఆశించినట్లే తను ఉండేది. సమస్యేమిటంటే... నేను ఆశిస్తున్నట్లు తను ఉంటున్నానన్న గమనింపును నిషా నాలో కలిగించేది. దాంతో ఆమె నన్ను ఆట పట్టిస్తోందని నాకు తెలిసిపోయింది. అటువంటి సందర్భాలలో నిషా నన్ను 'కె.టి. బాబా' అని పిలిచేది. అలా పిలవటంలో ప్రేమా ఉండేది, నవ్వులాటా ఉండేది.

ఆమె నన్ను ఆట పట్టిస్తోందని నా గ్రహింపునకు వచ్చినప్పుడు మొదట నేను జోక్‌గానే తీసుకున్నాను. కానీ జోకులతో సమస్య ఏమిటంటే మిగతా వారు కూడా వాటిల్లోకి దొరబడతారు. నా బెస్ట్ ఫ్రెండ్ ప్రవీణ్, ఇంకా అఫ్తాబ్, మరొక స్నేహితుడు నిషా మాటల్ని పట్టుకుని నాపైకి నవ్వులాటకు వచ్చేవారు. నిమిషాల వ్యవధిలోనే అది అటువైపు ముగ్గురు, ఇటువైపు ఒక్కరు అయ్యేది. ఆ తర్వాత నా మతిస్థిమితం నాపై విజయం సాధించి హాస్యమంతా పాడైపోటానికి ఎంతో సమయం పట్టేది కాదు.



నా ఉద్వేగం నా తలలోకి పరుగులు పెట్టేది. నా ముఖం ఎర్రబడేది. నా గొంతు పైకి లేచేది. దురదృష్టవశాత్తూ, ఇలా జరగటం అన్నది రాబోయే ప్రమాదం నుంచి వాళ్లను హెచ్చరించటానికి బదులుగా వాళ్లను మరింతగా నవ్వులాటకు పురిగొల్పేది. ఆ మాటల యుద్ధంలో నేను తలదూర్చేలా నా కోసం వల పన్ని వేడుకగా చూస్తుండేవారు.

ఆ ముగ్గురితో నేను గొడవ పడేవాడినని చెప్పటం సరిగ్గా ఉంటుంది. అయితే ప్రవీణ్, ఆఫ్తాబ్ నవ్వుతూ కొట్టి పడేస్తే, నిషా నా కోపాన్ని తను చిన్నతనంగా భావించి బాధపడేది. మీరు కనుక పెళ్లయినవారైతే భార్యలు... భర్తల (అలాంటి) తత్వాన్ని అక్కడ ఉన్నదాని కంటే చాలా ఎక్కువగా తీసుకుంటారని తెలుస్తుంది. వాళ్లంతా వెళ్లాక నిషా నాపై తన కోపాన్ని కుమ్మరించింది.

''మీరొక పరమ బుద్ధిహీనుడిలా ప్రవర్తించారు.'' ''నవ్వులాటను తేలిగ్గా తీసుకోలేరా?'' అని నిషా. ''అదేం తమాషాగా లేదు'' అని నేను. ''అందరికీ తెలుసు అదంతా తమాషాకేనని. కానీ అది మీ మీద జోక్ కనుక మీకు కోపం వచ్చింది'' – నిషా. ఇరవై నిముషాల తర్వాత నా కోపం అంతా చల్లారిపోయింది. నేను ప్రశాంతచిత్తుడినై ఉండిపోయాను. కానీ నిషా ఇంకా తన కోపాన్ని లోలోపల అణచుకునే ఉంది.

''కాఫీ'' అని అడిగాను. మౌనం! ''టీ?'' అన్నాను, అది కాకపోతే ఇది అన్నట్లు. మరింతగా మౌనం! ''ఏంటి నీ బాధ?'' అని పెద్దగా అరిచాను... ఆమె నాతో మాట్లాడటానికి తిరస్కరిస్తున్నందువల్ల వచ్చిన కోపంతో. అప్పుడు కూడా మౌనం! ''ఛీ పో...'' అన్నాను. ''నువ్వే ఛీ పో'' అంటూ అప్పుడు నోరు తెరిచి, మళ్లీ మౌనంగా ఉండిపోయింది. ఇదంతా సర్దుకోడానికి రెండు రోజులు పట్టింది.

ఏమైనా, బయటివాళ్లతో వచ్చే తగాదాలు బద్దలయ్యేంతగా గానీ, దీర్ఘ కాలం కొనసాగేంతగా గానీ ఉండవు. ఇట్టే అవి చెలరేగితే చెలరేగి ఉండొచ్చు గాక. నాకిప్పుడు తెలుస్తోంది నా ప్రారంభ ప్రతిస్పందన ఆత్మనిగ్రహం లేనిదిగా, సాధారణంగా నా వైపు నుండే తప్పును ఎత్తి చూపించేదిలా ఉంది అని. కానీ ఏం చేయటం, నాకు తెలివి వచ్చేటప్పటికే బాగా ఆలస్యం అయిపోయింది. తర్వాత నేను చేయగలిగిందంతా నేనే మొదట క్షమాపణలు చెప్పి పరిస్థితిని చక్కబరచుకోవటం. కొన్నిసార్లు అది పని చేస్తుంది కానీ అన్నిసార్లూ కాదు. ఆఫీసులో నా సహోద్యోగులు కొందరు రోజుల తరబడి బిగదీసుకుని ఉండేవారున్నారు.

గతవారం, మానవ ప్రవర్తనల్ని విశ్లేషించే ఒక అమెరికన్ ఇచ్చిన వివరణ అనుకోకుండా నా దృష్టికి వచ్చింది. ''షార్ట్ టెంపర్డ్‌గా ఉండేవాళ్లకు, అంటే... తేలిగ్గా, తరచు తప్పుగా కోపం తెచ్చుకునేవాళ్లకు మనసులో ఏమీ ఉండదు. అంతా పైకే కనబరిచేస్తారు. తమను ఎగతాళి చెయ్యటాన్ని వారు నవ్వుతూ తీసుకుంటారు. అయితే దాని వల్ల వారు తరచు అన్యాయంగా వెక్కిరింపులు పడవలసి వస్తుంది. దాంతో అదుపు తప్పుతారు. వాళ్ల మాదిరిగా నియంత్రణ కోల్పోవటం మంచిదే. కానీ అందులో మీరు నిజాయితీగా ఉండండి. దారి మళ్లించటానికి, మనసులో ఉన్నది దాచిపెట్టుకోటానికి మాత్రమే నిజమైనది కాని మౌనాన్ని కొనసాగించండి.''

నిషా ఈ మాటల్లోని సమర్థనీయతను అంగీకరించి ఉండేదా అని నా ఆశ్చర్యం. లేదంటే, ఆమె పెద్దగా నవ్వి, 'కె.టి. బాబా ఇదంతా మీరు కల్పించారు కదా? వినటానికైతే బాగుంది'' అని ఉండేదా?

కావచ్చు. అప్పుడైతే అది మానవ ప్రవృత్తిలోని గొప్ప విషయం.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

గాలిలో కదిలే దీపం!

ఈ లోకంలో ఏదీ శాశ్వతం కాదు. ఇక్కడ దేనికి, ఎప్పుడు కాలం చెల్లిపోతుందో ఎవ్వరూ చెప్పలేరు. కనుక, ఇక్కడ శాశ్వతమైనది ఏది? అని ప్రశ్న వేసుకుంటే 'అంతాన్ని గురించిన అనిశ్చితియే!' అనే సమాధానం దొరుకుతుంది. ఆ అనిశ్చితిని మనసులో ఒక వాస్తవంగా స్థాపించుకున్న వ్యక్తికి దుఃఖం దూరమై, ముక్తి దగ్గరౌతుందని విజ్ఞులు చెప్పారు. వేదాంత పరమైన ఈ వాస్తవాన్ని కనుపర్తి అబ్బయామాత్యుడు, తాను రచించిన 'కవిరాజ మనోరంజనం' ప్రథమాశ్వాసంలోని ఒక సన్నివేశంలో పురూరవుడికి, నారద మహర్షికి మధ్య జరిగిన సంభాషణలో భాగంగా ఒక చక్కటి పద్యంలో చెప్పాడు. తన జనరంజక పాలనను గొప్పగా పొగుడుతున్న నారదుడితో పురూరవుడు ఎందరో రాజులు ఈ పుడమిని ఇంతకు మునుపు గొప్పగా పాలించారు కనుక తనను అంతగా పొగడవలసిన పనిలేదని చెప్పాడు. ఆపై సంభాషణ కొనసాగింపుగా ఇలా అంటాడు:

జ్యోతిర్మయం

దేహము వాయుసంచలిత దీపిక, పుత్రకళత్ర మిత్ర సం
దోహము స్వప్నకాలమున దోచెడి సందడి రాజ్యభోగ స
న్నాహము జంత్రపుంబ్రతిమ నాట్యము సంపద యింద్రజాల మీ
యైహికసౌఖ్య మేమి సుఖమంచు దలంచెదనయ్య నారదా!

పద్యం ప్రారంభంలోని 'దేహము వాయుసంచలిత దీపిక' అనే మాటలలో సామాన్యము, విశేషము అయిన రెండు భావాలు అవగత మౌతాయి. మానవ దేహం గాలిలో కదులుతున్న దీపం వంటిది. ఎప్పుడైనా ఆరిపోవచ్చు. ఆ కారణంగా దాని భవితవ్యం అనిశ్చితం అని సామాన్యార్థం. విన్నవెంటనే మనసుకు తోచే అర్థం. ఇక రెండవది – మానవ శరీరంలో ఊపిరి అనే వాయువు ప్రసరిస్తున్నంత వరకు దేదీప్యమానంగా వెలిగే దీపం వంటిది ఈ దేహం. ఊపిరి ప్రసరణం ఆగిపోగానే అదీ ఆగిపోతుంది, ఆరి పోతుంది అనే విశేషమైన భావం! ఈరెండు భావాలు కూడా పద్యంలోని సందర్భానికి సొగసును కూర్చేవే!

'భార్య, బిడ్డలు, బంధువులు, మిత్రులతో కూడిన జీవితం, సందడి అంతా కలలో జరిగేదిగానే భావిస్తాను. జీవం లేని మరబొమ్మ చేసే నాట్యం వంటిది రాజ్యభోగం అనీ, ఐంద్రజాలికుడు వెదజల్లే ధనం వంటిది సంపద అనీ సదా భావించి, ఇహలోకంలో సౌఖ్యం లేదనుకోవడంలోనే సుఖముందని నేను భావిస్తాను!' అనేది పురూరవుడు నారదుడితో చెప్పిన మాటలకు అర్థం.

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, **తిథి:** బ.చవితి ఉ.8.24 వరకు, తదుపరి పంచమి, **నక్షత్రం:** పూర్వాభాద్ర రా.8.45 వరకు, తదుపరి ఉత్తరాభాద్ర, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.9.57 నుండి 10.48 వరకు, తదుపరి ప.3.06 నుండి 3.57 వరకు, **అమృత ఘడియలు:** ప.1.17 నుండి 2.45 వరకు ; **రాహుకాలం:** ప.1.30 నుండి 3.00 వరకు, **యమగండం:** ఉ.6.00 నుండి 7.30 వరకు, **సూర్యోదయం:** 5.40, **సూర్యాస్తమయం:** 6.32.

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

ఇలాగైతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండరు

బుల్డోజర్ సంస్కృతితో ఎలాంటి సందేశం ఇస్తున్నారు?.. ఏపీలో ప్రజల్ని భయపెట్టాలనుకుంటున్నారా?

- వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలే గెలిపించుకుంటారు
- అధికారంలో ఉన్న వారు సంయమనం పాటించాలి
- టీడీపీ కూటమి ప్రభుత్వంపై ఎస్పీ అధినేత అఖిలేశ్ ధ్వజం



సాక్షి, న్యూఢిల్లీ: 'ఆంధ్రప్రదేశ్‌లో ప్రజల్ని భయపెట్టాలనుకుంటున్నారా? పట్టపగలే దాడులు, హత్యలు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం, ప్రతిపక్ష పార్టీ శ్రేణులపై అక్రమంగా కేసులు నమోదు చేయడం.. వేధించడం, ఎన్నికైన ప్రజా ప్రతినిధులపై ఏకంగా హత్యాయత్నం చేయడం.. ఇలాంటి బుల్డోజర్ సంస్కృతితో ప్రజలకు ఎలాంటి సందేశం ఇస్తున్నారు?' అని యూపీ మాజీ సీఎం, సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ టీడీపీ కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇలాగైతే ఎక్కువ రోజులు అధికారంలో ఉండరని చెప్పారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఈ తరహా దాడులు ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని హితవు పలికారు. ఏపీలో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై ఢిల్లీలో బుధవారం వైఎస్ జగన్ చేపట్టిన నిరసన కార్యక్రమానికి హాజరైన ఆయన మీడియాతో మాట్లాడారు. తాను ఈ వేదిక వద్దకు రాకపోయి ఉంటే ఏపీలో జరుగుతున్న వాస్తవాలు తనకు తెలిసి ఉండేవి కావన్నారు. వైఎస్సార్‌సీపీకి తమ పార్టీ మద్దతు తెలుపుతోందని ప్రకటించారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమన్నారు. 'ఫొటోలు, వీడియోలు చూశాక ఓ విషయం స్పష్టం చేయదల్చుకున్నా. అధికారంలో ఉన్న వారు సంయమనం పాటించాలి. ప్రజల సమస్యలు పట్టించుకోవాలి. ఎదుటి వారు చెప్పేది వినాలి. అంతేకానీ, వారి ప్రాణాలు తీయకూడదు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీ.. ఆ వెంటనే ప్రతిపక్ష పార్టీపై దాడులు మొదలుపెట్టినట్లు.. ఈ ఫోటోలు, వీడియోలు చూసిన తర్వాత స్పష్టంగా అర్థమైంది. నిన్నటి వరకు వైఎస్ జగన్ సీఎంగా ఉన్నారు. ఇప్పుడు చంద్రబాబు సీఎంగా ఉన్నారు. రేపు మళ్లీ వైఎస్ జగన్ ముఖ్యమంత్రి కావచ్చు. ప్రజాస్వామ్య వ్యవస్థలో బుల్డోజర్ సంస్కృతిని సమాజ్‌వాదీ పార్టీ ఏనాడూ సమర్థించలేదు. దాన్ని తప్పు పడుతున్నాం. చివరకు ప్రభుత్వ పెద్దలు.. అలా బుల్డోజర్ సంస్కృతిని పెంచి, పోషిస్తూ.. సమాజానికి ఏం సందేశం ఇవ్వదల్చారు? అలా చేసి ప్రజలను భయపెట్టాలనుకుంటున్నారా? అది సరికాదు' అని చెప్పారు.

పోరాడుతున్నందుకు అభినందనలు

ప్రజలు సంతోషంగా జీవించాలని, ఎవరైతే ప్రజలను భయపెడుతుంటారో.. వారు మంచి ముఖ్యమంత్రి కారని, అది సుపరిపాలన కాదని అఖిలేశ్ స్పష్టం చేశారు. ఆ పని చేసే వాళ్లు ఎక్కువ కాలం అధికారంలో ఉండబోరన్నది గుర్తు పెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో కొనసాగుతున్న అరాచక పాలనను ధైర్యంగా ఎదుర్కొంటున్నందుకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, వైఎస్సార్‌సీపీని అభినందిస్తున్నానని చెప్పారు. 'ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పార్టీ కార్యకర్తలంతా ఆయన వెంట నడుస్తున్నారు. ఇది గొప్ప విషయం. వైఎస్ జగన్ ఎల్లప్పుడూ కార్యకర్తలతో మమేకం అవుతారు. అలాంటి నాయకుడు ఈ రోజు, తమ కార్యకర్తల కోసం పోరాడుతున్నారు. రేపు కార్యకర్తలే పోరాడి, తిరిగి అధికారంలోకి తీసుకొస్తారు. ఆంధ్రప్రదేశ్‌లో సాగుతున్న విధ్వంసాన్ని మీరు (మీడియా) అందరికీ చూపాలి' అని కోరారు.

వైఎస్ జగన్‌కు మా మద్దతు

బుల్డోజర్ సంస్కృతి అనేది ఎప్పుడూ, ఎక్కడా మంచిది కాదని, తాము దాన్ని యూపీలో చూశామని అఖిలేశ్ చెప్పారు. 'వ్యక్తుల ఆస్తులు ధ్వంసం చేయడాన్ని ఉత్తరప్రదేశ్‌లో చూశాం. అంత కంటే మరో దారుణం నకిలీ ఎన్‌కౌంటర్ అదీ ఏకంగా పోలీస్ కస్టడీలోనే ఎన్‌కౌంటర్ జరిగింది. ఎవరైనా పోలీస్ కస్టడీ సురక్షితం అనుకుంటారు. కానీ, మా దగ్గర ఏకంగా పోలీస్ కస్టడీలోనే ఎన్‌కౌంటర్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు అన్యాయం జరుగుతోంది. అదే పరిస్థితి మా యూపీలో కూడా చూశాం. కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే ఉన్నప్పుడు కూడా.. ప్రభుత్వంతో పోరాడాం. ప్రభుత్వం ముందు తల వంచలేదు. ఆ తర్వాత మా పార్టీ నుంచి 37 మంది ఎంపీలు గెల్చారు. కాంగ్రెస్ నుంచి కూడా ఆరుగురిని గెలిపించాం. ప్రజల వెంట ఉన్న వారిని ఎప్పుడైనా ఆదరిస్తారు. కాబట్టి, రేపు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ప్రజలే గెలిపించుకుంటారు. బీజేపీ ఇలాంటి ఘటనలను సమర్థించకూడదు. వైఎస్సార్‌సీపీ, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి మా మద్దతు ఉంటుంది. అండగా నిలబడతాం. ఇలాంటి పరిస్థితి రేపు మరెవరికైనా రావచ్చు. మేమెప్పుడూ అన్యాయానికి వ్యతిరేకంగా పోరాడతాం' అని స్పష్టం చేశారు.



ఢిల్లీలోని జంతర్ మంతర్‌లో బుధవారం వైఎస్సార్‌సీపీ నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో దేశవ్యాప్తంగా పలు పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. వైఎస్సార్‌సీపీ ఆందోళనకు సంఘీభావం తెలిపారు. ఫొటో గ్యాలరీని సందర్శించారు. ఏపీలో అధికార పార్టీ దారుణాలకు సంబంధించిన వీడియోను చూశారు. అనంతరం పలువురు జాతీయ నేతలు మీడియాతో మాట్లాడారు.

కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలి



ఏపీలో దౌర్జన్యాలు, అరాచకాలు అరికట్టాలి. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలి. వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నాం. గెలిచిన పార్టీ, ఓడిన పార్టీపై దాడులు చేయడం, వేధించడం సరికాదు. ఏపీలో అదే జరుగుతోంది. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా ఉంది. ఎవరు ప్రభుత్వం ఏర్పాటు చేసినా, అధికారంలోకి వచ్చినా, ప్రజలందరినీ రక్షించాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. కానీ, ఏపీలో అది జరగడం లేదు. ఏపీలో జరుగుతున్న దౌర్జన్యాలు, అరాచకాలను కేంద్రం అరికట్టి శాంతి భద్రతలను కాపాడాలి. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, శాంతి భద్రతలు బాగు పడడానికి.. మేము, జగన్‌తో కలిసి పని చేయాలని నిర్ణయించాము. వైఎస్సార్‌సీపీకి ఏఐఏడీఎంకే పూర్తి మద్దతు ఇస్తుంది.

– ఏఐఏడీఎంకే ఎంపీ తంబిదొరై

ఏపీ ప్రభుత్వాన్ని తక్షణం డిస్మిస్ చేయాలి



ఏపీలో జరుగుతున్న ఘటనల వీడియోలు చూసిన తరవాత, నాకు ఒక్కటే అనిపించింది. స్వతంత్ర్య భారతావనిలో, ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇలాంటి ఘటనలను ఊహించలేము. రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ ఏమైంది? గవర్నర్ ఏం చేస్తున్నారు? కేంద్రానికి రిపోర్టు ఎందుకు పంపడం లేదు? రాష్ట్రంలో రాజ్యాంగ వ్యవస్థ అనేది లేకుండా పోయింది. విపక్ష పార్టీ నేతను హత్య చేస్తున్నారు. వారిపై దాడులు చేస్తున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం కనీసం ఒక్క నిమిషం కూడా అధికారంలో ఉండే హక్కు లేదు. అందుకే నేను కేంద్రాన్ని ఒక్కటే డిమాండ్ చేస్తున్నాను. ఇప్పటికైనా కళ్లు తెరవాలి. వెంటనే రాష్ట్ర ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసి, రాష్ట్రపతి పాలన విధించాలి. వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నాం.

– ఎస్పీ నేత రాంగోపాల్ యాదవ్

సుప్రీంకోర్టు సుమోటోగా స్వీకరించాలి



ఎన్నికల తర్వాత ఏపీలో ఏం జరుగుతోందనేది వీడియోల్లో చూపించారు. దృశ్యాలు చాలా ఆవేదన కలిగించాయి. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి.. కానీ, ఎప్పుడూ, ఎక్కడా ఇలాంటి దారుణాలు చోటు చేసుకోవడం సరికాదు. ఈ సంస్కృతిని మేము కచ్చితంగా వ్యతిరేకిస్తాం. మేమంతా జగన్ వెంట ఉన్నాం. ఎక్కడైతే వ్యవస్థలపై దాడులు జరుగుతాయో, పార్టీలపై దౌర్జన్యాలు కొనసాగుతాయో.. ప్రజాస్వామ్య వ్యవస్థకు విఘాతం కలుగుతుందో.. ఇండియా కూటమి అక్కడ నిలబడి పోరాడుతుంది. భుజం భుజం కలిపి పని చేస్తుందని జగన్‌కు భరోసా ఇస్తున్నాం. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలి. వెంటనే ఏపీ ప్రభుత్వాన్ని డిస్మిస్ చేసి, రాష్ట్రపతి పాలన విధించాలి. ఏపీలో జరుగుతున్న దారుణాలపై సుప్రీం కోర్టు కూడా సుమోటోగా కేసు స్వీకరించాలి. వైఎస్సార్‌సీపీ చేస్తున్న పోరాటానికి మద్దతు ఇస్తున్నాం.

– శివసేన (ఉద్ధవ్) ఎంపీ ప్రియాంక చతుర్వేది

ఏపీలో పరిస్థితి దిగ్భ్రాంతికరం



నేను పశ్చిమ బెంగాల్ నుంచి వచ్చాను. ఆంధ్రప్రదేశ్‌లో పరిస్థితి చూసి దిగ్భ్రాంతికి గురయ్యాను. రాష్ట్రంలో ఏ స్థాయిలో దౌర్జన్యాలు జరిగాయో చూస్తే, బాధ అనిపిస్తోంది. ఇళ్లపై దాడులు చేశారు. ఆ ఘటనలన్నింటినీ తీవ్రంగా ఖండిస్తున్నాం. వెంటనే కేంద్రం సుమోటోగా చర్య తీసుకోవాలి. వెంటనే ఏపీలో పరిస్థితి చక్కదిద్దాలి. మేము జగన్‌కు, రాష్ట్ర ప్రజలకు అండగా, తోడుగా నిలబడతాం. – టీఎంసీ ఎంపీ నదీముల్ హక్

శాంతి భద్రతలను కాపాడాలి



రాష్ట్రంలో జరుగుతున్న దౌర్జన్యాలపై ఫోటోలు, వీడియోలు చూశాం. నిజంగా దిగ్భ్రాంతికి లోనయ్యాము. ఎన్నికలు జరిగిన నెల రోజుల్లోనే వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలే లక్ష్యంగా అధికార టీడీపీ అనేక దౌర్జన్యాలు చేసింది. వారి ఇళ్లపై టీడీపీ కార్యకర్తలు దాడులు చేశారు. ఆస్తులు ధ్వంసం చేశారు. పక్కాగా ప్లాన్ చేసి మరీ ఈ దాడులు చేస్తున్నారు. ప్రస్తుత సీఎం కొడుకు, తన పార్టీ కేడర్‌ను ఈ దాడులకు ఉసి గొల్పుతున్నారు. రెడ్ బుక్ పట్టుకుని తిరుగుతున్నారు. మా పార్టీ తరఫున ఈ ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నాం. ఏపీలో జరుగుతున్న అరాచకాలను కేంద్రం కూడా పరోక్షంగా సమర్థిస్తోంది. ఇప్పటికైనా కేంద్రం కళ్లు తెరవాలి. ఏపీలో శాంతి భద్రతలు కాపాడాలి.

– వీసీకే పార్టీ అధినేత తిరుమావలవన్

వారికి, దేశద్రోహులకి తేడా ఏముంది?!



ఇది చాలా బాధాకరం. దేశం ఎటు పోతుంది? ఎన్నికల్లో గెలుపొందిన పార్టీ, ఓడిన పార్టీ శ్రేణులపై దాడులు చేసి ప్రాణాలు తీయడం ఏంటి?. వారికి, దేశ ద్రోహులకు తేడా ఏముంది? కేంద్రం ఏం చేస్తోంది? ఎన్డీఏ కూటమి ఎందుకు స్పందించడం లేదు? ఏపీలో జరుగుతున్న ఘటనలపై కేవలం దాడుల కోణంలోనే కాకుండా, దేశద్రోహ కేసులు నమోదు చేయాలి. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇవి ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదు. ఇలా దాడులు చేస్తున్న వారిని కటకటాల్లోకి పంపాలి. కఠిన చర్యలు తీసుకోవాలి. వారు దేశానికే ప్రమాదకరంగా మారారు కాబట్టి.. వారి పట్ల కఠినంగా వ్యవహరించాలి.

– ఆప్ ఎమ్మెల్యే రాజేంద్రపాల్ గౌతమ్

కేంద్రం కళ్లు మూసుకొంటే ఏపీ మణిపూర్‌లా మారుతుంది

- ఈ తరహా దాడులు రాజకీయాలకు సరికాదు
- ఏపీ సీఎం కుమారుడు రెడ్‌బుక్ పట్టుకు తిరుగుతున్నారు
- శివసేన (ఉద్ధవ్) ఎంపీ అరవింద్ సావంత్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో సీఎం కుమారుడు రెడ్ బుక్ పట్టుకొని తిరుగుతున్నాడని, రాష్ట్రంలో హింస ప్రజ్వరిల్లుతోందని, కేంద్రం కళ్లుమూసుకొని ఉంటే ఆ రాష్ట్రం మరో మణిపూర్‌లా తయారవుతుందని శివసేన (ఉద్ధవ్) పార్టీ లోక్‌సభాపక్ష నేత, ఎంపీ అరవింద్ సావంత్ ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వెంటనే జోక్యం చేసుకోవాలని డిమాండ్ చేశారు. ఢిల్లీలో వైఎస్ జగన్ చేపట్టిన నిరసనలో పాల్గొని, ఫోటో గ్యాలరీని సందర్శించిన అనంతరం సావంత్ జాతీయ మీడియానుద్దేశించి మాట్లాడారు. ఏపీలో దారుణాలపై పోరాడుతున్న వైఎస్సార్‌సీపీకి మద్దతు ప్రకటించారు. 'మా ఆత్మకు క్షోభ కలిగించే ఘటనలు ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్నాయి. గతంలో చంద్రబాబుతో కలిసి కూటమిలో ఉన్నాము. ఎన్డీఏలో కూడా కొనసాగాం. శివసేన పార్టీలో చీలిక వచ్చినప్పుడు చాలా మంది పార్టీని వీడారు. ఉద్ధవ్ ఠాక్రే ఒక్కరే గట్టిగా నిలబడ్డారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కూడా అదే విధంగా రాజకీయాల్లో నిలబడ్డారు. అందుకే మా పార్టీలో వైఎస్ జగన్ గురించి మాట్లాడుకుంటాము. ఆయనకు ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా, అన్నీ తట్టుకుని నిలబడ్డారు. ప్రజల మద్దతుతో సీఎం అయ్యారు. ఈ రోజు చంద్రబాబు అధికారంలో ఉండొచ్చు. కానీ, గెల్చిన తర్వాత ఓడిన పార్టీ నాయకులను ఎంచుకుని మరీ చంపడం, దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసం చేయడం ఏ మాత్రం సమర్థనీయం కాదు. విపక్షంపై దాడులను ఏపీ సీఎం కుమారుడు ప్రోత్సహిస్తున్నారు. మహారాష్ట్రలోనూ ఇలాంటివి జరుగుతున్నాయి. ఈడీ దాడులు, సీబీఐ కేసులు, వేధింపులు వంటివి జరుగుతున్నాయి. అందుకే వైఎస్ జగన్‌కి వైఎస్సార్‌సీపీకి అండగా నిలుస్తున్నాం. పార్లమెంటులో కూడా ఆ పార్టీతో కలిసి పని చేస్తాం. కేంద్రం వెంటనే జోక్యం చేసుకొని, ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ పరిస్థితులు నెలకొనేలా చూడాలి' అని అరవింగ్ సావంత్ చెప్పారు.

కేంద్రం కళ్లు తెరవాలి

- గెలిచిన వారు ఓడిన వారిపై దాడులు చేయడం సరికాదు
- ఏఐఏడీఎంకే ఎంపీ నటరాజన్ చంద్రశేఖరన్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న హింసాత్మక ఘటనలపై కేంద్రం ఇప్పటికైనా కళ్లు తెరవాలని ఏఐఏడీఎంకే ఎంపీ నటరాజన్ చంద్రశేఖరన్ డిమాండ్ చేశారు. గెలిచిన పార్టీ వారు ఓడిన పార్టీ వారిపై దాడులు చేయడం, వేధింపులకు గురిచేయడం సరికాదని హితవు పలికారు. ఢిల్లీలో వైఎస్ జగన్ చేపట్టిన నిరసనలో పాల్గొన్న చంద్రశేఖరన్ జాతీయ మీడియాతో మాట్లాడారు. ఈ పోరాటంలో వైఎస్సార్‌సీపీకి మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. 'ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రజా తీర్పునకు అనుగుణంగా పార్టీలు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తాయి. ఏపీలో గెలిచిన పార్టీ వారు ఓడిన పార్టీ వారిపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారు. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితి దారుణంగా మారింది. ఎవరు అధికారంలోకి వచ్చినా ప్రజలందరినీ కాపాడాలి. ఏపీలో అది జరగడంలేదు. ఇప్పటికైనా కేంద్రం కల్పించుకొని ఏపీలో దౌర్జన్యాలు, అరాచకాలను అరికట్టి శాంతి భద్రతలు కాపాడాలి. ఏపీలో ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోవడానికి, శాంతి భద్రతల పునరుద్ధరణకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో కలిసి పని చేయాలని నిర్ణయించాం' అని చంద్రశేఖరన్ చెప్పారు.

ఏపీలో ప్రభుత్వ ఉగ్రవాదం

- వైఎస్ జగన్ పోరాటానికి మద్దతిస్తున్నాం
- ఐయూఎంఎల్ ఎంపీ అబ్దుల్ వాహబ్, హ్యారిస్ బీరన్




సాక్షి, న్యూఢిల్లీ : ఏపీలో ప్రభుత్వమే స్వయంగా ఉగ్రవాదానికి పాల్పడుతోందని ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ప్రతినిధులు, ఎంపీ అబ్దుల్ వాహబ్, న్యాయవాది హ్యారిస్ బీరన్ చెప్పారు. ఏపీలో జరుగుతున్న ఉగ్రవాద తరహా దాడులకు వ్యతిరేకంగా మాజీ సీఎం వైఎస్ జగన్ చేస్తున్న పోరాటానికి మద్దతిస్తున్నామని తెలిపారు. ఢిల్లీలో ఫొటో గ్యాలరీ తిలకించి మీడియాతో మాట్లాడుతూ.. 'వైఎస్ జగన్‌ను 2004లో తొలిసారి చూశాం. వైఎస్సార్ కుమారుడిగా ఏపీ ప్రజలకు సంక్షేమ పాలన అందించారు. ఈ రోజు ప్రతిపక్షంలో ఉండొచ్చు. వైఎస్ జగన్‌కు ఉన్న నాయకత్వ లక్షణాలతో ఆయన ప్రధాని కూడా కావొచ్చు. ప్రభుత్వ ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్న వైఎస్ జగన్, విజయసాయిరెడ్డి వంటి వారికి మా మద్దతు ఉంటుంది. పౌరులపై ఎక్కడ దాడి జరిగినా వ్యతిరేకించాల్సిందే. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పోరాటానికి అండగా నిలుస్తాం'' అని చెప్పారు.

ఒక్కరోజు కూడా పాలించే హక్కులేదు

- ఏపీలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉన్నాయా?
- కేంద్ర హోం మంత్రిత్వ శాఖ వెంటనే స్పందించాలి
- శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్



సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో అరాచకం రాజ్యమేలుతోందని, అక్కడ ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఉన్నాయా అని శివసేన (ఉద్ధవ్) ఎంపీ సంజయ్ రౌత్ ప్రశ్నించారు. ఏపీ ప్రభుత్వానికి ఒక్క రోజు కూడా పాలించే హక్కు లేదని స్పష్టం చేశారు. ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద వైఎస్ జగన్ చేపట్టిన నిరసనలో పాల్గొని, ఫోటో గ్యాలరీని సందర్శించిన అనంతరం సంజయ్ రౌత్ మీడియాతో మాట్లాడారు. ఏపీలో జరుగుతున్న రాజకీయ కక్షలులాంటివి దేశానికి మంచిది కాదని హితవు పలికారు. ఏపీలో హత్యాకాండకు వ్యతిరేకంగా పోరాడుతున్న వైఎస్ జగన్‌కు మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. 'మిత్రుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవడానికే ఇక్కడికి వచ్చాను. ప్రభుత్వాలు వస్తుంటాయి, పోతుంటాయి. కానీ, ఈ తరహా ఘటనలు మంచివి కాదు. ఆంధ్రప్రదేశ్‌లో గత 45 రోజులుగా నరమేధం కొనసాగుతోంది. దేశంలో కేంద్ర హోం మంత్రి, ఆ మంత్రిత్వ శాఖ ఉంటే.. వెంటనే స్పందించాలి. ప్రత్యేక బృందాన్ని రాష్ట్రానికి పంపాలి. ఏపీలో జరుగుతున్న దాడులు, అమానుషాలు, విధ్వంసంపై సమగ్ర విచారణ జరిపించాలి. ఈ చిత్రాలు, వీడియోలు చూసిన తర్వాత ఒక విషయం స్పష్టం చేయదల్చుకున్నా. ఆంధ్రప్రదేశ్‌లో ఎలాంటి ప్రజాస్వామ్యం, రాజ్యాంగం లేదు. అందుకే మేము వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీకి పూర్తి మద్దతు ఇస్తున్నాం. వారి పోరాటానికి అండగా నిలబడతాం' అని సంజయ్‌రౌత్ తెలిపారు.

అరాచక పాలనకు స్వస్తి చెప్పాలి.. రాష్ట్రపతి పాలన పెట్టాలి

ఏపీలో ప్రభుత్వం ఉందా?

- హత్యలు, అత్యాచారాలు, దాడులు, ఆస్తుల ధ్వంసం జరుగుతున్నా పట్టించుకోదా?
- రాష్ట్రంలో టీడీపీ గూండాల రావణకాష్టం
- అంబేడ్కర్ రాజ్యాంగం కాదు.. లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్రంలో టీడీపీ కూటమి దమనకాండను వైఎస్సార్‌సీపీ నేతలంతా ముక్తకంఠంతో ఖండించారు. టీడీపీ కూటమి దాష్టీకాలను నిరసిస్తూ బుధవారం ఢిల్లీలో జంతర్‌మంతర్ వద్ద వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేసిన ధర్నాలో వారు పాల్గొన్నారు. టీడీపీ కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని రావణకాష్టంగా మారుస్తున్న వైనంపై విరుచుకుపడ్డారు. రాజకీయ హత్యలను ప్రభుత్వమే పెంచి పోషిస్తోందంటూ నిప్పులు చెరిగారు. ఈ అరాచకాలు, దమనకాండ చూస్తే రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. రాష్ట్రంలో కూటమి అరాచకపాలనకు స్వస్తి చెప్పి, వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాలని డిమాండ్ చేశారు.

దుర్మార్గపు చర్యలు సరికాదు



రాష్ట్రంలో కూటమి అరాచకానికి హద్దూ అదుపూ లేకుండా పోతోంది. మేం ప్రభుత్వంలో ఉన్నప్పుడు ఎప్పుడూ ఇలాంటివి ప్రోత్సహించలేదు. ఈ దుర్మార్గపు చర్యలకు ప్రభుత్వం ఫుల్‌స్టాప్ పెట్టాలి.

– రాజ్య సభ సభ్యుడు మోపిదేవి వెంకటరమణ

ఈ దాడులను బీజేపీ ఆపాలి



కనీవినీ ఎరుగని రీతిలో రాష్ట్రంలో మారణకాండ జరుగుతోంది. స్వాతంత్రం వచ్చాక ఇలాంటి అరాచకాలు ఎప్పుడూ చూడలేదు. ఏపీలో టీడీపీ దమనకాండను దేశం మొత్తానికి చూపించేందుకే ఢిల్లీలో ఈ ధర్నా. కేంద్రంలో ఉన్న బీజేపీ ఇప్పటికైనా అర్థం చేసుకుని కళ్లు తెరిచి ఈ దాడులను ఆపాలి.

– రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబురావు

ప్రజలు తిరగబడతారు



కూటమి ప్రభుత్వం తక్షణమే దాడులను ఆపకపోతే ప్రజలే తిరగబడతారు. ఆ రోజులు దగ్గర్లోనే ఉన్నాయి. రాజకీయ పార్టీలు, నేతలు ప్రజలకు రోల్ మోడల్‌గా ఉండాలి. రాష్ట్రంలో విధ్వంస పాలన జరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోకపోవడం దారుణం. ఏపీలో మా పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులపై లోక్‌సభలో గళం విప్పేందుకు సిద్ధంగా ఉన్నా.

– అరకు ఎంపీ తనూజ రాణి

ఏపీని రావణకాష్టం చేశారు



ఏపీని కూటమి ప్రభుత్వం రావణకాష్టంలా మార్చింది. వెంటనే రాష్ట్రపతి పాలన పెట్టాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. అయినా సీఎం చంద్రబాబు ఏమీ జరగడం లేదంటున్నారు. అందుకే దేశంలోని అన్ని రాజకీయ పక్షాలకు సాక్ష్యాధారాలతో తెలియజేస్తున్నాం.

– అంబటి రాంబాబు, మాజీ మంత్రి

రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా?



కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన నాటి నుంచి హత్యలు, అత్యాచారాలు, ఆస్తుల ధ్వంసం జరుగుతూనే ఉన్నాయి. రాష్ట్రంలో అసలు ప్రభుత్వం ఉందా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రాష్ట్రంలో మంత్రి లోకేశ్ రెడ్‌బుక్ అమలవుతోంది. తాను లాఠీ, గన్ పట్టుకోవాలా అంటూ హోంమంత్రి మాట్లాడటం సిగ్గుచేటు.

– పుష్ప శ్రీవాణి, మాజీ ఉప ముఖ్యమంత్రి


ప్రమాదంలో ప్రజాస్వామ్యం



రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉంది. కూటమి ప్రభుత్వం ఏర్పడిన రోజు నుంచే టీడీపీ నాయకులు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులపై దాడులు చేస్తున్నారు. కొందరిని టార్గెట్ చేసి మరీ చంపేస్తున్నారు. ప్రజాస్వామ్యంలో ఇలాంటి ధోరణులు సరికావు. మహిళలను కూడా అనేక రకాలుగా చిత్రహింసలకు గురిచేస్తున్నారు.

– మాజీ మంత్రి కేవీ ఉషశ్రీ చరణ్

ఇలాంటి విష సంస్కృతి ఎన్నడూ చూడలేదు



50 ఏళ్లగా రాజకీయాల్లో ఉన్నాను. ఎప్పుడూ ఇలాంటి విష సంస్కృతి, రెడ్‌బుక్ రాజ్యం చూడలేదు. ఇప్పుడే చూస్తున్నాను. ఇదే విధంగా దాడులను ప్రోత్సహిస్తే.. భవిష్యత్తులో రాజకీయాల్లోకి వచ్చే వారు కూడా ఇదే సంస్కృతిని అనుసరిస్తారు. భవిష్యత్ ప్రభుత్వాలు కూడా అనుసరించే ప్రమాదం ఉంది. రాష్ట్రంలో జరుగుతున్న దాడులను కేంద్రం గమనించాలి. కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలి. – మాజీ మంత్రి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

రక్త చరిత్ర కనిపిస్తోంది



కూటమి ప్రభుత్వం గెలిచిన తర్వాత ఆ పార్టీల వాళ్లంతా రక్తపాతానికి పాల్పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, మహిళలపై దాడులకు తెగబడుతున్నారు. నడిరోడ్డుపై హత్యలు చేస్తున్నారు. హింసను ఎవరూ ప్రోత్సహించకూడదు. – మాజీ మంత్రి విడదల రజిని

హింస సమాజానికి మంచిది కాదు



హింస అనేది సమాజానికి మంచిది కాదు. మనం ఏం చేస్తున్నామో రాబోయే రోజుల్లో అదే మనకు రివర్స్‌లో ఎదురవుతుంది అనే విషయాన్ని ఎవరూ మర్చిపోవద్దు. శాంతిభద్రతలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. ఏపీలో ఎక్కడా శాంతిభద్రతలు అదుపులో లేవు. – మాజీ ఎంపీ వంగా గీత

సైబర్ చోరులూ... హ్యాండ్సప్!

ఆన్‌లైన్ నేరాల కట్టడిపై కేంద్రం దృష్టి ● ఏఐ పరిశోధనలకు మరింత ఊతం ● వాటికి బడ్జెట్లో రూ.1,550 కోట్లు

డిజిటల్ చెల్లింపుల్లో భారత్ దూసుకుపోతోంది. ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మొత్తం డిజిటల్ చెల్లింపుల్లో 46 శాతం వాటా మనదే. వీటిలో ఏకంగా 80 శాతం యూపీఐ చెల్లింపులే. మరోవైపు సైబర్ నేరగాళ్లు కూడా అదే స్థాయిలో పేట్రేగిపోతున్నారు. ఢిల్లీ ఎయిమ్స్ సర్వర్లపై పదేపదే సైబర్ దాడులు, చిరుతిళ్ల తయారీ దిగ్గజం హల్దీరామ్స్‌పై రాన్సమ్‌వేర్ దాడి వంటివి ఇందుకు కేవలం ఉదాహరణలే. గత ఐదేళ్లలో మన దగ్గర సైబర్ దాడుల సంఖ్య విపరీతంగా పెరిగిపోతోంది. జాతీయ సైబర్ దాడుల నమోదు పోర్టల్‌కు ఈ ఏడాది ఇప్పటిదాకా సగటున రోజుకు కనీసం 7,000 పై చిలుకు ఫిర్యాదులందాయి. వీటి వాస్తవ సంఖ్య ఇంకా భారీగా ఉంటుందని సైబర్ నిపుణులు చెబుతున్నారు. సైబర్ నేరాల్లో భారత్ ప్రస్తుతం ప్రపంచంలో పదో స్థానంలో ఉంది. నానాటికీ తీవ్రరూపు దాలుస్తున్న ఈ బెడదకు అడ్డుకట్ట వేసే దిశగా 2024–25 కేంద్ర బడ్జెట్లో పలు చర్యలకు మోదీ ప్రభుత్వం ఉపక్రమించింది. సైబర్ భద్రతకు నిధులు పెంచింది. కీలకమైన ఆన్‌లైన్ వ్యవస్థలు, డేటా భద్రత, సైబర్ నేరాల కట్టడి, కృత్రిమ మేధలో పరిశోధనలకు రూ.1,550 కోట్లు కేటాయించింది. ఇందులో రూ.238 కోట్లు కేంద్ర స్థాయిలో సైబర్ భద్రత, నేరాలకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించే నోడల్ ఏజెన్సీ ఇండియన్ కంప్యూటర్ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్ (సెర్ట్–ఇన్)కు దక్కాయి. మొత్తమ్మీద సైబర్ భద్రత ప్రాజెక్టులకు రూ.759 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఇవి ఏకంగా 90 శాతం అధికం కావడం విశేషం!

సైబర్ సెక్యూరిటీ కృత్రిమ మేధ ప్రాజెక్టుల కోసం కేంద్ర హోం శాఖకు కేటాయించిన భారీ నిధుల్లోని మొత్తాలను వెచ్చించనున్నారు. ఆ శాఖ అధీనంలో పని చేసే భారత సైబర్ నేరాల (కట్టడి) సమన్వయ కేంద్రం (ఐ4సీ) ఈ తరహా నేరాలపై ఉక్కుపాదం మోపే విషయంలో నోడల్ ఏజెన్సీగా వ్యవహరించనుంది. కేంద్ర దర్యాప్తు సంస్థలకు పూర్తి సహాయ సహకారాలు అందించనుంది. కీలకమైన ఈ ఏజెన్సీకి ఈసారి నిధులను 84 శాతం పెంచారు. గతేడాది కేవలం రూ.86 కోట్లు ఇవ్వగా ఈసారి రూ.150.95 కోట్లు వెచ్చించనున్నారు. సైబర్ సెక్యూరిటీ ప్రాజెక్టులకు నిధులను 90 పెంచడమే గాక ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలు సైబర్ దాడుల ముప్పు ఎదుర్కొన్నప్పుడు తక్షణం స్పందించి అప్రమత్తం చేసే హెచ్చరిక సంస్థ సెర్ట్–ఇన్‌కు కూడా నిధులు పెంచారు.





మహిళలు, చిన్నారుల రక్షణకు..

మహిళలు, చిన్నారులు సైబర్ వలలో చిక్కుతున్న ఉదంతాలు పెరుగుతున్నందున వాటికి అడ్డుకట్ట వేయడంపైనా కేంద్రం దృష్టి సారించింది. అందుకోసం బడ్జెట్లో రూ.52.8 కోట్లు కేటాయించారు. డిజిటల్ వ్యక్తిగత సమాచార పరిరక్షణ చట్టం, 2023 కింద ఏర్పాటుచేసిన డాటా ప్రొటెక్షన్ బోర్డ్ ఆఫ్ ఇండియాకు జీతభత్యాలు తదితరాల కోసం రూ.2 కోట్లు కేటాయించారు.

ఏఐకి ఐదేళ్లలో రూ.10 వేల కోట్లు

కృత్రిమ మేధ రంగం అభివృద్ధి, విస్తరణ కోసం వచ్చే ఐదేళ్లలో రూ.10,300 కోట్లు ఖర్చుచేయాలని కేంద్రం నిర్ణయించింది. ఇందుకోసం గత మార్చిలో ప్రారంభించిన ఇండియా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మిషన్‌ను పరుగులు పెట్టించనున్నారు. ఇండియాఏఐ మిషన్‌కు ఈసారి రూ.551 కోట్లు కేటాయించడం ఇందులో భాగమే. మొత్తమ్మీద సైబర్ సెక్యూరిటీ, ఏఐ ఇన్నోవేషన్‌కు ఈ బడ్జెట్లో రూ.840 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోలిస్తే ఇది 84 శాతం ఎక్కువ! ఇక ఏఐ, మెషీన్ లెర్నింగ్‌పై విస్తృత పరిశోధనలు చేస్తున్న ఐఐటీ ఖరగ్‌పూర్‌లోని ఏఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ విభాగానికి రూ.255 కోట్ల నిధులిస్తామని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు.





- సాక్షి, నేషనల్ డెస్క్

ఫిర్యాదుల వరద...

భారత్‌లో సైబర్ దాడుల ఉధృతి మామూలుగా లేదు. సొమ్ములు పోయాయంటూ జాతీయ సైబర్ దాడుల నమోదు పోర్టల్‌కు ప్రజలు, సంస్థల నుంచి రోజూ అందుతున్న 7,000 పై చిలుకు ఫిర్యాదుల్లో ఏకంగా 85 శాతం ఆన్‌లైన్ మోసాలే! మన దేశంలో ఆన్‌లైన్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు 2019లో కేవలం 26 వేలు కాగా 2021లో 4.5 లక్షలకు, 2023 నాటికి ఏకంగా 15.5 లక్షలకు పెరిగాయి. ఇక ఈ ఏడాది మే నాటికే 7.4 లక్షల ఫిర్యాదులు నమోదయ్యాయి! 2023లో భారత్‌లో ప్రతి 129 మందిలో ఒకరు సైబర్ దాడుల బారిన పడ్డట్టు మనోహర్ పారికర్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ డిఫెన్స్ స్టడీస్, అనాలిసిస్ గణాంకాల్లో వెల్లడైంది. ఢిల్లీలో అత్యధికంగా ప్రతి లక్ష మందిలో 755 మంది సైబర్ బాధితులున్నారు. ఈ జాబితాలో హరియాణా (381) తర్వాత తెలంగాణ (261) మూడో స్థానంలో ఉంది.

మన కంపెనీలే లక్ష్యం

కొన్నేళ్లుగా భారత కంపెనీలే లక్ష్యంగా సైబర్ దొంగలు రెచ్చిపోతున్నారు. ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ఈ ఏడాది రెండో త్రైమాసికంలో సైబర్ నేరగాళ్లకు భారతీయ కంపెనీలే రెండో అతిపెద్ద లక్ష్యంగా మారాయి. నకిలీ ట్రేడింగ్ యాప్‌లు, రుణ, గేమింగ్, డేటింగ్ యాప్‌లతో పాటు ఆన్‌లైన్‌లో పదేపదే చూసే, వెదికే కంటెంట్‌ను ఎరగా వేస్తూ మెల్లిగా ముగ్గులోకి దింపి ఖాతాల్లో ఉన్నదంతా ఊడ్చేసే ఘటనలు భారత్‌లో ఎక్కువైనట్టు పారికర్ సంస్థ హెచ్చరించింది. సైబర్ సెక్యూరిటీకి అందరికంటే ఎక్కువగా అమెరికా ఈ ఏడాది రూ.1.08 లక్షల కోట్లు వెచ్చిస్తోంది. బ్రిటన్ రూ.7,891 కోట్లు కేటాయిస్తోంది.



రైతు నేతలతో కలిసి మీడియాతో మాట్లాడుతున్న రాహుల్

చట్టబద్ధత కోసం తీవ్ర ఒత్తిడి తెస్తాం

- పంటలకు కనీస మద్దతు ధర విషయంలో రాహుల్ ఉద్ఘాటన
- విపక్షనేతతో భేటీ అయిన రైతుసంఘాల నేతలు

న్యూఢిల్లీ: పంటలకు కనీస మద్దతు ధరకు చట్టబద్ధత సాధన కోసం మోదీ సర్కార్‌పై తీవ్రమైన ఒత్తిడి తెస్తామని లోక్‌సభలో విపక్షనేత రాహుల్‌గాంధీ పునరుద్ఘాటించారు. బుధవారం పార్లమెంట్ భవన కాంప్లెక్స్‌లో రాహుల్‌ను రైతు సంఘాల నేతలు కలిశారు. తెలంగాణ, తమిళనాడు, కర్ణాటక, పంజాబ్, హరియాణా, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల నుంచి వచ్చిన 12 మంది రైతునేతల బృందం రాహుల్‌తో సమావేశమై రైతాంగ సమస్యలపై చర్చించారు. '' కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పిస్తామని మా మేనిఫెస్టోలో ప్రస్తావించాం. పూర్తిస్థాయి సమీక్ష తర్వాతే ఇది ఆచరణ సాధ్యమని చెప్పాం. ఈ విషయమై రైతునేతలతో కాంగ్రెస్ చర్చించింది. ఇక 'ఇండియా' కూటమి నేతలతో సమాలోచనల జరిపి ఎంఎస్‌పీ చట్టబద్ధత కోసం బీజేపీ ప్రభుత్వంపై తీవ్ర ఒత్తిడి తెస్తాం' అని భేటీ తర్వాత రాహుల్ చెప్పారు.

ఉగ్రవాదులు జైలుకు లేదా నరకానికి

హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్



న్యూఢిల్లీ: జమ్మూకశ్మీర్‌లో క్రియాశీలకంగా ఉన్న ఉగ్రవాదులు అయితే జైలుకు లేదా నరకానికి వెళతారని కేంద్ర హోంశాఖ సహాయమంత్రి నిత్యానంద రాయ్ బుధవారం రాజ్యసభలో అన్నారు. మోదీ సర్కారు ఉగ్రవాదాన్ని ఉపేక్షించబోదన్నారు. కాంగ్రెస్ ఎంపీ ప్రమోద్ తివారీ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ.. ఇటీవలి ఉగ్ర అలజడికి త్వరలో ముగింపు పలుకుతామని, ఉగ్రవాదులు తమ లక్ష్యాలను అందుకోలేరన్నారు. గత కొద్దిరోజుల్లో కశ్మీర్‌లో 28 మంది ఉగ్రవాదులను మట్టుబెట్టామని చెప్పారు.

కవచ్‌కు రూ. 1,112 కోట్లు: మంత్రి వైష్ణవ్



న్యూఢిల్లీ: రైల్వే భద్రతకు బడ్జెట్‌లో పెద్దపీట వేశామని మంగళవారం ఘనంగా చెప్పిన రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్ మరుసటి రోజు రాజ్యసభలో అసలు విషయం బయటపెట్టారు. రైలు ప్రమాదాలను నివారించే ఆటోమేటిక్ ట్రైన్ ప్రొటెక్షన్ (ఏటీపీ) వ్యవస్థ కవచ్‌కు తాజా బడ్జెట్లో రూ. 1,112 కోట్లు మాత్రమే కేటాయించినట్లు డీఎంకే ఎంపీలు కనిమొళి, రాణి శ్రీకుమార్‌లు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. కవచ్‌కు ఇప్పటిదాకా రూ.1,217 కోట్లు ఖర్చు పెట్టినట్లు వైష్ణవ్ వివరించారు.

లాలూ ప్రసాద్ యాదవ్‌కు అస్వస్థత



న్యూఢిల్లీ: దాణా కుంభకోణంలో దోషిగా తేలి బెయిల్‌పై బయటికొచ్చిన ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్ ఆరోగ్యం క్షీణించింది. దీంతో మంగళవారం వెంటనే ఆయనను బిహార్ రాజధాని పట్నా నుంచి హుటాహుటిన ఢిల్లీ ఎయిమ్స్‌కి తరలించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు. 77 ఏళ్ల లాలూ గత కొన్ని నెలలుగా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. రెండు మూత్రపిండాలు 75 శాతం విఫలమైన నేపథ్యంలో 2022లో సింగపూర్‌కు వెళ్లి కిడ్నీ ఆపరేషన్ చేయించుకున్నారు. కూతురు రోహిణి ఆచార్య దానంచేసిన కిడ్నీని శస్త్రచికిత్స ద్వారా లాలూకు విజయవంతంగా అమర్చిన విషయం తెల్సిందే. తర్వాత ఆయన భారత్‌కు తిరిగొచ్చినా క్రియాశీలక రాజకీయాల్లో లేరు. అదే ఏడాది ఇంట్లో కిందపడటంతో పలు చోట్ల ఎముకలు విరిగాయి. ఆనాటి నుంచి లాలూను అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి.

పరీక్షల్లో అక్రమాలకు రూ.10 లక్షల జరిమానా

బిహార్ అసెంబ్లీలో కీలక బిల్లు ఆమోదం

పాట్నా: పరీక్షల్లో అక్రమాలు, పేపర్ లీకేజీలను అరికట్టడమే లక్ష్యంగా బిహార్ ప్రభుత్వం కీలకమైన బిల్లును తీసుకొచ్చింది. ఈ బిల్లు ప్రకారం ప్రభుత్వ ఉద్యోగ నియామకాల పరీక్షల్లో అక్రమాలకు పాల్పడితే రూ.10 లక్షల జరిమానా విధిస్తారు. ఐదేళ్ల దాకా జైలు శిక్ష విధిస్తారు. ఈ మేరకు పబ్లిక్ పరీక్షలు(అక్రమ వ్యవహారాల నిరోధక) బిల్లు ఆమోదం పొందింది.

రైతులు–ప్రభుత్వం మధ్య అపనమ్మకమే అసలు సమస్య

- రైతుల్లో విశ్వాసం నెలకొల్పే చర్యలు చేపట్టండి
- 'తటస్థ అంపైర్'ను ఏర్పాటు చేయండి
- పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచన

న్యూఢిల్లీ: ప్రభుత్వం–రైతుల మధ్య నెలకొన్న అపనమ్మకాన్ని తొలగించాలని, ఇందుకోసం 'తటస్థ అంపైర్'గా వ్యవహరించే ఒక స్వతంత్ర కమిటీని ఏర్పాటు చేయాలని పంజాబ్, హరియాణా ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు సూచించింది. రైతుల సమస్యలు, డిమాండ్లపై చర్చించి, పరిష్కార మార్గాలు కనిపెట్టాలని పేర్కొంది. ప్రభుత్వం–రైతుల నడుమ అపనమ్మకం చోటుచేసుకుందని, ఇదే సమస్యగా మారిందని అభిప్రాయపడింది. రైతులు ఢిల్లీకి వెళ్లకుండా ఈ ఏడాది ఫిబ్రవరిలో మూసివేసిన శంభు సరిహద్దును వెంటనే తెరవాలంటూ పంజాబ్, హరియాణా హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ హరియాణా ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. దీనిపై జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ ఉజ్జల భుయాన్‌తో కూడిన ధర్మాసనం బుధవారం విచారణ చేపట్టింది. రైతులతో చర్చలు జరిపేందుకు ఏనాడైనా ప్రయత్నించారా? అని హరియాణా ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. రైతాంగం ఎదుర్కొంటున్న అసలు సమస్యలను ప్రభుత్వాలు గుర్తించడం లేదని పేర్కొంది. వారిలో విశ్వాసం నెలకొల్పే చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ప్రభుత్వానికి, రైతన్నలకు మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి చొరవ చూపే తటస్థ అంపైర్‌ను(స్వతంత్ర కమిటీ) నియమించాలని హరియాణా, పంజాబ్ ప్రభుత్వాలకు సూచించింది. కమిటీలో ఎవరిని నియమిస్తే బాగుంటుందో ప్రతిపాదించాలని పేర్కొంది. శంభు సరిహద్దు వద్ద బారికేడ్లను తొలగించడానికి ప్రణాళిక రూపొందించాలని, ప్రజల రాకపోకలకు ఇబ్బందుల లేకుండా చూడాలని ఆదేశించింది. తదుపరి విచారణను సుప్రీంకోర్టు ధర్మాసనం వచ్చేవారానికి వాయిదా వేసింది.

సింగపూర్ పాస్‌పోర్టు.. పవర్‌ఫుల్

195 దేశాలకు వీసా రహిత ప్రయాణ సదుపాయం



న్యూఢిల్లీ: సింగపూర్ పాస్‌పోర్టు ఉన్నవాళ్లు భలే అదృష్టవంతులు. ఎందుకంటే 195 దేశాలకు వీసా లేకుండా నిక్షేపంగా వెళ్లొచ్చు. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్టుగా సింగపూర్ పాస్‌పోర్టు ఘనత సాధించింది. ఇండియా పాస్‌పోర్టుకు 82వ స్థానం దక్కింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో ఇండియా పాస్‌పోర్టు ర్యాంకు 85 కాగా, ఇప్పుడు కొంత మెరుగుపడింది. ఈ పాస్‌పోర్టుతో ఇండోనేషియా, మలేషియా, థాయ్‌లాండ్ తదితర 58 దేశాలకు వీసా లేకుండా వెళ్లే అవకాశం ఉంది. హెన్లీ పాస్‌పోర్టు ఇండెక్స్ జాబితా తాజాగా విడుదలైంది. భారత పాస్‌పోర్టుతో సమానంగా సెనెగల్, తజకిస్తాన్ దేశాల పాస్‌పోర్టులకు సైతం 82వ ర్యాంకు లభించింది. జపాన్, ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ, స్పెయిన్ పాస్‌పోర్టులకు రెండో ర్యాంకు దక్కింది. ఈ దేశాల పాస్‌పోర్టులో 192 దేశాలకు వీసా లేకుండా ప్రయాణించే సౌలభ్యం ఉంది. ఆస్ట్రియా, ఫిన్‌లాండ్, ఐర్లాండ్, లక్సెంబర్గ్, నెదర్లాండ్స్, దక్షిణ కొరియా, స్వీడన్ పాస్‌పోర్టులకు మూడో ర్యాంకు సొంతమైంది. ఈ పాస్‌పోర్టులతో 191 దేశాలకు వీసాలేని ప్రయాణం సాగించవచ్చు.

మోసగాళ్లను ఓడించాలి

ట్రంప్‌పై విమర్శల వర్షం



వాషింగ్టన్: ట్రంప్ లాంటి అవినీతి పరులను, ద్రోహులను ఎన్నికల పోరాటంలో మట్టికరిపించడమే తన ధ్యేయమని రిపబ్లికన్ అభ్యర్థిగా దాదాపు ఖరారైన కమలా హారిస్ ఉద్ఘాటించారు. మంగళవారం విస్కాన్సిన్ రాష్ట్రంలో డెమొక్రటిక్ పార్టీ సమావేశంలో ఆమె తన మద్దతుదారులను ఉద్దేశించి ప్రసంగించారు. అభ్యర్థిత్వానికి సరిపడా మద్దతు కూడగట్టుకున్నాక కమల మాట్లాడిన మొదటి సమావేశం ఇదే. గతంలో కాలిఫోర్నియా ప్రాసిక్యూటర్‌గా పనిచేశానని, తన రికార్డు ఏమిటో ప్రజలకు తెలుసని పేర్కొన్నారు. డొనాల్డ్ ట్రంప్ గురించి కొత్తగా చెప్పాల్సిన అవసరం లేదన్నారు. మహిళలను వేధించిన దుర్మార్గులను, అమాయక ప్రజలను దగా చేసిన మోసగాళ్లను, సొంత లాభం కోసం నిబంధనలు అతిక్రమించిన దుష్టులను ఎన్నికల్లో చిత్తు చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చారు. కాగా, డెమొక్రటిక్ అభ్యర్థిగా తొలుత బరిలోకి దిగిన బైడెన్‌కు ప్రజల నుంచి వచ్చిన విరాళాలను హారిస్‌కు బదిలీ చేయడం ఆపాలని ట్రంప్ ప్రచార బృందం కోరింది. ఈ మేరకు ఫెడరల్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసింది.

సర్వేల్లో హారిస్‌దే పైచేయి

లేటుగా వచ్చినా, లేటెస్ట్‌గా వచ్చారన్న నానుడిని హారిస్ నిజం చేస్తున్నారు. అధ్యక్ష రేసులో బైడెన్‌పై ఆద్యంతం ఆధిపత్యం ప్రదర్శించిన ట్రంప్ జోరుకు ఆమె వచ్చీ రాగానే కళ్లెం వేశారు. మానసిక చురుకుదనం, సవాళ్లను దీటుగా ఎదుర్కోగల సత్తా విషయంలో ట్రంప్ కంటే హారిస్‌కే అమెరికన్లు జైకొట్టడం విశేషం! ఈ విషయమై రాయిటర్స్/ఇప్సోస్ చేసిన తాజా సర్వేలో 56 శాతం మంది హారిస్‌కు ఓటేయగా ట్రంప్‌కు 49 శాతమే దక్కాయి. తాజాగా సోమ, మంగళవారాల్లో సీఎన్ఎన్ జరిపిన దేశవ్యాప్త సర్వేలో కూడా ట్రంప్‌కు 49 శాతం రాగా, హారిస్ 46 శాతం ఓట్లు సాధించారు.

కేంద్ర బడ్జెట్‌పై సభా సమరం

- బీజేపీ, విపక్షాల వాగ్యుద్ధం
- బిహార్, ఏపీలకు పకోడీ, జిలేబీ
- మిగతా రాష్ట్రాలకు మొండిచేయి
- రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే
- ఉభయ సభల్లో వాకౌట్ల పర్వం

న్యూఢిల్లీ: పార్లమెంటు ఉభయసభల్లో బుధవారం కేంద్ర బడ్జెట్‌పై అధికార, విపక్షాల తీవ్ర వాగ్యుద్ధం చోటుచేసుకుంది. సమాఖ్య స్ఫూర్తికి, పేదలకు బడ్జెట్ ఫక్తు వ్యతిరేకంగా ఉందంటూ విపక్షాలు దుయ్యబట్టాయి. అధికార ఎన్డీఏ కూటమి భాగస్వాములను ప్రసన్నం చేసుకోవడానికే మోదీ సర్కారు పరిమితమైందని ఆరోపించాయి. రాజ్యసభ, లోక్‌సభ సమావేశం కాగానే బడ్జెట్ కేటాయింపులపై చర్చకు అవకాశం ఇవ్వాలంటూ పట్టుబట్టాయి. సభాపతులు అందుకు నిరాకరించడంతో ఉభయ సభల నుంచీ కాంగ్రెస్ సహా విపక్షాలన్నీ వాకౌట్ చేశాయి.

కుర్చీ కాపాడుకునే బడ్జెట్!

''బడ్జెట్లో బిహార్, ఆంధ్రప్రదేశ్‌లకు పకోడా, జిలేబీ దక్కాయి. మిగతా రాష్ట్రాలన్నింటికీ మోదీ మొండిచేయి చూపారు'' అంటూ రాజ్యసభలో విపక్ష నేత ఖర్గే దుయ్యబట్టారు. ఇతర కార్యకలాపాలను పక్కన పెట్టి ముందుగా బడ్జెట్‌పై చర్చ చేపట్టాలంటూ నోటీసులిచ్చారు. వాటన్నింటినీ చైర్మన్ తిరస్కరించడంపై విపక్ష సభ్యులంతా మండిపడ్డారు. 'కేవలం ఐదు రాష్ట్రాలకే పరిమితమైన బడ్జెట్', 'కుర్చీని కాపాడుకునే బడ్జెట్' అంటూ నినాదాలకు దిగారు. బడ్జెట్ కేటాయింపులు విపక్షపూరితమంటూ విపక్ష ఎంపీలు బుధవారం ఉదయం లోక్‌సభ ప్రవేశద్వారం వద్ద బైఠాయించి నిరసనకు దిగారు. ఈ అంశాన్నే ముందు చర్చకు చేపట్టాలంటూ సభలో పదేపదే డిమాండ్ చేశారు. వారి తీరుపై స్పీకర్ ఓం బిర్లా ఆగ్రహించారు. బైఠాయించి ఎవరినీ లోనికి రానీయకపోవడం ఏం పద్ధతని ప్రశ్నించారు. బీజేపీ ఎంపీ బి.మహతాబ్ బడ్జెట్‌పై చర్చ ప్రారంభించారు. నయా మధ్యతరగతిని సాధికారతకు బడ్జెట్ పెద్దపీట వేసిందన్న ఆయన వ్యాఖ్యలను కాంగ్రెస్ సభ్యురాలు కుమారి సెల్జా తీవ్రంగా ఆక్షేపించారు. కేంద్ర బడ్జెట్ ఎవరి కోసమో చెప్పగలరా అంటూ ప్రశ్నించారు. 'ఇది వికసిత్ బడ్జెట్ కాదు, విచలిత్ బడ్జెట్' అంటూ ఎద్దేవా చేశారు. తుమ్మితే ఊడేలా ఉన్న సంకీర్ణానికి మోదీ సారథ్యం వహిస్తున్నారంటూ తృణమూల్ నేత అభిషేక్ బెనర్జీ ఎద్దేవా చేశారు. అందుకే కీలక ఎన్డీఏ భాగస్వాములను తృప్తి పరిచేందుకు బిహార్, ఏపీలకే బడ్జెట్లో పెద్దపీట వేశారని ఆరోపించారు. బెనర్జీ వ్యాఖ్యలు తృణమూల్ పాలిత పశ్చిమబెంగాల్‌కే వర్తిస్తాయంటూ కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి తిప్పికొట్టారు. దయానిధి మారన్ (డీఎంకే), సుప్రియా సులే తదితరులు బడ్జెట్‌పై విమర్శలు గుప్పించారు. విపక్ష సభ్యులనుద్దేశించి బీజేపీ ఎంపీ అభిజిత్ గంగోపాధ్యాయ చేసిన విమర్శలు వివాదమయ్యాయి. దాంతో వాటిని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్టు స్పీకర్ చెప్పారు.



పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షాల నిరసన

కేంద్ర బడ్జెట్‌లో నిధుల కేటాయింపు తీరుపై ప్రతిపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విపక్ష పాలిత రాష్ట్రాలకు బడ్జెట్‌లో మొండిచేయి చూపారని మండిపడ్డారు. ప్రభుత్వ వైఖరిపై బుధవారం పార్లమెంట్ ప్రాంగణంలో నిరసన తెలిపారు. దేశ సమాఖ్య వ్యవస్థ పవిత్రతపై మోదీ ప్రభుత్వం దాడి చేసిందని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ ఆరోపించారు. విపక్ష పాలిత రాష్ట్రాలపై వివక్ష చూపించారని, ఇదెక్కడి న్యాయమని నిలదీశారు. కాంగ్రెస్ ఎంపీలు మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, సమాజ్‌వాదీ పార్టీ సభ్యులు అఖిలేష్ యాదవ్ సహా డీఎంకే, ఆమ్ ఆద్మీ పార్టీ, వామపక్షాలు, తృణమూల్ కాంగ్రెస్ తదితర పార్టీల ఎంపీలు నిరసనలో పాల్గొన్నారు.

నిర్మల మాతాజీ! ఖర్గే సంబోధన కూతురన్న ధన్‌ఖడ్

రాజ్యసభలో బడ్జెట్‌పై చర్చ సందర్భంగా సంబోధనల సంవాదం జరిగింది. చాలా రాష్ట్రాలకు బడ్జెట్లో అన్యాయం జరిగిందని విపక్ష నేత మల్లికార్జున ఖర్గే మాట్లాడుతుండగానే కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు వివరణ ఇచ్చేందుకు చైర్మన్ జగ్‌దీప్ ధన్‌ఖడ్ అవకాశమిచ్చారు. దాంతో ఖర్గే ఆగ్రహించారు. నిర్మలను ఉద్దేశించి, ''మాతాజీ! మీరు మాట్లాడటంలో ఎక్స్‌పర్ట్ అని నాకు తెలుసు. కానీ ముందుగా దయచేసి నన్ను పూర్తి చేయనివ్వండి'' అన్నారు. మాతాజీ సంబోధనపై చైర్మన్ అభ్యంతరం తెలిపారు. ''ఆర్థిక మంత్రికి 64 ఏళ్లు. మీకు 82. ఆమె మీకు మాతాజీ కాదు, కూతురి వంటిది'' అన్నారు. అనంతరం ఖర్గే చర్చను కొనసాగిస్తూ నిర్మల కర్ణాటక నుంచి రాజ్యసభకు ఎన్నికైనందున బడ్జెట్లో ఆ రాష్ట్రానికి ఎంతో ఇస్తారనుకుంటే అసలేమీ ఇవ్వలేదంటూ ఎత్తిపొడిచారు.

చందమామపై నీటి జాడలు!

జాబిల్లి నుంచి తెచ్చిన మట్టిలో గుర్తించిన చైనా సైంటిస్టులు



బీజింగ్: చందమామపై నీటి ఆనవాళ్లు ఉన్నాయా? అంటే నిజమేనని చెబుతున్నారు చైనా శాస్త్రవేత్తలు. జాబిల్లి నుంచి తీసుకొచ్చిన మట్టి నమూనాలను పరీక్షించగా, జలం జాడ కనిపించిందని చైనీస్ అకాడమీ ఆఫ్ సైన్సెస్(సీఏఎస్) వెల్లడించింది. చైనా 2020లో ప్రయోగించిన చాంగే–5 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడి నుంచి మట్టి నమూనాలను తీసుకొచ్చింది. దాదాపు 2 కిలోల మట్టి, రాళ్ల నమూనాలను భూమిపైకి చేర్చింది. వీటిపై చైనా సైంటిస్టులు పరీక్షలు చేస్తున్నారు. ఈ నమూనాల్లో భారీ స్థాయిలో నీటి అణువులు ఉన్నట్లు గుర్తించారు. 2009లో భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ప్రయోగించిన చంద్రయాన్–1 స్పేస్‌క్రాఫ్ట్ చంద్రుడిపై నీటి ఆనవాళ్లు ఉన్నట్లు కనిపెట్టింది.

నేపాల్‌లో విమాన ప్రమాదం

- కఠ్మాండు ఎయిర్‌పోర్టులో టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే కూలిన విమానం
- 18 మంది మృతి
- పైలెట్‌కు తీవ్ర గాయాలు

కఠ్మాండు: హిమాలయాల నేల నేపాల్‌లో ఘోర విమాన ప్రమాదం సంభవించింది. కాఠ్మాండూలోని త్రిభువన్ అంతర్జాతీయ విమానాశ్రయం రన్‌వేపై శౌర్య ఎయిర్‌లైన్స్ విమానం కుప్పకూలిన ఘటనలో 18 మంది ప్రాణాలు కోల్పోయారు. మృతుల్లో ఒక చిన్నారిసహా ఒక కుటుంబానికి చెందిన ముగ్గురు ఉన్నారు. పైలట్ ఒక్కరే ప్రాణాలతో బయటపడ్డారు. తీవ్రగాయాలైన పైలట్ మనీశ్ రత్న శాక్యకు కంటి, వెన్నుముక శస్త్రచికిత్స చేస్తున్నారు. స్థానిక కాలమానం ప్రకారం బుధవారం ఉదయం 11 గంటల సమయంలో కఠ్మాండు ఎయిర్‌పోర్ట్ నుంచి పొఖారా సిటీకి బయల్దేరేందుకు టేకాఫ్ అయిన కొన్ని సెకన్లకే బంబార్డియర్ తయారీ సీఆర్‌జే–200 రకం విమానం కూలింది. ప్రమాదానికి కారణాలు ఇంకా తెలియరాలేదు. టేకాఫ్ అయ్యాక ఎడమవైపుగా పయనించాల్సిన విమానం దిశను హఠాత్తుగా కుడి వైపునకు తిప్పడంతో స్థిరత్వం కోల్పోయి నేలరాలిందని ఎయిర్‌పోర్ట్ చీఫ్ జగన్నాథ్ నిరౌలా 'బీబీసీ న్యూస్ నేపాలీ' వార్తాసంస్థతో చెప్పారు. కూలిన విమానంలో సాధారణ ప్రయాణికులెవరూ లేరుగానీ పైలెట్, సాంకేతిక సిబ్బంది, ఇద్దరూ విమాన సిబ్బందితో కలిపి మొత్తం 19 మంది ఉన్నారు. విమానం రన్ వే మీద పడిన వెంటనే మంటలు చెలరేగాయి. ఆ ప్రాంతమంతా దట్టమైన పొగ కమ్ముకుంది. వెంటనే రంగంలోకి దిగిన అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యలు చేపట్టారు. మంటలను ఆర్పేశారు. 15 మంది ఘటనాస్థలిలో ముగ్గురు ఆస్పత్రుల్లో చికిత్సపొందుతూ మరణించారు. ఘటనాస్థలిని నేపాల్ ప్రధాని కేపీ శర్మ ఓలి సందర్శించారు. ఘటనపై విచారణకు ఆదేశించారు.

టేబుల్ టాప్ రన్‌వే

చుట్టూతా ఉండే హిమాలయ పర్వతాల మధ్య నుంచి దిగుతూ నేపాల్ ఎయిర్‌పోర్ట్‌ల గుండా రాకపోకలు సాగించడం ఇక్కడి పైలెట్లకు కత్తిమీద సామే. పర్వతప్రాంతం కావడంతో ఇక్కడి గాలి వీచే దిశ, వాతావరణ పరిస్థితులు ఎప్పటికప్పుడు అనూహ్యంగా మారిపోతుంటాయి. తక్కువ ఎత్తులో నడపడం సవాల్‌తో కూడిన పని. అందులోనూ కఠ్మాండు విమానాశ్రయంలో టేబుల్ టాప్ రన్‌వే ఉంది. అంటే రన్‌వే దాటి ఏమాత్రం ముందుకు వెళ్లినా లోయలో పడే ప్రమాదముంది. రన్‌వేకు ఒక వైపు గానీ, రెండు వైపులా గానీ లోయ లేదా ఏటవాలు భూమి టేబుల్ టాప్ రన్‌వేగా పిలుస్తారు. దీనిపై టేకాఫ్, ల్యాండింగ్ ఖచ్చితత్వంతో చేయకుండా ప్రమాదమే. బుధవారం జరిగిన ప్రమాదానికి ఈ రకం రన్‌వే కూడా ఒక కారణమని వార్తలొచ్చాయి. భారత్‌లో సిమ్లా, కాలికట్, మంగళూరు, లెంగ్‌పుయ్ (మిజోరం), పాక్యోంగ్ (సిక్కిం)లలో ఈ టేబుల్–టాప్ రన్‌వేలు ఉన్నాయి. వీటిలో కేరళ, మంగళూరులో గతంలో పెద్ద విమాన ప్రమాదాలు జరగడం గమనార్హం.



దగ్ధమవుతున్న విమానం

ఫేజ్2 బాలిస్టిక్ క్షిపణి రక్షణ వ్యవస్థ పరీక్ష సక్సెస్

న్యూఢిల్లీ: దాదాపు 5,000 కి.మీ.ల దూర శ్రేణి శత్రు క్షిపణులను అడ్డుకునే క్షిపణి రక్షణ వ్యవస్థను రక్షణ పరిశోధనాభివృద్ధి సంస్థ(డీఆర్‌డీఓ) విజయవంతంగా పరీక్షించింది. రెండో(ఫేజ్2) ప్రయోగ దశలో ఉన్న మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్‌ను ఒడిశాలోని చాందీపూర్ ఇంటిగ్రేటెడ్ టెస్ట్ రేంజ్‌లో పరీక్షించారు. వ్యవస్థ అన్ని పరామితులను ఖచ్చితత్వంతో సాధించిందని రక్షణ శాఖ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొంది. ముందుగా శత్రు క్షిపణి మాదిరిగా ఒక డమ్మీ క్షిపణిని మధ్యాహ్నం 4.20 గంటలకు ప్రయోగించారు. గగనతలం, సముద్రతలంపై మొహరించిన సాయుధ రాడార్లు వెంటనే ఈ శత్రు క్షిపణి దిశను గుర్తించిన ఇంటర్‌సెప్టార్ వ్యవస్థను క్రియాశీలం చేశాయి. ఇందులోని ఫేస్2 ఏడీ ఎండో అట్మాస్ఫిరిక్ క్షిపణి బయల్దేరి.. శత్రు క్షిపణిని విజయవంతంగా అడ్డుకుంది.

'బ్రిటన్‌తో బంధాల బలోపేతానికి కట్టుబడి ఉన్నాం'

న్యూఢిల్లీ: బ్రిటన్‌తో ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవడానికి కట్టుబడి ఉన్నామని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఇరుదేశాలకు ప్రయోజనం చేకూర్చే స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాన్ని (ఎఫ్‌టీఏ) ఖరారు చేసుకోవాలనే బ్రిటన్ ఆకాంక్షను స్వాగతిస్తున్నట్లు పేర్కొన్నారు. రెండురోజుల పర్యటన నిమిత్తం భారత్‌కు వచ్చిన బ్రిటన్ విదేశాంగ మంత్రి డేవిడ్ లామీ బుధవారం ప్రధాని మోదీని కలిశారు. భారత్– యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని మరింత విస్తృతం, బలోపేతం చేసుకోవడానికి బ్రిటన్ నూతన ప్రధాని కియర్ స్టార్మర్ ప్రాధాన్యమివ్వడాన్ని మోదీ అభినందించారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
గురువారం । 25 । జూలై । 2024

ముక్కలు చెక్కలు



బుధవారం కోలారులో అధిక శబ్దాన్నిచ్చే మోటారు బైక్‌ల సైలెన్సర్లను రోలర్‌తో ధ్వంసం చేస్తున్న పోలీసులు. కంపెనీ సైలెన్సర్లు కాకుండా ఇతరత్రా అమర్చుకుంటే ఇదే గతి అని తెలిపారు

న్యూస్‌రీల్

కూలిన పాఠశాల గోడ

- విద్యాశాఖ మంత్రి జిల్లాలో ఘటన



గోడ కూలి బెంచీలపై పడిన దృశ్యం

శివమొగ్గ: విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప సొంత నియోజకవర్గంలో పాఠశాలల దుస్థితి బయటపడింది. సొరబ తాలూకాలో వర్షం జోరు కొనసాగుతుండగా మంగళవారం ఆనవట్టి పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాల గోడ కూలిపోయింది. అదృష్టవశాత్తు ఆ సమయంలో గదిలో విద్యార్థులు ఎవరూ లేరు. ప్రభుత్వ పాఠశాలలో 104 మంది విద్యార్థులు అభ్యసిస్తున్నారు. గోడ కూలిన గదిలో 31 మంది విద్యార్థులు కూర్చొంటున్నారు. మధ్యాహ్నం తరగతుల తరువాత గది ముందు వైపు గోడ పెద్ద శబ్దంతో పడిపోయింది. టేబుళ్లు, బెంచీలు, పాఠ్యపుస్తకాలు ధ్వంసమయ్యాయని తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాల గతంలోనే శిథిలావస్థకు చేరుకుంది. ఈ విషయాన్ని విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేకపోయిందని తల్లిదండ్రులు వాపోయారు. క్లాస్ జరుగుతున్న సమయంలోనే గోడ కూలిపోయి ఉంటే ఊహించని ఘోరం సంభవించేదని ఆందోళన వ్యక్తంచేశారు. తహసీల్దార్ మంజుల హెగ్డాళ్ స్థలాన్ని సందర్శించి పరిశీలించారు.

డీసీఎంతో దర్శన్ భార్య భేటీ

- కొడుకు అడ్మిషన్‌పై చర్చ?

దొడ్డబళ్లాపురం: సినీ హీరో దర్శన్ కేసు విషయంలో తాను ఎలాంటి జోక్యం చేసుకోనని డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ అన్నారు. రేణుకాస్వామి హత్య కేసు విచారణలో పోలీసులకు పూర్తి స్వాతంత్ర్యం ఇచ్చామన్నారు. రామనగరలో ఒక కార్యక్రమంలో మాట్లాడిన డీకే.. దర్శన్‌కు అన్యాయం జరిగి ఉంటే న్యాయం చేస్తానని చెప్పారు. దీనిపై బెంగళూరులో మీడియాతో మాట్లాడుతూ తాను కెంపేగౌడ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో దర్శన్ భార్య విజయలక్ష్మి వచ్చి కలిశారన్నారు. ఇక్కడకు కాదు, ఇంటికి వచ్చి కలవాలని ఆమెకు చెప్పానన్నారు. దర్శన్ కేసు గురించి మాట్లాడతారని అనుకున్నా, అయితే వారు వారి కుమారుని స్కూలు అడ్మిషన్ గురించి వచ్చారని డీకే చెప్పడం విశేషం.

నివాసంలో సమావేశం

దర్శన్ భార్య విజయలక్ష్మి, తమ్ముడు దినకర్, ప్రముఖ డైరెక్టర్ ప్రేమ్‌లు డీసీఎం డీకేశిని నివాసంలో కలివారు. తరువాత ప్రేమ్ విలేకరులతో మాట్లాడుతూ దర్శన్ గురించి చర్చించలేదని, తనయుడు స్కూలు అడ్మిషన్ గురించి ప్రస్తావించానమన్నారు. ఇక విజయలక్ష్మి, దినకర్ ఏం మాట్లాడారో తనకు తెలీదన్నారు. జూన్ 10 నుంచి దర్శన్ హత్య కేసులో అరెస్టయి జైలు పాలయ్యాడు. అసలు ఆ విషయం గురించే మాట్లాడలేదని వారు చెప్పడం గమనార్హం.

మహిళా సిబ్బందికి వాయనం



వాయనం బహూకరిస్తున్న దృశ్యం

మైసూరు: ఆషాఢమాసం వేడుకలలో భాగంగా చాముండి కొండపై ఆలయ మహిళా సిబ్బందికి శ్రీ దుర్గా ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా చీరలు, గాజులు, పసుపు కుంకుమతో కూడిన వాయనం అందజేశారు. చాముండి హిల్ ఫీల్డ్ డెవలప్‌మెంట్ అథారిటీ సెక్రటరీ రూపా, ఆర్.హెచ్.పవిత్ర, సోమన్న, గిరీష్, లతామోహన్, శాంత, జి. రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

జాగా.. జగడం

- మైసూరు ముడా స్థలాలపై చర్చకు బీజేపీ పట్టు
- విధానసభలో ఇరువక్షాల వాగ్వాదం
- ప్రత్యేక చర్చకు స్పీకర్ నిరాకరణ



విధానసభలో అధికార విపక్షాల మధ్య మాటల యుద్ధం

బనశంకరి: మైసూరులో ముడా ఇళ్ల జాగాల పంపిణీలో అక్రమాలపై బుధవారం విధానసభ మార్మోగింది. చర్చ కోసం ప్రతిపక్ష బీజేపీ పట్టుబట్టగా అధికార విపక్ష సభ్యుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ ముడా కుంభకోణం గురించి చర్చ జరపాలని స్పీకర్ యుటీ ఖాదర్‌కు మనవి చేశారు. సీఎం సిద్దరామయ్యపై ఆరోపణ ఉందని, ఇది మూడు నాలుగు వేల కోట్ల రూపాయల కుంభకోణమని ఆరోపించారు. ఈ సమయంలో స్పీకర్ స్పందిస్తూ, అంత ముఖ్యమైన విషయమైతే సమావేశాలు మొదటిరోజు నోటీస్ ఇవ్వాలని, 10 రోజులు ఎందుకు అడ్డుకున్నారని ప్రశ్నించారు. ఇది రెండేళ్ల పాత విషయమని, ఆరోపణలపై న్యాయ కమిషన్ విచారణ చేపడుతుందని, మీరు అసెంబ్లీలో ఇబ్బంది పెట్టరాదని, చెడు సంప్రదాయం వద్దు, ప్రశ్నోత్తరాలకు అవకాశం అందించాలని స్పీకర్ కోరారు.

సభ ఎందుకు..

బీజేపీ ఎమ్మెల్యే సునీల్‌కుమార్ మాట్లాడుతూ కమిషన్ దర్యాప్తు చేస్తే సభలో చర్చించరాదు అంటే సభ నిర్వహించడం ఎందుకు, వాయిదా వేయండి అన్నారు. ఈ సమయంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేచి మాట్లాడటానికి ప్రయత్నించగా ఇరువర్గాలు కేకలు, అరుపులతో కోలాహలం నెలకొంది. బీజేపీ ఎమ్మెల్యే అశ్వత్‌నారాయణ మాట్లాడుతూ ముఖ్యమంత్రిపై నేరుగా ఆరోపణలు ఉన్నందున చర్చకు అవకాశం కల్పించాలన్నారు.

మంత్రి ఫైల్‌పై వాగ్యుద్ధం

మంత్రి బైరతి బసవరాజ్ మాట్లాడుతూ తమ వద్ద అందరి జాతకాలు ఉన్నాయని ఒక ఫైల్‌ని ప్రదర్శించారు. మంత్రి హెచ్‌కే పాటిల్ మాట్లాడుతూ ప్రశ్నోత్తరాలు ప్రారంభించాలని సూచించారు. బీజేపీ ఎమ్మెల్యే అరగ జ్ఞానేంద్ర మాట్లాడుతూ ముడా కుంభకోణం ఫైల్‌ని అసెంబ్లీకి ఎందుకు తెచ్చారని మండిపడ్డారు. ఎమ్మెల్యే బసవనగౌడ పాటిల్ యత్నాళ్ మాట్లాడుతూ మంత్రి అన్ని పార్టీలు వాళ్లు ఉన్నారని చెబుతున్నారని, వెల్లడి చేసి చర్చకు అవకాశం ఇవ్వాలన్నారు. ఈ సందర్భంగా బీజేపీ ఎమ్మెల్యేలు సీఎం రాజీనామా చేయాలని ప్లకార్డులు పట్టుకుని నిరసన తెలిపారు. చివరకు స్పీకర్ ప్రశ్నోత్తరాలకు అవకాశం కల్పించారు.



చిక్కుముడిగా మారిన ముడా ఇళ్ల స్థలాలు



రాత్రంతా ధర్నా చేస్తాం

శాసనసభలో అహోరాత్రి ధర్నా చేస్తామని బీజేపీ నేత ఆర్.అశోక్ చెప్పారు. రూ.3 వేల కోట్ల ముడా కుంభకోణంపై చర్చకు రాకుండా కాంగ్రెస్ పారిపోతోందని, వారికి ధైర్యం ఉంటే 14 స్థలాలను న్యాయసమ్మతంగా తీసుకున్నామని ప్రకటించాలన్నారు. వాల్మీకి స్కాంలో రూ.187 కోట్లు ఆదివాసీ, దళితుల డబ్బును లూటీ చేశారన్నారు.



అసెంబ్లీ సమావేశాలను చూడడానికి వచ్చిన బాలలతో కారిడార్లలో సందోహం

పంటల పరిహారంపై రగడ

శివాజీనగర: రైతులకు పంట నష్ట పరిహారం గురించి ఎగువసభ విధాన పరిషత్‌లో అధికార, ప్రతిపక్షాల మధ్య కొంతసేపు గొడవ జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల తారతమ్యానికి పాల్పడిందని బీజేపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. రెవెన్యూ మంత్రి కృష్ణబైరేగౌడ మాట్లాడుతూ రూ.1,296 కోట్ల పరిహారం ఇవ్వడమైనది. కేంద్ర ప్రభుత్వం ఎలాంటి సాయం ఇవ్వలేదని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రతో పాటుగా ఏ రాష్ట్రానికి కూడా కేంద్రం ఒక్క పైసా కరువు పరిహార సొమ్ము ఇవ్వలేదు. కర్ణాటక సుప్రీంకోర్టుకు వెళ్లడంతో కేంద్రం రూ.3,498 కోట్లు ఇచ్చిందని చెప్పారు.

యువరైతు ఆత్మహత్య



చంద్రశేఖర్(ఫైల్)

మండ్య: అప్పుల బాధ తాళలేక ఓ యువరైతు విషం తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన మండ్య తాలూకాలోని తంగళగెరె గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన చంద్రశేఖర్ (34) అనే యువరైతు వ్యవసాయ పనులకు, పొలంలో బోరు బావి తవ్వకానికి బ్యాంకు నుంచి రుణం పొందాడు. అంతేగాకుండా ఇల్లు కట్టడానికి అప్పులు చేశాడు. దీంతో అప్పులిచ్చిన వారి వేధింపులు అధికం కావడంతో జీవితంపై విరక్తి చెందిన చంద్రశేఖర్ తన పొలంలో పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఘటనపై బసరాళు పోలీసులు కేసు నమోదు చేశారు.

ఆర్టీసీకి దండిగా నిధులు: మంత్రి

శివాజీనగర: బడ్జెట్‌లో అధిక నిధులు లభించడంతో మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ పథకం ఎలాంటి భారం కాదని రవాణా మంత్రి రామలింగారెడ్డి చెప్పారు. బుధవారం ఆయన విధానపరిషత్‌లో ప్రశ్నకు సమాధానమిస్తూ ఆర్టీసీకి సీఎం సిద్దరామయ్య బడ్జెట్‌లో రూ.1400 కోట్లు నిధులను కేటాయించారు. కాబట్టి ఆర్థిక భారం ఉండబోదన్నారు. వాహన పన్ను చట్టానికి మినహాయిపు ఇవ్వడంతో ఆర్టీసీకి రూ.600 కోట్లు అదనంగా నిధులు లభిస్తాయన్నారు. బస్సుల కొనుగోలు చేయటానికి 580 కోట్లు నిధులు సమకూరుతాయని, సంస్థ అన్ని విధాలుగా కోలుకొంటోందని తెలిపారు. ఉద్యోగులకు జీతాలకు గతంలో ఇబ్బంది ఉండేది, ఇప్పుడు చాలావరకు పరిష్కారమైందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ.1,413 కోట్ల జీతం బకాయిలను దశలవారీగా చెల్లిస్తామన్నారు.

గల్లంతైన ట్రక్కు నదిలో గుర్తింపు

దొడ్డబళ్లాపురం: ఉత్తర కన్నడ జిల్లా అంకోలా వద్ద జాతీయ రహదారి- 66లో శిరూరు వద్ద కొండచరియలు విరిగిపడిన ప్రమాదంలో గల్లంతైన ట్రక్‌ను గంగావళి నదిలో గుర్తించినట్లు రెవెన్యూ మంత్రి క్రిష్ణబైరేగౌడ తెలిపారు. కేరళ కోజికోడ్‌కు చెందిన అర్జున్ అనే డ్రైవర్ ఆ ట్రక్ వేసుకుని వచ్చాడు. పక్కనే ఉన్న హోటల్లో టీ తాగుతుండగా కొండచరియలు విరిగి పడడంతో ట్రక్కు నదిలోకి కొట్టుకుపోయింది. అర్జున్ జాడ కూడా లేదు. నది నీటి అడుగున ఉన్న ట్రక్‌ను వీలయినంత త్వరగా వెలికి తీస్తామని మంత్రి తెలిపారు.

వర్ష బీభత్సం.. అపార ఆస్తినష్టం

- ఉత్తర కన్నడలోనే రూ. 61 కోట్ల నష్టం



బెళగావిలో వర్షంలో కూరగాయల కొనుగోలు



బుధవారం చిక్కమగళూరు వద్ద అల్లంపురలో ఇల్లు కూలి ఆటోపై పడిన దృశ్యం

బనశంకరి: రాష్ట్రవ్యాప్తంగా కురిసిన భారీ వర్షాలతో జనజీవనానికి తీవ్ర ఆటంకం ఏర్పడింది. పెద్ద మొత్తంలో ఇళ్లు, కట్టడాలు కూలిపోయి ఆస్తినష్టం సంభవించింది. ఉత్తరకన్నడ జిల్లాలో గత నాలుగైదు రోజులుగా కుండపోత కురుస్తోంది. మామూలు కంటే 34 శాతం అధిక వర్షం కురవడంతో అనేకచోట్ల రోడ్లు, చిన్న వంతెనలు దెబ్బతిన్నాయి. ప్రజల ఇళ్లు ధ్వంసమై సుమారు రూ.61.45 కోట్ల ఆస్తినష్టం సంభవించింది. జూన్ ప్రారంభం నుంచి జూలై మధ్య వరకు జిల్లాలో సరాసరి 133 సెంటీమీటర్ల వర్షం కురిసింది. కొండచరియలు విరిగిపడటం ప్రాణనష్టం జరిగింది. నదులు పోటెత్తి రెండన్నరవేలమందికి పైగా ప్రజలు నిరాశ్రయులయ్యారు. 19 నిరాశ్రయ కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్నారు. పొలాలు, తోటల్లో పంటలు దెబ్బతిన్నాయి. 500 కు పైగా ట్రాన్స్‌ఫార్మర్లు దెబ్బతిన్నాయి. 169 కిలోమీటర్ల పొడవు గల విద్యుత్ లైన్లు పాడయ్యాయి.

2 రోజులు వర్షసూచన

రెండురోజుల పాటు 26వ తేదీ వరకు రాష్ట్రంలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. కరావళి, దక్షిణ ఒళనాడులో వర్షాలు పడే అవకాశముంది. ఉత్తరకన్నడ, ఉడుపి, దక్షిణ కన్నడ జిల్లాలో ఎల్లో అలర్ట్ ప్రకటించారు. శివమొగ్గ, కొడగు, చిక్కమగళూరు, యాదగిరి, కలబుర్గి, రాయచూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురవవచ్చు. బెంగళూరులో ఐదురోజుల పాటు వర్షాలకు ఆస్కారముంది. ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ, ఉడుపి జిల్లాల్లో గాలులతో కూడిన భారీ వర్షాలు పడవచ్చు.

డ్యాం వద్ద కూలిన గోడ

మండ్య: జిల్లాలోని శ్రీరంగపట్టణ తాలూకాలో కృష్ణరాజసాగర జలాశయం వద్ద నగువనతోట అడ్డుగోడ నీటి తాకిడికి కూలిపోయింది. నగువనతోట ఎదుట ఆనకట్ట గేట్ తెరిచి నీరు వదిలిన కొన్ని గంటలకే అడ్డుగోడ కూలిపోవడంతో వెంటనే మేల్కొన్న నీటిపారుదల శాఖ అధికారులు ఆ గేట్ ద్వారా నీటి విడుదలను నిలిపివేశారు. నాసిరకం పనులు, అధికారుల నిర్లక్ష్యమే దీనికి కారణమని స్థానికులు ఆరోపించారు.

పీజీ హాస్టల్లో యువతి హత్య

- సిలికాన్ సిటీలో ఘోరం
- హంతకుని కోసం గాలింపు





మృతదేహాన్ని పీజీ నుంచి తరలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్) కృతి (ఫైల్)

బనశంకరి: మహిళా పీజీ హాస్టల్‌లోకి చొరబడిన ఓ దుండగుడు యువతి గొంతుకోసి హత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బెంగళూరు కోరమంగల పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. బిహార్ కు చెందిన కృతికుమారి (24) హతురాలు. వివరాలు.. ఎంబీఏ పూర్తిచేసిన కృతి బెంగళూరుకు చేరుకుని ఓ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేస్తోంది. కోరమంగలలో వీఆర్ లేఅవుట్‌లోని పీజీలో ఉంటోంది. మంగళవారం ఉదయం ఆఫీసుకు వెళ్లి రాత్రి తిరిగివచ్చింది. దుండగుడు రాత్రి 11.10 నుంచి 11.30 మధ్య పీజీ యజమాని, మహిళా సెక్యూరిటీ గార్డు కళ్లు గప్పి పీజీలోకి చొరబడి మూడవ అంతస్తులోని కృతి కుమారి రూమ్‌లోకి వెళ్లి చాకుతో గొంతుకోసి అక్కడ నుంచి ఉడాయించాడు.

తెలిసినవారి పనేనా?

కొన్ని గంటల తరువాత విషయం తెలిసి పోలీసులు చేరుకుని పరిశీలించి మృతదేహాన్ని శవపరీక్షల నిమిత్తం సెయింట్‌జాన్స్ ఆసుపత్రికి తరలించారు. తెలిసినవారే ఈ ఘాతుకానికి పాల్పడి ఉండొచ్చని అనుమానాలున్నాయి. ప్రేమ వ్యవహారమే కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. పీజీ చుట్టుపక్కల రోడ్లలో సీసీ కెమెరాల చిత్రాలను పోలీసులు సేకరించి హంతకుని కోసం గాలింపు చేపట్టారు. ఈ హత్యతో పీజీలోని యువతులు భయభ్రాంతులకు గురయ్యారు.

హంతకుడెవరో తెలిసింది: డీసీపీ

ఆగ్నేయ విభాగ డీసీపీ సారా ఫాతిమా మాట్లాడుతూ పీజీ యజమాని నిర్లక్ష్యం ఉన్నట్లు తెలుస్తోంది. హంతకుని ఆచూకీ తెలిసిందని త్వరగా అరెస్ట్ చేస్తామని ఆమె తెలిపారు.

బడి బస్సు పల్టీ, 5 మందికి గాయాలు

యశవంతపుర: పాఠశాల బస్సు బోల్తా పడగా విద్యార్థులు గాయపడిన ఘటన బెళగావి జిల్లా గోకాక్ తాలూకా పాశ్చాపుర రోడ్డులో బుధవారం ఉదయం జరిగింది. ప్రైవేట్ పాఠశాల బస్సు వేగంగా వెళుతుండగా బస్సు రోడ్డు పక్కలోకి పల్టీ కొట్టింది. గోకాక్ తాలూకా మరడిమఠ గ్రామంలోని ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు మావనూరు, గోడచిలో విద్యార్థులను ఎక్కించుకొని వెళ్లతుండగా ఈ ఘటన జరిగింది. ఐదు మంది విద్యార్థులు స్వల్పంగా గాయపడ్డారు. పోలీసులు ఘటన స్థలాన్ని పరిశీలించారు.

క్రైస్తవ గురువు దుర్మరణం

- శివమొగ్గ జిల్లాలో కారు- ఆర్టీసీ బస్సు ఢీ



ధ్వంసమైన బస్సు ముందు భాగం



పూర్తిగా నుజ్జునుజ్జయిన కారు



పోప్‌తో ఫాదర్ ఆంథోనీ పీటర్ (ఫైల్)

శివమొగ్గ: జిల్లాలోని హొన్నాళి తాలూకా న్యామతి పోలీస్ స్టేషన్ పరిధిలో చిన్నికట్టె సవళంగ రోడ్డులో మంగళవారం సాయంత్రం కేఎస్ఆర్‌టీసీ బస్సు, కారు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో కారులో ప్రయాణిస్తున్న శివమొగ్గ క్యాథలిక్ క్రిస్టియన్ చర్చికి చెందిన ఫాదర్ ఆంథోనీ పీటర్ (51) దుర్మరణం చెందారు. వివరాలు.. శికారిపుర జూనియర్ ఫ్లవర్ సెయింట్ థెరిసా చర్చిలో ఆంథోనీ పీటర్ మత గురువుగా పని చేస్తున్నారు. శివమొగ్గ నుంచి శికారిపురకు కారులో వెళ్తుండగా బస్సు ఢీకొనడంతో కారు నుజ్జునుజ్జై రోడ్డు పక్కకు ఎగిరి పడింది. ఆంథోనీ అక్కడికక్కడే చనిపోగా, స్టీఫెన్ అనే మరో వ్యక్తి గాయపడ్డాడు. ఆంథోనీ స్వస్థలం శివమొగ్గ కాగా ప్రతిభావంతుడైన బోధకునిగా పేరుపొందారు. గతంలో ఆయన వాటికన్ సిటీలో అప్పటి పోప్‌ను కలిసి ఆశీర్వాదాలు తీసుకున్నారు. ఆయన అకాల మరణంపై క్రైస్తవ సోదరులు ఆవేదన వ్యక్తంచేశారు. ఆంథోనీ అంత్యక్రియలు గురువారం ఉదయం 10 గంటలకు శివమొగ్గలోని సేక్రెడ్ హార్ట్ చర్చిలో నిర్వహించనున్నట్లు ఫాదర్ వీరేష్ మోరాస్ తెలిపారు.

తమ్ముడు కాదు.. రక్త పిశాచి

- అన్న, అతని కొడుకు దారుణ హత్య
- బాగేపల్లి వద్ద హత్యాకాండ
- భూ వివాదం, అక్రమ సంబంధమే కారణం!





హత్యకు గురైన మహబూబ్ సాబ్, నజీర్ (ఫైల్)



ఘటనాస్థలిలో నజీర్ మృతదేహం, పరిశీలిస్తున్న పోలీసులు



విలపిస్తున్న బంధువులు

బాగేపల్లి / చిక్కబళ్లాపురం: చిక్కబళ్లాపురం జిల్లా బాగేపల్లి సమీపంలో గుడిబండ తాలూకా హంపసంద్ర గ్రామంలో బుధవారం వేకువనే బంధువుల మధ్య తుపాకీ కాల్పులు జరిగాయి. ఈ సంఘటనలో ఓ వృద్ధుడు, ఆయన కొడుకు మరణించారు. గుడిబండ పోలీసులు తెలిపిన మేరకు వివరాలు.. హంపసంద్ర గ్రామంలో మహబూబ్ సాబ్ (80), ఆయన కొడుకు నజీర్ అహమ్మద్ (60) జీవిస్తున్నారు. బుధవారం వేకువజామున 5:15 గంటలకు నమాజ్ చేయడానికి వెళుతున్నారు. మహబూబ్‌సాబ్ సొంత తమ్ముడు బషీర్ అహమ్మద్ (66) దారిలో పొంచి ఉండి వారిపై పిస్టల్‌తో కాల్పులు జరిపాడు. దీంతో తూటాలు తగిలి నజీర్ అహమ్మద్ అక్కడికక్కడే మరణించాడు. తరువాత అన్నపై వేట కొడవలితో నరికి పరారయ్యాడు. స్థానికులు చూసి తీవ్ర గాయాలతో పడి ఉన్న వృద్ధున్ని గుడిబండ ప్రభుత్వ ఆసుపత్రికి, అటు నుంచి బెంగళూరుకు తరలించగా, ఆస్పత్రిలో చనిపోయాడు.

భార్యను చంపాలని ప్లాన్...

కాల్పుల శబ్దాలతో గ్రామం ఉలిక్కిపడింది. జనం ఇళ్ల నుంచి బయటకు రాగా హంతకుడు బైక్‌పై బాగేపల్లిలో కొత్త రోడ్డులోని తన ఇంటికి బయల్దేరాడు, అక్కడ తన భార్యను హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. గ్రామంలో హత్యల గురించి సమాచారం అందుకున్న పోలీసులు బాగేపల్లిలోని హంతకుని భార్యకు ఫోన్ చేసి ఎవరు వచ్చినా తలుపు తెరవవద్దని హెచ్చరించారు. ఇంతలో ఇంటికి వెళ్లిన బషీర్ ఆమె వాకిలి తీయకపోవడంతో వెనుదిరిగాడు. పోలీసులు అతన్ని పట్టుకుని పిస్టల్, వేట కొడవలిని స్వాధీనం చేసుకున్నారు. చిక్కబళ్లాపుర ఎస్పీ కుషాల్ చౌక్సీ, ఏఎస్పీ ఖాసీం, డీఎస్పీ శివకుమార్, సీఐ నయాజ్‌బేగ్ ఘటనా స్థలిని పరిశీలించారు. బంధువులు పరుగుపరుగున వచ్చి చూడగా రోడ్డుపై నజీర్ మృతదేహం పడి ఉంది. గ్రామంలో ఉద్రిక్తత చోటు చేసుకోగా పోలీసు బందోబస్తు ఏర్పాటైంది. బషీర్ కొంతకాలంగా దుబాయ్‌లో ఉండి ఇటీవలే ఊరికి తిరిగి వచ్చాడు. హత్యలకు వారి మధ్య భూ వివాదం, వివాహేతర సంబంధం కారణమని గ్రామస్తులు చెబుతున్నారు.

క్లుప్తంగా

స్వామీజీలు ఇళ్ల నిర్మాణానికి పూనుకోవాలి


సిద్ధరబెట్ట స్వామీజీని అభినందిస్తున్న దృశ్యం

తుమకూరు: స్వామీజీలు మఠాల నిర్మాణంతో పాటు ప్రజల కోసం ఇళ్ల నిర్మాణ పనులను చేపట్టినప్పుడే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, ఇలాంటి పనులు సిద్ధరబెట్ట క్షేత్ర స్వామీజీ చేస్తున్నారని, వారి సేవలు మరో వందేళ్ల రాష్ట్రానికి అందాలని ఎలెరాంపుర కుంచిటిగర మహాసంస్థాన మఠం పీఠాధ్యక్షుడు డాక్టర్ హనుమంతనాథ స్వామీజీ అన్నారు. ఆయన బుధవారం కొరటగెరె తాలూకా సిద్ధరబెట్ట బాళెహొన్నూరు ఖాసా శాఖామఠంలో నిర్వహించిన కార్యక్రమంలో మాట్లాడారు. సిద్ధరబెట్ట స్వామీజీ తాలూకాతో పాటు సహా చుట్టుపక్కల తాలూకాల్లో సామాజిక సేవా కార్యక్రమాలు చేపడుతున్నారన్నారు. సింధనూరు రంభాపురి ఖాసా శాఖా మఠం సోమేశ్వర శివాచార్య స్వామీజీ మాట్లాడుతూ సిద్ధరబెట్ట స్వామీజీని ఇతర మఠాల స్వామీజీలందరూ ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ శుభా సచిన్, పంచాక్షరయ్య, రాజణ్ణ, ఈశ్వరయ్య, రోటరీ అధ్యక్షుడు రఘు, గంగాధర శాస్త్రి, కె.పి.రాజణ్ణ తదితరులు పాల్గొన్నారు.

మాజీ ఎమ్మెల్సీ డీఎస్ వీరయ్యకు బెయిలు

దొడ్డబళ్లాపురం: దేవరాజు అరసు ట్రక్ టర్మినల్ కుంభకోణంలో అరెస్టైన మాజీ ఎమ్మెల్సీ డీఎస్ వీరయ్యకు కోర్టు బెయిలు ఇచ్చింది. డీడీయూటీఎల్‌లో సుమారు రూ.47 కోట్ల మేరకు అవినీతి జరిగిందని, ఇందుకు సూత్రధారి వీరయ్య అని భావించిన సీఐడీ పోలీసులు జూలై12న ఆయనను అరెస్టు చేశారు. తదనంతరం జనప్రతినిధుల ప్రత్యేక కోర్టు ఆయనకు 14రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించింది. దీంతో ఆయన జైలుపాలయ్యారు. మంగళవారం ఆయనను మళ్లీ కోర్టులో హాజరుపరచగా షరతులతో కూడిన బెయిలు మంజూరు చేసింది.

నటుడు డాలి అవ్వ కన్నుమూత


అవ్వతో డాలి ధనంజయ(ఫైల్)

యశవంతపుర: శాండల్ వుడ్ నటుడు డాలి ధనంజయ అవ్వ మల్లమ్మ(96) బుధవారం వయోసంబంధిత సమస్యలతో మృతి చెందారు. హాసన జిల్లా అరసీకెరె తాలూకా కాణేనహళ్లిలో కన్నుమూశారు. మల్లమ్మకి ఐదుగురు సంతానం. డాలి ధనంజయ తండ్రి అడవిస్వామి రెండో కుమారుడు. వీకెండ్ విత్ రమేష్ సీజన్-5లో మల్లమ్మ కనిపించారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

• మంత్రి ఈశ్వర ఖండ్రె

శివాజీనగర: ప్రకృతి, పర్యావరణం భూమికి రెండు కళ్లు అని, వాటి పరిరక్షణ బాధ్యత అందరిపై ఉందని అటవీ, పర్యావరణ శాఖ మంత్రి ఈశ్వర ఖండ్రె పిలుపునిచ్చారు. బెంగళూరులోని స్కౌట్స్, గైడ్స్ సభా మందిరంలో ఏర్పాటు చేసిన పర్యావరణ వస్తు ప్రదర్శనను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వృక్షాలను కాపాడుకుంటే పర్యావరణాన్ని రక్షించుకున్నట్లు అవుతుందన్నారు. పూర్వీకులు తమకు అందుబాటులో ఉన్న వనరులను పరిమితంగా వినియోగించుకుంటూ భావితరాలకు మిగిల్చేవారన్నారు. కొండలు, నదులు, వృక్షాలను పూజించేవారన్నారు. నేడు భారీ యంత్రాలతో భూగర్భాన్నే తవ్వుతున్నామని, అటవీ సంపదను చేజేతులా నాశనం చేస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యతను ఇవ్వాలని స్కౌట్స్, గైడ్స్ విద్యార్థులకు సూచించారు. విద్యార్థులకు బాల్యం నుంచే పర్యావరణ పరిరక్షణ, వృక్ష సంరక్షణ ప్రాధాన్యతను తెలియజేయాలన్నారు. మాజీ మంత్రి, స్కౌట్స్,గైడ్స్ రాష్ట్ర కమిషనర్ పీ.జీ.ఆర్.సింధ్యా, సీనియర్ పాత్రికేయుడు నాగేశ్ హెగ్డే, విధానపరిషత్ మాజీ సభ్యుడు మోహన్ కొండజ్జి, సినీ నటుడు రిచర్డ్ లూయిస్, కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నిధులు అడిగితే చెంబు ఇచ్చారు

• బడ్జెట్‌లో కన్నడిగులకు అన్యాయంపై కాంగ్రెస్ నిరసన



చెంబులతో నిరసన తెలియజేస్తున్న కాంగ్రెస్ కార్యకర్తలు

మైసూరు: కేంద్రమంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో కన్నడిగులను మోసం చేశారని ఆరోపిస్తూ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు బుధవారం మైసూరులోని ఆ పార్టీ కార్యాలయం ఎదుట చెంబులతో నిరసనకు దిగారు. కేంద్ర ప్రభుత్వానికి, ఆర్థిక మంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కర్ణాటకలోని ఒక్క ప్రాజెక్టుకు కూడా నిధులు ఇవ్వలేదన్నారు. బీజేపీ, జేడీఎస్‌లకు చెందిన 19 మంది ఎంపీలు ఉన్నా ఈసారి బడ్జెట్‌లో కర్ణాటకకు మోసం చేశారని ఆరోపించారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం తమ మిత్రపక్షాలు అధికారంలో ఉన్న రాష్ట్రాలకే ఎక్కువ గ్రాంట్లు ఇవ్వడం అన్యాయమన్నారు. పీసీసీ మహిళా అధ్యక్షురాలు, హామీల అమలు కమిటీ ఉపాధ్యక్షులు డాక్టర్ బి.పుష్పా అమర్‌నాథ్, ఉపాధ్యక్షురాలు పుష్పవల్లి, పట్టణ మహిళా అధ్యక్షురాలు పుష్పలత చిక్కన్న, రూరల్ అధ్యక్షురాలు లతా సిద్ధశెట్టి, మాజీ మేయర్లు మూడామణి, పుష్పలత జగన్నాథ్, నాయకులు, పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు.

ఐటీ ఉద్యోగుల ధర్నా

బనశంకరి: బెంగళూరు నగరంలో ఐటీ కంపెనీల ఉద్యోగులు బుధవారం రోడ్డెక్కారు. ఐటీ ఉద్యోగులు రోజుకు 14 గంటలు విధులు నిర్వహించాలని కర్ణాటక ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలపై వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సర్కారుకు వ్యతిరేకంగా వందలాది మంది ఐటీ ఉద్యోగులు మహదేవపుర, ఎలక్ట్రానిక్ సిటి, బ్రూక్‌ఫీల్డ్ ప్రాంతాల్లో ధర్నాలు నిర్వహించారు. ఐటీ ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి సుహాస్ తదితరులు పాల్గొన్నారు. రానున్న రోజుల్లో భారీ ధర్నాకు పిలుపునిస్తామని తెలిపారు. గురువారం కార్మిక మంత్రి సంతోష్‌లాడ్‌ను కలిసి పని గంటలను పొడిగించరాదని కోరతామన్నారు.

ఆరోగ్య శాఖలో ఖాళీలు భర్తీ చేస్తాం

శివాజీనగర: ప్రభుత్వ ఉద్యోగాల కోసం నిరీక్షిస్తున్న ఆకాంక్షులకు ఆరోగ్య శాఖ మంత్రి తీపి కబురు అందించారు. ఆరోగ్య శాఖలో ఖాళీ పోస్టులను 2 సంవత్సరాల్లో భర్తీ చేస్తామని తెలిపారు. విధానసౌధలో బుధవారం మాట్లాడిన ఆయన.. తనిఖీ అధికారులు, పీహెచ్‌సీల్లో సిబ్బంది పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. సీఎం సిద్ధరామయ్యతో చర్చించి ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకుంటామన్నారు.

క్రికెట్ బెట్టింగ్ దందాను అరికట్టండి


ఎస్పీకి వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: జిల్లా వ్యాప్తంగా సాగుతున్న క్రికెట్ బెట్టింగ్ దందాను అరికట్టాలని బీజేపీ యువ మోర్చా కార్యకర్తలు డిమాండ్ చేశారు. ఈమేరకు మంగళవారం జిల్లా ఎస్పీ నిఖిల్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. జిల్లా అధ్యక్షుడు తేజస్ మాట్లాడుతూ క్రికెట్ బెట్టింగ్‌కు విద్యార్థులు బానిసై జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారన్నారు. పొరుగు రాష్ట్రాల నుంచి గంజాయి కూడా జిల్లాకు వస్తోందన్నారు. జిల్లాలో బెట్టింగ్, మాదక ద్రవ్యాలను అరికట్టాలని కోరారు.

అగ్ని ప్రమాద బాధిత ఇంజినీర్ భార్యకు ఉద్యోగం

బనశంకరి: బీబీఎంపీ కేంద్ర కార్యాలయంలో చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో మృతిచెందిన ఇంజినీర్ భార్యకు, ముగ్గురు తాత్కాలిక సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగాలు కల్పించారు. గత ఏడాది ఆగస్టు 8 తేదీన బీబీఎంపీ కార్యాలయంలో అగ్నిప్రమాదం సంభవించింది. ఈఘటనలో 13 మంది పాలికె తాత్కాలిక సిబ్బంది గాయపడగా ఇంజినీర్ శివకుమార్ మృతిచెందారు. ఇంజినీర్ కుటుంబంలో ఒకరికి, గాయపడిన సిబ్బందికి కారుణ్య నియామకం ఆధారంగా ఉద్యోగం ఇవ్వాలని బీబీఎంపీ కమిషనర్ ప్రభుత్వానికి మనవిచేశారు. దీంతో ఇంజినీర్ భార్య ఉమామహేశ్వరితోపాటు గాయపడిన ముగ్గురు సిబ్బంది శ్రీనివాస్, జ్యోతి, మనోజ్‌కు బీబీఎంపీ కార్యాలయంలో పర్మినెంట్ ఉద్యోగం కల్పించారు.

ముందస్తు బెయిల్ పిటిషన్ తిరస్కరణ

బనశంకరి: మాజీ ఎంపీ ప్రజ్వల్ రేవణ్ణకు కోర్టు షాక్ ఇచ్చింది. లైంగిక దాడి ఘటనలో తనపై నమోదైన కేసులో ఆయన సమర్పించిన ముందస్తు బెయిల్‌పిటిషన్ ప్రజాప్రతినిధుల కోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. పిటిషన్‌ను తిరస్కరిస్తూ న్యాయమూర్తి సంతోషగజాననభట్ ఆదేశాలు జారీ చేశారు. దీంతో ప్రజ్వల్ రేవణ్ణ మరికొద్దిరోజులు పరప్పన అగ్రహారజైలులో గడపాల్సి ఉంటుంది.

స్వచ్ఛ భారత్‌తో ప్లాస్టిక్‌కు చరమగీతం


సేకరించిన ప్లాస్టిక్ సామగ్రితో విద్యార్థులు

మైసూరు: నగరంలోని ముఖ్యమైన వ్యాపార కేంద్రాలైన సంతపేట, శివరాంపేటె, దేవరాజ అరసు రోడ్డు తదితర చోట్ల బుధవారం విద్యార్థులతో స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి ప్లాస్టిక్ బ్యాగ్‌లను, వ్యర్థాలను సేకరించారు. వీరంతా ప్రతి షాప్, మాల్స్ యజమానులు, వినియోగదారులను కలిసి ప్లాస్టిక్‌ను ఉపయోగించడం వల్ల కలిగే ప్రతికూల ప్రభావాల గురించి వివరించారు. అంతేగాక దుకాణాల నుంచి వాటర్ బాటిళ్లు, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. మార్కెట్‌కు వచ్చిన వేలాది మంది కస్టమర్లు ఉత్సుకతతో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే నష్టాలను ఆలకించారు. ఈ ప్లాస్టిక్ వ్యర్థాలను ఎలా పారవేయాలి, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఏం ఉపయోగించవచ్చో శాస్త్రీయ సమాచారం అందించి ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రజలను చైతన్య పరిచారు. నగరంలోని హెచ్‌డీ కోటే రోడ్డులోని పూర్ణ చేతన పాఠశాలకు చెందిన విద్యార్థులు నగరంలో నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ల వినియోగానికి పేరుగాంచిన మార్కెట్ ఏరియాలో ఏకకాలంలో ప్లాస్టిక్ వ్యతిరేక ప్రచారం నిర్వహించారు. స్వచ్ఛ భారత్ ఉద్యమంలో భాగంగా విద్యార్థులు వాటర్ బాటిల్స్, ఇతర ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించారు. పాఠశాల ముఖ్య కార్యనిర్వహణాధికారి దర్శన్ రాజ్ పాల్గొన్నారు.

బీబీఎంపీ చెత్త సంస్కరణపై గ్యాంగ్టాక్ పాలికె ఆసక్తి


గ్యాంగ్టాక్ మేయర్ శ్రీనేల్‌భహద్దూర్‌బెట్రీ, డిప్యూటీ మేయర్ శెరింగ్‌పాల్డెన్‌భూటియా బృందానికి సన్మానం

బనశంకరి: బృహత్ బెంగళూరు మహానగర పాలికెలో నిర్వహిస్తున్న పొడిచెత్త నిర్వహణపై గ్యాంగ్టాక్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్‌తో కూడిన బృందం వివరాలు తెలుసుకుంది. గ్యాంగ్టాక్ మేయర్ శ్రీనేల్‌బహద్దూర్‌బెట్రీ, డిప్యూటీ మేయర్ శెరింగ్‌పాల్డెన్‌భుటియా బుధవారం పాలికెను సందర్శించి బీబీఎంపీ కమిషనర్ తుషార్‌గిరినాథ్‌తో సమావేశమయ్యారు. పొడిచెత్త నిర్వహణకు తీసుకున్న చర్యలు, చెత్త సంస్కరణ కేంద్రాలు, బిడదిలో నూతనంగా ఏర్పాటుచేసిన చెత్తతో విద్యుత్ ఉత్పత్తిచేసే కేంద్రంతో పాటు ఇతర విషయాలు గురించి కమిషనర్ వివరాలు తెలియజేశారు. అనంతరం కోరమంగల నిర్మించిన ద్వితీయశ్రేణి పొడిచెత్త మార్పు, చెత్త విభజన కేంద్రాన్ని గ్యాంగ్టాక్ మేయర్ బృందం పరిశీలించింది. మెచ్చుకున్నారు. గ్యాంగ్టాక్‌లో నిత్యం 70 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతుందని, దీనిని సంస్కరించేందుకు బీబీఎంపీ పాటించిన విధానం అమలు కోసం ప్రయత్నం చేస్తామని మేయర్ తెలిపారు. కార్యక్రమంలో బీబీఎంపీ ఇంజినీర్ బసవరాజకబాడే, రమామణి, గ్యాంగ్టాక్ కమిషనర్ ఆర్‌బీ.భండారి తదితరులు పాల్గొన్నారు.

జలజీవన్ మిషన్ పనుల పరిశీలన


నీటి సరఫరాను పరిశీలిస్తున్న ప్రపంచ బ్యాంకు అధికారులు

కోలారు : తాలూకాలోని చిక్కతిరుపతి గ్రామ పంచాయతీ పరిధిలోని కల్కెరె గ్రామంలో అమలు చేసిన జలజీవన్ మిషన్ పనులను ప్రపంచ బ్యాంకు కెఐఎస్ఆర్‌డ్యూస్‌పి జిల్లా సమాలోచకుల బృందం బుధవారం పరిశీలన జరిపింది. పీడీఓ హరిప్రసాద్ వారికి వివరాలు తెలియజేశారు.
2023–24 ఆర్థిక సంవత్సరంలో 72.07 లక్షలతో పనులను పూర్తి చేసినట్లు తెలిపారు. రెండు ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించి గ్రామంలో 336 కుటుంబాలకు ఇంటింటికి కొళాయి ద్వారా తాగునీరు అందిస్తున్నట్లు వివరించారు. ఇదే పథకం కింద మరో బోరు బావి తవ్వించామని, విద్యుత్ కనెక్షన్ ఇవ్వాల్సి ఉందని తెలిపారు. ప్రతి ఇంటికీ నీటి సరఫరా గురించి తెలుసుకున్న అధికారుల బృందం సంతృప్తిని వ్యక్తం చేసింది. గ్రామ పంచాయతీ అధ్యక్షుడు టీఎం రామప్రసాద్, తదితరులు ఉన్నారు.

సిద్దూ అవినీతిపరుడని చెప్పలేం

• ఆ ప్లాట్లను ముడాకు వెనక్కివ్వాలి
• మాజీ ఎంపీ ప్రతాప్ సింహ

మైసూరు: తన భార్య భూమికి బదులుగా ముడా నుంచి పొందిన 14 ప్లాట్లను ముఖ్యమంత్రి సిద్ధరామయ్య ముడాకు వాపసు చేయాలని మాజీ ఎంపీ ప్రతాప్ సింహ డిమాండ్ చేశారు. బుధవారం నగరంలోని పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. 40 ఏళ్ల సిద్ధరామయ్య సుదీర్ఘ రాజకీయ జీవితాన్ని చూస్తే ఆయనను అవినీతిపరుడని చెప్పలేమన్నారు. అయితే ఇప్పుడు సిద్ధరామయ్యపై కూడా అనుమానాలు మొదలయ్యాయన్నారు. ఇళ్ల స్థలాలను వాపసు చేసి దర్యాప్తు చేయించాలన్నారు. లేకుంటే సీఎం కుటుంబ కేసును అడ్డుపెట్టుకుని చాలా మంది తప్పించుకుంటారని అన్నారు. 40 ఏళ్లుగా ఎలాంటి మచ్చ లేని మీరు కేవలం 16 సైట్ల కోసం కళంకాన్ని అంటించుకుంటారా? ఇది మీకు అవసరమా? అని ప్రశ్నించారు. వచ్చే మూడున్నరేళ్లు మీరు ఇదే ఆరోపణ ఎదుర్కొంటారన్నారు. రాష్ట్రంలో గత సీఎంల ఆస్తులతో పోల్చి చూస్తే సిద్ధరామయ్య ఆస్తి లెక్కలోది కాదన్నారు. ముడా కుంభకోణంపై జస్టిస్ ఎన్.సంతోష్ హెగ్డే, కుమార్ వంటి వారితో న్యాయ విచారణ జరిపించాలని ఒత్తిడి చేశారు. తాను ముడాలో ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా ఒక్క సైటు తీసుకున్నట్లు నిరూపించాలని తనపై ఆరోపణలు చేస్తున్న వారికి సవాల్ విసిరారు.

ఇంటింటికీ వెళ్లి డెంగీపై అవగాహన కల్పించండి

హొసపేటె: విజయనగర జిల్లాలో డెంగీ, చికన్‌గున్యా నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ అధికారులను ఆదేశించారు. సాంక్రమిక వ్యాధుల నియంత్రణపై కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దోమల వల్ల డెంగీ వ్యాపిస్తుందని, దోమల నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది బృందాలు ఏర్పడి నగరాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నిలబడి ఉన్న నీటిలో డెంగీకి కారణమయ్యే దోమలు ఉత్పత్తి అవుతాయని, ఇలాంటి స్థలాలను గుర్తించి రసాయనాలు పిచికారీ చేయించాలని సూచించారు. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను ఆశ్రయించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ద్వారా ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు.

తుంగభద్ర వరద యథాతథం


తుంగభద్ర డ్యాం వద్ద నుంచి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

• 10 గేట్ల నుంచి దిగువకు 20 వేల క్యూసెక్కుల విడుదల

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పలు జిల్లా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయమైన తుంగభద్ర డ్యాంకు బుధవారం 87,700 క్యూసెక్కుల మేర భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాం వద్ద 10 గేట్లద్వారా అడుగు మేర పైకెత్తి దిగువకు సుమారు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటినిల్వ 96.914 టీఎంసీలకు చేరుకొంది. డ్యాంకు ఎగువన శివమొగ్గ, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబె, చిక్కమగళూరు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద యథావిధంగా కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1630.75 అడుగులకు చేరుకొంది. ఔట్‌ఫ్లో 18,686 క్యూసెక్కులుగా ఉందని మండలి అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఏ సమయంలో అయినా డ్యాంకు సంబంధించిన మరిన్ని క్రస్ట్‌గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

శాంతించని కృష్ణమ్మ


శీలహళ్లి వద్ద నీట మునిగిన రోడ్డు వంతెన

రాయచూరు రూరల్: మహారాష్ట్రలోని పశ్చిమ కనుమలతో పాటు ఆల్మట్టి డ్యాం ఎగువ భాగంలో విస్తారంగా కురుస్తున్న వానలతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. రోజురోజుకు పెరుగుతున్న వరదలతో ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర, గదగ్, కళ్యాణ కర్ణాటకలోని యాదగిరి, రాయచూరు జిల్లాల నదీ తీర లోతట్టు ప్రాంత వాసులు ముంపు భయం ఎదుర్కొంటున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నేపథ్యంలో ఆల్మట్టి, నారాయణపుర డ్యాంల నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రమాదపు హెచ్చరికలు జారీ చేశారు. రాయచూరు తాలూకా కాడ్లూరు వద్ద ఉపేంద్ర తీర్థ ఆలయం నీట మునిగింది. జిల్లాలోని లింగసూగూరు, దేవదుర్గ, రాయచూరు తాలూకాల్లో అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉప్పొంగుతున్న నదులు:
మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల కోయ్నా జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేయడంతో ఉత్తర కర్ణాటకలో కృష్ణమ్మ పొంగిప్రవహిస్తోంది. కృష్ణా నదికి ఉపనదులైన దూద్ గంగా, వేదగంగా, ఘటప్రభ, మలప్రభ నదులు కూడా వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. బెళగావి జిల్లాలో శంకర లింగ ఆలయం నీట మునిగింది. లింగసూగూరు తాలూకాలో శీలహళ్లి వంతెన వద్ద నది ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవదుర్గ తాలూకాలో హూవిన హెడగి వంతెనపైకి నీరు రావడానికి కేవలం రెండు అడుగులు మాత్రమే మిగిలి ఉంది.

కోలారు వార్తలు...

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సర్కార్ వంచన


మాట్లాడుతున్న వక్కలేరి శంకరప్ప

కోలారు: ఎస్సీ, ఎస్టీ సముదాయాలకు చెందిన ప్రతిభావంత విద్యార్థులను ప్రభుత్వం విస్మరించిందని కర్ణాటక దళిత సంఘర్ష సమితి భీమావాద జిల్లా అధ్యక్షుడు వక్కలేరి శంకరప్ప ఆరోపించారు. సర్కార్ తీరును ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేయడానికి ఈ నెల 25న రాష్ట్ర సమితి సభలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతోమాట్లాడారు. వెనుకబడిన వర్గాలకు తొలుత విద్యను అందుబాటులోకి తేవాలనేది అంబేడ్కర్ ఆశయమన్నారు. ఈ ఆశయాన్ని నెరవేర్చడంలో ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప విఫలమయ్యారన్నారు. సామాజిక న్యాయం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోడికణ్ణూరు నాగరాజ్, హర్జేనహళ్లి కృష్ణప్ప, రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.

అనాథ పిల్లల పరిరక్షణపై కలెక్టర్ సమీక్ష


మాట్లాడుతున్న కలెక్టర్ అక్రం పాషా

కోలారు : ఆరు సంవత్సరాలలోపు నిర్గతిక అనాథ పిల్లల ఆలనాపాలన కోసం ప్రభుత్వ దత్తు సంస్థ అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టర్ అక్రం పాషా సమీక్ష చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పిల్లల రక్షణ నిర్దేశనాలయం, మిషన్ వాత్సల్య పథకం, జిల్లా పిల్లల రక్షణా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన మిషన్ వాత్సల్య వివిధ పథకాల త్రైమాసిక సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇలాంటి పిల్లలకు శాశ్వత కుటుంబ వ్యవస్థను చట్ట బద్ధంగా కల్పించడానికి దత్తు సంస్థ సహకారి అవుతుందన్నారు. జిల్లాలోని దత్తు సంస్థలలో 52 మంది పిల్లల దాఖలు అయ్యారన్నారు. పీఎంకేర్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద 8 మంది పిల్లల సమాచారాన్ని పిఎం కేర్ పోర్టల్‌లో చేర్చినట్లు తెలిపారు. జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని, జిల్లా ఎస్పీ నిఖిల్ పాల్గొన్నారు.

శబ్దం చేస్తే కఠిన చర్యలు

కోలారు: శబ్ద కాలుష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ నిఖిల్ హెచ్చరించారు. కఠోర శబ్దం చేస్తున్న రూ. 6.5 లక్షల విలువ చేసే 152 బైక్ సైలెన్సర్లను పోలీసులు స్వాధీనం చేసుకొని బుధవారం ఎస్పీ సమక్షంలో బుల్డోజర్ కింద వేసి నాశనం చేశారు. ఎస్పీ మాట్లాడుతూ యువత శబ్దకాలుష్యం కలుగజేసే సైలెన్సర్‌లను ఎక్కువగా వినియోగిస్తున్నారన్నారు. వీరంతా ఇలాంటి వాటికి డబ్బు ఖర్చు చేయడం కంటే పుస్తకాలు కొని చదివితే ఎంతో జ్ఞానం సంపాదించుకోవచ్చన్నారు. బీమ్ ఎల్ఈడీ లైట్లు ఉపయోగిస్తున్న 1500 వాహనాలకు జరిమానా విధించినట్లు తెలిపారు. సురక్షత దృష్టితో ప్రతి ఒక్కరూ హెల్మెట్‌లు ధరించాలన్నారు. బైక్ వీలింగ్‌కు పాల్పడితే కఠినంగా శిక్షిస్తామన్నారు. కలెక్టర్‌తో చర్చించి సిగ్నల్స్ వద్ద ఏర్పాటు చేసిన సీసీకెమెరాలకు మరమ్మతులు చేయిస్తామని తెలిపారు. ఏఎస్పీ రవిశంకర్, డీఎస్పీ నాగ్తె తదితరులు పాల్గొన్నారు.

పావురాలను రక్షించబోయి ప్రాణాల మీదకు..

• విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

సాక్షి,బళ్లారి: విద్యుత్ స్తంభానికి చిక్కుకున్న పావురాలను రక్షించబోయిన బాలుడు మృతి చెందిన ఘటన బుధవారం చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా హనుమాపుర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రామచంద్ర(12) అనే బాలుడు గ్రామంలోని విద్యుత్ స్తంభంపై వైర్లకు పావురాలు చిక్కుకుని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న దృశ్యం చూసి చలించిపోయి వెంటనే తెలియనితనంతో విద్యుత్ స్తంభం ఎక్కి పావురాలను రక్షించబోయి, విద్యుత్ వైర్లు పట్టుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హుటాహుటిన పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కుటుంబసభ్యుల రోదనలు మిన్నంటాయి. అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గురువు లేనిదే విజయం అసాధ్యం

కోలారు: గురువు లేనిదే జీవితంలో విజయం సాధించడం అసాధ్యమని నివృత్త ఉపాధ్యాయుడు సంగణ్ణ తెలిపారు. తాలూకాలోని బెగ్లి హొసహళ్లి గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన గురువందన, స్నేహ సమ్మిలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితానికి దారి దీపమైన గురువును స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. నేటి విద్యా వ్యవస్థ దారి తప్పుతోందన్నారు. పిల్లలను దండించరాదు, కోపంగా కూడా చూడరాదు అనే వాతావరణంలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సి పరిస్థితి నెలకొందన్నారు. నివృత్త ప్రధానోపాధ్యాయుడు వెంకటేశప్ప మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాసన్, మునివెంకటప్ప, రమేష్, చంద్రకాంత, మేరి ఎలిజబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ల దొంగ అరెస్ట్


పట్టుబడిన దొంగ, పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

శ్రీనివాసపురం: బైక్ చోరీలకు పాల్పడుతున్న దొంగను గౌనిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్దనుంచి రూ.2.75 లక్షల విలువ చేసే 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. బైక్‌లను సొంతదారులకు అప్పగించారు. గౌనిపల్లి పోలీసుల కార్యవైఖరిని ఎస్పీ నిఖిల్ ప్రశంసించారు.

వినాయక ఆలయంలో పూజలు


ప్రత్యేక అలంకరణలో కురుడుమలై వినాయకుడు

కోలారు: సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని ముళబాగిలు తాలూకా కురుడుమలై గ్రామంలో వినాయక దేవాలయంలో బుధవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

క్లుప్తంగా

సెల్‌ఫోన్లకు బానిస కావొద్దు



విద్యార్థులకు సూచనలిస్తున్న తహసీల్దారు

గౌరిబిదనూరు: విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ చదువుపై శ్రద్ధ పెట్టాలని తహసీల్దార్ మహేశ్ పత్రి సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ ప్రభుత్వ హాస్టల్‌ను ఆయన తనిఖీ చేశారు. విద్యార్థులతో మాట్లాడుతూ గదులను శుభ్రంగా ఉంచుకోవాలని, చెడు అలవాట్లకు దూరంగా వుండాలని, రోజూ నాలుగు గంటలైనా చదవాలని సూచించారు. నాణ్యమైన ఆహారాన్ని విద్యార్థులకు ఇవ్వాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు.

చెలరేగిన దోపిడీదారులు

మైసూరు: ఓ మహిళ వద్ద నుంచి దుండగులు నగదు, బంగారు ఆభరణాలను దోచుకుని పరారైన ఘటన నగరంలో జరిగింది. బన్నిమంటప నివాసి ఆర్షియాబేగం అనే మహిళ కేఆర్ ఆస్పత్రి సమీపంలోని తన సోదరుని ఇంటికి నడుచుకుంటూ వెళుతుండగా బైక్‌పై వెంబడించి వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె వద్ద ఉన్న నగదు, బంగారు ఆభరణాలు ఉన్న బ్యాగ్‌ను లాక్కొని పరారయ్యారు. ఈ ఘటనపై దేవరాజ అరసు పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

మాంగల్యం చైన్ అప్పగింత



వృద్ధురాలికి చైన్‌ను అప్పగిస్తున్న పోలీసులు

దొడ్డబళ్లాపురం: స్నాచింగ్‌కు గురైన బంగారు చైన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకొని సొంతదారుకి అప్పగించారు. దొడ్డబళ్లాపురం తాలూకా నరసింహనహళ్లి గ్రామంలో వారం రోజుల క్రితం ఓ వృద్ధురాలు కాలినడకన వెళ్తుండగా బైక్‌పై వచ్చిన ఇద్దరు దుండగులు ఆమె మెడలో మాంగల్యం చైన్ లాక్కెళ్లారు. కేసు నమోదు చేసుకున్న దొడ్డ గ్రామీణ పోలీసులు నిందితులను అరెస్టు చేసి వృద్ధురాలికి చైన్ అప్పగించారు.

భర్తకు తక్కువ వేతనం వస్తోందని భార్య ఆత్మహత్య

దొడ్డబళ్లాపురం: భర్తకు తక్కువ జీతం వస్తోందని కలత చెందిన భార్య ఆత్మహత్య చేసుకున్న సంఘటన నెలమంగల తాలూకా అరిశినకుంటలో చోటుచేసుకుంది. అరిశినకుంటలో నందిని(30), సునీల్ దంపతులు నివాసం ఉంటున్నారు. వీరికి 8ఏళ్ల క్రితం వివాహమైంది. సునీల్ ప్రైవేటు పాఠశాలలో బస్సు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. డిగ్రీ చేసిన భర్త తక్కువ జీతానికి పని చేయడం, తాను బీకాం చదివినా పని లేకపోవడంతో కలత చెందిన నందిని.. భర్త పనికి వెళ్లిన సమయంలో ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ఫొటో గ్రాఫర్లకు ఉత్సాహంగా క్రీడా పోటీలు



క్రీడా పోటీలలో పాల్గొన్న ఫొటోగ్రాఫర్లు

గౌరిబిదనూరు: ఫొటోగ్రాఫర్లు వృత్తి నిపుణతతో పాటు మానసిక, శారీరక ఆరోగ్యానికి క్రీడలు ఆడాలని నగరసభ మాజీ అధ్యక్షుడు నరసింహమూర్తి పిలుపు నిచ్చారు. పట్టణంలోని ఇడగూరు రోడ్డులో ఉన్న మైదానంలో ఫొటోగ్రాఫర్ల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. ఎమ్మెల్యేతో సంప్రదించి క్రీడాకారులకు యూనిఫారం క్రికెట్ కిట్లను వితరణ చేయడానికి ప్రయత్నిస్తానన్నారు. అనంతరం జరిగిన పోటీల్లో షెక్షావలి బృందం ప్రథమ స్థానం, అనిల్ బృందం ద్వితీయ స్థానం, దాదుపీర్ బృందం తృతీయస్థానంలో నిలిచింది. ఉత్తమ క్రీడాకారుడిగా నాగేంద్ర జైన్ బహుమతి అందుకున్నారు. దేవీ మంజునాథ్, అరుణ్‌కుమార్, నాగరాజజైన్, అంజినప్ప, సురేశ్,శ్రీ నివాస్ పాల్గొన్నారు.

ఏనుగు దాడిలో అరటి తోట ధ్వంసం



అరటిచెట్లను ధ్వంసం చేసిన దృశ్యం

దొడ్డబళ్లాపురం: ఏనుగు దాడిలో అరటితోట ధ్వంసమైన ఘటన చెన్నపట్టణ తాలూకా హొసహళ్లి గ్రామంలో చోటుచేసుకుంది. తెంగినకల్లు అటవీప్రాంతం నుంచి ఆహారం వెదుక్కుంటూ దారితప్పి వచ్చిన ఏనుగు మంగళవారం రాత్రి గ్రామ శివారులోని లోకేశ్ అనే రైతుకు చెందిన తోటలోకి చొరబడి అరటి చెట్లను తొండంతో పీకి నాశనం చేసింది. పంపుసెట్లను విరిచేసింది. దీంతో రైతుకు నష్టం వాటిల్లింది. అటవీశాఖ అధికారులు స్పందించి ఏనుగును అడవిలోకి తరమాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నిరుద్యోగి పేరుతో రూ.కోట్ల లావాదేవీలు





- అతని ఆధార్, పాన్ తీసుకుని మోసగాళ్ల దందా
- షేర్ల పేరుతో మరొకరికి రూ.1.52 కోట్లు టోకరా

బనశంకరి: పార్ట్‌టైమ్ ఉద్యోగం, రుణం ఇస్తామని నమ్మించి ఆధార్, పాన్‌కార్డు తీసుకునే వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి. లేనిపక్షంలో ఇబ్బందుల్లో చిక్కుకోవలసివస్తుంది. బెంగళూరు నగరంలో ఓ యువకునికి పార్ట్‌టైమ్ ఉద్యోగం ఇస్తామని నమ్మించిన వంచకులు ఆధార్, పాన్‌కార్డు తీసుకుని అతని పేరుతో వివిధ బ్యాంకుల్లో అకౌంట్లు తెరిచి రూ.2.22 కోట్లు ఆర్థిక కార్యకలాపాలు నిర్వహించారు. హెచ్‌ఏఎల్ సమీపంలోని శాస్త్రినగర నివాసి సయ్యద్ బాధితుడు. వివరాలు.. బాధితుడు ఉద్యోగం కోసం గాలిస్తుండగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఓ వ్యక్తి ఫోన్ చేసి ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ చేశాడు. హెచ్‌ఎస్ఆర్.లేఔట్‌లో ఉన్న హోటల్‌లో మరోసారి ఇంటర్వ్యూ నిర్వహించారు. అక్కడ ఆధార్, పాన్‌కార్డు ప్రతులు తీసుకుని కొన్ని బ్యాంకు పత్రాలపై సంతకం తీసుకున్నారు. తరువాత సయ్యద్‌కు ఎలాంటి ఉద్యోగం ఇవ్వలేదు, కానీ అతని ఖాతాకు నెలకు రూ.3 వేలు చొప్పున జమచేశారు. మరోవైపు నగరంలోని వివిధ బ్యాంకుల్లో అతని ఆధార్, పాన్‌ను ఉపయోగించి ఖాతాలు తెరిచి కోట్లాది రూపాయలు వ్యవహారాలు నిర్వహించారు. ప్రతి బ్యాంకులో ఓ నకిలీ కంపెనీ పేరుతో ఖాతా తెరిచారు. ఇటీవల సయ్యద్‌కు అనుమానం వచ్చి తనిఖీ చేయగా నకిలీ ఖాతాలు బయటపడ్డాయి. దీంతో సైబర్‌క్రైం పోలీసులకు ఫిర్యాదు చేయగా విచారణ చేపట్టారు. సైబర్ నేరగాళ్లే ఈ పనికి పాల్పడి ఉంటారని అనుమానాలున్నాయి.

ఆస్తులు అమ్మి షేర్లలో పెట్టుబడి...

ట్రేడింగ్ వ్యవహారాల్లో పెట్టుబడిపెడితే అధిక లాభాలు వస్తాయని ఆశచూపించి ఓ వ్యక్తికి రూ.1.52 కోట్లు మోసగించారు సైబర్ వంచకులు. యలహంకవాసి వెంకటాచలపతి సైబర్‌క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎమిలాసింగ్, పంకజ్ అనేవారిపై కేసు నమోదు చేశారు. వెంకటాచలపతికి స్టాక్‌మార్కెట్ గురించి శిక్షణ ఇస్తామని వాట్సాప్ గ్రూప్‌లోకి చేర్చుకున్నారు. ప్రతిరోజు గంటపాటు స్టాక్‌మార్కెట్ గురించి టిప్స్ పంపించేవారు. తరువాత ఓ నకిలీ యాప్ లింక్ పంపించి డౌన్‌లోడ్ చేయించి షేర్లు కొనుగోలు చేయాలని సలహా ఇచ్చారు. బాధితుని వద్ద డబ్బు లేకపోయినప్పటికీ తన ఇంటి పత్రాలు, బంగారు నగలు కుదువపెట్టి డబ్బు తెచ్చి పెట్టుబడిపెట్టాడు. ఏప్రిల్ 18 నుంచి మే 23 తేదీ వరకు 15 బ్యాంకు అకౌంట్లకు రూ.1.52 కోట్లు నగదు జమచేశాడు. యాప్‌లో అతడికి లాభాలతో కలిసి రూ.28.67 కోట్లు బ్యాలెన్స్ ఉన్నట్లు చూపించారు. జూన్ 10వ తేదీన నగదు డ్రాచేయడానికి ఆయన ప్రయత్నించగా సాధ్యం కాలేదు. దీనిపై ప్రశ్నించగా రూ.75 లక్షలు జమచేస్తే రూ.28 కోట్లు విత్ డ్రా అవుతాయని సూచించారు. ఇక డబ్బు లేదనడంతో మోసగాళ్లు యాప్ పనిచేయకుండా చేసి ఫోన్లు స్విచాఫ్ చేసుకున్నారు. అటు ఆస్తులు పోయి, ఇటు వంచనకు గురై బాధితుడు లబోదిబోమన్నాడు.

మైసూరులో ఇద్దరికి రూ. 28 లక్షలు టోపీ

మైసూరు: ఎక్కువ లాభాల కోసం ఆశపడిన ఇద్దరు నకిలీ కంపెనీలో సుమారు రూ.28 లక్షలను పెట్టుబడి పెట్టి మోసపోయిన ఘటన ఇది. వివరాలు.. మైసూరులో బోగాది నివాసురాలైన ఓ మహిళకు టెలిగ్రాం ఐడీ ద్వారా కార్స్ 24 అనే కంపెనీలో పెట్టుబడి పెడితే ఎక్కువ లాభాలు వస్తాయనే మెసేజ్ వచ్చింది. అందులోని నంబరుకు ఫోన్ చేసిన ఆమె వంచకుని మాటలను నమ్మి దశల వారీగా రూ.17. 95 లక్షలను పెట్టుబడి పెట్టింది. తరువాత మోసగాని ఫోన్ స్విచాఫ్ అయ్యింది. మరో ఘటనలో అదే ప్రాంతానికి చెందిన మహేష్ అనే వ్యక్తికి ఆన్‌లైన్ ద్వారా పార్ట్‌టైం ఉద్యోగంలో చేరాడు. ఆ తర్వాత కంపెనీవారు అధిక లాభాల ఆశ చూపడంతో దశల వారీగా రూ.10.50 లక్షలను పెట్టుబడి పెట్టి మోసపోయాడు. ఈ ఘటనలపై సైబర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మాల్ రీ ఓపెన్

దొడ్డబళ్లాపురం: పంచె కట్టుకుని వచ్చిన వ్యక్తిని లోపలకు అనుమతించకుండా బయటకు పంపించి దేశ వ్యాప్తంగా చర్చకు కారణమైన బెంగళూరు మాగడి రోడ్డులోని జీటీ మాల్ రీ ఓపెన్ చేశారు. ఈ మాల్ యాజమాన్యం ఏకంగా రూ.1.78 కోట్ల ఆస్తి పన్ను బకాయి పడడంతో అధికారులు ఆరు రోజుల క్రితం మూసివేయించారు. పన్ను చెల్లించడంతో మాల్ మళ్లీ ఓపెన్ చేసినట్టు మాల్ యజమాని ఆనంద్ కుమారుడు ప్రశాంత్ తెలిపారు.

ప్రతిభా పురస్కారాలు ప్రదానం



ప్రతిభా పురస్కారాలను అందించిన దృశ్యం

మండ్య: వీరమడివాళ మాచిదేవ సౌహార్ద సహకార సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఐదో వార్షిక మహాసభ జరిగింది. ఈ సందర్భంగా 2023–24వ సంవత్సరంలో ఎస్ఎస్ఎల్‌సీ, పీయూసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల ప్రదానం చేశారు. కార్యక్రమాన్ని మైసూరు చక్కెర కర్మాగారం అధ్యక్షుడు సీడీ గంగాధర్ ప్రారంభించారు. సంఘం జిల్లాధ్యక్షుడు గురురాజ్, ప్రముఖులు ఆర్‌జీ ప్రకాష్, కే.రాజేశ్వరి, గురుప్రసాద్, చంద్రశేఖరయ్య, బలరాము, ఆశా తదితరులు పాల్గొన్నారు.

పట్టాలపై కూలిన చెట్టు.. రైలుకు తప్పిన ప్రమాదం

యశవంతపుర: లోకోపైలెట్ సమయస్ఫూర్తితో ముంబై–మంగళూరు మధ్య నడిచే మత్స్యగంధ ఎక్స్‌ప్రెస్ రైలుకు పెద్ద ప్రమాదం తప్పింది. అంకోలా రైలు మార్గం బారకూరు వద్ద బుధవారం ఉదయం 9.18 గంటలకు మణిపాల్ పెరంపల్లి వద్ద పట్టాలపై పెద్ద చెట్టు కూలింది. అదే సమయంలో మత్స్యగంధ ఎక్స్‌ప్రెస్ రాగా పట్టాలపై చెట్టు కూలిన విషయాన్ని లోకో పైలట్ గుర్తించి బ్రేక్ వేసి రైలు నిలిపివేసినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. ఓహెచ్ఇ బృందం రక్షణం రంగంలోకి దిగి పట్టాలపై పడిన చెట్టును తొలగించారు.

యువకుడి ఆత్మహత్య



సుశాంత్(ఫైల్)

యశవంతపుర: యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్న ఘటన దక్షిణకన్నడ జిల్లా విట్ల తాలూకా మాణి సమీపంలోని బుడోలి మడలో జరిగింది. బుడోలి మడలకు చెందిన సుశాంత్(25) ఇటీవల మినీ బస్సు కొనుగోలు చేసి ఉపాధి పొందుతున్నాడు. బస్సు ద్వారా వచ్చే ఆదాయంతో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించేవాడు. ఏ కారణం చేతనో ఇంటిలోనే ఉరివేసుకొని మృతి చెందాడు. విట్ల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

డోలిలో ఆస్పత్రికి తరలింపు



వృద్ధురాలిని డోలిలో తరలిస్తున్న దృశ్యం

యశవంతపుర: ఓ ప్రమాదంలో గాయపడిన వృద్ధురాలిని డోలిలో ఆస్పత్రికి తరలించారు. ఈఘటన చిక్కమగళూరు జిల్లాలో జరిగింది. కొద్ది రోజులుగా భారీ వానలు కురుస్తుండటంతో కళస తాలూకా కాల్నే గ్రామంలో చెట్టు విరిగి ఇంటిపై పడింది. ఘటనలో బెల్లమ్మ అనే వృద్ధురాలు గాయపడింది. గ్రామానికి రోడ్డు మార్గంలేని కారణంగా ఎలాంటి వాహనాలు వచ్చే అవకాశం లేదు. దీంతో డోలిలో ఆమెను ఉంచి వాగులు, వంకలు దాటుతూ అతి కష్టం మీద కళస ఆస్పత్రికి తరలించారు. రోడ్డు నిర్మించాలని ఎంతో కాలంగా కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు వాపోయారు. వర్షాకాలంలో నదిని దాటి వెళ్లాల్సి ఉంటోందని, ఎవరికైనా అత్యవసర వైద్యం అవసరమైతే ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు డోలిని ఆశ్రయిస్తున్నట్లు తెలిపారు.

పరిషత్ ప్రతిపక్ష నాయకుడిగా నారాయణస్వామి



చలవాది నారాయణస్వామి

శివాజీనగర: విధానపరిషత్ ప్రతిపక్ష నాయకుడిగా చలవాది నారాయణస్వామి పేరును సభాపతి బసవరాజ హొరట్టి అధికారికంగా శాసనమండలిలో ప్రకటించారు. దీంతో బీజేపీ, జేడీఎస్ సభ్యులు ఆయనను తీసుకొచ్చి ప్రతిపక్ష నాయకుడి స్థానంలో కూర్చొపెట్టారు. ఆ తరువాత చవాది నారాయణస్వామికి మంత్రులు కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్ సభ్యులు అభినందనలు తెలిపారు. ఉపసభాపతి ఎం.కే.ప్రాణేశ్ మాట్లాడుతూ ప్రతి సముదాయానికీ సామాజిక న్యాయం లభించాలనేది రాజ్యాంగ ఆశయమన్నారు. మంత్రి కృష్ణభైరేగౌడ మాట్లాడుతూ ప్రభుత్వం తప్పులు చేస్తే చెవులు పిండి హెచ్చరించే పని ప్రతిపక్ష నాయకులది అని అన్నారు. సభా నాయకుడు బోసురాజు మాట్లాడుతూ నారాయణస్వామి పోరాట నేపథ్యంలో వచ్చి ప్రతిపక్ష స్థానంలో కూర్చున్నారని, ఇందులో విజయవంతంగా కొనసాగాలని ఆశించారు. బీ.కే.హరిప్రసాద్, సీ.టీ.రవి, శశిల్ నమోశి, ఉమాశ్రీ, సలీం అహమ్మద్, సంకనూరు,శరవణ మాట్లాడారు.

రేపటి నుంచి రాష్ట్ర స్థాయి వైద్య సమ్మేళనం



మాట్లాడుతున్న డాక్టర్ శివకుమార్

మండ్య: ఆదిచుంచనగిరి విశ్వవిద్యాలయం, మండ్య వైద్య విజ్ఞాన సంస్థ(మిమ్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 26, 27, 28 తేదీల్లో మిమ్స్ ఆవరణలో అసోసియేషన్ ఆఫ్ ఫిజిషియన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో 41వ రాష్ట్ర స్థాయి ఫిజిషియన్ వైద్యుల సమ్మేళనం(కేఏజీఐసీఓఎన్)–2024ను ఏర్పాటు చేసినట్లు జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ కేఎం శివకుమార్ తెలిపారు. ఇండియన్ కాలేజీ డీన్ డాక్టర్ నరసింహులు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కేఏజీఐసీఓఎన్ అధ్యక్షుడు డాక్టర్ బీ.వీ.మురళీమోహన్ అధ్యక్షత వహిస్తారని తెలిపారు. 26వ తేదీ సాయంత్రం 6.15 గంటలకు ఆదిచుంచనగిరి పీఠాధ్యక్షుడు నిర్మలానందనాథ స్వామీజీ సాన్నిధ్యంలో జరిగే కార్యక్రమంలో ఏపీఐ జాతీయ అధ్యక్షురాలు జ్యోతిర్మయి ముఖ్య అతిథిగా పాల్గొంటారు. ఆదిచుంచనగిరి వర్సిటీ చాన్స్‌లర్ డాక్టర్ ఎంఏ శేఖర్ గౌరవ అతిథిగా పాల్గొంటారు.

27న మెగా జాబ్ మేళా



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

కృష్ణరాజపురం: మహదేవపుర నియోజకవర్గంలోని చెన్నసంద్ర ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈనెల 27న మెగా జాబ్ మేళా ఏర్పాటు చేసినట్లు బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి తెలిపారు. మారతహళ్లిలోని పార్టీ కార్యాలయంలో ఆయన బుధవారం మేళా కరపత్రాలు విడుదల చేసి విలేకరులతో మాట్లాడారు. సుమారు 50కి పైగా వివిధ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయన్నారు. 7వ తరగతి నుంచి డిగ్రీ తదితర ఉన్నత విద్యాభ్యాసం చేసిన నిరుద్యోగులు హాజరు కావచ్చన్నారు. ఎంపికైన నిరుద్యోగులకు అక్కడికక్కడే ఆఫర్ లెటర్ అందజేస్తారన్నారు. మేళాకు హాజరైన వారికి వాహన, భోజన వ్యవస్థ కల్పించినట్లు తెలిపారు.

పోక్సో చట్టం కింద అర్చకుడి అరెస్ట్

యశవంతపుర: బాలికపై లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన అర్చకుడు కటకటాల పాలయ్యాడు. 34 సంవత్సరాల వయసున్న సదరు అర్చకుడు గత ఆదివారం 7 సంవత్సరాల బాలికపై లైంగిక దౌర్జన్యం చేశాడు. బాధిత బాలిక ఈ విషయాన్ని తల్లికి తెలియజేసింది. దీంతో విద్యారణ్యపుర పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు అర్చకుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు.

26 నుంచి బాలసుబ్రహ్మణ్య స్వామికి పూజలు

మండ్య: నగరంలోని రైల్వే స్టేషన్ ఎదురుగా ఉన్న బాలసుబ్రహ్మణేశ్వర ఆలయంలో ఈనెల 30న స్వామివారికి పూజా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శంకర్ తెలిపారు. 26న మహాగణపతి పూజ, మారెమ్మ దేవతకు పంచామృత అభిషేకం, చండికా హోమం, పూర్ణాహుతి, మహామంగళ హారతి కార్యక్రమాలు ఉంటాయన్నారు. 27న రాత్రి 8 గంటల వరకు దుర్గా హోమం, 28న రాత్రి నవగ్రహ హోమం, మృత్యుంజయ హోమం నిర్వహిస్తారని తెలిపారు. 29న సాయంత్రం 7 గంటలకు స్కంధ హోమం, 30న ఫలపంచామృతాభిషేక సహిత మహాపూజ, అనంతరం ప్రసాద వితరణ జరుగుతాయని తెలిపారు. ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు. దేవస్థాన సమితి కణివేలు, ఆర్ముగం తదితరులు పాల్గొన్నారు.

మేకను బలితీసుకున్న చిరుత

దొడ్డబళ్లాపురం: దొడ్డబళ్లాపురం తాలూకాలోని గుండప్పనాయకనహళ్లి గ్రామంలో చిరుత సంచరిస్తోంది. బుధవారం మధ్యాహ్నం దేవరాజు అనే వ్యక్తి గ్రామ శివారులో మేకలను మేపుతుండగా హఠాత్తుగా చిరుత దాడిచేసి మందలోని మేకను బలితీసుకుంది. దేవరాజు కేకలు వేయడంతో చిరుత పరారైంది. ఈ విషయం తెలిసి గ్రామస్తులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. అటవీశాఖ అధకారులు బోను ఏర్పాటు చేసి చిరుతను బంధించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

కేఎం దొడ్డి తాలూకా ఏర్పాటు ప్రతిపాదన లేదు

- మంత్రి కృష్ణబేరేగౌడ

మండ్య: జిల్లాలోని మద్దూరు తాలూకా భారతీనగర(కేఎం దొడ్డి)ను తాలూకా కేంద్రంగా రూపొందించే విషయంపై మండ్య జిల్లాధికారి నుంచి ఎలాంటి ప్రతిపాదన అందలేదని రాష్ట్ర రెవెన్యూ శాఖా మంత్రి కృష్ణబేరేగౌడ పేర్కొన్నారు. జనాభా, విద్య, వాణిజ్య అవసరాల దృష్ట్యా శరవేగంగా అభివృద్ధి చెందుతున్న భారతీనగరను తాలూకా కేంద్రంగా చేయాలనే అంశాన్ని కాంగ్రెస్ ఎమ్మెల్యే మధు బీ.మాదేగౌడ విధాన పరిషత్‌లో లేవనెత్తారు. దీనికి మంత్రి బదులిస్తూ కొత్త జిల్లాలు, తాలూకాలను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి పలు ప్రతిపాదనలు, విజ్ఞప్తులు అందాయన్నారు. ఈ విషయాన్ని నియమాల ప్రకారం పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత జిల్లాధికారులకు ఇప్పటికే లేఖ రాశామన్నారు.

చెట్టు కూలి యువకుడి మృతి

యశవంతపుర: చెట్టు కూలి యువకుడు మృతి చెందిన ఘటన ఉత్తరకన్నడ జిల్లా యల్లాపుర–శిరసి రోడ్డు చాచనళ్లి గ్రామంలో జరిగింది. యల్లాపుర హసణగి పంచాయతీ వ్యాప్తిలోని కబ్బినగద్దెకి చెందిన వినయ్(25) యల్లాపురం నుంచి మంచికేరికి స్కూటర్‌పై వెళ్తుండగా చెట్టు కూలింది. వినయ్ అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కూలిన చెట్టును తొలగించి ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు తీసుకున్నారు. ఘటనపై యల్లాపుర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

జరిమానా తప్పించుకునేందుకు మాజీ ఎంపీ దొడ్డిదారి

- ముడా అధ్యక్షుడు మరిగౌడ ఆరోపణ

మైసూరు: మైసూరు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ముడా) నుంచి పొందిన స్థలంపై 25 శాతం జరిమానా తప్పించుకోడానికి మాజీ ఎంపీ ప్రతాప్ సింహ దొడ్డిదారిని అనుసరించారని ముడా అధ్యక్షుడు కె.మరిగౌడ ఆరోపించారు. ఆయన బుధవారం నగరంలో విలేకరులతో మాట్లాడారు. ప్రతాప్‌సింహకు ఆయన భార్య పేరుపై జీ కేటగిరీలో సైటు వచ్చిందన్నారు. ఆ స్థలంలో ఇల్లు కట్టుకోవాలి, లేదా భూమి విలువలో 25 శాతం జరిమానా చెల్లించాలన్నారు. కానీ ప్రతాప్ సింహ ఇల్లు కట్టుకోకుండా షీట్లతో ఇల్లు నిర్మించినట్లు చూపించి జరిమానా నుంచి తప్పించుకున్నారన్నారు.

హోసూరు వార్తలు..

స్పీడ్ బ్రేకర్లను తొలగించాలి

హోసూరు: క్రిష్ణగిరి– బెంగళూరు జాతీయ రహదారిపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి, వెంటనే స్పీడ్‌బ్రేకర్లను తొలగించాలని బుధవారం సిటీ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన టౌన్ ప్లానింగ్ కమిటీ సమావేశంలో కమిటీ అధ్యక్షులు అశోక్‌రెడ్డి అధికారులను కోరారు. పట్టణంలో ఎక్కడ చూసినా గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి వాహనదారులు ఇరుక్కుపోతున్నారని, ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని కోరారు. గాంధీ రోడ్డులో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద నిత్యం రద్దీగానే ఉంటుందని, అక్కడ సౌకర్యాలు కల్పించాలని తెలిపారు.

చికెన్ పకోడాకు డబ్బులడిగారని దాడి

హోసూరు: చికెన్ పకోడా దుకాణంలో పార్శిల్ కట్టించుకొని వెళుతున్న వారిని డబ్బులడిగిన దుకాణ యాజమానిపై కారుతో దూసుకెళ్లి హత్యాప్రయత్నం చేశారు. వివరాల మేరకు పట్టణంలోని పార్వతీనగర్‌కి చెందిన రాజయోగం (54), రైల్వేస్టేషన్ రోడ్డులో చికెన్ పకోడా షాపు నిర్వహిస్తున్నాడు. మంగళవారం సాయంత్రం కారులో వెళ్లిన ఇద్దరు వ్యక్తులు చిల్లీ చికెన్ పార్శిల్ కట్టించుకొన్నారు. వారిని డబ్బులడగడంతో మమ్మల్నే డబ్బులు అడుగుతావా? అని ఆవేశం చెంది కారుతో దుకాణంపై దూసుకెళ్లారు. దీంతో వేడి నూనె కళాయి ఎగిరి రాజయోగం, అతని భార్య విజయ(48)లపై వేడినూనె పడి తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు గాయపడిన దంపతులను చికిత్స కోసం హోసూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజయోగంను మెరుగైన చికిత్స కోసం క్రిష్ణగిరి ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసుకొని శానసంద్రం ప్రాంతానికి చెందిన నిందితులు జాయ్స్ ఆల్బర్ట్ (28), కార్మేఘం (38) ను అరెస్ట్ చేశారు.

భర్త చేతిలో రెండో భార్య హతం

క్రిష్ణగిరి: రెండవ భార్య.. భర్త చేతిలో ప్రాణాలు కోల్పోయిన ఘటన పోచ్చంపల్లి పరిధిలో చోటు చేసుకొంది. వివరాల మేరకు క్రిష్ణగిరి జిల్లా పోచ్చంపల్లి సమీపంలోని కొడమాండపట్టి గ్రామానికి చెందిన వేలాయుధం బెంగళూరులో కూలిపనులు చేస్తున్నాడు. ఇతనికి మత్తూరుకు చెందిన సేటమ్మతో గత ఎనిమిదేళ్ల క్రితం పెళ్లి జరిగింది. గొడవలొచ్చి వారు విడిపోయారు. ఆరేళ్ల కిందట వేలాయుధం దిబ్బనూరు గ్రామానికి చెందిన సుధారాణిని రెండవ పెళ్లి చేసుకొన్నాడు. వీరికి ఇద్దరు పిల్లలున్నారు. ఈ నేపథ్యంలో మొదటి భార్య సేటమ్మ తనతో కాపురం చేయాలని భర్తను ఒత్తిడి చేయడంతో కుటుంబంలో కలహాలు జరుగుతున్నాయి. మంగళవారం ఇదే విషయమై గొడవ జరిగి వేలాయుధం రెండవ భార్య సుధారాణిపై దాడి చేయగా ఆమె మరణించింది. పోచ్చంపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టి వేలాయుధంని అరెస్ట్ చేశారు.

వేడుకగా మారియమ్మ జాతర



జాతరలో పాల్గొన్న భక్తుల కోలాహలం

కెలమంగలం: గ్రామదేవత మారియమ్మ జాతరతో బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు డెంకణీకోట పట్టణంలో వైభవంగా జరిగింది. డెంకణీకోట సంత మైదానంలో నెలకొన్న గ్రామదేవత మారియమ్మ జాతరను ప్రతి సంవత్సరం ఘనంగా జరుపుకొంటున్నారు. ఈ సందర్భంగా దేవరాజ్ చెరువులో గంగపూజ నిర్వహించారు. అగ్నిగుండ మహోత్సవంలో భక్తులు నిప్పుల్లో నడిచి భక్తిని చాటుకున్నారు. ఉదయం నుంచి శరీలాలకు శూలాలు గ్రుచ్చుకొని క్రేన్ వాహనాలపై వేలాడుతూ పట్టణంలోని పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. పెద్ద ఎత్తున మహిళలు పాలకుండలు, పూలకరగాలతో ఆలయం వద్దకు ఊరేగింపుగా వెళ్లారు. డెంకణీకోట, చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొన్నారు.

మేయర్ తనిఖీలు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ మేయర్ ఎస్.ఏ.సత్య ఎస్‌బీఎం కాలనీలో కొత్తగా నిర్మిస్తున్న ప్రాథమిక ఆరోగ్య కేంద్ర నిర్మాణాన్ని పరిశీలించారు. ఆనందనగర్, అందివాడి తదితర ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అందివాడి సమీపంలో ఏర్పాటు చేసిన చెత్త విభజన కేంద్రాన్ని పరిశీలించి సేంద్రియ ఎరువుల తయారీ, ప్లాస్టిక్ వ్యర్థాల సేకరణను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ప్రజలు పలు సమస్యలపై ఫిర్యాదు చేశారు. డిప్యూటీ మేయర్ ఆనందయ్య, పారిశుధ్య శాఖాధికారి ప్రభాకరన్, రవి, కార్పొరేటర్ చెన్నీరప్ప పాల్గొన్నారు.

పథకాలను పూర్తిచేయాలి

హోసూరు: తమిళనాడు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథక పనులను జిల్లా పరిశీలకురాలు బీలా వెంకటేష్ బుధవారం వెళ్లి పరిశీలించారు. కలెక్టర్ శరయుతో కలిసి బర్గూరు సమితి పులియంబట్టి గ్రామంలో ప్రజలతో మాట్లాడారు. క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో అన్ని శాఖల అధికార్లతో సమావేశమయ్యారు. జిల్లాలో జరుగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేసి త్వరగా ముగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌వో సాధన కురల్, అదనపు కలెక్టర్ వందనా కార్గ్, హోసూరు కమిషనర్ స్నేహ, జిల్లా అటవీ శాఖాధికారిణి కార్తికేయిని పాల్గొన్నారు.

బసవణ్ణ తత్వాలతో సమాజంలో మార్పు

- సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: ఎప్పటి వరకు మూఢ నమ్మకాలు ఉంటాయో అంతవరకు సామాజిక న్యాయం తీసుకొచ్చేందుకు సాధ్యపడదని ముఖ్యమంత్రి సిద్దరామయ్య తెలిపారు. సభాపతి బసరాజ హొరట్టి బుధవారం తన చాంబర్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం పాల్గొని విధానపరిషత్ సభ్యులకు జగజ్యోతి బసవణ్ణ అనుభవ మంటపం ఫొటో అందజేశారు. సీఎం మాట్లాడుతూ 850 సంవత్సరాల క్రితమే బసవాది శరణులు అనుభవ మంటపం చేసి సమాజంలో అనేక సమస్యలపై చర్చలు జరిపేవారన్నారు. అప్పటి సామాజిక సమస్యలకు అనుభవ మంటపంలో పరిష్కారం చూపేవారన్నారు. బసవణ్ణ ఆశయాల సాధనకు అనుభవ మంటపం నిర్మిస్తున్నామన్నారు. యడ్యూరప్ప హయాంలో నిధులు ఇవ్వలేదని, తమ ప్రభుత్వం అవసరమైన నిధులు ఇచ్చేందుకు సిద్ధంగా ఉందన్నారు. బసవణ్ణ ఫొటోలను అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ విద్యా సంస్థల్లో ఏర్పాటు చేయాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు బసవణ్ణ తత్వాలను అలవరచుకోవాలన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే ఎస్.ఆర్.విశ్వనాథ్ దంపతులు

బనశంకరి: యలహంక శాసనసభ్యుడు ఎస్ఆర్.విశ్వనాథ్ పుట్టినరోజు వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. రమాడా రిసార్ట్స్‌లో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో 1015 కిలోల కేక్‌ను ఎమ్మెల్యే ఎస్ఆర్.విశ్వనాథ్ దంపతులు కట్‌చేశారు. పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు, అభిమానులు తరలివచ్చి ఎమ్మెల్యేకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.నియోజకవర్గంలో పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు.



టీడీపీ అరాచకాలపై ఫొటో ఎగ్జిబిషన్

ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్సార్‌సీపీ శ్రేణులపై టీడీపీ నేతలు చేసిన దాడులు, హత్యలకు సంబంధించి ఢిల్లీలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్
















శివసేన (యూబీటీ) ఎంపీ సంజయ్ రౌత్‌కు టీడీపీ దాడుల గురించి వివరిస్తున్న మాజీ సీఎం వైఎస్ జగన్



ఏఐఏడీఎంకే ఎంపీలు తంబిదురై, ఎన్.చంద్రశేఖరన్, శివసేన (యూబీటీ) ఎంపీ అరవింద్ సావంత్‌కు టీడీపీ దాడుల చిత్రాలను చూపుతున్న వైఎస్ జగన్



టీడీపీ నేతల దాడులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను రాజ్యసభ ఎంపీ పరిమళ్ నత్వానీతో కలిసి చూస్తున్న వైఎస్ జగన్



టీడీపీ నేతల దాడులకు సంబంధించి ఏర్పాటు చేసిన ఫొటోలను ఆప్, వీసీకే తదితర పార్టీల నేతలతో కలిసి చూస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్‌కు టీడీపీ అరాచకాలను గురించి వివరిస్తున్న వైఎస్ జగన్



రాజ్యసభ ఎంపీ పరిమళ్ నత్వానీతో కలిసి టీడీపీ దాడుల ఫొటోలను చూస్తున్న వైఎస్ జగన్

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాస్వామ్యంపైనే దాడి

- అది యావత్ దేశ ప్రజలకు తెలియజేయాలనే ఢిల్లీలో ధర్నా
- మా నిరసనకు మద్దతిచ్చిన వారందరికీ ధన్యవాదాలు
- ఎక్స్ వేదికగా వైఎస్ జగన్ పోస్ట్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ ఎన్నికల తర్వాత జరుగున్న దాడులు, ఆస్తుల విధ్వంసం, హత్యలు, హత్యాచారాలు.. ఒక్క వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీపై దాడి మాత్రమే కాదని, అవి ముమ్మాటికీ ప్రజాస్వామ్యంపై దాడి అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ప్రజాస్వామ్య స్ఫూర్తికి, చట్టం ముందు అందరూ సమానులే అన్న స్ఫూర్తికీ విఘాతం కలుగుతున్న నేపథ్యంలో యావత్ దేశ ప్రజలందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే ఢిల్లీలో నిరసన కార్యక్రమం చేపట్టామని స్పష్టం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విటర్)లో పోస్ట్ చేశారు. అందులోని వివరాలు ఇలా ఉన్నాయి.

- రాష్ట్రంలో టీడీపీ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి అరాచక, ఆటవిక పాలన కొనసాగుతోంది. అంతులేని దారుణాలు జరుగుతున్నాయి. శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయి. యథేచ్ఛగా హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసం, వైఎస్సార్‌సీపీని అణగదొక్కడమే ప్రభుత్వ లక్ష్యం అయింది. అందుకే హత్యలు, దాడులు, అకృత్యాలను ప్రభుత్వం దగ్గరుండి ప్రోత్సహిస్తోంది.
- రాష్ట్రంలో ఇప్పుడు అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగం కాకుండా, లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలవుతోంది. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఇలాంటి వేమీ జరగలేదు. విధ్వంసాన్ని ప్రశ్నించకపోతే, వాటన్నింటినీ వెంటనే ఆపలేకపోతే, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకోలేం.
- ఇన్ని జరుగుతున్నా పోలీసులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఆ విధంగా రాజ్యాంగ వ్యవస్థను కూడా నిర్వీర్యం చేశారు. ప్రజల మానవ హక్కులను తిరస్కరించడం అంటే వారి మానవత్వాన్ని సవాలు చేయడమే అని నెల్సన్ మండేలా చెప్పినట్లు.. రాష్ట్రంలో దారుణ పరిస్థితి నెలకొంది. రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని కాపాడడంలో అండగా నిలవండి.

మీ సంఘీభావం ప్రజాస్వామ్యాన్ని నిలబెడుతుంది

టీడీపీ నేతృత్వంలోని ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌లో సాగిస్తున్న హింస, అన్యాయం, నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద బుధవారం వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ధర్నాకు అనేక పార్టీలు, పలువురు ఎంపీలు సంఘీభావం తెలిపారు. వారందరికీ ధన్యవాదాలు. సమాజ్‌వాది పార్టీ, ఆమ్ ఆద్మీ పార్టీ, ఏఐఏడీఎంకే, శివసేన, ఏఐటీసీ, వీసీకే, ఐయూఎంఎల్, ఎంపీలు అఖిలేష్ యాదవ్, ప్రియాంక చతుర్వేది, పీవీ అబ్దుల్ వాహెబ్, ప్రొఫెసర్ రాంగోపాల్ యాదవ్, తంబిదురై, ఎండీ నదిముల్ హక్యూ, అరవింద్ సావంత్, తిరుమవలన్‌లు అందించిన మద్దతు కేవలం ఆంధ్రప్రదేశ్‌కే కాకుండా యావత్తు దేశానికి.. ప్రజాస్వామ్యం, సమానత్వం, న్యాయాన్ని నిలబెట్టడంలో సహాయపడుతుంది.

– వైఎస్ జగన్

ధర్నా సైడ్‌లైట్స్

- వైఎస్సార్‌సీపీ శ్రేణుల జై జగన్ నినాదాలతో హస్తిన మార్మోగింది. జంతర్ మంతర్ రూట్‌లో వైఎస్ జగన్ వస్తున్న కారు కనిపించిన వెంటనే ప్రారంభమైన 'జై జగన్' నినాదాలు మీడియాతో మాట్లాడుతున్నంత సేపూ కొనసాగాయి. జగన్ కారు దిగి మీడియా పాయింట్ వద్దకు వచ్చేందుకు అభిమానులు, కార్యకర్తల తోపులాట మధ్య దాదాపు 15 నిమిషాల సమయం పట్టింది.
- ఫొటో ఎగ్జిబిషన్ తిలకిస్తున్న వైఎస్ జగన్‌ను కార్యకర్తలు, నాయకులు చుట్టుముట్టారు. 'జగనన్నా హౌ ఆర్‌యూ, అన్నా నా వైపు ఒకసారి చూడన్నా, జగనన్నా నీకు పెద్ద ఫ్యాన్‌ని..' అంటూ కార్యకర్తలు తమ అభిమాన నాయకుడి కరచాలనం కోసం ఎగబడ్డారు.
- వైఎస్ జగన్ సభా వేదికపైకి రాగానే ఫొటో ఎగ్జిబిషన్ వద్దకు ఏర్పాటు చేసిన దారి అంతా జనంతో కిక్కిరిసిపోయింది. వారిని ఎలా కంట్రోల్ చేయాలో తెలియక నేతలు ఆందోళనకు గురయ్యారు. అది గమనించిన వైఎస్ జగన్.. మైక్ తీసుకుని 'అన్నా.. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు మీరంతా దారి ఇవ్వాలి. మనం ఇక్కడకు వచ్చింది ఏపీలో జరుగుతోన్న దమనకాండను దేశ ప్రజలకు, నేతలకు చూపించేందుకు. అక్కడ దారిలేకపోతే ఇబ్బంది అవుతుంది కదా.. సహకరించాలి.. ప్లీజ్' అని చెప్పగానే కార్యకర్తలు క్షణాల్లో అక్కడి నుంచి వేదిక వద్ద ఏర్పాటు చేసిన కుర్చీల్లోకి వచ్చి కూర్చున్నారు.
- 'మీ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకంతా నా సెల్యూట్' అంటూ అఖిలేశ్ యాదవ్ జగన్‌తో అన్నారు. అఖిలేశ్ నోటి వెంట వచ్చిన ఆ మాటతో జై జగన్, జై అఖిలేష్ అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు.
- 'రాబోయే రోజుల్లో వైఎస్ జగన్ ప్రధాని అవుతారు' అంటూ అబ్దుల్ వాహెబ్ తన ప్రసంగంలో అన్నారు. ఆ ఒక్క మాటకు ఐదు నిమిషాల పాటు కార్యకర్తల నినాదాలతో జంతర్ మంతర్ దద్దరిల్లింది. ఎప్పుడు నినాదాలు ఆపుతారా అంటూ వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది.
- వైఎస్ జగన్‌ను కలిసేందుకు, ఫొటో దిగేందుకు వేదికపైకి వందలాది మంది ఎక్కారు. ఒక్క సెల్ఫీ అన్నా అంటూ రిక్వెస్ట్ చేశారు. ఇది గమనించిన వైఎస్ జగన్.. ఇక్కడికి వచ్చే ప్రముఖులకు ఇబ్బంది కలగకూడదంటూ అంతకంటే ఎక్కువ రిక్వెస్ట్‌తో వాళ్లు స్టేజ్ కిందకు వెళ్లేలా చూశారు.
- 'ఏం విక్టర్ బాగున్నావా' అంటూ మాజీ ఎంఎంసీ చైర్మన్(గుడివాడ) మట్టా జాన్ విక్టర్‌ను వైఎస్ జగన్ పలకరించారు. అంతమందిలో పేరు పెట్టి మరీ పిలవడంతో జగనన్నకు కార్యకర్తలంటే ఎంత ప్రేమ, ఆప్యాయత అంటూ అక్కడున్న వారంతా సంతోషంతో ఉబ్బిపోయారు. విక్టర్ పది నిమిషాల పాటు ఆశ్చర్యంతో ఆ సంతోషం నుంచి తేరుకోలేదు.
- 'అప్పుడెప్పుడో చూశాం జగన్‌ని. మళ్లీ ఇప్పుడు ఢిల్లీకి వచ్చారా? ఏక్ బార్ దేఖ్నాహే..' అంటూ ఉత్తరాది ప్రజలు క్యూ కట్టారు.
- మహిళా కార్యకర్తలు వైఎస్ జగన్‌ను తమ సెల్‌ఫోన్‌లలో చిత్రీకరించి వాట్సాప్ గ్రూపుల్లో షేర్ చేస్తూ కనిపించారు.

– సాక్షి, న్యూఢిల్లీ



దమనకాండకు ఇవిగో సాక్ష్యాలు

ఏపీలో కూటమి ప్రభుత్వ అరాచకాలను కళ్లకు కట్టిన ఫొటో ఎగ్జిబిషన్.. ● దమనకాండ గురించి వివరిస్తూ వైఎస్ జగన్ భావోద్వేగం

ఫొటో ఎగ్జిబిషన్‌పై జాతీయ మీడియా ప్రత్యేక కథనాలు.. ఏపీలో ఏం జరుగుతోందని ఉత్తరాది ప్రజల్లో చర్చ

సాక్షి, న్యూఢిల్లీ: '50 రోజుల్లో 36 హత్యలు, నలుగురిపై అత్యాచారాలు.. ఆపై హత్యలు, 16 అత్యాచారాలు, వెయ్యికి పైగా దాడులు, వందల్లో విధ్వంసాలు' ..ఇదీ టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్రంలో జరుగుతున్న దమనకాండ అని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నారు. ఏపీలో జరిగిన హత్యలు, అత్యాచారాలు, హత్యాయత్నాలు, ఆస్తుల విధ్వంసాన్ని దేశ ప్రజలకు, జాతీయ మీడియాకు తెలిపేందుకు జంతర్ మంతర్ వద్ద కళ్లకు కట్టినట్లుగా ఫొటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. తొలుత మీడియాతో మాట్లాడిన వైఎస్ జగన్.. ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తూ వేదిక వద్దకు చేరుకున్నారు. దాదాపు 15 నిమిషాల పాటు ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఒక్కో ఫొటోను వీక్షిస్తున్న సందర్భంలో ఆ ఘటనలను గుర్తు చేసుకుంటూ వైఎస్ జగన్ భావోద్వేగానికి గురయ్యారు. జాతీయ మీడియాకు ఒక్కో సంఘటన గురించి వివరిస్తూ వేదికపైకి వచ్చారు.



శివసేన (యూబీటీ), తృణమూల్ కాంగ్రెస్, ఎస్పీ ఎంపీలు ప్రియాంక చతుర్వేది, నదీముల్ హక్, రాంగోపాల్ యాదవ్‌లతో కలిసి టీడీపీ దాడుల దృశ్యాలను తిలకిస్తున్న వైఎస్ జగన్

కంట తడి పెట్టించిన ఫొటోలు

జూలై 17న పల్నాడు జిల్లా వినుకొండలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను నడిరోడ్డుపై టీడీపీ గూండా జిలానీ నరికి చంపుతున్న దృశ్యాలతో ఫొటో ఎగ్జిబిషన్ మొదలైంది. నడిరోడ్డుపై వేటాడి మరీ నరుకుతున్న చిత్రాలు ప్రతి ఒక్కరినీ కంటతడి పెట్టించాయి. చిత్తూరు జిల్లా పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంటిపై దాడి దృశ్యాలు.. అదే సమయంలో రెడ్డప్పతో పాటు ఎంపీ, లోక్‌సభ ఫ్లోర్ లీడర్ మిథున్‌రెడ్డి ఉన్న ఆ ఇంటిపై టీడీపీ గూండాలు రాళ్లు రువ్వుతున్న చిత్రాలను కళ్లకు కట్టేట్టు ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా మంగళగిరిలో వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్త పాలేటి రాజ్‌కుమార్‌ను మోకాళ్లపై కూర్చోబెట్టి, మంత్రి లోకేశ్ బ్యానర్‌కు మొక్కిస్తూ, బలవంతంగా క్షమాపణలు చెప్పించిన చిత్రాలను ఏర్పాటు చేశారు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో టీడీపీ నేతలు ఇద్దరు మహిళల బట్టలను తొలగిస్తూ అరాచకానికి పాల్పడుతున్న ఫొటోలను అక్కడ ప్రదర్శించారు. ఈ ఘటన స్వయాన హోం మంత్రి నియోజకవర్గంలో జరిగిందని వివరించారు. గుంటూరు జిల్లాలోని వైఎస్సార్‌సీపీ కార్యాల యాన్ని ధ్వంసం చేస్తున్న, చిత్తూరు జిల్లా పుంగనూరులో టీడీపీ నేతలు బ్యాడ్మింటన్ స్టేడియాన్ని ధ్వంసం చేస్తున్న, ఇదే ప్రాంతంలోని వాటర్ ట్యాంకులను ధ్వంసం చేస్తున్న ఫొటోలను ప్రదర్శించారు. గుంటూరు జిల్లా తెనాలిలో వైఎస్సార్‌సీపీ నాయకుడు కాళిదాస వెంకట సత్యనారాయ ణను కత్తితో టీడీపీ గూండాలు పొడిచిన దృశ్యాలు, కడప జిల్లా పులివెందులలో వైఎస్సార్‌సీపీ కార్యకర్త అజయ్‌కుమార్ రెడ్డిపై బ్యాట్‌లతో దాడి చేసిన ఫొటోలను అమర్చారు. అనంతపురం జిల్లా ధర్మవరం మండలం కొత్తకోటలో చాకలి సూర్యనారా యణను హత్య చేస్తున్న దృశ్యాలు, తూర్పుగోదావరి జిల్లా అనపర్తిలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై జరిపిన దాడుల ఫొటోలను ఏర్పాటు చేశారు. ఇలా రాష్ట్రంలో జరిగిన హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు, ఆస్తుల విధ్వంసం వంటి ఫొటోలతో ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను తిలకించేందుకు ఉత్తరాది ప్రజలు క్యూకట్టారు.

సోషల్ మీడియాలో వైరల్

వేదికకు రెండు వైపులా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌పై జాతీయ మీడియా దృష్టి సారించింది. రెండు వైపులా ప్రతి ఒక్క ఫొటోను తమ తమ కెమెరాల్లో బంధించారు. జర్నలిస్టులు ఆ ఫొటోలను విశ్లేషిస్తూ లైవ్ రిపోర్టింగ్ చేశారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఫొటో ఎగ్జిబిషన్‌పై జాతీయ మీడియాలో భిన్నమైన కథనాలు ప్రసారమయ్యాయి. దేశ ప్రజలంతా ఏపీలో జరుగుతోన్న దమనకాండపై చర్చించుకునేలా జాతీయ మీడియా ఫోకస్ చేయడం విశేషం. కాగా, వైఎస్ జగన్ చేపట్టిన ధర్నా, ఫొటో ఎగ్జిబిషన్‌కు సమాజ్‌వాది పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్, ఎంపీ ప్రియాంక చతుర్వేది, శివసేన (ఉద్ధవ్) ఎంపీలు అరవింద్ సావంత్, సంజయ్ రౌత్, ఐయూఎంఎల్ ఎంపీ అబ్దుల్ వాహబ్, హ్యారిస్ బీరన్, ఏఐఏడీఎంకే ఎంపీ నటరాజన్ చంద్రశేఖరన్, ఎస్పీ నేత రాం గోపాల్ యాదవ్, టీఎంసీ ఎంపీ నదీముల్ హక్, వీసీకే పార్టీ అధినేత తిరుమావలన్, ఆప్ ఎమ్మెల్యే రాజేంద్రపాల్ గౌతమ్‌లు విచ్చేసి మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఈ నేతల వెంట వచ్చిన వందలాది మంది నేతలు, కార్యకర్తలు దమనకాండపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను క్షుణ్ణంగా తిలకించారు. వాటిని ఫొటోలు తీసి సోషల్ మీడియా గ్రూపుల్లో షేర్ చేయడం విశేషం. దీంతో ఏపీలో ఏం జరుగుతోందని ఉత్తరాది ప్రజల్లో చర్చ మొదలైంది. కొన్ని ఫొటోల గురించి అక్కడున్న వైఎస్సార్‌సీపీ నేతలను అడిగి మరీ తెలుసుకున్నారు. ఇటువంటి దాడులు భవిష్యత్‌లో ఎక్కడా జరగకుండా వైఎస్ జగన్ ఢిల్లీలో ధర్నా చేపట్టడం హర్షించదగ్గ విషయమని ఆయా పార్టీల నేతలు, ఉత్తరాది ప్రజలు వ్యాఖ్యానించారు.



కొత్త తరం నుంచి కొత్త ఆలోచనలు పుడతాయి. కొత్త సాహిత్యం వస్తుంది. కొత్త కథా వస్తువులు మిలమిలమని మెరుస్తాయి. అందుకే కథలు రాయాలనుకుంటున్న నేటి తరానికి వేదిక పరవాలనుకుంటోంది సాక్షి. 30 ఏళ్ల లోపు యువ రచయితల కోసం 'సాక్షి ఫన్‌డే'లో 'యువ కథ' శీర్షిక ప్రారంభించనుంది. 'సాక్షి ఫన్‌డే' మేగజీన్‌లో ఒకటి లేదా రెండు పేజీల నిడివి వచ్చేలా కథలు రాసి పంపండి. అవసరమైతే మార్పులు చేర్పులు చేసి ప్రచురిస్తాం. ఒక్క కథ జీవితాంతం మీకో మంచి సాంగత్యం కాగలదు. గుర్తింపు మార్గం ఇవ్వగలదు. ప్రయత్నించండి.

మా చిరునామా: యువ కథ, సాక్షి ఫన్ డే, సాక్షి, రోడ్ నం.1, బంజారాహిల్స్, హైదరాబాద్ –34.
ఈమెయిల్: funday.kathalu@gmail.com

అన్నం మహిత... చిన్నప్పుడు పెన్సిల్‌తో బొమ్మలు వేసింది. ఇప్పుడు పెన్సిల్ మీద గ్రంథాలు చెక్కుతోంది. మహనీయుల జీవిత చరిత్రలను పెన్సిల్ మీద రాస్తోంది. ఇప్పటి వరకు ఆమె రాసిన జీవిత చరిత్రలు, మహాగ్రంథాల జాబితా ఆమె వయసుకంటే పెద్దదిగా ఉంది. ఆంధ్రప్రదేశ్, బాపట్ల జిల్లా, కారంచేడు మండలం, స్వర్ణ గ్రామానికి చెందిన మహిత... తాను సాధన చేస్తున్న మైక్రో ఆర్ట్ గురించి 'సాక్షి ఫ్యామిలీ'తో పంచుకున్న వివరాలివి.



మహిత సూక్ష్మ లిఖిత




మహిత



"చిన్నప్పటి నుంచి బొమ్మలు వేయడం ఇష్టం. ఇంటర్ పూర్తయి డిగ్రీలో చేరినప్పుడు కోవిడ్ లాక్‌డౌన్ వచ్చింది. ఆ ఖాళీ టైమ్‌లో బియ్యం మీద వినాయకుడు, జాతీయ పతకాలను చెక్కాను. ఆ తర్వాత మినుములు, పెసలు, బొబ్బర్లు మీద బొమ్మలు చెక్కాను. వాటిని చూసి మా నాన్న మహాభారతం ట్రై చెయ్యి, నీ సాధనకు గుర్తింపు వస్తుందన్నారు. సంస్కృత భాషలో మహాభారతంలోని 700 శ్లోకాలను 810 పెన్సిళ్ల మీద చెక్కాను. మొత్తం అక్షరాలు 67, 230, పదాల్లో చెప్పాలంటే 7,238. కళను సాధన చేయడంలో ఉన్న గొప్పతనం ఏమిటంటే... ఒకటి పూర్తయిన తర్వాత మరొకటి చేయాలనిపిస్తుంది. మహాభారతం తర్వాత వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర, పుట్టపర్తి సాయిబాబా చరిత్ర, అనేకమంది ప్రముఖుల జీవితచరిత్రలను పెన్సిల్ ముక్కు మీద రాశాను. జాతిపిత మహాత్మాగాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్, అమరజీవి పొట్టి శ్రీరాములు, నెల్సన్‌మండేలా, ప్రధాని నరేంద్రమోదీ, స్వర్గీయ ఎన్‌టీఆర్, వైఎస్సార్, అంబేద్కర్, కరుణానిధి, కేసీఆర్, నరేంద్రమోదీ, ఎంఎస్‌రెడ్డితోపాటు ఏఎన్‌ఆర్ ఇంకా అనేక మంది సినీ ప్రముఖుల జీవితచరిత్రలను చెక్కాను. మన జాతీయగీతాన్ని పాస్తా మీద చెక్కాను. కర్ణాటక రాష్ట్ర అవతరణ చరిత్రను కూడా రాశాను. నా కళకు గుర్తింపుగా చీరాల రోటరీ క్లబ్‌తో మొదలు ఉత్తరప్రదేశ్ ఆర్ట్ కాంపిటీషన్ వరకు అనేక పురస్కారాలందుకున్నాను. ఈ కళాసాధనను కొనసాగిస్తాను'' అన్నారు అన్నం మహిత. సూక్ష్మ కళ ఆసక్తి కొద్దీ సాధన చేసే వాళ్లతోనే మనుగడ సాగిస్తోంది. ప్రభుత్వం నుంచి శిక్షణ అవకాశం లభిస్తే ఎక్కువ మంది కళాకారులు తయారవుతారని ఈ సందర్భంగా మహిత తన అభిలాషను వ్యక్తం చేశారు.

– వంగూరి సురేశ్‌కుమార్, సాక్షి, బాపట్ల జిల్లా





'మామ్'లా

తమిళనాడులోని కమలాహ్యారిస్ పూర్వీకుల గ్రామం తులసేంద్రపురంలో ఏర్పాటుచేసిన కమల పోస్టర్

కమలా హ్యారిస్

'లెట్స్ విన్ దిస్' ఇది కమలా హ్యారిస్ నినాదం. గెలిచే శక్తి... గెలవగలిగే శక్తి తాను కాగలనని హ్యారిస్ ఆత్మవిశ్వాసం. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో డెమొక్రటిక్ పార్టీ నుంచి అధ్యక్ష పదవి అభ్యర్థిగా జో బైడెన్ తప్పుకున్నాక ఇప్పుడు అమెరికాయే కాదు, ప్రపంచమంతా కమలా హ్యారిస్ వైపు చూస్తోంది. అధ్యక్ష పదవి అభ్యర్థిగా ఆమె ఎంపికైతే అది ఒక చరిత్రాత్మక సందర్భం... గెలిచి ప్రెసిడెంట్ అయితే చరిత్రే! భారతీయ మూలాల్లో తల్లి శక్తిస్వరూపిణి. స్త్రీ శక్తి స్వరూపిణి. స్త్రీగా... తల్లిగా... రాజకీయవేత్తగా కమలా హ్యారిస్ తన శక్తి ఏమిటో ఇప్పటికే నిరూపించారు. ఆమెలోని భారతీయత శక్తిని ఇస్తూనే ఉంటుంది.

కమలా హ్యారిస్ జీవితంలో ఆగస్టు 22కు ఒక ప్రత్యేకత ఉంది. 2014లో డగ్లస్ ఎంహాఫ్‌తో ఆమె పెళ్లి జరిగిన రోజు అది. సరిగ్గా పదేళ్ల తర్వాత అదే ఆగస్టు 22 మళ్లీ ఇప్పుడు ఆమె కోసం మరొక చిరస్మరణీయమైన సందర్భాన్ని సిద్ధం చేసి ఉంచినట్లే అనిపిస్తోంది! 2024 ఆగస్టు 19 నుంచి 22 వరకు షికాగోలో జరిగే పార్టీ సమావేశంలో చివరి రోజున డెమోక్రాట్‌లు తమ పార్టీ అధ్యక్ష అభ్యర్థిని ఎన్నుకుంటారు. ఆ అభ్యర్థి కమలా హ్యారిస్ అయ్యేందుకే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయి. మరో మూడు నెలలో అధ్యక్ష ఎన్నికలు ఉండగా పోటీ నుంచి విరమించుకున్న జో బైడెన్.. వెళుతూ వెళుతూ ఆమె అభ్యర్థిత్వాన్ని బలపరిచి వెళ్లారు. ఆయన మాటపై కమలా హ్యారిస్‌కు మద్దతుగా ఉన్న డెమోక్రాట్‌లతో పాటుగా, పార్టీలోని ఆమె వ్యతిరేకులు కూడా.. ఇప్పుడు 'ట్రంప్‌ను ఓడించగల శక్తి'గా కమలా హ్యారిస్‌ను గుర్తించటం మొదలైంది.

ఎంతటి శక్తిమంతురాలు?

కమలా హ్యారిస్‌ను ఆమె పిల్లలు 'మామ్‌లా' (మామ్ + కమల) అని పిలుస్తారు. పిల్లలకు ఆమె సొంత తల్లి కాదు. విడిపోయిన డగ్లస్ ఎంహాఫ్ మొదటి భార్య పిల్లలు. ఒక అబ్బాయి, ఒక అమ్మాయి. కమలా డగ్లస్‌ల పెళ్లయ్యే నాటికి అబ్బాయికి 19 ఏళ్లు. అమ్మాయికి 15. ఆ వయసులోని పిల్లలు ఒక బయటి మనిషి తల్లిలా వచ్చి తమను చేరదీస్తానంటే వెళ్లి ఒడిలో వాలిపోతారా? కానీ అలాగే జరిగింది. వాళ్లను చక్కగా కలుపుకుపోయారు కమల. కొత్తమ్మ అమ్మ అయింది. ఫ్రెండ్ అయింది. అమ్మ, ఫ్రెండ్ కలిసి 'మామ్‌లా' అయింది. తల్లి స్థానంలో తల్లిగా వచ్చి, పిల్లల మనసు గెలుచుకోటానికి శక్తి కావాలి. అంతటి శక్తిమంతురాలు అయిన కమలకు అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఎంపికవటం, ఆపైన అధ్యక్షురాలిగా నెగ్గటం ఎంత పని?

''అమెరికాను సకల జాతులకు సహజీవన యోగ్యమైన దేశంగా మార్చటమే నా ధ్యేయం'' అని కమల అనడం ట్రంప్ వంటి కరడు గట్టిన జాతీయవాదులకు నచ్చకపోవచ్చు. అయితే ఆ ఒక్క మాటతో ఆమె ఇప్పటికే అధికశాతం అమెరికన్‌లు, అమెరికాలోని ఇతర వలస దేశాల ప్రజల హృదయాలలో గొప్ప స్థానం సంపాదించారు.

> "అమెరికాను సకల జాతులకు సహజీవన యోగ్యమైన దేశంగా మార్చటమే నా ధ్యేయం" అని కమల అనడం ట్రంప్ వంటి కరడు గట్టిన జాతీయవాదులకు నచ్చకపోవచ్చు. అయితే ఆ ఒక్క మాటతో ఆమె ఇప్పటికే అధికశాతం అమెరికన్‌లు, అమెరికాలోని ఇతర వలస దేశాల ప్రజల హృదయాలలో గొప్ప స్థానం సంపాదించారు.

వ్యక్తిగా ఎలాంటి మనిషి?

నాలుగేళ్ల క్రితం బైడెన్ రన్నింగ్ మేట్‌గా (వైస్ ప్రెసిడెంట్ అభ్యర్థిగా) ఎంపికైనది మొదలు, అమెరికా తొలి మహిళా ఉపాధ్యక్షురాలిగా ఎన్నికయ్యే వరకు కమలా హ్యారిస్‌ను గురించిన ఏ చిన్న విషయాన్నీ వదలకుండా ప్రపంచం ఆసక్తిగా తెలుసుకుంది. ''నా బిడ్డ'' అని భారతదేశం గర్వించింది. అంతేకాదు, తన ఉపాధ్యక్ష ప్రమాణ స్వీకారానికి ఆమె భారతీయ సంస్కృతీ సంప్రదాయాలను తలపిస్తూ చీరకట్టులో వేదికపైకి రావాలని ఇండియా కోరుకుంది. అమెరికా ఎన్నికల్లో అభ్యర్థుల మధ్య పెద్ద పెద్ద డిబేట్‌లు జరిగిన విధంగానే.. ''కమల చీర కట్టులో కనిపిస్తారా లేదా?'' అని రెండు దేశాల్లోనూ డిబేట్‌లు జరిగాయి. చీర కట్టుకుంటే బావుంటుందన్న ఆకాంక్షలు వెల్లివిరిశాయి. ప్రమాణ స్వీకారానికి ఆమె చీర ధరిస్తే.. సంస్కృతుల సమైక్య భావనకు తనొక సంకేతం ఇచ్చినట్లు అవుతుంది'' అని, ''కమలా హ్యారిస్ చీర కట్టుకుని ప్రమాణం స్వీకారంలో కనిపిస్తే అమెరికాలోని దక్షిణాసియా సంతతి వారికి ఆమె తమ మనిషి అనే ఒక నమ్మకం ఏర్పడుతుంది..'' అని, ''కమలా హ్యారిస్ కనుక చీరలో ప్రమాణ స్వీకారం చేస్తే అదొక దౌత్యపరమైన స్నేహానికి చిహ్నంగా నిలుస్తుంది'' అని... ఇలా అనేక అభిప్రాయాలు వ్యక్తం అయ్యాయి.

చివరికేం జరిగింది? అచ్చమైన అమెరికన్ పౌరురాలిగా ప్యాంట్ సూట్, బౌ బ్లవుజ్‌లో వచ్చి ప్రమాణం స్వీకారం చేశారు కమలా హ్యారిస్. ఇది దేనికి సంకేతం? కొత్తగా తను సంస్కృతుల సమైక్య భావనను, దౌత్యపరమైన స్నేహభావనను ప్రదర్శించనవసరం లేదని ఆమె బలంగా నమ్మారని. ఆమె వ్యక్తిత్వం ఎలాంటిదో వెల్లడించే ఒక చిన్న సందర్భం ఇది.

''వాళ్లిద్దరు కూడా నాకు అమ్మలే''

తన తల్లి శ్యామలా గోపాలన్ కాకుండా, మరో ఇద్దరు మహిళలు కూడా తనకు తల్లి వంటి వారని.. ఆనాటి ప్రమాణ స్వీకారానికి రెండు రోజుల ముందు తన ఇన్‌స్టాగ్రామ్‌లో ఒక పోస్ట్ పెట్టారు కమల! ఆ ఇద్దరిలో ఒకరు: చిన్నప్పుడు తమ పక్కింట్లో ఉండే శ్రీమతి షెల్టన్. ఇంకొకరు : ఒకటో తరగతి టీచర్ శ్రీమతి విల్సన్. ''సాయంత్రం అమ్మ డ్యూటీ నుండి రావటం లేటయితే నేను, చెల్లి మాయా నేరుగా షెల్టన్ వాళ్ల ఇంట్లోకి వెళ్లిపోయేవాళ్లం. అక్కడే తిని, అమ్మ వచ్చి మమ్మల్ని పిలుచుకెళ్లే వరకు అక్కడే పడుకునేవాళ్లం. షెల్టన్ మమ్మల్నెంతో ఆదరణగా చూశారు..'' అని కమల గుర్తు చేసుకున్నారు. ఇక శ్రీమతి విల్సన్ బర్కిలీలోని థౌజండ్ ఓక్స్ ఎలిమెంటరీ స్కూల్లో ఒకటో తరగతి టీచర్. ''బాల్యంలో నాలో ఆశల్ని, ధైర్యాన్ని నింపింది ఆవిడే. నేను పై చదువులకు వెళ్లి, 'లా' డిప్లొమా చేసి, ఆ సర్టిఫికెట్‌ను అందుకునేందుకు స్టేజ్ మీదకు వెళ్లినప్పుడు కూడా విల్సన్ నా కోసం వచ్చి ఆడియెన్స్‌లో కూర్చొని ఉండటం దూరాన్నుంచి కనిపించింది! నన్ను సంతోష పెట్టటం కోసం ఆమె అలా చేయటం నాకెంతో ఆనందాన్నిచ్చింది'' అని విల్సన్ గురించి రాశారు కమల.

అమెరికా తొలి ఉపాధ్యక్షురాలు అయ్యాక కూడా ఈ నాలుగేళ్లలో ఎక్కడా దర్పాన్ని ప్రదర్శించని కమల తన జీవితంలోని అమూల్యమైన వ్యక్తులను, ప్రదేశాలను, మరచిపోలేని సందర్భాలను తరచు సోషల్ మీడియాలో షేర్ చేస్తూ ఉంటారు. రేపు ఒకవేళ ఆమె అమెరికా అధ్యక్ష అభ్యర్థిగా ఎంపికైతే కనుక ఆమె షేర్ చేసే తొలి పోస్టు ఏదైనా గాని, తప్పకుండా ఆమె కన్నా కూడా అది అగ్రరాజ్యం అమెరికాకే చరిత్రాత్మక సందర్భం అవుతుంది.



కృత్రిమ గర్భధారణ...

హార్ట్‌ఫిషియల్‌గా అమ్మానాన్నలుగా...

ఇటీవల మనదేశం వంధ్యత్వ సంక్షోభం (ఇన్‌ఫెర్టిలిటీ) దిశగా వెళుతోంది. ఈ సమస్య తీవ్రత ఎంత ఎక్కువగా ఉందంటే... ప్రతి ఆరు వివాహిత జంటల్లో ఒకరు సంతానలేమితో బాధపడుతున్నారు. సంతానలేమి అన్నది కేవలం పిల్లలు కలగకపోవడం మాత్రమే కాదు... ఇది మరిన్ని సంక్షోభాలకు... అంటే ఉదాహరణకు జనాభాలో యువత శాతం తగ్గిపోవడం, వృద్ధుల సంఖ్య పెరగడం వంటి అనర్థాలకు దారి తీయవచ్చు. దీనివల్ల దేశ ఆర్థిక సంపద తగ్గడంతో పాటు అనేక విధాలా నష్టం జరుగుతుంది. ఈ నెల 25న ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) డే సందర్భంగా సంతానలేమి సమస్యను ఎదుర్కొంటున్న దంపతులకు కృత్రిమ గర్భధారణకు సంబంధించిన కొన్ని అంశాలపై అవగాహన కోసం కొన్ని ప్రశ్నలకు ఇన్‌ఫెర్టిలిటీ నిపుణురాలు డాక్టర్ కట్టా శిల్ప సమాధానాలు.



● ఇటీవల మనదేశంలో సంతానలేమి సమస్యతో బాధపడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరగడానికి కారణాలేమిటి?

జ: దీనికి రెండు ప్రధాన కారణాలున్నాయి. మొదటిది సామాజికం, రెండు ఆరోగ్యపరమైన కారణాలు. సామాజిక అంశాల విషయానికి వస్తే... ఇటీవల యువత పై చదువులు, మంచి ఉద్యోగాలంటూ కెరియర్ కోసం ఎక్కువ కాలం కేటాయించడం, పెద్ద పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకోవడం, వాటిని నెరవేర్చుకోవడం కోసం ఆలస్యంగా పెళ్లిళ్లు చేసుకోవడం, ఉద్యోగాల్లో ఒత్తిడి, ఆహార అలవాట్లు, క్రమంగా లేని పనివేళలు, శారీరక శ్రమ ఎక్కువగా లేకపోవడం, అధిక బరువు, మద్యపానం, పొగతాగడం, డ్రగ్స్ వంటి అనారోగ్యకర అలవాట్లు, వ్యసనాలు వంటివి సంతానలేమికి దారితీస్తున్నాయి. ఇవన్నీ సామాజిక సమస్యలు.

ఇక ఆరోగ్య సమస్యల విషయానికి వస్తే... మహిళల్లో కనిపించే హార్మోన్లలో అసమతౌల్యత, ఇన్ఫెక్షన్లు, మానసిక ఒత్తిడులు వంటివి సంతానలేమికి కారణమవుతున్నాయి. ఉదాహరణకు అండం తయారీలో, ఫలదీకరణలో, పిండం ఇంప్లాంటేషన్‌లో ఇబ్బందుల వంటివి మహిళలకు ప్రత్యేకంగా వచ్చే సమస్యల్లో కొన్ని. ఇక మగవారిలోనైతే... శుక్రకణాల సంఖ్య, కదలిక, నాణ్యత తగ్గడం సంతానం కలగడానికి అవరోధంగా నిలుస్తున్నాయి.

● సాధారణంగా దంపతుల్లో సంతానలేమి ఉంటే ప్రధానంగా మహిళనే నిందిస్తారు. ఇదెంతవరకు సమంజసం?

జ: ఇది మళ్లీ మరో సామాజిక సమస్య. వాస్తవానికి గర్భం రాకపోతే అందులో తప్పెవరిదీ ఉండదు. కానీ మన సమాజంలో మహిళ గర్భం దాల్చకపోతే, ఆమెనే తప్పుబడుతుంటారు. నిజానికి గర్భధారణ జరగకపోవడానికి లోపాలు 40% మహిళల్లో ఉంటే, మరో 40% శాతం పురుషుల్లోనూ ఉండవచ్చు. ఇద్దరిలోనూ లోపాలున్న కేసులు మరో 10% మందిలో ఉంటాయి. అయితే ఎంతకూ కారణాలు తెలియని కేసులు మరో 10% ఉంటాయి. అందుకే ఒక జంటకు సంతానం కలగకపోతే... ఎవరినెవరూ నిందించుకోకుండా, శాస్త్రీయపద్ధతుల్లో అవసరమైన పరీక్షలన్నీ క్రమంగా చేయించుకోవాలి.

● ఫలానా దంపతులకు సంతానలేమి అనే నిర్ధారణ ఎలా?

జవాబు: ఆరోగ్యంగా ఉన్న భార్యాభర్తలు వివాహం అయ్యాక ఎలాంటి కుటుంబనియంత్రణ పద్ధతులను పాటించకుండా, కలిసి ఉంటూ ఏడాది పాటు గర్భధారణ కోసం ప్రయత్నించినా గర్భం రాకపోతే అప్పుడు ఆ దంపతులకు సంతానలేమి సమస్య ఉండే అవకాశాలున్నాయని చెప్పవచ్చు. ఈ సమస్యను ప్రైమరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

రెండో రకమైన సంతానలేమి ఏమిటంటే... మొదటిసారి గర్భధారణ తర్వాత, రెండోసారి గర్భధారణ కోసం కోరుకున్నప్పుడు ఏడాది పాటు ప్రయత్నించినా గర్భం దాల్చకపోతే దాన్ని సెకండరీ ఇన్‌ఫెర్టిలిటీ అంటారు.

● ఇప్పుడున్న సాంకేతిక పురోగతితో కృత్రిమ గర్భధారణ ఎలా?

జ: స్త్రీ, పురుషుల లోపాలు, వాటిని అధిగమించాల్సిన పద్ధతులన్నీ ప్రయత్నించాక కూడా గర్భం రాకపోతే అప్పుడు కొన్ని అత్యాధునిక పద్ధతుల్లో సంతాన సాఫల్యాన్ని సాధించవచ్చు. అవి...

ఇంట్రా యుటెరైన్ ఇన్‌సెమినేషన్ (ఐయూఐ): అండం విడుదలలో లోపాలు,ఎండోమెట్రియాసిస్, పురుషుల వీర్యకణాల సంఖ్య, కదలికల్లో లోపాలు ఉన్నప్పుడు ఐయూఐ అనే పద్ధతి ద్వారా డాక్టర్లు వీర్యకణాలను నేరుగా యోని నుంచి సర్విక్స్ ద్వారా గర్భాశయంలోకి పంపుతారు.

ఐవీఎఫ్: స్త్రీ, పురుషులిద్దరిలోనూ ఫలదీకరణ సమస్యలు ఉన్నప్పుడు డాక్టర్లు ఐవీఎఫ్ అనే మార్గాన్ని సూచిస్తారు. ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ అనే మాటకు సంక్షిప్త రూపమే ఐవీఎఫ్. దీనికే 'టెస్ట్‌ట్యూబ్ బేబీ' అనే పేరు. ఇందులో తొలుత మహిళలో అండాలు బాగా పెరిగేందుకు మందులిస్తారు. వాటిల్లోంచి ఆరోగ్యకరమైన కొన్ని అండాలను సేకరించి, పురుషుడి శుక్రకణాలతో ప్రయోగశాలలోని 'టెస్ట్‌ట్యూబ్'లో ఫలదీకరణం చేస్తారు. ఈ ప్రక్రియలో ఒకటి కంటే ఎక్కువ పిండాలు వృద్ధి చెందుతాయి. (అందుకే టెస్ట్‌ట్యూబ్ బేబీ ప్రక్రియను అనుసరించిన చాలామందిలో ట్విన్స్ పుట్టడం సాధారణం.) ఇందులోని ఆరోగ్యకరమైన పిండాలను మహిళ గర్భాశయంలోకి ప్రవేశపెడతారు. రెండు వారాలకు నిర్ధారణ పరీక్షలూ, నాలుగు వారాల తర్వాత అల్ట్రాసౌండ్ పరీక్ష చేసి గర్భం నిలిచిందా లేదా నిర్ధారణ చేసుకుంటారు. ఒకవేళ గర్భం నిలవకపోతే కారణాలను విశ్లేషించి, మళ్లీ ప్లాన్ చేస్తారు.



డాక్టర్ కట్టా శిల్ప
కన్సల్టెంట్
ఇన్‌ఫెర్టిలిటీ స్పెషలిస్ట్

ఐసీఎస్‌ఐ: ఇంట్రా సైటోప్లాస్మిక్ స్పెర్మ్ ఇంజెక్షన్ (ఐసీఎస్‌ఐ) అనే ఈ ప్రక్రియ పురుషుల్లో సమస్య ఉన్నప్పుడు అనుసరిస్తారు. ఇది కూడా ఐవీఎఫ్ లాంటిదే. ఇందులో ఎంపిక చేసుకున్న శుక్రకణాన్ని నేరుగా అండంలోకి ప్రవేశపెడతారు. ఇందులోనూ మహిళల అండాల్లో లోపాలు ఉంటే మహిళా దాత నుంచి అండాన్ని సేకరించడం (ఐవీఎఫ్ విత్ డోనార్ ఎగ్), పురుషుని వీర్యకణాల్లో లోపాలుంటే దాత నుంచి సేకరించిన శుక్రకణంతో ఫలదీకరణ చేయడం (ఐవీఎఫ్ విత్ డోనార్ స్పెర్మ్), దంపతుల్లోని స్త్రీ, పురుషులిద్దరిలోనూ లోపాలు ఉంటే మరో మహిళ, మరో పురుషుడి నుంచి అండం, శుక్రకణాలు సేకరించి ఫలదీకరించి దంపతుల్లోని మహిళ గర్భంలోకి ప్రవేశపెట్టడం (ఐవీఎఫ్ విత్ డోనార్ ఎంబ్రియో) అనే పద్ధతుల్లో సంతాన సాఫల్యం కలిగించడానికి డాక్టర్లు ప్రయత్నిస్తారు.

- యాసీన్

హెల్దీ డైట్ ఓట్స్-పొటాటో చీజ్ బాల్స్



కావలసినవి: ఉడికించి చిదిమిన బంగాళాదుంప – 2 కప్పులు; ఓట్స్ – కప్పు; చీజ్ తురుము – కప్పు; ఉల్లిపాయ తరుగు – పావు కప్పు; కొత్తిమీర – పావు కప్పు (తరగాలి); మిరప్పొడి– అర టీ స్పూన్; చాట్ మసాలా– అర టీ స్పూన్; ఉప్పు – రుచికి తగినంత; నూనె – టేబుల్ స్పూన్.

తయారీ: ● ఓట్స్‌ను బాణలిలో నూనె లేకుండా మీడియం మంట మీద ఒక మోస్తరుగా వేయించి, పొడి చేసి పక్కన పెట్టాలి ● ఒక పాత్రలో చిదిమిన బంగాళాదుంప, ఓట్స్ పొడి, చీజ్, ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర, చాట్ మసాలా, మిరప్పొడి, ఉప్పు వేసి కలపాలి. మొత్తం చపాతీ పిండిలా ముద్దగా తయారవుతుంది. ఈ ఈ మిశ్రమాన్ని పెద్ద నిమ్మకాయంత సైజులో బాల్స్ చేసుకోవాలి. ఒక్కో బాల్‌ని అరచేతిలో వేసి కొద్దిగా ఫోటోలో కనిపిస్తున్న ఆకారంలో వత్తాలి ● ఆపం పెనం లేదా కొంచెం గుంటగా ఉన్న పెనాన్ని వేడి చేసి కొద్దిగా నూనె రాసి ఒక్కో బాల్‌ని పెనం మీద అమర్చి మంటను మీడియంలో పెట్టాలి. ఒకవైపు దోరగా కాలిన తర్వాత మెల్లగా తిరగేసి రెండో వైపు కూడా కాలనివ్వాలి ● ఈ చీజ్ బాల్స్‌ని వేడిగా ఉన్నప్పుడే కెచప్ లేదా సాస్‌లతో వడ్డించాలి.

గమనిక: పిండిలో కలిపిన చీజ్ కరిగి బయటకు వస్తుంది. కాబట్టి నూనె ఎక్కువ వేయాల్సిన అవసరం ఉండదు. పెనం మాడుతున్నట్లనిపిస్తే చీజ్ బాల్స్ కాలుతున్నప్పుడు పై నుంచి కొద్ది చుక్కలు నూనె వేయవచ్చు.

పోషకాలు: పై కొలతలతో చేసిన చీజ్ బాల్స్‌లో 150 కేలరీలుంటాయి. కార్బొహైడ్రేట్‌లు 25 గ్రాములు, ప్రొటీన్‌లు– 6 గ్రాములు, ఫ్యాట్– 7 గ్రాములు, ఫైబర్ –3 గ్రాములు, క్యాల్షియం– 100 మిల్లీ గ్రాములు, ఐరన్– 1.5 మిల్లీ గ్రాములు



డాక్టర్ కరుణ
న్యూట్రిషనిస్ట్ అండ్ వెల్‌నెస్ కోచ్

పెర్‌ఫ్యూమ్

మట్టి పరిమళం

వేడి, పొడి వాతావరణంలో ఒక్కసారిగా కురిసే చినుకులతో భూమి నుండి వెలువడే ఆహ్లాదకరమైన సువాసన మనసును సేదతీరుస్తుంది. ఇది మట్టి వెదజల్లే సహజ పరిమళం కావడంతో మన మనసుల్ని సంతోష సాగరంలో విహరింపజేస్తుంది. తొలకరి చినుకులు నేలను తాకినప్పుడు వచ్చే ఈ మట్టి సువాసనను ఆస్వాదించడంలో ఆడ–మగ అనే భేదమేమీ లేదు. అందుకే, ఈ సువాసనలు ఇప్పుడు అత్తరు రూపంలో అందరినీ అల్లుకు పోతున్నాయి.

ప్రకృతి నుండి ప్రేరణ పొంది, సురక్షితమైన పదార్థాలతో తయారైన మట్టి అత్తరు పరిమళాలకు వందల సంవత్సరాల నైపుణ్యం గల వారసత్వ కంపెనీలు కూడా ఉన్నాయి. చెమట వాసనను దూరం చేస్తూ విభిన్న శ్రేణి వ్యక్తులను ఆకర్షిస్తుంది. 'ది సెంట్ ఆఫ్ రైన్' లేదా 'పెట్రిచోర్ ఎసెన్షియల్ ఆయిల్'గా ప్రసిద్ధి చెందినవీ ఉన్నాయి. అన్ని దేశాలలోనూ ఈ తరహా సువాసనలను ప్రజలు ఇష్టపడుతున్నారు. ఆఫ్‌లైన్–ఆన్‌లైన్ మార్కెట్లో వందల రూపాయల నుంచి వేల రూపాయల వరకు ఈ ఎర్త్ సెంటెడ్ పెర్‌ఫ్యూమ్స్ అందుబాటులో ఉన్నాయి.



చెక్.. తప్పనిసరి: ● మనసును కదిలించే ఈ సువాసన గల అత్తరులో ఆల్కహాల్ వాడకం లేనివి ఎంచుకోవాలి ● అత్తరు లేదా పెర్‌ఫ్యూమ్ మన చర్మ తత్త్వానికి సరిపడుతుందా లేదా అని చెక్ చేసుకోవాలంటే ముందుగా దూది ఉండతో మణికట్టు, చెవి వెనక భాగాన కొద్దిగా అద్ది/స్ప్రే చేసి, 30 నిమిషాలు ఉండాలి. సరిపడితే రోజూ ఉపయోగించుకోవచ్చు.

ప్రయోజనాలు ఏంటంటే: ● మట్టి పరిమళం గల సహజ అత్తరు/పెర్‌ఫ్యూమ్‌ను వాడి మానసిక ఒత్తిడి నుంచి రిలాక్స్ కావచ్చు ● ఏకాగ్రతను మెరుగుపరుచుకోవాలనుకునేవారికి ఉత్తమమైన సాధనాలలో మట్టి పరిమళం ఒకటి ● లగ్జరీ హోటళ్లు, యోగా అండ్ ఆయుర్వేద రిసార్ట్‌లలో, అరోమా థెరపీ రిట్రీట్‌లలో సుగంధ లేపనాల తయారీలోనూ ఈ మట్టి అత్తరును ఉపయోగిస్తుంటారు ● మట్టి పరిమళం స్ప్రే చేసుకొని వెళితే మీ చుట్టూ ఉన్నవారు బయట వర్షం పడుతుందేమో అన్న అనుభూతికి లోనుకాకుండా ఉండలేరు.

స్పోర్ట్స్



పోరాడి ఓడిన సుమిత్ నగాల్

జెనరాలి ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పోరాటం ముగిసింది. ఆస్ట్రియాలో బుధవారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ 80వ ర్యాంకర్ సుమిత్ 5–7, 5–7తో ప్రపంచ 45వ ర్యాంకర్ పెడ్రో మార్టినెజ్ (స్పెయిన్) చేతిలో ఓడిపోయాడు. 2 గంటల 36 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో సుమిత్ తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయి, ప్రత్యర్థి సర్వీస్‌ను రెండుసార్లు బ్రేక్ చేశాడు. సుమిత్‌కు 10,165 యూరోల (రూ. 9 లక్షల 24 వేలు) ప్రైజ్‌మనీతోపాటు 25 పాయింట్లు లభించాయి.

క్వార్టర్ ఫైనల్లో యూకీ బాంబ్రీ జోడీ

క్రొయేషియా ఓపెన్ ఏటీపీ–250 టెన్నిస్ టోర్నీలో పురుషుల డబుల్స్ విభాగంలో టాప్ సీడ్ యూకీ బాంబ్రీ (భారత్)–అల్బానో ఒలివెట్టి (ఫ్రాన్స్) జోడీ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లింది. ఉమగ్ నగరంలో బుధవారం జరిగిన తొలి రౌండ్‌లో యూకీ–ఒలివెట్టి ద్వయం 6–3, 6–2తో కొవాలిక్ (స్లొవేకియా)–కారాబెల్లి (అర్జెంటీనా) జంటపై గెలిచింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో హైదరాబాద్ ప్లేయర్ అనిరుధ్–అర్జున్ ఖడే (భారత్) జోడీ 2–6, 2–6తో గిడో ఆంద్రెజి (అర్జెంటీనా)–వరేలా (మెక్సికో) ద్వయం చేతిలో ఓడిపోయింది.



విజయోస్తు!

గత మూడేళ్లుగా భారత క్రీడాకారులు ఏ లక్ష్యంతోనైతే సాధన చేస్తున్నారో... ఆ ప్రయత్నాలను పతకాల రూపంలో మార్చేందుకు సమయం ఆసన్నమైంది. విశ్వ క్రీడా సంరంభం పారిస్ ఒలింపిక్స్‌కు రంగం సిద్ధమైంది. శుక్రవారం జరిగే ప్రారంభోత్సవం తర్వాత పారిస్ ఒలింపిక్స్ క్రీడలు అధికారికంగా మొదలవుతాయి. అయితే ఫుట్‌బాల్, రగ్బీ సెవెన్స్ పోటీలు మాత్రం బుధవారమే ఆరంభమయ్యాయి. భారత్ విషయానికొస్తే నేడు ఆర్చరీలో పురుషుల, మహిళల వ్యక్తిగత రికర్వ్ ర్యాంకింగ్ రౌండ్‌తో మనోళ్ల సమరానికి తెర లేస్తుంది. ర్యాంకింగ్ రౌండ్‌లో ఆయా ఆర్చర్లు సాధించిన పాయింట్లు, ర్యాంక్ ఆధారంగానే ఆర్చరీ ప్రధాన పోటీల 'డ్రా'ను ఖరారు చేస్తారు. కరోనా మహమ్మారి కారణంగా 2020 టోక్యో ఒలింపిక్స్ ఒక ఏడాది వాయిదా పడి 2021లో జరగ్గా... భారత్ నుంచి 18 క్రీడాంశాల్లో 127 మంది బరిలోకి దిగారు. 1 స్వర్ణం, 2 రజతాలు, 4 కాంస్యాలతో కలిపి 7 పతకాలు నెగ్గి తమ అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన భారత్ పతకాల పట్టికలో 48వ ర్యాంక్‌లో నిలిచింది. మూడేళ్లు ముగిశాయి. మళ్లీ పారిస్ వేదికగా ఒలింపిక్స్ వచ్చాయి. ఈసారి భారత్ నుంచి 16 క్రీడాంశాల్లో మొత్తం 117 మంది పోటీపడుతున్నారు. అథ్లెటిక్స్‌లో అత్యధికంగా 29 మంది అర్హత సాధించగా... షూటింగ్‌లో 21 మంది తమ గురికి పదును పెట్టనున్నారు. ఒలింపిక్స్ సన్నాహాల కోసం కేంద్ర ప్రభుత్వం క్రీడాకారులపై ఏకంగా రూ. 470 కోట్లు ఖర్చు చేసింది. ఈసారి భారత క్రీడాకారులు 'టోక్యో' ప్రదర్శను అధిగమించి 'పారిస్'ను చిరస్మరణీయంగా చేసుకోవాలని, పతకాల పంట పండించి స్వదేశానికి తిరిగి రావాలని ఆశిస్తూ... ఆల్ ద బెస్ట్!



రేపటి నుంచి

- పారిస్ ఒలింపిక్స్‌కు భారత్ బలగం సిద్ధం
- 16 క్రీడాంశాల్లో 117 మంది క్రీడాకారులు పోటీ
- కనీసం 10 పతకాలు లక్ష్యంగా బరిలోకి
- నేడు ఆర్చరీలో ర్యాంకింగ్ రౌండ్‌తో మొదలు



పారిస్ ఒలింపిక్స్ క్రీడా గ్రామంలో భారత బ్యాడ్మింటన్, టెన్నిస్, టేబుల్ టెన్నిస్ ప్లేయర్లు

అథ్లెటిక్స్ (29)


నీరజ్

పురుషుల విభాగం (18): నీరజ్ చోప్రా (జావెలిన్ త్రో), అవినాశ్ సాబ్లే (3000 మీటర్ల స్టీపుల్‌చేజ్), కిశోర్ జేనా (జావెలిన్ త్రో), అక్ష్‌దీప్ సింగ్ (20 కిలోమీటర్ల రేస్ వాక్), పరమ్‌జీత్ సింగ్ బిష్త్ (20 కిలోమీటర్ల రేస్ వాక్), తజీందర్ పాల్ (షాట్‌పుట్), అబ్దుల్లా అబూబాకర్ (ట్రిపుల్ జంప్), ప్రవీణ్ చిత్రావెల్ (ట్రిపుల్ జంప్), అజ్మల్ (4x400 మీటర్ల రిలే), అనస్ (4x400 మీటర్ల రిలే), అమోజ్ జేకబ్ (4x400 మీటర్ల రిలే), సంతోష్ తమిళరాసన్ (4x400 మీటర్ల రిలే), రాజేశ్ రమేశ్ (4x400 మీటర్ల రిలే), మిజో చాకో కురియన్ (4x400 మీటర్ల రిలే), జెస్విన్ ఆల్డ్రిన్ (లాంగ్‌జంప్), సర్వేశ్ కుషారే (హైజంప్), సూరజ్ పన్వర్ (మారథాన్ మిక్స్‌డ్ రేస్ వాక్), వికాశ్ సింగ్ (20 కిలోమీటర్ల రేస్ వాక్),
మహిళల విభాగం (11): జ్యోతి యర్రాజీ (100 మీటర్ల హర్డిల్స్; ఆంధ్రప్రదేశ్), పారుల్ చౌదరీ (3000 మీటర్ల స్టీపుల్‌ఛేజ్, 5000 మీటర్లు), అన్నురాణి (జావెలిన్ త్రో), విత్యా రాంరాజ్ (4x400 మీటర్ల రిలే), పూవమ్మ రాజు (4x400 మీటర్ల రిలే), దండి జ్యోతిక శ్రీ (4x400 మీటర్ల రిలే; ఆంధ్రప్రదేశ్), శుభా వెంకటేశన్ (4x400 మీటర్ల రిలే), కిరణ్ పహల్ (400 మీటర్లు, 4x400 మీటర్ల రిలే), ప్రాచి (4x400 మీటర్ల రిలే), అంకిత ధ్యాని (5000 మీటర్లు), ప్రియాంక గోస్వామి (20 కిలోమీటర్ల రేస్ వాక్, మిక్స్‌డ్ మారథాన్).
షెడ్యూల్: ఆగస్టు 1 నుంచి 11 వరకు

షూటింగ్ (21)


మనూ భాకర్

పురుషుల విభాగం (10): సరబ్‌జోత్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్), అర్జున్ సింగ్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్), అర్జున్ బబూటా (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్), సందీప్ సింగ్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్), ఐశ్వర్య ప్రతాప్ తోమర్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), స్వప్నిల్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), విజయ్‌వీర్ (25 మీటర్ల ర్యాపిడ్ ఫైర్ పిస్టల్), అనంత్ జీత్ (స్కీట్, స్కీట్ మిక్స్‌డ్ టీమ్), పృథ్వీరాజ్ (ట్రాప్). మహిళల విభాగం (11): మనూ భాకర్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 25 మీటర్ల పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్), ఇలవేనిల్ (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, 10 మీటర్ల ఎయిర్ రైఫిల్ మిక్స్‌డ్ టీమ్), సిఫ్ట్ కౌర్ సమ్రా (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), అంజుమ్ (50 మీటర్ల రైఫిల్ త్రీ పొజిషన్స్), రిథమ్ (10 మీటర్ల ఎయిర్ పిస్టల్, 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్), ఇషా సింగ్ (25 మీటర్ల స్పోర్ట్స్ పిస్టల్; తెలంగాణ), రమిత (10 మీటర్ల ఎయిర్ రైఫిల్, మిక్స్‌డ్ టీమ్), శ్రేయసి సింగ్ (ట్రాప్), రైజా ధిల్లాన్ (స్కీట్), రాజేశ్వరి (ట్రాప్), మహేశ్వరి (స్కీట్, స్కీట్ మిక్స్‌డ్ టీమ్).
షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు

హాకీ (16)
పురుషుల విభాగం (16): శ్రీజేశ్, హర్మన్‌ప్రీత్, మన్‌ప్రీత్, హార్దిక్, జర్మన్‌ప్రీత్, షంషేర్, మన్‌దీప్, గుర్జంత్, సుఖ్‌జీత్, కృష్ణ బహదూర్, జుగ్‌రాజ్, అమిత్ రోహిదాస్, సుమిత్, వివేక్ ప్రసాద్, అభిషేక్, లలిత్, రాజ్‌కుమార్, సంజయ్, నీలకంఠ శర్మ.
షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 9 వరకు

టేబుల్ టెన్నిస్ (8)
మహిళల విభాగం (4): ఆకుల శ్రీజ (సింగిల్స్, టీమ్; తెలంగాణ), మనిక బత్రా (సింగిల్స్, టీమ్), అర్చన (టీమ్), ఐహిక (టీమ్). పురుషుల విభాగం (4): శరత్ కమల్ (సింగిల్స్, టీమ్), హర్మీత్ (సింగిల్స్, టీమ్), మానవ్ (టీమ్), సత్యన్ (టీమ్).
షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 10 వరకు

బ్యాడ్మింటన్ (7)
పురుషుల విభాగం (4): సాత్విక్ సాయిరాజ్ (డబుల్స్; ఆంధ్రప్రదేశ్), చిరాగ్ శెట్టి (డబుల్స్), ప్రణయ్ (సింగిల్స్), లక్ష్య సేన్ (సింగిల్స్). మహిళల విభాగం (3): పీవీ సింధు (సింగిల్స్), అశ్విని పొన్నప్ప (డబుల్స్), తనీషా (డబుల్స్).
షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 5 వరకు

ఆర్చరీ (6)
పురుషుల విభాగం (3): బొమ్మదేవర ధీరజ్ (సింగిల్స్, టీమ్, మిక్స్‌డ్ టీమ్; ఆంధ్రప్రదేశ్), తరుణ్‌దీప్ (టీమ్), ప్రవీణ్ (టీమ్). మహిళల విభాగం (3): దీపిక (టీమ్), అంకిత (టీమ్), భజన్ (సింగిల్స్, టీమ్, మిక్స్‌డ్ టీమ్).
షెడ్యూల్: జూలై 28 నుంచి ఆగస్టు 4 వరకు

బాక్సింగ్ (6)
పురుషుల విభాగం (2): నిశాంత్ దేవ్ (71 కేజీలు), అమిత్ (51 కేజీలు). మహిళల విభాగం (4): నిఖత్ జరీన్ (50 కేజీలు; తెలంగాణ), లవ్లీనా (75 కేజీలు), ప్రీతి (54 కేజీలు), జైస్మిన్ (57 కేజీలు).
షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 10 వరకు

రెజ్లింగ్ (6)
పురుషుల విభాగం (1): అమన్ (57 కేజీలు). మహిళల విభాగం (5): వినేశ్ ఫొగాట్ (50 కేజీలు), అంతిమ్ (53 కేజీలు), అన్షు (57 కేజీలు), నిషా (68 కేజీలు), రీతిక హుడా (76 కేజీలు).
షెడ్యూల్: ఆగస్టు 5 నుంచి 11 వరకు

స్విమ్మింగ్ (2)
పురుషుల విభాగం (1): శ్రీహరి నటరాజ్ (100 మీటర్ల బ్యాక్‌స్ట్రోక్). మహిళల విభాగం (1): ధీనిధి (200 మీటర్ల ఫ్రీస్టయిల్)
షెడ్యూల్: జూలై 28 నుంచి 30 వరకు

సెయిలింగ్ (2)
పురుషుల విభాగం (1): విష్ణు శరవణన్ (ఐఎల్‌సీఏ-7). మహిళల విభాగం (1): నేత్రా కుమనన్ (ఐఎల్‌సీఏ-6).
షెడ్యూల్: జూలై 28 నుంచి ఆగస్టు 8 వరకు

ఈక్వెస్ట్రియన్ (1)
పురుషుల విభాగం (1): అనూశ్ అగర్వల్లా (డ్రెసాజ్). షెడ్యూల్: ఆగస్టు 4

జూడో (1)
మహిళల విభాగం (1): తులికా మాన్ (ప్లస్ 78 కేజీలు). షెడ్యూల్: ఆగస్టు 2

రోయింగ్ (1)
పురుషుల విభాగం (1): బల్‌రాజ్ (సింగిల్ స్కల్స్). షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 3 వరకు

టెన్నిస్ (3)
పురుషుల విభాగం (3): రోహన్ బోపన్న (డబుల్స్), శ్రీరామ్ బాలాజీ (డబుల్స్), సుమిత్ నగాల్ (సింగిల్స్)
షెడ్యూల్: జూలై 27 నుంచి ఆగస్టు 4 వరకు

గోల్ఫ్ (4)
పురుషుల విభాగం (2): శుభాంకర్, గగన్‌జీత్. మహిళల విభాగం (2): అదితి, దీక్షా.
షెడ్యూల్: ఆగస్టు 1 నుంచి 10 వరకు

వెయిట్‌లిఫ్టింగ్ (1)
మహిళల విభాగం (1): మీరాబాయి చాను (49 కేజీలు). షెడ్యూల్: ఆగస్టు 7

ఐఓసీ సభ్యురాలిగా నీతా అంబానీ



పారిస్: అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) సభ్యురాలిగా రిలయెన్స్ ఫౌండేషన్ చైర్‌పర్సన్ నీతా అంబానీ మళ్లీ ఎన్నికయ్యారు. బుధవారం పారిస్‌లో జరిగిన ఐఓసీ 142వ సెషన్‌లో నీతా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2016 రియో ఒలింపిక్స్ సందర్భంగా తొలిసారి నీతాకు ఐఓసీలో సభ్యత్వం లభించింది.




అర్జెంటీనాకు షాక్

సెయింట్ ఎటిన్ (ఫ్రాన్స్): పారిస్ ఒలింపిక్స్ అధికారికంగా శుక్రవారం మొదలు కావాల్సినా... ఫుట్‌బాల్, రగ్బీ సెవెన్స్ క్రీడాంశాల్లో బుధవారం పోటీలు ప్రారంభమయ్యాయి. పురుషుల ఫుట్‌బాల్ ఈవెంట్ సంచలనంతో ఆరంభమైంది. రెండుసార్లు స్వర్ణ పతక విజేత అర్జెంటీనా తొలి లీగ్ మ్యాచ్‌లో 1–2తో మొరాకో చేతిలో ఓడిపోయింది. ఇంజ్యూరీ టైమ్‌లో అర్జెంటీనా చేసిన గోల్‌ను ముందుగా రిఫరీ అనుమతించడంతో స్కోరు 2–2తో సమమైంది. అయితే రిఫరీ నిర్ణయంతో ఆగ్రహించిన అభిమానులు మైదానంలోకి దూసుకొచ్చారు. వాటర్ బాటిళ్లను మైదానంలోకి విసిరేశారు. దాంతో రెండు గంటలపాటు ఆటకు అంతరాయం ఏర్పడింది. పరిస్థితి అదుపులోకి వచ్చాక ఆటను కొనసాగించారు. అర్జెంటీనా రెండో గోల్‌ను టీవీ రీప్లేలో పరిశీలించి ఆఫ్ సైడ్‌గా పరిగణించి గోల్ ఇవ్వలేదు. దాంతో మొరాకో 2–1తో గెలిచింది.

సెమీఫైనల్లో బంగ్లాదేశ్, శ్రీలంక

దంబుల్లా: ఆసియా కప్ మహిళల టి20 క్రికెట్ టోర్నమెంట్‌లో గ్రూప్ 'బి' నుంచి బంగ్లాదేశ్, శ్రీలంక జట్లు సెమీఫైనల్లోకి దూసుకెళ్లాయి. బుధవారం జరిగిన చివరి రౌండ్ లీగ్ మ్యాచ్‌ల్లో బంగ్లాదేశ్ 114 పరుగుల తేడాతో మలేసియా జట్టును ఓడించగా... ఆతిథ్య శ్రీలంక జట్టు 10 వికెట్ల తేడాతో థాయ్‌లాండ్ జట్టుపై గెలిచింది. మలేసియాతో జరిగిన మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 2 వికెట్లకు 191 పరుగులు చేసింది. ముర్షిదా ఖాతూన్ (59 బంతుల్లో 80; 10 ఫోర్లు, 1 సిక్స్), నిగర్ సుల్తానా (37 బంతుల్లో 62 నాటౌట్; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) మెరిపించారు. అనంతరం మలేసియా 20 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 77 పరుగులు సాధించింది. శుక్రవారం జరిగే సెమీఫైనల్స్‌లో బంగ్లాదేశ్‌తో భారత్; పాకిస్తాన్‌తో శ్రీలంక తలపడతాయి.

సినిమా



చిరంజీవి

ఇంద్ర మళ్లీ వస్తున్నాడు

చిరంజీవి కెరీర్‌లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన చిత్రం 'ఇంద్ర' (2002). ఈ చిత్రంలో ఆర్తీ అగర్వాల్, సోనాలీ బింద్రే హీరోయిన్లుగా నటించారు. బి. గోపాల్ దర్శకత్వంలో వైజయంతీ మూవీస్ పతాకంపై సి. అశ్వినీదత్ నిర్మించిన ఈ యాక్షన్ డ్రామా విశేష ప్రేక్షకాదరణ దక్కించుకుంది. ఈ చిత్రంలో ఇంద్ర సేనారెడ్డి అలియాస్ శంకర్ నారాయణ పాత్రలో చిరంజీవి నటించారు. ఈ సినిమా రీ–రిలీజ్‌కు సిద్ధం అవుతోంది. వైజయంతీ మూవీస్ 50 గోల్డెన్ ఇయర్స్‌ని సెలబ్రేట్ చేస్తూ, చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 22న 'ఇంద్ర' చిత్రాన్ని మళ్లీ విడుదల చేస్తోంది.


సంజయ్ దత్

డబ్బింగ్ డన్

బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ తొలిసారి తెలుగులో పూర్తి స్థాయి పాత్ర పోషించిన చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ చిత్రంలో తన పాత్రకు సంబంధించిన హిందీ వెర్షన్ డబ్బింగ్‌ని పూర్తి చేశారు సంజయ్ దత్. హీరో రామ్ పోతినేని, డైరెక్టర్ పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో తెరకెక్కిన హిట్ మూవీ 'ఇస్మార్ట్ శంకర్' (2019)కి సీక్వెల్‌గా ఇదే కాంబినేషన్‌లో 'డబుల్ ఇస్మార్ట్' రూపొందింది. ఈ చిత్రంలో సంజయ్ దత్ విలన్‌గా చేశారు. పూరి కనెక్ట్స్‌పై పూరి జగన్నాథ్, ఛార్మీ కౌర్ నిర్మించిన ఈ సినిమా ఆగస్టు 15న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో విడుదల కానుంది. ప్రైమ్‌షో ఎంటర్‌టైన్‌మెంట్‌పై నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ చిత్రాన్ని ఐదు భాషల్లో విడుదల చేస్తున్నారు.


తమన్నా

ఆజ్ కీ రాత్...

అమేజింగ్ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌తో స్పెషల్ సాంగ్‌ను ఇంకా స్పెషల్‌గా చేయాలంటే కొందరు హీరోయిన్స్‌కే సాధ్యమవుతుందంటారు ఆడియన్స్. ఈ జాబితాలో తమన్నా తప్పక ఉంటారు. ఇప్పటికే ఈ బ్యూటీ దాదాపు పది స్పెషల్ సాంగ్స్‌లో డ్యాన్స్‌లో అదరగొట్టారు. ఇప్పుడు ఈ ప్రస్తావన ఎందుకంటే... హిందీ చిత్రం 'స్త్రీ 2'లో తమన్నా చేసిన స్పెషల్ సాంగ్ 'ఆజ్ కీ రాత్' విడుదలైంది. ఈ పాటలో తమన్నా అదిరిపోయే స్టెప్పులు వేశారు. శ్రద్ధా కపూర్, రాజ్‌కుమార్ రావు, పంకజ్ త్రిపాఠి, అభిషేక్ బెనర్జీ, అపర్‌శక్తి ఖురానా లీడ్ రోల్స్‌లో అమర్ కౌశిక్ దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'స్త్రీ 2'. ఈ చిత్రం ఆగస్టు 15న విడుదల కానుంది. ఈ సందర్భంగా 'స్త్రీ 2'లోని 'ఆజ్ కీ రాత్' సాంగ్ వీడియోను రిలీజ్ చేశారు. హిట్ ఫిల్మ్ 'స్త్రీ'కి సీక్వెల్‌గా 'స్త్రీ 2' రూపొందింది.


ఇమ్రాన్ శాస్త్రి పేరులా పాటలు వైవిధ్యంగా ఉన్నాయి
- చంద్రబోస్

వంశీరామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి, ఏపూరి హరి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా. మురళీ గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు రెండో వారంలో విడుదల కానుంది. ఈ సినిమా ఆడియో రిలీజ్ ఈవెంట్‌లో పాటల రచయితలు చంద్రబోస్, రామజోగయ్య శాస్త్రి, సుద్దాల అశోక్ తేజ, అనంత శ్రీరామ్, కాసర్ల శ్యామ్ అతిథులుగా పాల్గొన్నారు. హరినాథ్ పులి మాట్లాడుతూ– ''మత్స్యకారుల జీవితాలను ప్రతిబింబించేలా 'రేవు' తీశాను'' అన్నారు. ''రేవు' చిత్రానికి పాటలు రాసిన ఇమ్రాన్ శాస్త్రి పేరు ఎంత వైవిధ్యంగా ఉందో అతను రాసిన పాటలు అంతే వైవిధ్యంగా ఉన్నాయి'' అన్నారు చంద్రబోస్. ''తెలుగు సంగీత దర్శకులకు అవకాశాలు ఇవ్వాలి. అప్పుడే మనవారి ప్రతిభ తెలుస్తుంది'' అన్నారు రామజోగయ్య శాస్త్రి. సుద్దాల అశోక్ తేజ మాట్లాడుతూ– ''ఈ ఆడియో ఫంక్షన్‌కు గీత రచయితలను అతిథులుగా పిలవడం గొప్ప సంప్రదాయం. ఈ క్యాసెట్‌ను నేను దాచుకుంటాను. అప్పట్లో దాసరి నారాయణరావు, రాఘవేంద్రరావుగార్ల సినిమాలకు పని చేసి, ఆ క్యాసెట్ అందుకున్నప్పుడు కలిగిన సంతోషం ఇప్పుడు కలుగుతోంది'' అన్నారు. ''నాలాగే తొలి సినిమాకే అన్ని పాటలు రాసే అవకాశాన్ని ఇమ్రాన్ అందుకోవడం సంతోషం'' అన్నారు అనంత శ్రీరామ్. ''ఈ సినిమా రచయిత ఇమ్రాన్ శాస్త్రి, మ్యూజిక్ చేసిన జాన్‌లలో అన్ని మతాలు ఉన్నాయి. అందుకే అన్ని వర్గాల వారికీ నచ్చేలా పాటలు రూపొందించారు'' అన్నారు కాసర్ల శ్యామ్. ''ప్రేక్షకుల ఆశీస్సులు మా సినిమాకు ఉండాలని కోరుకుంటున్నా'' అన్నారు ఇమ్రాన్ శాస్త్రి. ''రేవు' మత్స్యకారుల జీవితాలను తెరపై చూపిస్తుంది'' అన్నారు చిత్ర నిర్మాణ పర్యవేక్షకుడు ప్రభు. ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ పర్వతనేని రాంబాబు పాల్గొన్నారు.


శ్యామ్, అనంత శ్రీరామ్, సుద్దాల, చంద్రబోస్, రామజోగయ్య

ఈ మ్యూజిక్ కాన్సెప్ట్ నచ్చింది
- మారుతి

''జామ్ జంక్షన్' మ్యూజిక్ కాన్సెప్ట్ కొత్తగా అనిపించింది. ఎందరో ప్రతిభావంతుల్ని ఒకే వేదికపై చూడబోతున్నాం. దీన్ని తర్వాతి స్థాయికి తీసుకెళ్లబోతున్నాం'' అన్నారు దర్శకుడు మారుతి. హైదరాబాద్‌లోని హైటెక్స్ గ్రౌండ్స్‌లో సెప్టెంబర్ 6న 'జామ్ జంక్షన్' పేరుతో మ్యూజికల్ ఈవెంట్ షో జరగనుంది. మారుతి సమర్పణలో జరగనున్న ఈ ఈవెంట్ కర్టెన్‌రైజర్ ప్రెస్‌మీట్ హైదరాబాద్‌లో జరిగింది. మారుతి మాట్లాడుతూ– ''జామ్ జంక్షన్'లో బాగా మెప్పించిన వారికి క్యాష్ ప్రైజ్‌తో పాటు మా సినిమాల్లో ఓ చిన్న సినిమాకి మ్యూజిక్ చేసే చాన్స్ ఇప్పిస్తాం'' అన్నారు. సంగీతదర్శకుడు తమన్ మాట్లాడుతూ– ''నేను బ్యాండ్ నుంచే వచ్చాను. ఆ బ్యాండ్ ఎమోషన్ నాకు తెలుసు. ఇప్పటికీ రెగ్యులర్‌గా బ్యాండ్ మ్యూజిక్‌కి వెళ్తాను. హైదరాబాద్ ఇప్పుడు మంచి మ్యూజికల్ సిటీ. చక్కని బ్యాండ్స్, మ్యూజిషియన్స్ వస్తున్నారు. 'జామ్ జంక్షన్'లో భాగమవడం హ్యాపీగా ఉంది'' అన్నారు. శ్రీ ఈవెంట్స్ కంపెనీ ఫౌండర్, సీఈఓ శ్రీ, నిర్మాత ఎస్‌కేఎన్, బ్యాండ్ మెంబర్స్ పాల్గొన్నారు.


తమన్, మారుతి

శ్రీమంతుడు కథతో పోల్చవద్దు
- రామ్ భీమన

రాజ్ తరుణ్, హాసినీ సుధీర్ జంటగా రామ్ భీమన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పురుషోత్తముడు'. డా. రమేశ్ తేజావత్, ప్రకాశ్ తేజావత్ నిర్మించిన ఈ చిత్రం రేపు విడుదల కానుంది. ఈ సందర్భంగా రామ్ భీమన మాట్లాడుతూ– ''మా సినిమాను 'శ్రీ మంతుడు' సినిమా కథతో పోల్చవద్దు. కోటీశ్వరుడైన యువకుడు ఇంటి నుంచి బయటకు రావడం అనే పాయింట్‌తో చాలా కథలు వచ్చాయి. కానీ కథను ఏం విధంగా చెప్పాం? ఎలా చెప్పాం అనేది ముఖ్యం'' అన్నారు. ''14 ఏళ్ల వయసులోనే ఆంధ్రా నుంచి ముంబై వెళ్లి, ఇప్పుడు బిజినెస్‌లో రాణిస్తున్నాను. తెలుగు సినిమా నిర్మించాలన్న నా ఆశ ఈ సినిమాతో నెరవేరింది. ఎక్కడా వల్గారిటీ ఉండదు. ఈ సినిమా కోసం చిత్రీకరించిన స్పెషల్ సాంగ్‌ను కూడా తీసేశాం. కుటుంబం అంతా కలిసి మా సినిమాను చూడొచ్చు'' అన్నారు చిత్రనిర్మాత రమేశ్.


రామ్ భీమన, రమేశ్

ఒక్కరిలో మార్పు వచ్చినా చాలు
- అనసూయ



''పర్యావరణాన్ని మనం ఎలా కలుషితం చేస్తున్నామో... దానివల్ల ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామో చూస్తున్నాం. ఈ నేపథ్యంతో మంచి కాన్సెప్ట్‌తో రూపొందిన చిత్రం 'సింబా'. ఈ సినిమా చూశాక కనీసం ఒక్కరిలో మార్పు వచ్చినా సంతోషమే'' అని అనసూయ అన్నారు. జగపతిబాబు, అనసూయ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'సింబా'. డైరెక్టర్ సంపత్ నంది అందించిన 'సింబా' కథకు మురళీ మనోహర్ దర్శకత్వం వహించారు. సంపత్ నంది, దాసరి రాజేందర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్ 9న విడుదలవుతోంది. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో మురళీ మనోహర్ మాట్లాడుతూ– ''సూపర్ నేచురల్ క్రైమ్ థ్రిల్లర్ మూవీ 'సింబా'. ఇంతవరకు ఇండియన్ స్క్రీన్ పై ఇలాంటి కాన్సెప్ట్ మూవీ రాలేదు'' అన్నారు. ''ప్రకృతిని జాగ్రత్తగా కాపాడుకోవాలి. ముందు తరాల గురించి ఆలోచించండి'' అన్నారు దాసరి రాజేందర్ రెడ్డి.

హీరోగా ఉంటూ ఆర్టిస్టుగా కొనసాగాలనుకుంటున్నాను
- సందీప్ కిషన్

''కెప్టెన్ మిల్లర్, రాయన్' సినిమాల్లో లీడ్ రోల్స్ చేశాను. అంత మాత్రాన నేను క్యారెక్టర్ ఆర్టిస్టుగా ఉండాలనుకోవడం లేదు. హీరోగా ఉంటూ ఆర్టిస్టుగా కొనసాగాలనుకుంటున్నా. 'రాయన్' కథ విని షాక్ అయ్యాను. పైగా ధనుష్‌గారి 50వ సినిమా కాబట్టి గౌరవంతో కూడా 'రాయన్' అంగీకరించాను. అలాగే నెగటివ్ రోల్స్ కూడా చేయాలనుకోవడం లేదు. 'ప్రస్థానం' సినిమాలో కథలో భాగంగా అక్కను, బావను చంపానని ఆ రోజంతా డిప్రెషన్‌లోనే ఉండిపోయాను. అలాంటి మనస్తత్వం నాది'' అన్నారు సందీప్ కిషన్. ధనుష్ నటించి, స్వీయ దర్శకత్వం వహించిన చిత్రం 'రాయన్'. ఇందులో సందీప్ కిషన్ ఓ లీడ్ రోల్ చేశారు. రేపు ఈ చిత్రం విడుదల కానుంది. ఏషియన్ సురేష్ ఎంటర్‌టైన్‌మెంట్ ఎల్‌ఎల్‌పి 'రాయన్' తెలుగు వెర్షన్‌ను విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో జరిగిన విలేకర్ల సమావేశంలో సందీప్ కిషన్ చెప్పిన విశేషాలు.



- నార్త్ చెన్నై బ్యాక్‌డ్రాప్‌లో సాగే కథ 'రాయన్'. ఈ చిత్రంలో పెద్దన్న కార్తవ రాయన్‌గా ధనుష్ గారు, రెండోవాడు ముత్తువేల్ రాయన్‌గా నేను, మూడోవాడు మాణిక్య వీర రాయన్‌గా కాళిదాసు, వీరి చెల్లి దుర్గా రాయన్‌గా దుషార కనిపిస్తాం. ఈ 'రాయన్' ఫ్యామిలీలో ఏం జరిగింది? అనేది కథ. నిజానికి ధనుష్ గారు 'రాయన్' కథను వేరే దర్శకుడికి ఇచ్చి, ఇందులో నేను చేసిన పాత్రను ఆయన చేయాలనుకున్నారు. కానీ ఈ సినిమాకు ఆయనే దర్శకత్వం వహించాల్సి రావడం, ఆయన యాభయ్యవ చిత్రం కావడంతో ఆ రోల్ చేసే చాన్స్ నాకు వచ్చింది. 'రాయన్'లో నా కోసం రాసుకున్న పాత్రకు మిమ్మల్ని అడుగుతున్నానని ధనుష్‌గారు అన్న వెంటనే ఓకే చెప్పాను. నాది విలన్ పాత్ర అని చెప్పలేను కానీ ఆడియన్స్ సర్‌ప్రైజ్ అవుతారు.
- నా కంటే పెద్దవారిని నేనెప్పుడూ గౌరవిస్తాను. అందుకే 'రాయన్' ఈవెంట్‌లో ధనుష్‌గారి కాళ్లను టచ్ చేశాను. తన కోసం రాసుకున్న పాత్రను ధనుష్‌గారు నాకు ఇచ్చారు. ఇప్పటివరకు నేను అందుకున్న అత్యధిక పారితోషికం 'రాయన్' నుంచే వచ్చింది.
- నేను తమిళ సినిమాలు చేస్తున్నది అక్కడ మార్కెట్ క్రియేట్ చేసుకోవాలని కాదు. ఇక్కడ దుల్కర్ సల్మాన్, ధనుష్‌గార్ల లాంటి హీరోలకు ఎలాంటి ఆదరణ దక్కుతుందో అలాంటి ప్రేమ నాకు తమిళంలో దక్కాలని. పద్నాలుగేళ్ల నా కెరీర్‌లో 29 సినిమాలు చేశాను. వీటిలో చాలా సినిమాలను ఫ్లాప్స్ అన్నారు. కానీ ఆ సినిమాల థియేట్రికల్ కలెక్షన్స్ బాగున్నాయని నాకు తెలుసు. ఒకవేళ అవి ఫ్లాప్స్ అనుకున్నప్పటికీ నాకు అవకాశాలు వస్తున్నాయంటే ఆడియన్స్ నన్ను ప్రేమించి, సపోర్ట్ చేస్తున్నట్లే కదా.
- నక్కిన త్రినాథరావుతో 'మాజాకా' (వర్కింగ్ టైటిల్) సినిమా చేస్తున్నాను. స్వరూప్ డైరెక్షన్‌లో 'వైబ్' షూటింగ్ జరుగుతోంది. 'ఫ్యామిలీ మేన్ 3' వెబ్ సిరీస్‌లో నటిస్తున్నా. సైన్స్ ఫిక్షన్ సూపర్ హీరో ఫిల్మ్ 'మాయవన్ 2' ఉంది. 'ఊరు పేరు భైరవకోన' సీక్వెల్ ఆలోచన ఉంది.

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
280	66
80,149	24,413

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

నాస్‌డాక్	17,510	▽ 488
డోజోన్స్	40,055	▽ 303
ఎఫ్‌టీఎస్ఈ 100	8,154	▽ 14
డాక్స్	18,387	▽ 170
షాంఘై	2,902	▽ 13
నికాయ్	39,155	▽ 440

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (24 క్యారెట్)	69,151	▽ 451
బంగారం (22 క్యారెట్)	68,874	▽ 449
వెండి (కేజీ)	84,862	▽ 57

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎన్‌ఐఆర్	83.29	84.31
£	బ్రిటన్ పౌండ్	ఎన్‌ఐఆర్	106.73	109.32
€	యూరో	ఎన్‌ఐఆర్	89.70	92.06
¥	జపాన్ ఎన్ (100)	ఎన్‌ఐఆర్	53.43	54.62
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎన్‌ఐఆర్	54.29	56.22
S$	సింగపూర్ డాలర్	ఎన్‌ఐఆర్	60.10	64.78
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	21.43	22.99
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	21.91	23.69
¥	చైనా యువాన్	థామస్‌కుక్	10.65	12.48

నిస్సాన్ ఎక్స్-ట్రయల్ వచ్చేస్తోంది..

బుకింగ్స్ 26 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: జపాన్ ఆటోమొబైల్ దిగ్గజం నిస్సాన్ తమ ప్రీమియం ఎస్‌యూవీ ఫోర్త్ జనరేషన్ ఎక్స్-ట్రయల్‌ను ఆవిష్కరించింది. దీన్ని భారత మార్కెట్లో సీబీయూ (కంప్లీట్లీ



బిల్టప్) మోడల్‌గా విక్రయించనుంది. ఇది టయోటా ఫార్చ్యూనర్, స్కోడా కోడియాక్, జీప్ మెరీడియన్, ఎంజీ గ్లోస్టర్ తదితర వాహనాలకు పోటీనివ్వనుంది. భారత్‌లో ఇది మూడు వరుసల సీటింగ్‌తో 7 సీటర్‌గా ఉంటుంది. దీని బుకింగ్స్ జూలై 26న ప్రారంభం కానుండగా, డెలివరీలు ఆగస్టులో ప్రారంభమవుతాయని కంపెనీ తెలిపింది. బుకింగ్ అమౌంటు రూ. 1,00,000గా ఉంటుంది. సన్‌రూఫ్, ఎలక్ట్రానిక్ పార్కింగ్ బ్రేక్, 7 ఎయిర్‌బ్యాగ్‌లు, 360 డిగ్రీ కెమెరా తదితర ఫీచర్లు ఇందులో ఉంటాయి. నిస్సాన్ ప్రస్తుతం భారత్‌లో కాంపాక్ట్ ఎస్‌యూవీ మాగ్నైట్‌ను మాత్రమే విక్రయిస్తోంది. వచ్చే 30 నెలల్లో అయిదు మోడల్స్‌ను ప్రవేశపెట్టనున్నట్లు ఎక్స్-ట్రయల్ ఆవిష్కరణ సందర్భంగా నిస్సాన్ ఇండియా ప్రెసిడెంట్ ఫ్రాంక్ టోరెస్ తెలిపారు.


తక్షణం తగ్గినా..

భవిత 'బంగారమే'!

పసిడి ధరలు ముున్ముందు పైపైకే • అంతర్జాతీయ ఆర్థిక అనిశ్చితి, రూపాయి క్షీణత ఎఫెక్ట్

పుత్తడిపై కస్టమ్స్ సుంకాలు 15% నుంచి 6%కి తగ్గిస్తున్నట్లు వార్షిక బడ్జెట్ ప్రసంగంలో ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించిన వెంటనే ఇటు స్పాట్‌లో అటు ఫ్యూచర్స్ మార్కెట్లలో రూ.4,000 వరకూ పడిపోయిన పసిడి ధరలు.. ఇదే రీతిలో ముందు ముందు ఆభరణ ప్రియులకు అంతే సంతోషాన్ని కలిగించే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. అంతర్జాతీయ అంశాలతో పాటు దేశీయంగా రూపాయి విలువ పతనం ఇందుకు కారణం.

- భౌగోళిక ఉద్రిక్తతలను మొదట ప్రధాన కారణంగా చెప్పవచ్చు. రష్యా-ఉక్రెయిన్ ఉద్రిక్తతలు, దీనికి పశ్చిమ దేశాల మద్దతు అలాగే చైనాతో అమెరికాకు ఉన్న రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అనిశ్చితికి దారితీసే అంశాలు. ఎలాంటి ఉద్రిక్తతలు నెలకొన్నా.. పెట్టుబడి సాధనంగా ఇన్వెస్టర్ బంగారం వైపే చూస్తాడనడంలో సందేహం లేదు.
- ఇక రెండో అంశానికి వస్తే.. అమెరికాతో సహా పలు దేశాలు సరళతర వడ్డీరేట్ల విధానంలోకి మారినప్పటికీ ఆ విధానాన్ని ఎంతవరకూ కొనసాగిస్తాయో తెలియని పరిస్థితి. సరళతర వడ్డీరేట్ల విధానంతో బంగారంలో కొనుగోళ్లు పెరుగుతాయి. అయితే ఈ విధానం కొనసాగింపునకు ప్రపంచవ్యాప్తంగా ద్రవ్యోల్బణం సమస్యలు, సవాళ్లు ఉన్నాయి.
- కీలక మూడవ అంశం.. రూపాయి విలువ. డాలరుతో రూపాయి మారకం విలువ సరికొత్త కనిష్ట స్థాయి రికార్డులను కొనసాగిస్తోంది. బుధవారం ఆల్‌టైమ్ కనిష్టం 83.71 వద్ద ముగిసింది. ఇంట్రాడేలో 83.72 కనిష్టాన్ని తాకింది.



దేశీయంగా రెండోరోజూ భారీ తగ్గుదల

బడ్జెట్‌లో నిర్ణయంతో దేశీయంగా రెండవరోజూ బుధవారమూ దేశీయంగా ధరలు భారీగా తగ్గాయి. దేశ రాజధానిలో 99.9 స్వచ్ఛత ధర 10 గ్రాములకు రూ.650 తగ్గి, రూ. 71,650కి చేరింది. 99.5 స్వచ్ఛత ధర కూడా ఇంతే స్థాయిలో దిగివచ్చి రూ. 71,300కు దిగివచ్చింది. ఇక మంగళవారం రూ.4 వేల వరకూ తగ్గిన వెండి ధర బుధవారం అక్కడక్కడే 87,500 వద్ద ముగిసింది. దేశ రాజధాని ముంబైలో 99.9, 99.5 స్వచ్ఛత ధరలు వరుసగా రూ. 451, రూ.449 తగ్గి రూ.69,151, రూ.68,874కు దిగివచ్చాయి. వెండి ధర రూ.57 తగ్గి రూ.84,862 వద్ద ముగిసింది.

- భౌగోళిక ఆర్థిక అనిశ్చితి అంశాల నేపథ్యంలో... అంతర్జాతీయ ఫ్యూచర్స్ మార్కెట్ న్యూయార్క్ కమోడిటీ ఎక్స్ఛేంజ్‌లో ఈ నెల 16వ తేదీన ఔన్స్‌కు (31.1గ్రా) ఆల్‌టైమ్ హై 2,489 డాలర్లను తాకిన పసిడి ఆగస్టు కాంట్రాక్ట్ ధర అటు పై కొంత తగ్గినప్పటికీ... పటిష్ట స్థాయిలోనే కొనసాగుతోంది. అంతర్జాతీయ ఫ్యూచర్స్‌లో 18 డాలర్లు అధికంగా 2,425 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. భారత్‌లో రూపాయి క్షీణిస్తూ... అంతర్జాతీయంగా ధర పెరుగుదల ధోరణే కొనసాగిస్తే దేశీయంగా సైతం బంగారం ముున్ముందుకే సాగుతుందనడంలో సందేహం లేదు.

పెట్టుబడులకు ప్లస్సే...

దేశీయంగా శుభకార్యాల్లో భారతీయులు పసిడి కొనుగోళ్లకు ఎంత ప్రాధాన్యత ఇస్తారో అందరికీ తెలిసిన అంశమే. ఇది ఎలాగూ తప్పని అంశం. ఇక పసిడి పెట్టుబడులకు ఇది తగిన అవకాశమనడంలో సందేహం లేదు. వినియోగదారులకు ధరల తగ్గుదల ఇప్పుడు ప్రయోజనకరంగా ఎలాసూ ఉంటుంది. తక్కువ ఖర్చులు అలాగే 2.5% వార్షిక వడ్డీని అందించే సావరిన్ గోల్డ్ బాండ్స్ వంటి డిజిటల్ ఆప్షన్‌లలో పెట్టుబడి పెట్టడానికి ఇది సరైన సమయం అనడంలో సందేహం లేదు.

– సాక్షి, బిజినెస్ డెస్క్

ఎలక్ట్రిక్ స్కూటర్ @14.9 లక్షలు

బీఎండబ్ల్యూ నుంచి సీఈ 04

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీ జర్మనీ దిగ్గజం బీఎండబ్ల్యూ భారత మార్కెట్లో సీఈ 04 ఎలక్ట్రిక్ స్కూటర్‌ను విడుదల చేసింది. ఎక్స్‌షోరూంలో ధర రూ.14.9 లక్షల నుంచి ప్రారంభం. భారత్‌లో తొలి ప్రీమియం ఎలక్ట్రిక్ టూ వీలర్ ఇదేనని కంపెనీ ప్రకటించింది. ఒకసారి చార్జింగ్‌తో 130 కిలోమీటర్లు పరుగెడుతుంది. గరిష్ట వేగం గంటకు 120 కిలోమీటర్లు. గంటకు 50 కిలోమీటర్ల వేగాన్ని 2.6 సెకన్లలో అందుకుంటుంది. 42 హెచ్‌పీ పవర్‌తో లిక్విడ్ కూల్డ్ పర్మనెంట్ మాగ్నెట్ ఎలక్ట్రిక్ మోటార్ పొందుపరిచారు. 8.5 కిలోవాట్ అవర్ లిథియం అయాన్ బ్యాటరీ ఏర్పాటు చేశారు. కీలెస్ రైడ్, బ్లూటూత్ కనెక్టివిటీతో 10.25 అంగుళాల టీఎఫ్‌టీ కలర్ స్క్రీన్, డబుల్ డిస్క్ బ్రేక్, యాంటీ లాక్ బ్రేకింగ్ సిస్టమ్, ఆటోమేటిక్ స్టెబిలిటీ కంట్రోల్ ఇతర హంగులు. కాగా, రూ.72.9 లక్షల ప్రారంభ ధరతో సరికొత్త 5 సిరీస్ లాంగ్ వీల్‌బేస్ కారుతోపాటు రూ.44.9-54.9 లక్షల ధరల శ్రేణిలో కొత్త మినీ కూపర్ ఎస్, కొత్త ఆల్ ఎలక్ట్రిక్ మినీ కంట్రీమ్యాన్ మోడళ్లు సైతం విడుదల అయ్యాయి.



యాక్సిస్ బ్యాంక్ లాభం ప్లస్

క్యూ1లో రూ. 6,436 కోట్లు




ముంబై: ప్రయివేట్ రంగ దిగ్గజం యాక్సిస్ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. ఏప్రిల్-జూన్(క్యూ1)లో కన్సాలిడేటెడ్ నికర లాభం 6 శాతం పుంజుకుని రూ. 6,436 కోట్లను తాకింది. స్టాండెలోన్ లాభం సైతం 4 శాతం వృద్ధితో రూ. 6,035 కోట్లకు చేరింది. నికర వడ్డీ ఆదాయం 12 శాతం ఎగసి రూ. 13,448 కోట్లను తాకింది. నికర వడ్డీ మార్జిన్లు 4.05 శాతం వద్ద నిలకడను ప్రదర్శించాయి. ఇతర ఆదాయం 14 శాతం అధికమై రూ. 5,783 కోట్లకు చేరింది. అయితే స్థూల స్లిప్పేజీలు రూ. 3,471 కోట్ల నుంచి రూ. 4,793 కోట్లకు పెరిగాయి. రుణ నష్టాల ప్రొవిజన్లు రూ. 1,146 కోట్ల నుంచి రూ. 2,551 కోట్లకు భారీగా పెరిగాయి. ఈ కాలంలో 10 లక్షల క్రెడిట్ కార్డులను జారీ చేసినట్లు బ్యాంక్ సీఎఫ్‌వో పునీత్ శర్మ పేర్కొన్నారు. స్థూల మొండిబకాయిలు(ఎన్‌పీఏలు) 0.42% మెరుగుపడి 1.54%కి చేరాయి. అనుబంధ సంస్థలలో యాక్సిస్ ఫైనాన్స్ నికర లాభం 26% జంప్‌చేసి రూ. 154 కోట్లయ్యింది.

ఫలితాల నేపథ్యంలో యాక్సిస్ షేరు బీఎస్‌ఈలో 1.8 శాతం తగ్గి రూ. 1,240 వద్ద ముగిసింది.

బ్యాంకింగ్ షేర్లలో లాభాల స్వీకరణ

సెన్సెక్స్‌కు 280 పాయింట్ల నష్టం



ముంబై: ఎఫ్అండ్‌ఓ ట్రేడింగ్‌పై సెక్యూరిటీ లావాదేవీల పన్ను పెంపుతో పాటు మూలధన లాభాలపై పన్ను పెంచాలనే బడ్జెట్ ప్రతిపాదనల ప్రభావం స్టాక్ మార్కెట్‌పై బుధవారమూ కొనసాగింది. ఇన్వెస్టర్లు బ్యాంకులు, ఫైనాన్స్, ఆటో మొబైల్ షేర్లలో లాభాల స్వీకరణకు పాల్పడ్డారు. ఫలితంగా సెన్సెక్స్ 280 పాయింట్లు నష్టపోయి 80,149 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 66 పాయింట్లు క్షీణించి 24,413 వద్ద నిలిచింది. కాగా, సూచీలకిది వరుసగా నాలుగోరోజూ నష్టాల ముగింపు. ఒక దశలో సెన్సెక్స్ 679 పాయింట్లు క్షీణించి 79,751 స్థాయికి, నిఫ్టీ 172 పాయింట్లు పతనమై 24,307 స్థాయికి దిగివచ్చాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో..

కొత్త పన్ను విధానంలోనే 66% రిటర్నులు

తగ్గిన బీఎస్ఎన్ఎల్ నష్టాలు

ఎల్అండ్‌టీ లాభం అప్

క్యూ1లో రూ. 2,786 కోట్లు



న్యూఢిల్లీ: డైవర్సిఫైడ్ దిగ్గజం లార్సెన్ అండ్ టుబ్రో(ఎల్అండ్‌టీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2024-25) తొలి త్రైమాసికంలో పటిష్ట ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన ఏప్రిల్-జూన్(క్యూ1)లో నికర లాభం 12 శాతం పుంజుకుని రూ. 2,786 కోట్లను తాకింది. ఆదాయం మెరుగుపడటం ఇందుకు సహకరించింది. మొత్తం ఆదాయం సైతం 15 శాతం ఎగసి రూ. 55,120 కోట్లను తాకింది. వీటిలో అంతర్జాతీయ వాటా 48 శాతం జంప్ చేసి రూ. 26,248 కోట్లకు చేరింది. ఈ కాలంలో 8 శాతం అధికంగా రూ. 70,936 కోట్ల ఆర్డర్లను అందుకుంది. ప్రధానంగా మధ్యప్రాచ్యం నుంచి లభించిన కాంట్రాక్టులు ఇందుకు సహకరించాయి. ప్రపంచవ్యాప్తంగా రాజకీయ, భౌగోళిక అనిశ్చితులలోనూ తాజా త్రైమాసికంలో ఆర్థికంగా అన్ని అంశాలలోనూ నిలకడైన వృద్ధిని సాధించినట్లు కంపెనీ సీఎండీ ఎస్ఎన్ సుబ్రమణ్యన్ పేర్కొన్నారు. ఇటీవలే సెమీకండక్టర్ విభాగంలో చిప్ డిజైన్ కంపెనీ సిలికాంచ్ సిస్టమ్స్‌తో ఎల్అండ్‌టీ వాటా కొనుగోలు ఒప్పందాన్ని కుదుర్చుకుంది.

ఫలితాల నేపథ్యంలో ఎల్అండ్‌టీ షేరు బీఎస్‌ఈలో 0.5 శాతం నీరసించి రూ. 3,519 వద్ద ముగిసింది.

భవిత

పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ జాగ్రఫీ కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

ఎయిమ్స్ డియోఘర్‌లో ఫ్యాకల్టీ పోస్టులు

డియోఘర్(జార్ఖండ్)లోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్).. ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 66.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-25, అడిషనల్ ప్రొఫెసర్-14, అసోసియేట్ ప్రొఫెసర్-09, అసిస్టెంట్ ప్రొఫెసర్-18.
» **విభాగాలు:** అనెస్తీషియాలజీ, బయో కెమిస్ట్రీ, కార్డియాలజీ, గ్యాస్ట్రో ఎంటరాలజీ, పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్, సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ, న్యూక్లియర్ మెడిసిన్, ఎండోక్రైనాలజీ అండ్ మెటబాలిజం, రేడియో-డయాగ్నోసిస్ తదితరాలు.
» **అర్హత:** సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,68,900 నుంచి రూ.2,20,400, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,42,200 నుంచి రూ.2,11,400, అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,38,300 నుంచి రూ.2,11,400, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టుకు రూ.1,01,500 నుంచి రూ.1,67,400.
» **వయసు:** ప్రొఫెసర్, అడిషనల్ ప్రొఫెసర్ పోస్టులకు 58 ఏళ్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు 50 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ అభ్యర్థులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

ముఖ్య సమాచారం

» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్,ఈమెయిల్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఎయిమ్స్ డియోఘర్, అకడమిక్ బ్లాక్, నాలుగో ఫ్లోర్, రిక్రూట్‌మెంట్ సెల్,దేవిపూర్,డియోఘర్ జిల్లా, జార్ఖండ్-814152 చిరునామకు పంపించాలి.
» **ఈమెయిల్:** recruitment2022@aiimsdeoghar.edu.in.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 16.07.2024.
» **ఈమెయిల్ ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 10.08.2024.
» **ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తులకు చివరితేది:** 17.08.2024.
» **వెబ్‌సైట్:** www.aiimsdeoghar.edu.in

ఐహెచ్‌బీఏఎస్, ఢిల్లీలో 42 పోస్టులు

ఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్ (ఐహెచ్‌బీఏఎస్).. రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 42
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-04, అడిషనల్ ప్రొఫెసర్-07, అసోసియేట్ ప్రొఫెసర్-12, అసిస్టెంట్ ప్రొఫెసర్-19.
» **విభాగాలు:** న్యూరో రేడియాలజీ, న్యూరో సర్జరీ, న్యూరో అనెస్తీషియా, న్యూరాలజీ, క్లినికల్ సైకాలజీ,సైకియాట్రీ, సైకియాట్రిక్ సోషల్ వర్కర్, సైకియాట్రిక్ నర్సింగ్ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/ఎండీ/ఎంఎస్, పీహెచ్‌డీ ఉత్తీర్ణతతో పాటు బోధనానుభవం ఉండాలి.
» **వయసు:** 41 నుంచి 50 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ఆఫీస్ డైరెక్టర్, ఐహెచ్‌బీఏఎస్, దిల్షాద్ గార్డెన్, ఢిల్లీ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 14.08.2024.
» **వెబ్‌సైట్:** https://ihbas.delhi.gov.in

జిప్‌మర్, పుదుచ్చేరిలో 209 గ్రూప్ బి, సి పోస్టులు

పుదుచ్చేరిలోని జవహర్‌లాల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పోస్ట్ గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(జిప్‌మర్) గ్రూప్ బి, సి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 209.
» **పోస్టుల వివరాలు:** గ్రూప్ బి పోస్టులు-169, గ్రూప్ సి పోస్టులు-40.
» **గ్రూప్ బి పోస్టులు:** జూనియర్ ట్రాన్స్‌లేషన్ ఆఫీసర్-01, జూనియర్ ఆక్యుపేషనల్ థెరపిస్ట్-01, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజిస్ట్-04, నర్సింగ్ ఆఫీసర్-154, ట్యూటర్ ఇన్ స్పీచ్ పాథాలజీ అండ్ ఆడియాలజీ-01, ఎక్స్‌రే టెక్నీషియన్(రేడియోథెరపీ)-01, ఎక్స్‌రే టెక్నీషియన్(రేడియో డయాగ్నోసిస్)-05, టెక్నికల్ అసిస్టెంట్ ఎలక్ట్రానిక్స్(ఫిజియాలజీ)-01, టెక్నికల్ అసిస్టెంట్(న్యూక్లియర్ మెడిసిన్)-01.
» **గ్రూప్ సి పోస్టులు:** అనెస్తీషియా టెక్నీషియన్-1, ఆడియాలజీ టెక్నీషియన్-1, జూనియర్ అడ్మినిస్ట్రేటివ్ అసిస్టెంట్-24, ఫార్మాసిస్ట్-6, రెస్పిరేటరీ ల్యాబొరేటరీ టెక్నీషియన్-2,స్టెనోగ్రాఫర్ గ్రేడ్ 2-1, కార్డియోగ్రఫీ టెక్నీషియన్-5.
» **అర్హత:** పన్నెండో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, డిగ్రీ, బీఎస్సీ, బీఈ/బీటెక్, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** 27 నుంచి 45 ఏళ్లు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీ/ఎక్స్-సర్వీస్‌మెన్ అభ్యర్థులకు పదేళ్ల గరిష్ట వయో పరిమితి ఉంటుంది.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 19.08.2024
» **పరీక్ష తేది:** 14.09.2024.
» **వెబ్‌సైట్:** https://jipmer.edu.in

న్యాయం చేసే లా

» క్లాట్-2025 నోటిఫికేషన్ విడుదల
» క్లాట్ స్కోర్‌తో 24 నేషనల్ లా యూనివర్సిటీల్లో ప్రవేశం
» యూజీ, పీజీ ప్రోగ్రామ్‌లకు వేర్వేరుగా క్లాట్ ఎంట్రన్స్

నేషనల్ లా యూనివర్సిటీస్.. దేశంలో న్యాయ విద్య బోధనలో పేరెన్నిక గల విద్యాసంస్థలు! వీటిలో బ్యాచిలర్, పీజీ స్థాయిలో..'లా' కోర్సులను పూర్తి చేసుకుంటే.. న్యాయవాద వృత్తిలో రాణించే నైపుణ్యాలతోపాటు కార్పొరేట్ కెరీర్స్ సైతం స్వాగతం పలుకుతాయి. ఇలాంటి నేషనల్ లా యూనివర్సిటీల్లో న్యాయవిద్య కోర్సుల్లో ప్రవేశానికి మార్గం.. క్లాట్! 2025 విద్యాసంవత్సరానికి సంబంధించి క్లాట్ నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. క్లాట్-2025 అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..



న్యాయ విద్య కోర్సులు ఎల్ఎల్‌బీ, ఎల్ఎల్ఎంలపై యువతలో ఆసక్తి పెరుగుతోంది. దీనికి కారణం.. సంప్రదాయ న్యాయవాద వృత్తితోపాటు కార్పొరేట్ రంగంలోనూ కొలువులు లభిస్తుండడమే. క్లాట్ స్కోర్ ఆధారంగా ప్రతిష్టాత్మక నేషనల్ లా యూనివర్సిటీల్లో అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీఏ-ఎల్ఎల్‌బీ, అదే విధంగా పీజీ స్థాయిలో ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు. ఇందుకోసం ప్రతిఏటా కన్సార్షియం ఆఫ్ నేషనల్ లా యూనివర్సిటీస్ ఆధ్వర్యంలో క్లాట్‌ను నిర్వహిస్తారు.

క్లాట్ యూజీ, పీజీ

బ్యాచిలర్ స్థాయిలో బీఏ-ఎల్ఎల్‌బీ, పీజీ స్థాయిలో ఎల్ఎల్ఎం కోర్సుల్లో ప్రవేశాలు కల్పించేందుకు క్లాట్-యూజీ, క్లాట్-పీజీ నిర్వహిస్తారు. బీఏ-ఎల్ఎల్‌బీ ప్రవేశం కోసం క్లాట్-యూజీ, ఎల్ఎల్ఎంలో అడ్మిషన్ కోసం క్లాట్-పీజీలో ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది.

అర్హతలు

- **క్లాట్-యూజీ:** కనీసం 45శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత ఉండాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు కనీసం 40 శాతం మార్కులు సాధించాలి. అర్హత కోర్సు చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- **క్లాట్-పీజీ:** కనీసం 50 శాతం మార్కులతో ఎల్ఎల్‌బీ ఉత్తీర్ణత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులకు అయిదు శాతం సడలింపు లభిస్తుంది. ఆయా కోర్సులు చివరి సంవత్సరం అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

120 మార్కులకు పరీక్ష

- క్లాట్-యూజీ పరీక్షను అయిదు విభాగాల్లో నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ 22-26 ప్రశ్నలు, కరెంట్ అఫైర్స్, జీకే 28-32 ప్రశ్నలు, లీగల్ రీజనింగ్ 28-32 ప్రశ్నలు, లాజికల్ రీజనింగ్ 22-26 ప్రశ్నలు, క్వాంటిటేటివ్ టెక్నిక్స్ 10-14 ప్రశ్నలు ఉంటాయి. ఇలా మొత్తంగా అన్ని విభాగాలు కలిపి 120 ప్రశ్నలు అడుగుతారు. పరీక్షకు కేటాయించిన మార్కులు 120. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.
- ఇంగ్లిష్ లాంగ్వేజ్, కరెంట్ అఫైర్స్, లీగల్ రీజనింగ్, లాజికల్ రీజనింగ్‌లలో పూర్తిగా ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలే అడుగుతారు. క్వాంటిటేటివ్ టెక్నిక్స్ విభాగంలోనూ గ్రాఫ్స్, టేబుల్స్, డయాగ్రమ్స్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి.
- మొత్తం ప్రశ్నల్లో.. ఇంగ్లిష్ లాంగ్వేజ్, లాజికల్ రీజనింగ్‌ల నుంచి 20 శాతం చొప్పున; కరెంట్ అఫైర్స్ అండ్ జీకే, లాజికల్ రీజనింగ్‌ల నుంచి 25 శాతం చొప్పున; క్వాంటిటేటివ్ టెక్నిక్స్‌ను నుంచి 10 శాతం చొప్పున ప్రశ్నలు అడిగే అవకాశం ఉంది.

క్లాట్-పీజీ ఇలా

- బీఏ-ఎల్ఎల్‌బీ, లేదా ఎల్ఎల్‌బీ అర్హతగా నేషనల్ లా యూనివర్సిటీల్లోని ఎల్ఎల్ఎం స్పెషలైజేషన్లలోని సీట్ల భర్తీకి క్లాట్-పీజీ పరీక్షను 120 ప్రశ్నలు-120 మార్కులకు నిర్వహిస్తారు. ప్యాసేజ్ ఆధారితంగా ఆబ్జెక్టివ్ తరహాలో ప్రశ్నలు అడుగుతారు.
- పరీక్షలో కాన్‌స్టిట్యూషనల్ లా సంబంధిత ప్రశ్నలు, జ్యూరిస్ప్రుడెన్స్, అడ్మినిస్ట్రేటివ్ లా, లా ఆఫ్ కాంట్రాక్ట్, టార్ట్స్, ఫ్యామిలీ లా, క్రిమినల్ లా, ప్రాపర్టీ లా, కంపెనీ లా, పబ్లిక్ ఇంటర్నేషనల్ లా, ట్యాక్స్ లా, ఎన్విరాన్‌మెంటల్ లా, లేబర్ అండ్ ఇండస్ట్రియల్ లా విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తులు ప్రారంభం:** 15.07.2024
- **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ:** 15.10.2024
- **క్లాట్ పరీక్ష తేదీ:** 2024, డిసెంబర్ 1
- **వెబ్‌సైట్:** https://consortiumofnlus.ac.in/clat-2025

రాత పరీక్షలో రాణించేలా

క్లాట్ ఎంట్రన్స్‌లలో విజయం సాధించాలంటే.. విద్యార్థులు నిర్దిష్ట వ్యూహంతో అడుగులు వేయాలి. క్లాట్ యూజీకి పోటీ అధికంగా ఉంటుంది. కాబట్టి సిలబస్‌ను, గత ప్రశ్న పత్రాలను పరిశీలించి.. సెక్షన్ల వారీగా పటిష్ట ప్రణాళికతో ప్రిపరేషన్ సాగించాలి. అయిదు సెక్షన్లలోనూ మెరుగైన ప్రతిభ చూపే ప్రయత్నం చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఇంగ్లిష్ లాంగ్వేజ్ నైపుణ్యాన్ని పరిశీలించే ఈ సబ్జెక్ట్‌లో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు ఉంటాయి. ఈ విభాగంలో రాణించడానికి కాంప్రహెన్షన్, ప్యాసేజ్ రీడింగ్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. సునిశిత పరిశీలన నైపుణ్యం, ఇచ్చిన ప్యాసేజ్ సారాంశాన్ని గ్రహించడం, ప్యాసేజ్ ప్రధాన ఉద్దేశం తెలుసుకోవడం వంటి నైపుణ్యాలు పెంచుకోవాలి. ఇందుకోసం జనరల్ ఎస్సేలు, న్యూస్ పేపర్ ఎడిటోరియల్స్, ఇతర ముఖ్య ప్రచురణలు చదవాలి.

కరెంట్ అఫైర్స్, జనరల్ నాలెడ్జ్

సమకాలీన అంశాలు, కళలు, సంస్కృతి, అంతర్జాతీయ వ్యవహారాలు, ప్రాధాన్యత కలిగిన చారిత్రక అంశాలకు సంబంధించిన ప్యాసేజ్‌లు ఇచ్చి వీటి నుంచి ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు జాతీయోద్యమంలో కీలక ఘట్టాలపై దృష్టి పెట్టాలి. భారత రాజ్యాంగానికి సంబంధించి రాజ్యాంగ రూపకల్పన నుంచి తాజా సవరణల వరకూ.. అన్నీ తెలుసుకోవాలి. కరెంట్ అఫైర్స్‌కు సంబంధించి అంతర్జాతీయ స్థాయిలో ద్వైపాక్షిక ఒప్పందాలు, ముఖ్యమైన సంఘటనలు, సదస్సుల గురించి పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి.

లీగల్ రీజనింగ్

న్యాయపరమైన దృక్పథం, సహేతుక ఆలోచన ధోరణి, నిర్ణయ సామర్థ్యాలను పరీక్షించే విభాగం ఇది. ఇందులో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. సంబంధిత ప్యాసేజ్‌ల నుంచి నిబంధనలు, సిద్ధాంతాలు, వాస్తవాలు, వాటిద్వారా చోటు చేసుకుంటున్న మార్పులకు సంబంధించిన ప్రశ్నలు ఉంటాయి. నిర్దిష్టంగా ఒక సంఘటన, వివాదాన్ని పరిష్కరించేందుకు అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం కనుగొనే నైపుణ్యం పొందాలి. ముఖ్యమైన చట్టాలు, న్యాయ శాఖకు సంబంధించి ఇటీవల కాలంలో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, లీగల్ టెర్మినాలజీపై అవగాహన ఏర్పరచుకోవడం కూడా ఈ విభాగంలో మంచి మార్కులకు దోహదం చేస్తుంది.

లాజికల్ రీజనింగ్

తార్కిక విశ్లేషణ సామర్థ్యాన్ని పరీక్షించే ప్రశ్నలు ఉండే విభాగం ఇది. ఇందులోనూ ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలకే ఎక్కువ ప్రాధాన్యం ఉంటుంది. ఈ విభాగంలో ప్యాసేజ్ ఆధారిత ప్రశ్నలు; అసెర్షన్ అండ్ రీజనింగ్ విధానంలో ప్రశ్నలు అడుగుతారు. ఇందుకోసం సిలాజిజమ్, కోడింగ్-డీ కోడింగ్, డైరెక్షన్, అనాలజీ, సిరీస్, సీటింగ్ అరేంజ్‌మెంట్ వంటి అంశాలపై అవగాహన పొందాలి. స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నల కోసం కంపేరిటివ్ అప్రోచ్‌ను అలవర్చుకోవాలి.

క్వాంటిటేటివ్ టెక్నిక్స్

ఈ విభాగంలో రాణించేందుకు పదో తరగతి స్థాయిలోని గణిత అంశాలపై పట్టు సాధించాలి. గత ప్రశ్న పత్రాలను పరిశీలిస్తే.. అర్థమెటిక్‌కు కొంత ఎక్కువ వెయిటేజీ కనిపిస్తోంది. కాబట్టి పర్సంటేజెస్, టైమ్ అండ్ డిస్టెన్స్, టైమ్ అండ్ స్పీడ్, యావరేజెస్, రేషియోస్ తదితర అంశాలను ప్రాక్టీస్ చేయాలి. గ్రాఫ్‌లు, చార్ట్‌లను విశ్లేషించే నైపుణ్యం సొంతం చేసుకోవాలి.

క్లాట్ పీజీకి ఇలా

తాజాగా ముఖ్యమైన తీర్పులు, రాజ్యాంగ, శాసన పరమైన అంశాలు, చారిత్రాత్మక తీర్పులు, వాటి ప్రభావం వంటి అంశాలపై అవగాహన పెంచుకోవాలి. తాము ఎంపిక చేసుకోనున్న స్పెషలైజేషన్‌కు సంబంధించి అకడమిక్‌గా బ్యాచిలర్ స్థాయిలోని అంశాలపై పట్టు సాధించడం మేలు చేస్తుంది.

కెరీర్ అవకాశాలు

క్లాట్‌లో విజయంతో నేషనల్ లా యూనివర్సిటీల్లో అడుగు పెట్టి కోర్సులు పూర్తి చేసుకున్న వారికి ఉజ్వల కెరీర్ అవకాశాలు ఖాయమని చెప్పొచ్చు. న్యాయవాద వృత్తి మాత్రమే కాకుండా.. కార్పొరేట్ కొలువులు సైతం సొంతం చేసుకునే అవకాశం లభిస్తుంది. ప్రస్తుతం అంతర్జాతీయ వాణిజ్య విధానాలు, పలు దేశాల కంపెనీల మధ్య ఒప్పందాలతో కార్యకలాపాలు జరుగుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో ఎదురయ్యే న్యాయ సమస్యల పరిష్కారానికి సంస్థలు న్యాయ నిపుణులను నియమించుకుంటున్నాయి. నేషనల్ లా యూనివర్సిటీల్లో కార్పొరేట్ సంస్థలు క్యాంపస్ రిక్రూట్‌మెంట్స్ సైతం నిర్వహిస్తున్నాయి. క్యాంపస్ డ్రైవ్స్‌లో సగటున రూ.8 లక్షల వార్షిక వేతనంతో కొలువులు ఖరారవుతున్నాయి.

క్లుప్తంగా...

మద్య నిషేధం చాలా కష్టం

ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్



సాక్షి, అమరావతి: ఏపీలో మద్య నిషేధం అమలు చేయడం సాధ్యపడదని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ అన్నారు. శాసనసభలో బుధవారం ఎక్సైజ్ రంగంపై సీఎం చంద్ర బాబు శ్వేతపత్రం విడుదల చేశారు. ఈ చర్చలో పవన్ మాట్లాడుతూ.. 'మద్య నిషేధం అమలు చాలా కష్టం. యానాం తో పాటు తెలంగాణ, ఒడిశా, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల తో సరిహద్దులను పంచుకుంటున్నాం. దీంతో నే ఎక్కువ ఇబ్బంది. గతంలోనూ మద్య నిషేధం పెట్టారు. ఏం సాధించలేకపోయారు. కానీ, దీనిని రెగ్యులేట్ చేయాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. గత ప్రభుత్వ మద్యం పాల సీతో ప్రజలు అనారోగ్యం పాలయ్యారని.. ప్రభుత్వ ఆదాయానికి కూడా నష్టం వచ్చిందని పవన్ ఆరోపించారు.

ప్యానల్ స్పీకర్‌గా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే సుధ

సాక్షి, అమరావతి: శాసన సభ ప్యానల్ స్పీకర్‌గా వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దాసరి సుధ నామినేట్ అయ్యారు. ఆమెతో పాటు, జనసేన ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, టీడీపీ ఎమ్మెల్యేలు వరదరాజులు రెడ్డి, జ్యోతుల నెహ్రూ, కోళ్ల లలితకుమారి, బీజేపీ ఎమ్మెల్యే పి. విష్ణు కుమార్ రాజులు ప్యానల్ స్పీకర్‌లుగా నామినేట్ అయినట్లు స్పీకర్ బుధవారం శాసన సభలో ప్రకటించారు. బీజేపీ ఫ్లోర్ లీడర్‌గా విష్ణుకుమార్ రాజు, ఆ పార్టీ చీఫ్ విప్‌గా ఆదినారాయణ రెడ్డిని గుర్తించినట్లు చెప్పారు.

కోరం లేక మండలి వాయిదా

సాక్షి, అమరావతి: తగినంత మంది సభ్యులు(కోరం) లేకపోవడంతో బుధవారం శాసనమండలి కొద్దిసేపు వాయిదా పడింది. మధ్యాహ్నం భోజన విరామం అనంతరం సమావేశమైన సభలో కోరం(మొత్తం సభ్యుల్లో పది శాతం మంది) లేకపోవడాన్ని మండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు గుర్తించారు. సభ్యులు లేకుండా సభ నడపడం సరికాదని మంత్రి పయ్యావుల కేశవ్‌కు చెప్పి సభను వాయిదా వేశారు. దీంతో మంత్రి పయ్యావులతో పాటు పలువురు అధికారపక్షం సభ్యులు బయటకు వెళ్లి ఎమ్మెల్సీలను తీసుకొచ్చే ప్రయత్నం చేశారు.

చేనేతకు పూర్వ వైభవం

రాష్ట్ర బీసీ సంక్షేమ, జౌళి శాఖ మంత్రి సవిత


సాక్షి, అమరావతి: ఎన్డీయే ప్రభుత్వం ఏర్పాటుతో రాష్ట్రంలో చేనేత రంగానికి పూర్వ వైభవం వచ్చిందని బీసీ, జౌళి శాఖా మంత్రి ఎస్. సవిత అన్నారు. ప్రతి చేనేత కార్మికుడికీ పని కల్పించాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. బుధవారం చేనేత కార్మిక సంఘా ల నాయకులు మంత్రి సవితను సచివాల యంలో కలిశారు. వచ్చే నెల ఏడో తేదీన విజయవాడలో జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా ఎగ్జిబిషన్ నిర్వహి స్తున్నామని తెలిపారు. ఈ ఎగ్జిబిషన్లో చేనేత కార్మికులు స్టాల్లు ఏర్పాటు చేయాలని సూచించారు..

వైఎస్సార్‌సీపీకి మాజీ ఎమ్మెల్యే కిలారి రాజీనామా

నెహ్రూనగర్: వైఎస్సార్‌సీపీకి గుంటూరు జిల్లా పొన్నూరు మాజీ ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య రాజీనామా చేశారు. బుధవారం గుంటూరులో ఆయన మాట్లాడుతూ.. 2019 ఎన్నికల్లో పొన్నూరు ఎమ్మెల్యేగా పోటీ చేసేందుకు అవకాశం కల్పించినందుకు వైఎస్ జగన్‌కు ధన్యవాదాలు తెలిపారు. 2024లో పొన్నూరుకు బదులు గుంటూరు ఎంపీ స్థానం నుంచి పోటీ చేయాలని పార్టీ అధిష్టానం ఆదేశించిందని చెప్పారు. ఆ మేరకు పనిచేశానని తెలిపారు. కానీ పార్టీలో కొందరు తనకు వ్యతిరేకంగా పనిచేశారని చెప్పారు.శాసనమండలిలో ప్రతిపక్ష నేత హోదాను వేరే వ్యక్తికి ఇచ్చే విషయంలో వైఎస్సార్‌సీపీలోని సీనియర్ నేత ఉమ్మారెడ్డిని కనీసం సంప్రదించలేదన్నారు. వీటితో పాటు పలు కారణాల వల్ల వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ రైల్వేకి రూ.9,151 కోట్లు

కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్‌లో రైల్వేకి సంబంధించి ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,151 కోట్లు కేటాయించినట్లు కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ తెలిపారు. ఢిల్లీలోని రైల్‌భవన్‌లో బుధవారం ఆయన మీడియాతో మాట్లా డారు. ఉమ్మడి ఏపీలో యూపీఏ హయాంతో పోలిస్తే ఇప్పుడు ఏపీకి 10 రెట్లు ఎక్కువ నిధులు కేటాయిస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం ఏపీలో రూ.73,743 కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టులు నిర్మాణంలో ఉన్నాయని, అమృత్ భారత్ పథకంలో 73 రైల్వేస్టేషన్లు ఉన్నాయని చెప్పారు. 2014 నుంచి ఏపీలో 743 అండర్ పాస్, ఫ్లై ఓవర్ల నిర్మాణం జరిగిందన్నారు. విశాఖ కేంద్రంగా ఏర్పాటుకానున్న సౌత్ కోస్ట్ రైల్వే జోన్ కోసం వేరే భూమి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు చెప్పారు. ఈ విషయమై కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఇప్పటికే విశాఖలో రైల్వే అధికారులతో చర్చించారని, ఢిల్లీలో తాను సమీక్షించానని తెలిపారు.

మందు'బాబు' దందానే!

మొదటి పేజీ తరువాయి

దశలవారీ మద్య నియంత్రణ విధానాన్ని సమర్థంగా అమలు చేయడంతో విక్రయాలు తగ్గాయని ఎక్సైజ్ శాఖ గణాంకాలు, కేంద్ర ప్రభుత్వ నివేదికలే వెల్లడిస్తున్నాయి.

చంద్రబాబు ఆరోపణలు వాస్తవాలు

మేం పారదర్శకంగా మద్యం విధానాన్ని అమలు చేస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మద్యం దందాకు పాల్పడింది.

టీడీపీ సిండికేట్ మద్యం దోపిడీకి నిదర్శనాలివిగో..

- 2014–19 మధ్య టీడీపీ మద్యం సిండికేట్ చెలరేగడంతో పర్మిట్ రూమ్‌లు, బెల్ట్ దుకాణాలతో మద్యం ఏరులై పారింది.
- ఉదయం 10 గంటల నుంచి రాత్రి 11 వరకు జోరుగా విక్రయాలు. అనధికారికంగా 24 గంటలూ దందా.
- 4,380 మద్యం దుకాణాలకు అనుబంధంగా అంతే సంఖ్యలో పర్మిట్ రూమ్‌లకు అనుమతి. వీటికి తోడు 43 వేలకు పైగా బెల్ట్ దుకాణాలు.
- ఎమ్మార్పీ కంటే 25 శాతం అధిక ధరలకు అమ్మకాలు.
- ఏటా బార్ల సంఖ్య పెంపు.
- జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే (ఎన్ఎఫ్‌హెచ్ఎస్) నివేదిక ప్రకారం 2015–16లో ఏపీలో 34.9 శాతం మంది పురుషులకు, 0.4 శాతం మంది మహిళలకు మద్యం అలవాటు ఉంది.

పచ్చ సిండికేట్ దోపిడీ రూ.12.50 లక్షల కోట్లు

మద్యం దందాను వ్యవస్థీకృతం చేసి రూ.12.50 లక్షల కోట్ల దోపిడీకి పాల్పడ్డ చరిత్ర బాబు సర్కారుదే. 2014 నుంచి 2019 వరకు మద్యం సిండికేట్‌ను టీడీపీ నేతలు తమ గుప్పిట్లో ఉంచుకుని బడి, గుడి అనే విచక్షణ లేకుండా మద్యం దుకాణాలకు అనుమతులిచ్చేశారు. పర్మిట్ రూమ్‌ల పేరుతో అనధికారిక బార్లను తెరిచేసి మరో 43 వేల బెల్ట్ దుకాణాలను నెలకొల్పి ఏరులై పారించారు. ఎంఆర్‌పీ కంటే రూ.10 నుంచి రూ.25 వరకు అధిక ధరలకు విక్రయించి సొమ్ము చేసుకున్నారు. ఏడాదికి రూ.2.50 లక్షల కోట్ల చొప్పున ఐదేళ్లలో రూ.12.50 లక్షల కోట్లు కొల్లగొట్టారు.



ఊరూ పేరూ లేని బ్రాండ్లు తెచ్చారు..

అవన్నీ మీరు తెచ్చిన బ్రాండ్లే చంద్రబాబూ!

- ప్రెసిడెంట్ మెడల్, హైదరాబాద్ బ్లూ డీలక్స్ బ్రాండ్ల విస్కీకి చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2017 నవంబరు 22న అనుమతి ఇచ్చారు.
- గవర్నర్ రిజర్వ్, లెఫైర్ నెపోలియన్, ఓక్టోన్ బారెల్ ఏజ్డ్, సెవెన్త్ హెవెన్ బ్లూ బ్రాండ్ల పేరుతో విస్కీ, బ్రాందీ తదితర 15 బ్రాండ్లకూ టీడీపీ సర్కారే 2018 అక్టోబరు 26న ఒకేసారి అనుమతులిచ్చింది.
- హైవోల్టేజ్, వోల్టేజ్ గోల్డ్, ఎస్ఎన్‌జీ 10000, బ్రిటీష్ ఎంపైర్ సూపర్ స్ట్రాంగ్ ప్రీమియం బీర్, బ్రిటీష్ ఎంపైర్ అల్ట్రా బ్రాండ్లతో బీరు విక్రయాలు సైతం బాబు సర్కారు నిర్వాకాలే. ఆ బ్రాండ్లకు టీడీపీ ప్రభుత్వం 2017 జూన్ 7న అనుమతి జారీచేసింది.
- రాయల్ ప్యాలెస్, న్యూకింగ్, సైన్ అవుట్ పేర్లతో విస్కీ, బ్రాందీ బ్రాండ్లకూ చంద్రబాబే 2018 నవంబరు 9న అనుమతిచ్చారు.
- బిరా –91 పేరుతో మూడు రకాల బీర్ బ్రాండ్లకు 2019 మే 14న చంద్రబాబు ప్రభుత్వమే అనుమతి ఇచ్చింది. అప్పటికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇంకా అధికారం చేపట్టలేదు.
- ఆ మర్నాడే టీఐ మ్యాన్షన్ హౌస్, టీఐ కొరియర్ నెపోలియన్ విస్కీ, బ్రాందీ బ్రాండ్లకూ టీడీపీ సర్కారే అనుమతినిచ్చిందన్నది నిజం!

మేనిఫెస్టోలో హామీని వైఎస్సార్‌సీపీ ఉల్లంఘించింది..

దశలవారీ మద్య నియంత్రణను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమర్థంగా అమలు చేసింది.

2019లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన తరువాత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రాష్ట్రంలో మద్యం దందాపై ఉక్కు పాదం మోపింది. ప్రైవేట్ మద్యం దుకాణాల విధానాన్ని రద్దు చేసి 2019 అక్టోబరు 1 నుంచి మద్యం దుకాణాలను ప్రభుత్వపరం చేశారు. టీడీపీ హయాంలో 4,380 మద్యం దుకాణాలు ఉండగా వైఎస్ జగన్ ప్రభుత్వం వాటిని 2,934కి తగ్గించింది. మద్యం దుకాణాల వేళలను కుదిస్తూ ఉ.10 నుంచి రాత్రి 9 వరకే పరిమితంగా విక్రయాలకు అనుమతించారు. 4,380 పర్మిట్ రూమ్‌లు రద్దు చేశారు. 43 వేల బెల్ట్ దుకాణాలను పూర్తిగా తొలగించారు. కొత్త బార్లకు లైసెన్సులు ఇవ్వలేదు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీకి కట్టుబడుతూ మద్యం వినియోగాన్ని నిరుత్సాహపరిచేందుకు షాక్ కొట్టేలా ధరలు పెంచారు. అక్రమ మద్యాన్ని అరికట్టేందుకు 'స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (ఎస్ఈబీ) ఏర్పాటు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపట్టిన సంస్కరణలు సత్ఫలితాలనిచ్చాయి. టీడీపీ హయాంతో పోలిస్తే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మద్యం విక్రయాలు సగానికి పడిపోయాయి.

ఏపీలో మద్యం వినియోగం తగ్గింది: కేంద్రం

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్‌లో మద్యం వినియోగం తగ్గిందని కేంద్ర ప్రభుత్వమే వెల్లడించడం గమనార్హం. మద్యం అలవాటు 2015–16లో పురుషుల్లో 34.9 శాతం, మహిళల్లో 0.4 శాతం ఉంది. 2019–21 మధ్య పురుషుల్లో ఈ అలవాటు 31.2 శాతానికి, మహిళల్లో 0.2 శాతానికి తగ్గినట్లు పార్లమెంట్‌కు సమర్పించిన నివేదికలో కేంద్ర హోంశాఖ వెల్లడించింది.

మద్యంపై ఆదాయం తగ్గింది ఇలా..

2017–18లో చంద్రబాబు హయాంలో మద్యం విక్రయాలు రూ.3.60 కోట్లు ఉండగా 2020–21సమయంలోని వైఎస్సార్‌సీపీ హయాంలో ఆ విక్రయాలు రూ.1.87 కోట్లకు తగ్గాయి. అలాగే, 2018–19లో చంద్రబాబు హయాంలో మద్యం విక్రయాలు రూ.3.84 కోట్లు ఉండగా.. 2023–24 సమయంలోని వైఎస్సార్‌సీపీ హయాంలో అది రూ.3.32 కోట్లకు తగ్గాయి.

నాణ్యత లేని మద్యంతో వినియోగదారుల ఆరోగ్యం దెబ్బతింది

వైఎస్సార్‌సీపీ హయాంలో రాష్ట్రంలో మద్యం నాణ్యతపై టీడీపీ గత ఐదేళ్లు పదేపదే సాగించిన దుష్ప్రచారం బెడిసికొట్టింది. నాడు మద్యంలో విషపు అవశేషాలు ఉన్నట్లు చెన్నైలోని ఎస్‌జీఎస్ లేబొరేటరీ పేరిట ఓ తప్పుడు నివేదికను టీడీపీ ప్రచారంలోకి తెచ్చింది. అయితే అలాంటి నివేదికేదీ తాము ఇవ్వలేదని ఆ సంస్థ స్పష్టం చేసింది. తాము పరీక్షించిన మద్యం నమూనాల్లో అవశేషాలు పరిమితికి లోబడే ఉన్నాయని, అవి ప్రమాదకరం కాని సహజ సిద్ధమైన మొక్కల నుంచి తయారైనవేనని ఆ లేబొరేటరీ ప్రకటించింది. తమ నివేదికను తప్పుగా అన్వయించారని పేర్కొంది. అయినప్పటికీ రాష్ట్ర బెవరేజస్ కార్పొరేషన్ మద్యం నమూనాలను హైదరాబాద్‌లోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్)కు చెందిన ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ ల్యాబ్‌లో పరీక్షించింది. ఆ నమూనాలన్నీ నిర్దేశిత ప్రమాణాల ప్రకారమే ఉన్నాయని నివేదిక ఇచ్చింది.

- 2014-19 మధ్య టీడీపీ హయాంలో మద్యం నాణ్యత పరీక్షలు తూతూ మంత్రంగా నిర్వహించారు. ఆ ఐదేళ్లలో 96,614 శాంపిల్స్ మాత్రమే సేకరించి పరీక్షించారు. వైఎస్సార్‌సీపీ హయాంలో మద్యం నాణ్యత పరీక్షల కోసం బెవరేజస్ కార్పొరేషన్ రూ.12.5 కోట్లతో అత్యాధునిక లేబరేటరీలను ఏర్పాటు చేసింది. సగటున ఏడాదికి 1,26,083 శాంపిల్స్‌ను పరీక్షించారు.

డిస్టిలరీలన్నీ లాక్కున్నారు..

ఆ డిస్టిలరీలన్నీ మీరు నుమతిచ్చినవే... మీ వాళ్లవే చంద్రబాబూ!! రాష్ట్రంలో 20 మద్యం డిస్టిలరీలు ఉంటే వాటిలో 14 డిస్టిలరీలకు చంద్రబాబు సీఎంగా ఉండగానే అనుమతినిచ్చారు. మిగిలిన 6 డిస్టిలరీలకు అంతకుముందు ప్రభుత్వాలు అనుమతినిచ్చాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కొత్తగా ఒక్క డిస్టిలరీకీ అనుమతి ఇవ్వలేదు. మద్యం తయారీ డిస్టిలరీలన్నీ చంద్రబాబు అనుయాయుల గుప్పిట్లోనే ఉన్నాయన్నది నిజం. ఆ డిస్టిలరీలకు అనుమతులు ఇచ్చిందీ కూడా గతంలో టీడీపీ ప్రభుత్వమే. ఆ డిస్టిలరీలు తయారు చేసిన మద్యాన్నే గతంలో టీడీపీ హయాంలో విక్రయించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ హయాంలోనూ అదే మద్యాన్నే విక్రయించారు. మరి అందులో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కొత్తగా చేసిన అక్రమం ఏముంది? టీడీపీ అధికారంలో ఉంటే మద్యం నాణ్యమైనదని.. లేదంటే నాసిరకమని దుష్ప్రచారం చేయడం చంద్రబాబు బృందానికి, పచ్చ మీడియాకే చెల్లింది.

డిస్టిలరీలన్నీ పచ్చ ముఠావే..

రాష్ట్రంలోని డిస్టిలరీలన్నీ దాదాపుగా టీడీపీ కీలక నేతల కుటుంబాల చేతుల్లోనే ఉన్నాయి. పీఎంకే డిస్టిలరీ టీడీపీ సీనియర్ నేత యనమల రామకృష్ణుడి అల్లుడు, టీడీపీ ఎమ్మెల్యే పుట్టా మధుసూదన్ యాదవ్ కుమారుడు, ప్రస్తుతం ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్‌కుమార్‌ది.

- శ్రీకృష్ణ ఎంటర్‌ప్రైజెస్ టీడీపీ మాజీ ఎంపీ దివంగత డీకే ఆదికేశవులనాయుడు కుటుంబానిది.
- ఎస్పీవై ఆగ్రో ప్రొడక్ట్స్ టీడీపీ నేత, మాజీ ఎంపీ ఎస్పీవై రెడ్డి కుటుంబానిది. వైఎస్సార్‌సీపీ తరఫున ఎంపీగా గెలిచిన ఎస్పీవై రెడ్డి నిబంధనలకు విరుద్ధంగా టీడీపీలోకి ఫిరాయించినందుకు నజరానాగా ఆ డిస్టిలరీకి నాడు చంద్రబాబు అనుమతిచ్చారు.
- గత ఎన్నికలకు ముందు ఆగమేఘాల మీద 2019 ఫిబ్రవరి 25న అనుమతినిచ్చిన విశాఖ డిస్టిలరీస్‌లో అప్పటి మంత్రి, ప్రస్తుత స్పీకర్ అయ్యన్న పాత్రుడు వాటాదారుగా ఉన్నారు.

తల్లికి వందనం ఇప్పుడే కాదు

శాసనమండలిలో పరోక్షంగా చెప్పిన మంత్రి నారా లోకేశ్



సాక్షి, అమరావతి: ఎంతమంది పిల్లలు ఉంటే అంత మందికీ 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామంటూ ఊదరగొట్టిన విద్య, మానవ వనరుల అభివృద్ధి శాఖల మంత్రి లోకేశ్ ఇప్పుడు నాలుక మడతేశారు. తల్లులు, పిల్లల్ని మోసం చేస్తున్నారు. పిల్లల డేటా సిద్ధంగా ఉన్నా.. విధివిధానాల రూపకల్పనలో జాప్యం జరుగుతోందని చెబుతూ.. ఇప్పట్లో పథకం అమలు చేయబోమని శాసన మండలిలో ప్రశ్నోత్తరాల సమయంలో పరోక్షంగా చెప్పారు. తల్లికి వందనం అమలుకు విధివిధానాలు రూపొందించడానికి కొంత సమయం కావాలని అడిగామని, దీనిపై మంత్రులందరితో చర్చిస్తున్నట్టు చెప్పారు. పథకం పకడ్బందీగా అమలు చేయాలని తమ ఉద్దేశమంటూ చెప్పుకొచ్చారు. అర్హులు ఎంత మంది ఉన్నా ఇవ్వాలనేది ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ పథకం ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకూ వర్తిస్తుందని చెప్పారు. 2019–24 మధ్య ప్రభుత్వ బడుల్లో సుమారు 72 వేల మంది విద్యార్థులు తగ్గారని, దీనిపైనా చర్చిస్తున్నామన్నారు. గత ప్రభుత్వం 'నాడు– నేడు' కార్యక్రమం ద్వారా వందల కోట్లు ఖర్చు పెట్టింది వాస్తవమని అన్నారు. గత ప్రభుత్వం సీబీఎస్ఈ బోర్డు పరీక్షలు పెట్టి, ఆ తర్వాత ఐబీ, టోఫెల్ తెచ్చిందన్నారు. విద్యా రంగంలో నిర్ణయాలు తీసుకున్నప్పుడు ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలతో చర్చించి, అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారం వెతకాలని అన్నారు. వచ్చే సంవత్సరం ఏం చేయాలో అందరితో చర్చించి రోడ్ మ్యాప్ సిద్ధం చేద్దామని చెప్పారు. టీచర్ల భర్తీ దిశగా తొలి అడుగు వేశామని, వచ్చే సంవత్సరానికి పూర్తి చేస్తామని వెల్లడించారు. 3 నుంచి 10వ తరగతి విద్యార్థులకు టోఫెల్ పరీక్షలపై ఉపాధ్యాయులు, సంఘాల నుంచి అభ్యంతరం వచ్చినందున, ఆ కార్యక్రమాన్ని సమీక్షిస్తామని లోకేశ్ మరో ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఏం చేస్తున్నారో పరిశీలిస్తున్నామన్నారు. టోఫెల్‌పై సమీక్షించి, వంద రోజుల్లో యాక్షన్‌ప్లాన్ తయారు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం తీసుకొనిచ్చిన ఇంగ్లిష్ మీడియంకు వ్యతిరేకం కాదని, టీచర్ ట్రైనింగ్ లేకుండా ఆ నిర్ణయం తీసుకోవడం కరెక్టు కాదని అన్నారు.

మద్యం పేదల వ్యసనం

- **శ్వేతపత్రం విడుదలలో సీఎం చంద్రబాబు**



సాక్షి, అమరావతి: పేదలకు మద్యపానం ఓ వ్యసనమని, శారీరక శ్రమ చేసిన తర్వాత రెండు పెగ్గులు వేసుకునేవారికి గత ప్రభుత్వం మద్యం లభించకుండా చేసిందని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారు. మద్యాన్ని అధిక ధరలకు అమ్మడంతో తెలంగాణ, కర్ణాటక ఆదాయం పెరిగిందన్నారు. తగ్గిన ఆదాయం నాటి నాయకుల జేబుల్లోకి వెళ్లిందని ఆరోపించారు. 2019–24 మద్యం అమ్మకాలపై సీఎం చంద్రబాబు బుధవారం శాసనసభలో శ్వేతపత్రం విడుదల చేసి మాట్లాడారు. గత పాలకులు మద్యపాన నిషేధంపై చిత్తశుద్ధితో వ్యవహరించకపోవడంతో బ్లాక్ మార్కెటింగ్ పెరిగిందని ఆరోపించారు. 4,380 మద్యం షాపులను 2,934కి తగ్గించి మళ్లీ ఏపీ టీడీసీ టూరిజం పేరుతో దుకాణాల సంఖ్యను 3,392కి పెంచారన్నారు. 2019లో ఉన్న 840 బార్లను అలాగే కొనసాగించారన్నారు. దీనివల్ల అక్రమ రవాణా పెరిగిందన్నారు. 2014–19లో ఏపీకి, తెలంగాణకు మద్యం ఆదాయంలో వ్యత్యాసం రూ.4,186.70 కోట్లు ఉంటే 2019–24లో ఏకంగా రూ.42,762 కోట్లకు చేరడంతో 10 రెట్ల ఆదాయం ఏపీకి తగ్గిపోయిందన్నారు. మద్యం పాలసీలో వ్యత్యాసం వల్ల ఆదాయంలో తెలంగాణ ముందుందన్నారు. అన్ని వ్యయాలు పోనూ ఐదేళ్లలో ప్రభుత్వానికి రావాల్సిన రూ.18,860 కోట్ల ఆదాయం తగ్గిపోయిందన్నారు. ఇతర రాష్ట్రాలు లాభపడితే ఆంధ్రప్రదేశ్ నష్టపోయిందన్నారు. పేదవాడు తాగే లిక్కర్ రేట్లు పెంచి 99.97 శాతం బ్రాండ్లు లేకుండా చేశారని విమర్శించారు. మద్యం అమ్మకాల్లో లిక్కర్ కేసుకు రూ.200, బీరు కేసుకు రూ.50 చొప్పున అక్రమంగా వసూలు చేశారని, 2019–24 మధ్య రూ.3,113 కోట్లు అక్రమంగా వసూలు చేశారని ఆరోపించారు.

ధరలు తగ్గిస్తాం.. సీఐడీ, ఈడీతో దర్యాప్తు

ఆబ్కారీ శాఖను ఒకే తాటిపైకి తెస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. మద్యం ధరలు పేదలకు అందుబాటులో ఉండేలా చేస్తామన్నారు. డిజిటల్ పేమెంట్ విధానం అమలు చేస్తామని చెప్పారు. గత ప్రభుత్వంలో జరిగిన మద్యం అమ్మకాలపై సీబీసీఐడీ, ఈడీతో దర్యాప్తు చేయిస్తామని ప్రకటించారు.

మానవీయ కోణంలో పనిచేయండి

అధికారులు రూల్స్ అనే కోణంలో పని చేయకూడదని చంద్రబాబు స్పష్టం చేశారు. బ్యూరోక్రటిక్ కోణం కాకుండా మానవీయ కోణంతో పనిచేయాలని సూచించారు. బుధవారం సచివాలయంలో మంత్రులు, ప్రభుత్వ శాఖల కార్యదర్శులు, శాఖాధిపతులతో సీఎం సమావేశమయ్యారు. రూ. లక్ష కోట్ల వరకు బిల్లులు, బకాయిలు ఉన్నా యన్నారు. రాయలసీమలో ఇండస్ట్రియల్ కారిడార్‌కు ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు కేంద్రం సిద్ధంగా ఉందన్నారు.

రేపు ఢిల్లీకి బాబు

చంద్రబాబు శుక్రవారం (రేపు) ఢిల్లీ వెళ్లనున్నారు. కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి సముచిత స్థానం ఇచ్చారని భావిస్తున్న ఆయన అందుకు ప్రధాని ఇతర మంత్రులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఢిల్లీ వెళుతున్నారని అధికారవర్గాలు చెబుతున్నాయి. కాగా, సీఎం చంద్రబాబుతో బుధవారం ఆస్ట్రేలియా హై కమిషనర్ ఫిలిప్ గ్రీన్ సమావేశమయ్యారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు అనువైన వాతావరణం ఉందని, అక్కడి పారిశ్రామికవేత్తలు ఏపీలో పెట్టుబడులు పెట్టేలా చూడాలని చంద్రబాబు ఆయన్ని కోరారు.

రీ సర్వేపై చంద్రబాబు యూటర్న్

రీసర్వేపై వైఎస్ జగన్ ప్రభుత్వ దారిలోకి సీఎం

- 9 రోజుల కింద రీ సర్వే విఫలయత్నమన్న బాబు
- వైఎస్సార్‌సీపీ అనాలోచితంగా చేపట్టిందని, దాన్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటన
- రీ సర్వే చేసే రాష్ట్రాలకు కేంద్రం ప్రత్యేక ప్రయోజనాలు ప్రకటించడంతో కొత్త రాగం
- రీ సర్వేను హోల్డ్ చేశామంటూ శాసన సభలో చెప్పిన బాబు
- క్షుణ్ణంగా పరిశీలించాక ముందుకెళ్తామంటూ సన్నాయి నొక్కులు



ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ రద్దు

సాక్షి, అమరావతి: వందేళ్ల తర్వాత వైఎస్ జగన్ ప్రభుత్వం రాష్ట్రంలో చేపట్టిన భూముల రీ సర్వేపై నానా యాగీ చేసి, దాన్ని రద్దు చేస్తామంటూ చిందులేసిన సీఎం చంద్రబాబు.. ఇప్పుడు దిగొచ్చారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ బాటలోకి వచ్చారు. భూముల రీసర్వే చేపట్టే రాష్ట్రాలకు ప్రత్యేక ప్రయోజనాలు కల్పిస్తామంటూ కేంద్రం ప్రకటించింది. తద్వారా రీ సర్వే సక్రమమేనని తేల్చి చెప్పింది. దీంతో చంద్రబాబు దిగిరాక తప్పలేదు. రీ సర్వేపై స్టడీ చేస్తున్నామంటూ శాసన సభలో సన్నాయి నొక్కులు నొక్కారు. 9 రోజుల కిందట తాను తూర్పారబట్టిన కార్యక్రమాన్ని ఈరోజు తానే భుజాలకెత్తుకొనే ప్రయత్నం చేశారు. దీంతో సభలో సభ్యులంతా ఆశ్చర్యపోయారు.

రాష్ట్రంలో గత వందేళ్లుగా భూముల సమగ్ర సర్వే జరగలేదు. దీనివల్ల రాష్ట్రవ్యాప్తంగా అనేక వివాదాలు నెలకొనడంతో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం పేరుతో రీ సర్వే చేపట్టి, భూ యజమానులను వివాదాల నుంచి బయటపడేసి, వారి భూములకు రక్షణ కల్పించింది. ఇదే చంద్రబాబుకు నచ్చలేదు. రీసర్వేను ఓ అనాలోచిత నిర్ణయమంటూ చిందులు తొక్కారు. ఈ నెల 15న భూ, సహజ వనరుల దోపిడీపై శ్వేతపత్రం విడుదల సమయంలో రాష్ట్రంలో సమగ్ర భూ రీ సర్వే కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. 'ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నా హయాంలో కెనడా నుంచి హెలికాప్టర్లు తెప్పించి సర్వే చేస్తే హద్దులు మారిపోవడంతో ముందుకు వెళ్లలేదు. మరోసారి కాంగ్రెస్ ప్రభుత్వం రీసర్వే తలపెట్టి విఫలమైంది. కానీ, గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం శాశ్వత భూ హక్కు– భూ రక్ష పథకం పేరుతో అనాలోచితంగా రీ సర్వే చేపట్టింది. ఇది విఫల ప్రయత్నమే. ఇకపై భూ యజమానులు వచ్చి వారి హద్దులు నిర్ణయించమని కోరితే తప్ప ఎవ్వరికీ సర్వే చేసే ప్రసక్తి లేదు' అంటూ ఆరోజు సీఎం చంద్రబాబు హుంకరించారు. అయితే, భూముల రీ సర్వే చేపట్టే రాష్ట్రాలకు ప్రత్యేక ప్రయోజనాలు, రాయితీలు కల్పిస్తామని కేంద్ర ప్రభుత్వం మంగళవారం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ప్రకటించింది. దీనిద్వారా రీసర్వే మంచి కార్యక్రమమేనని తేల్చిచెప్పింది. దీంతో బాబు ప్రభుత్వం కంగుతింది. వెంటనే సర్దుబాటు చర్యలు ప్రారంభించింది. బుధవారం చంద్రబాబు అసెంబ్లీలో 'గత ప్రభుత్వం రీసర్వే మొత్తాన్ని సెటిల్‌మెంట్ కోసం చేసింది. డబ్బులైతే ఖర్చుపెట్టింది కానీ, వివాదాలు పెంచేశారు. రీ సర్వేను హోల్డ్ చేశాం. స్టే చేశాం. ఇవన్నీ క్షుణ్ణంగా స్టడీ చేసిన తర్వాతే చేస్తామని స్పష్టంగా హామీ ఇచ్చాం' అంటూ చెప్పుకొచ్చారు.

పాతపాటే పాడిన రైల్వేశాఖ

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో రైల్వే ప్రాజెక్టులకు కేటాయింపులు కొత్తసీసాలో పాతసారాను తలపించాయి. ఎన్నికల ముందు ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో పేర్కొన్న వాటికి మించి అదనంగా ఒక్కటి కూడా కేటాయించనే లేదు. ఎన్నికల ముందు కేంద్ర ప్రభుత్వం ఈ ఏడాది ఫిబ్రవరిలో ప్రవేశపెట్టిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.9,125 కోట్లు కేటాయించినట్టు తెలిపారు. అప్పట్లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి గతంలో కంటే భారీగా నిధులు కేటాయించేలా చేసింది. ఎన్నికల అనంతరం కేంద్రంలో ఏర్పడిన ఎన్డీయే ప్రభుత్వంలో టీడీపీ, జనసేన పార్టీలు భాగస్వాములుగా ఉన్నా.. కేంద్రం 2024–25కు ప్రవేశ పెట్టిన పూర్తిస్థాయి బడ్జెట్‌లో అదనంగా ఏమీ కేటాయించలేదు. ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయించిన రూ.9,125 కోట్లనే కేంద్ర రైల్వేశాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్ పునరుద్ఘాటించారు. 2009–14 మధ్య కాంగ్రెస్ ప్రభుత్వం కంటే 2014–24 మధ్య బీజేపీ ప్రభుత్వం ఏపీలో రైల్వే ప్రాజెక్టులకు భారీగా నిధులు కేటాయించినట్టు గతంలో చెప్పిన విషయాన్నే ప్రస్తావించారు. గతంలో ప్రకటించిన కొత్త లైన్లకు నిధుల కేటాయింపు.. ఇలా అన్ని అంశాల్లోనూ ఫిబ్రవరిలో ప్రకటించిన ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్‌లో కేటాయింపులనే కొత్తగా ప్రకటించి చేతులు దులుపుకొన్నారు.

ల్యాండ్ టైటిలింగ్ యాక్టు రద్దు

- వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరు డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీగా మార్పు
- ఈ రెండు బిల్లులకు శాసనసభ ఆమోదం

సాక్షి, అమరావతి: శాసనసభ బుధవారం రెండు బిల్లులకు ఆమోదం తెలిపింది. గత ప్రభుత్వం భూ సంస్కరణల్లో భాగంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు బిల్లు, డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీగా మార్చే బిల్లులను శాసనసభ ఏకగ్రీవంగా ఆమోదించింది. తొలుత రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, స్టాంపులశాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ ల్యాండ్ టైట్లింగ్ యాక్టు రద్దు బిల్లును ప్రవేశపెట్టారు. అనంతరం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం పేరును ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయంగా మారుస్తూ తెచ్చిన సవరణ బిల్లును శాసనసభ ముందు ఉంచారు. ఈ బిల్లులపై సభ్యులు చర్చించిన అనంతరం వీటిని శాసనసభ ఆమోదించినట్లు స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రకటించారు.

2014-24 మధ్యలో 1.81 లక్షల ఉద్యోగాల భర్తీ

మండలిలో ఆర్థిక మంత్రి పయ్యావుల జవాబు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 2014–24 మధ్య కాలంలో ప్రభుత్వం మొత్తం 1,81,208 ఉద్యోగాలను భర్తీ చేసిందని రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో చెప్పారు. 2014–19 మధ్య, 2019–24 మధ్య సంవత్సరాల్లో ప్రభుత్వం కల్పించిన ప్రభుత్వ ఉద్యోగాల సంఖ్యపై వైఎస్సార్‌సీపీ సభ్యులు లేళ్ల అప్పిరెడ్డి, రాజగొల్ల రమేష్‌యాదవ్, దువ్వాడ శ్రీనివాస్ అడిగిన ప్రశ్నకు ఆయన సభకు లిఖితపూర్వక సమాధానం ఇస్తూ పదేళ్లకు కలిపి ఒకటే సమాధానంగా వివరాలు పేర్కొన్నారు.

2022, 23లో పోలీసు శాఖలో వివిధ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్లు..

2022 నవంబర్ 28న పోలీసు శాఖలో 315 సివిల్ ఎస్ఐ పోస్టులు, 96 రిజర్వు ఎస్ఐ పోస్టులను భర్తీ చేసేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందని.. 2023 డిసెంబర్‌లోనే ఎంపిక జాబితాను జారీ చేసి, అన్ని పోస్టులను భర్తీ చేసిందని ప్రశ్నోత్తరాల సమయంలో హోం మంత్రి అనిత జవాబిచ్చారు. అనంతపురం పోలీసు శిక్షణ కాలేజీలో వారికి శిక్షణ కూడా కొనసాగుతున్నట్టు తెలిపారు. వీటికి అదనంగా 2022 నవంబర్‌లో 6100 మంది పోలీస్ కానిస్టేబుల్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా.. కోర్టులో కేసులు నమోదు కావడంతో నియామక ప్రక్రియ నిలిచిపోయిందని చెప్పారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza,2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed at Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenahalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

క్లుప్తంగా

పింఛన్లు సక్రమంగా అందించండి



వినతిపత్రం సమర్పిస్తున్న దృశ్యం

రాయచూరురూరల్: వృద్ధాప్య, వితంతు, దివ్యాంగులకు పెన్షన్లు సక్రమంగా అందించాలని కరవే డిమాండ్ చేసింది. ఈమేరకు బుధవారం కలెక్టరేట్ వద్ద ఆందోళన నిర్వహించారు. అధ్యక్షుడు ఖలీల్ పాషా మాట్లాడుతూ వివిధ పథకాల కింద పింఛన్లు అందక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. లబ్ధిదారులు నిత్యం తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వస్తోందన్నారు. గత ఏడాది నుంచి చాలా మందికి పింఛన్లు అందలేదన్నారు. ఆ మొత్తాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కార్యాలయ అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఉపాధ్యక్షుడిగా బాబురావు



నియామక పత్రం అందుకున్న బాబురావు

రాయచూరురూరల్: రాయచూరు జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడిగా దక్షిణ మధ్య రైల్వే బోర్డు మాజీ సలహాదారుడు బాబురావ్ నియమితులయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు, నగర ఎమ్మెల్యే శివరాజ్ పాటిల్ అదేశాలు జారీ చేశారు. జిల్లాలో పార్టీని బలోపేతం చేసి త్వరలో జరగనున్న జెడ్పీ, టీపీ ఎన్నికల్లో అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని జిల్లా అధ్యక్షుడు సూచించారు.

పావురాలను రక్షించబోయి ప్రాణాల మీదకు..

- విద్యుత్ షాక్‌తో బాలుడు మృతి

సాక్షి,బళ్లారి: విద్యుత్ స్తంభానికి చిక్కుకున్న పావురాలను రక్షించబోయిన బాలుడు మృతి చెందిన ఘటన బుధవారం చిత్రదుర్గ జిల్లా మొళకాల్మూరు తాలూకా హనుమాపుర గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన రామచంద్ర(12) అనే బాలుడు గ్రామంలోని విద్యుత్ స్తంభంపై వైర్లకు పావురాలు చిక్కుకుని చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న దృశ్యం చూసి చలించిపోయి వెంటనే తెలియనితనంతో విద్యుత్ స్తంభం ఎక్కి పావురాలను రక్షించబోయి, విద్యుత్ వైర్లు పట్టుకుని అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులు హుటాహుటిన పెద్ద సంఖ్యలో అక్కడికి చేరుకున్నారు. కుటుంబసభ్యుల రోదలను మిన్నంటాయి. అక్కడి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పరిశ్రమల కేంద్రానికి రక్షణ కల్పించండి



ఎస్పీ పుట్టమాదయ్యను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరురూరల్: రాయచూరు జిల్లా పరిశ్రమల కేంద్రానికి రక్షణ కల్పించాలని రాయచూరు జిల్లా చాంబర్స్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కమల్ కుమార్ అన్నారు. బుధవారం ఆయన ఎస్పీ పుట్టమాదయ్యను కలిసి సన్మానించి మాట్లాడారు. నగరంలో ట్రాఫిక్ సమస్య నెలకొందని, భారీ వాహనాల సంచారాన్ని నిషేధించాలని కోరారు. అదేవిధంగా అక్రమ బియ్యం రవాణాను అడ్డుకట్ట వేయాలన్నారు.

యువకుడు దారుణ హత్య

హుబ్లీ: ధార్వాడ శివారు హెబ్బళ్లి రోడ్డు గోవనకొప్ప క్రాస్ వద్ద బయలు స్థలంలో మంగళవారం రాత్రి యువకుడి దారుణ హత్య జరిగింది. ధార్వాడ దోరవీధి నివాసి హరీష్ షిండే(30) హత్యకు గురైన యువకుడు. రాళ్లతో కొట్టి పదునైన ఆయుధంతో ఈ హత్యకు పాల్పడ్డారు. కాగా హత్య చేసిందెవరు, ఏ కారణంగా హత్యకు పాల్పడ్డారన్న విషయం తెలియరాలేదు. నిందితుల అరెస్ట్ కోసం దర్యాప్తు ప్రారంభించిన ధార్వాడ గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేసుకున్నట్లు జిల్లా ఎస్పీ డాక్టర్ గోపాల బ్యాకోడ తెలిపారు.

జాగృతితోనే డెంగీ నియంత్రణ



జాతాను ప్రారంభిస్తున్న కలెక్టర్

రాయచూరురూరల్: ప్రజలను జాగృతి చేయడంతోనే జిల్లాలో డెంగీకి అడ్డుకట్ట వేయవచ్చని కలెక్టర్ నితీష్ అన్నారు. డెంగీపై అవగాహన కల్పించేందుకు బుధవారం ఏర్పాటు చేసిన జాతాను ఆయన కలెక్టరేట్ వద్ద ప్రారంభించి మాట్లాడారు. దోమల నివారణకు ఇంటి ముందు, మురుగు కాలువల వద్ద శుభ్రత పాటించాలన్నారు. తొట్టెలు, పూలకుండీల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచరాదన్నారు. వ్యక్తిగత శుభ్రతపై దృష్టి పెట్టాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ రాహుల్ తుకారాం పాండే, జిల్లా ఆరోగ్యాధికారి సురేంద్ర బాబు, రమేష్, వైద్యాధికారులు గణేష్,నందిత, యశోద, షాకీర్ పాల్గొన్నారు.

శాంతించని కృష్ణమ్మ



కాద్లూరు వద్ద నీట మునిగిన ఉపేంద్ర తీర్థ ఆలయం



రాయచూరు తాలూకాలో కృష్ణా నది ఉగ్రరూపం



శీలహళ్లి వద్ద నీట మునిగిన రోడ్డు వంతెన

- ఉత్తర, కళ్యాణ కర్ణాటక జిల్లాల్లో ముంపు భయం
- ఆల్మట్టి నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీరు నదికి విడుదల

రాయచూరు రూరల్: మహారాష్ట్రలోని పశ్చిమ కనుమలతో పాటు ఆల్మట్టి డ్యాం ఎగువ భాగంలో విస్తారంగా కురుస్తున్న వానలతో కృష్ణమ్మ ఉగ్రరూపం దాల్చింది. రోజురోజుకు పెరుగుతున్న వరదలతో ఉత్తర కర్ణాటకలోని బెళగావి, బాగల్‌కోటె, విజయపుర, గదగ్, కళ్యాణ కర్ణాటకలోని యాదగిరి, రాయచూరు జిల్లాల నదీ తీర లోతట్టు ప్రాంత వాసులు ముంపు భయం ఎదుర్కొంటున్నారు. ఎగువ నుంచి వస్తున్న వరద నేపథ్యంలో ఆల్మట్టి, నారాయణపుర డ్యాంల నుంచి 2 లక్షల క్యూసెక్కుల నీరు దిగువకు వదిలారు. నదీ తీర ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు ప్రమాదపు హెచ్చరికలు జారీ చేశారు. రాయచూరు తాలూకా కాద్లూరు వద్ద ఉపేంద్ర తీర్థ ఆలయం నీట మునిగింది. జిల్లాలోని లింగసూగూరు, దేవదుర్గ, రాయచూరు తాలూకాల్లో అధికారులు పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

ఉప్పొంగుతున్న నదులు:

మహారాష్ట్రలో కురుస్తున్న భారీ వర్షాల వల్ల కోయ్నా జలాశయం నుంచి వరద నీటిని విడుదల చేయడంతో ఉత్తర కర్ణాటకలో కృష్ణమ్మ పొంగి ప్రవహిస్తోంది. కృష్ణా నదికి ఉపనదులైన దూద్‌గంగా, వేదగంగా, ఘటప్రభ, మలప్రభ నదులు కూడా వరద నీటితో పరవళ్లు తొక్కుతున్నాయి. బెళగావి జిల్లాలో శంకర లింగ ఆలయం నీట మునిగింది. లింగసూగూరు తాలూకాలో శీలహళ్లి వంతెన వద్ద నది ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దేవదుర్గ తాలూకాలో హూవిన హెడగి వంతెనపైకి నీరు రావడానికి కేవలం రెండు అడుగులు మాత్రమే మిగిలి ఉంది.



పశువులను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్న దృశ్యం

అల్పాహారం తిని అస్వస్థత

- రిమ్స్ ఆస్పత్రిలో మెరుగైన చికిత్స
- విద్యార్థులకు డీహెచ్ఓ పరామర్శ



విద్యార్థులకు చికిత్స అందిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: అల్పాహారం తిని 40 మంది విద్యార్థులు అస్వస్థతకు లోనై ఆస్పత్రి పాలైన ఘటన నగరంలో చోటు చేసుకుంది. బుధవారం చంద్రబండ రహదారిలోని మొరార్జి దేశాయి గురుకుల పాఠశాల హాస్టల్‌లో పలావ్ తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని అధికారులు, సిబ్బంది హుటాహుటిన రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స కోసం చేర్పించారు. విషయం తెలుసుకున్న జిల్లా ఆరోగ్య అధికారి డాక్టర్ సురేంద్ర బాబు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. పలావ్‌లో బల్లి పడిందనే విషయం తెలిసింది. దానిని తిన్న విద్యార్థులు అస్వస్థతకు గురికావడంతో ఆస్పత్రి సిబ్బంది వెంటనే చికిత్స అందజేశారు.



విద్యార్థులను పరామర్శిస్తున్న డీహెచ్ఓ

వరద పరిస్థితిని నిభాయించండి

- జిల్లాధికారి దివాకర్ సూచన

హొసపేటె: ఎగువన కురుస్తున్న వర్షాలతో విజయనగర జిల్లాలో తుంగభద్ర నదీ తీరంలో తలెత్తిన వరద పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోవాలని జిల్లా విపత్తు నిర్వహణ అథారిటీ చైర్మన్, జిల్లాధికారి ఎంఎస్ దివాకర్ అధికారులకు సూచించారు. ఆయన బుధవారం తన కార్యాలయ సభామందిరంలో అధికారులతో ఏర్పాటు చేసిన వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో మాట్లాడారు. నోడల్ అధికారులు ఎలాంటి సమస్యనైనా ఎదుర్కొనేందుకు తగిన ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. వరదలు వచ్చే అవకాశం ఉన్న నదీ పరివాహక ప్రాంతంలోని మొత్తం 22 గ్రామాల్లో ఇప్పటికే నోడల్ అధికారులను నియమించామన్నారు. రానున్న రోజుల్లో వర్షాకాలం ముగిసే వరకు ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా తగిన సన్నాహాలు చేయాలని వివిధ శాఖల అధికారులకు గట్టి ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలోని తుంగభద్ర రిజర్వాయర్ నుంచి భారీగా నీటిని విడుదల చేస్తేనే జిల్లాలోని 22 నదీ పరివాహక గ్రామాలు ముంపునకు గురవుతాయన్నారు. ఇప్పటికే నియమితులైన నోడల్ అధికారులు ప్రతివారం తమకు కేటాయించిన గ్రామాలను సందర్శించి నివేదికను సమర్పించాలన్నారు. ఈ సందర్భంగా జెడ్పీ సీఈఓ మహమ్మద్ అలీ అక్రమ్ షా, హొసపేటె, హరపనహళ్లి అసిస్టెంట్ కమిషనర్లు, వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకులు, ఉద్యానవన శాఖ డిప్యూటీ డైరెక్టర్, పశు సంవర్ధక, పశువైద్య శాఖాధికారులు, జిల్లాలోని అన్ని తాలూకాల తహసీల్దార్లు, అన్ని తాలూకా పంచాయతీల కార్యనిర్వాహక అధికారులు, వివిధ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

ప్రియురాలి మనసు విరిచినందుకే..

- వైష్ణోదేవి ఆలయ అర్చకుడి హత్య కేసులో నిందితుడి అరెస్ట్
- మరింత లోతుగా దర్యాప్తు చేస్తాం: పోలీస్ కమిషనర్ శశికుమార్

హుబ్లీ: గతంలో తాను ప్రేమించిన అమ్మాయికి తనపై చాడీలు చెప్పినా ఆమె మనస్సు మార్చాడనే ద్వేషంతో స్థానిక ఈశ్వర్ నగర్ వైష్ణోదేవి ఆలయం వ్యవస్థాపకులు, ప్రధాన పూజారి దేవేంద్రప్ప వనహళ్లి(63) హత్యకు పాల్పడిన కేసులో నిందితుడిని హుబ్లీ ధార్వాడ కమిషనరేట్ పోలీసులు అరెస్ట్ చేశారు. కేసుకు సంబంధించి స్థానిక కమరిపేట అడ్డా నివాసి సంతోష్ బోజగార (44) అనే వ్యక్తిని అక్కడి చెన్నమ్మ సర్కిల్‌లో అరెస్ట్ చేశారు. విచారణ వేళ హత్య చేసినట్లుగా నిందితుడు పెదవి విప్పాడు. నిందితుడిని జుడీషియల్ కస్టడీకి అప్పగించి మరింత దర్యాప్తు కోసం పోలీస్ కస్టడీకి తీసుకోవాలని నిర్ణయించినట్లుగా జంట నగరాల పోలీస్ కమిషనర్ ఎన్.శశికుమార్ మీడియాకు తెలియజేశారు. పూజారి దేవేంద్రప్ప వివిధ రకాల పూజ ప్రక్రియలు నిర్వహించేవాడు. ఈక్రమంలో సంతోష్ బోజగార కుటుంబానికి వ్యతిరేకంగా కూడా ఇలాంటి పూజలు నిర్వహించాడు. దీంతో తమ కుటుంబంపై దుష్పరిణామాలు కలిగి కుటుంబంలోని కొందరు సభ్యులు మృతి చెందారు.

8 ప్రత్యేక బృందాలతో చురుగ్గా గాలింపు

దీన్ని మనస్సులో పెట్టుకున్న నిందితుడు సంతోష్ ఈ నెల 21న దేవప్పను చాకుతో పొడిచి హత్య చేసి పరారైన సంగతి తెలిసిందే. ఆ మేరకు 8 ప్రత్యేక దర్యాప్తు బృందాలు చురుకుగా గాలింపు చర్యలు చేపట్టి నిందితుడిని పట్టుకున్నారు. 2022లో మార్చిలో కూడా దేవప్పపై హత్యాయత్నం జరిగింది. దీంతో దర్యాప్తు బృందాలు అప్పటి, ఇప్పటి సీసీటీవీ వీడియో దృశ్యాలు పరిశీలించి అనుమానాస్పద ఫొటోను మీడియాలో ప్రకటించారు. ఈ క్రమంలోనే స్థానికులు నిందితుడిని గుర్తు పట్టి పోలీసులకు ఫలానా వ్యక్తి అని సమాచారం ఇచ్చారు. ఇప్పటి వరకు దర్యాప్తులో సంతోష్ ఒకడే హత్య పథకం రూపొందించి హత్య చేయడం వరకు తెలిసింది. ఘటన అనంతరం ధరించిన జర్కిన్, చాకు పారవేసినట్లుగా నిందితుడు పేర్కొన్నాడు. వాటిని స్వాధీనం చేసుకొని అన్ని కోణాల్లో దర్యాప్తు చేపడుతామని కమిషనర్ తెలిపారు.

హతుడి కదలికలపై నిరంతర రెక్కీ

కాగా నిందితుడు గత ఆరున్నరేళ్ల నుంచి మనసులో కక్ష పెట్టుకొని దేవేంద్రప్పను మట్టుపెట్టాలని నిరంతరంగా ఆయన కార్యకలాపాలపై దృష్టి పెట్టాడు. ఈ నేపథ్యంలో పూజారి ఇళ్లు, ఆలయం చుట్టు సంచరించేవాడని అవసరమైన సాక్ష్యాలు లభించాయి. 2022లో హత్యకు ఉపయోగించిన చాకు విరిగిపోవడంతో ఆ హత్యయత్నం విఫలం అయింది. దీంతో రూ.250 ఖర్చు పెట్టి మంచి చూపైన చాకును కొనుగోలు చేసినట్లు కమిషనర్ తెలిపారు. కాగా నిందితుడు సంతోష్ కోవిడ్‌కు ముందు వాహనాలు శుభ్రం చేసేవాడు. ఇటీవల ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. నిందితుడు నివసించే కమరిపేటె చుట్టు పక్కల అతడి బంధువుల ఇళ్లు ఉన్నాయి. ఇతడి సోదరుడు, ఇతరులు దేవేంద్రప్పతో కలిసి పూజలు చేయడానికి వెళ్లేవారు. తన కుటుంబానికి దేవేంద్రప్ప నుంచి అన్యాయం జరిగింది అన్న కసితోనే ఈ దారుణానికి పాల్పడ్డాడని కమిషనర్ వివరించారు.

మెదడు ఆరోగ్యానికి యోగా, ధ్యానం అవసరం

హొసపేటె: రోజువారీ జీవితంలో మెదడుపై పడే ఒత్తిడిని తగ్గించేందుకు యోగా, ధ్యానం చేయాలని జిల్లా ఆరోగ్య, కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ ఎల్ఆర్ శంకర్ నాయక్ సూచించారు. ప్రపంచ మెదడు దినోత్సవంలో భాగంగా కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇన్సియేటివ్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ శాఖ, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జాతాను ఆయన ప్రారంభించి మాట్లాడారు. మానవ శరీరంలో మెదడు ముఖ్యమైన పాత్ర పోషిస్తుందన్నారు. శారీరక శ్రమ, ఆరోగ్యకరమైన నిద్ర, ఆరోగ్యకరమైన అలవాట్లు, కొత్త కార్యకలాపాలు మెదడును ఆరోగ్యంగా ఉంచుతాయన్నారు. అతిగా ఆలోచించడం నేరుగా మెదడుపై ప్రభావం చూపుతుందన్నారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్.ఎస్.సలీమ్, కుష్టు నిర్మూలన అధికారి డాక్టర్.రాధిక కే, ప్రభుత్వ వైద్యుడు డాక్టర్ సోమశేఖర్ కే, ఆర్‌సీహెచ్ అధికారి డాక్టర్.జంబయ్య, కుటుంబ సంక్షేమ కార్యక్రమ అమలు అధికారి డాక్టర్.వినయ్ పట్నే, సర్వేయర్ డాక్టర్ షణ్ముక్ నాయక్, ఆరోగ్య విద్యాశాఖాధికారి డాక్టర్ దొడ్డమణి ఎంపీపీ, కర్ణాటక బ్రెయిన్ హెల్త్ ఇన్సియేటివ్ కోఆర్డినేటర్ గిరీష్ ఆర్, తాలూకా ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ సోమశేఖర్ కబీర్ ప్రత్యేక ఉపన్యాసం చేశారు.



జాతాను ప్రారంభిస్తున్న అధికారి డాక్టర్ శంకర్‌నాయక్

వరదనష్టం నివారణకు ముందస్తు చర్యలు

బళ్లారిటౌన్: ప్రస్తుతం ఎగువ ప్రాంతంలో భారీగా వర్షాలు కురుస్తున్నందున తుంగభద్ర జలాశయం కూడా పూర్తి స్థాయిలో నిండుతున్న నేపథ్యంలో నీటిని తుంగభద్ర నదికి వదులుతున్నందున వరద నీటి ముంపు వల్ల ఎలాంటి నష్టం జరగకుండా ఉండేందుకు తగిన ముందస్తు చర్యలను తీసుకుంటున్నట్లు జిల్లా విపత్తు నిర్వహణ ప్రాధికారం అధ్యక్షుడు, జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా పేర్కొన్నారు. బుధవారం స్థానిక ప్రభుత్వ అతిథిగృహంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దీనిపై ఈ విపత్తు ముందస్తు చర్యల పట్ల అన్ని శాఖల అధికారులతో స్థానిక జిల్లా పాలన భవనంలో వీడియో సభాంగణంలో అధికారులతో చర్చించినట్లు ఆయన పేర్కొన్నారు. బళ్లారి, కంప్లి, సిరుగుప్ప తాలూకాల్లో వేదవతి నదికి ఆనుకుని ఉన్న పలు గ్రామాలకు గుర్తించి ముందు జాగ్రత్తలకు సూచించినట్లు తెలిపారు. ఆయా గ్రామ అభివృద్ధి అధికారు(పీడీఓ)లతో సంయుక్తంగా సమావేశం నిర్వహించి తహసీల్దార్లను ఆదేశించినట్లు తెలిపారు. వారంలోగా ప్రవాహం వల్ల నష్టపోయిన గ్రామాలను సందర్శించి సమీక్ష జరిపి ఎప్పటికప్పుడు తమకు నివేదిక అందించాలని సూచించామన్నారు.

వంతెనలపై కూడా నిఘా పెట్టండి

సిరుగుప్ప తాలూకాలోని రారావి వంతెన, కంప్లి వంతెనలపై కూడా తగిన నిఘా ఉంచాలని అధికారులకు సూచించామని అన్నారు. పంట పొలాలపై నష్టాలను కూడా సంబంధిత వ్యవసాయ ఉద్యానవన శాఖ అధికారులు కూడా సూచించినట్లు కూడా తెలిపారు. జిల్లాలో 78 శాతం పాణీలను ఆధార్ లింక్ చేసినట్లు తెలిపారు. మిగిలిన 22 శాతం కూడా పూర్తి చేసే దిశలో అధికారులకు సూచించినట్లు తెలిపారు. నకిలీ దాఖలాలు సృష్టించి రిజిస్టర్ చేసుకోవడానికి క్లెయిం వేసినట్లు అవుతుందన్నారు. ఫసల్ బీమా పథకం కింద రైతులకు ఖరీఫ్ సీజన్ బీమా చేసుకోవాలని రైతులకు మనవి చేశారు. జిల్లాలో 114 డెంగీ కేసులు కనిపించగా, ఇందులో 23 కేసులు కోలుకున్నట్లు తెలిపారు. మిగిలిన కేసుల్లో కూడా త్వరలోనే కోలుకుంటారన్నారు. డెంగీ వల్ల ఏ ఒక్కరు కూడా మృతి చెందలేదని వివరించారు. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో ప్రజల సహకారంతో ఎన్నికలు విజయవంతం అయ్యాయని గుర్తు చేశారు. ఈ సమావేశంలో ఏడీసీ మహమ్మద్ ఝుబేర, ఎస్పీ శోభారాణి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లాధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

ఇంటింటికీ వెళ్లి డెంగీపై అవగాహన కల్పించండి

హొసపేటె: విజయనగర జిల్లాలో డెంగీ, చికన్‌గున్యా నియంత్రణకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ అధికారులను ఆదేశించారు. సాంక్రమిక వ్యాధుల నియంత్రణపై కలెక్టరేట్‌లో ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశానికి ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. దోమల వల్ల డెంగీ వ్యాపిస్తుందని, దోమల నివారణపై ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. అధికారులు, సిబ్బంది బృందాలు ఏర్పడి నగరాల్లో ఇంటింటికీ వెళ్లి ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. నిలబడి ఉన్న నీటిలో డెంగీకి కారణమయ్యే దోమలు ఉత్పత్తి అవుతాయని, ఇలాంటి స్థలాలను గుర్తించి రసాయనాలు పిచికారీ చేయించాలని సూచించారు. డెంగీ లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను ఆశ్రయించేలా అవగాహన కల్పించాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ, ఆశా వర్కర్ల ద్వారా ఆరోగ్య చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. మనోహర్, అర్బన్ డెవలప్‌మెంట్ సెల్ ప్రాజెక్ట్ డైరెక్టర్, జిల్లా ఆరోగ్య కుటుంబ సంక్షేమ అధికారి డాక్టర్ శంకర్‌నాయక్, తదితరులు పాల్గొన్నారు.

వినాయక ఆలయంలో పూజలు

కోలారు: సంకష్ట చతుర్థిని పురస్కరించుకుని ముళబాగిలు తాలూకా కురుడుమలై గ్రామంలో వినాయక దేవాలయంలో బుధవారం స్వామివారికి విశేష పూజలు నిర్వహించారు. వినాయక విగ్రహాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి దర్శనం చేసుకున్నారు.

లైంగిక దౌర్జన్య నిందితుడికి 20 ఏళ్ల శిక్ష

హుబ్లీ: మైనర్ బాలికను అపహరించి లైంగిక దౌర్జన్యానికి పాల్పడిన నిందితుడికి 20 ఏళ్ల కఠిన జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ కొప్పళ పోక్సో అదనపు జిల్లా సెషన్స్ జడ్జి మంగళవారం ఆదేశాలను ఇచ్చారు. గజేంద్రగడ తాలూకా నెల్లూరు గ్రామానికి చెందిన కుమార్ చవాన్ శిక్షకు గురైన వ్యక్తి. యలబుర్గ పోలీస్ స్టేషన్ పరిధిలో బాధితురాలి ఇంట్లో ఉంటున్న అతడు ఆమెతో సఖ్యత పెంచుకున్నాడు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో రెండు, మూడు సార్లు లైంగిక దౌర్జన్యానికి పాల్పడి పెళ్లి చేసుకుంటానని నమ్మించి 2021 ఆగస్టు 22న బాలికను కిడ్నాప్ చేశాడు. ముధోళ తాలూకా మల్లల్లి గ్రామం రేకుల షెడ్డులో రెండున్నర నెలలు బాలికను బంధించాడు. అక్కడ కూడా లైంగిక దౌర్జన్యానికి పాల్పడ్డాడని కేసు దర్యాప్తు చేపట్టిన యలబుర్గ రూరల్ పోలీస్ స్టేషన్ సీఐ ఎం నాగిరెడ్డి కోర్టుకు చార్జిషీట్ సమర్పించారు. ప్రభుత్వం తరఫున ప్రత్యేక న్యాయవాది గౌరమ్మ దేశాయి వాదించారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు సర్కార్ వంచన

కోలారు: ఎస్సీ, ఎస్టీ సముదాయాలకు చెందిన ప్రతిభావంత విద్యార్థులను ప్రభుత్వం విస్మరించిందని కర్ణాటక దళిత సంఘర్ష సమితి భీమవాద జిల్లా అధ్యక్షుడు వక్కలేరి శంకరప్ప ఆరోపించారు. సర్కార్ తీరును ఎండగట్టేందుకు రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేయడానికి ఈ నెల 25న రాష్ట్ర సమితి సభలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వెనుకబడిన వర్గాలకు తొలుత విద్యను అందుబాటులోకి తేవాలనేది అంబేడ్కర్ ఆశయమన్నారు. ఈ ఆశయాన్ని నెరవేర్చడంలో ప్రభుత్వం, సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి హెచ్‌సీ మహదేవప్ప విఫలమయ్యారన్నారు. సామాజిక న్యాయం పేరుతో అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం.. ఎస్సీ, ఎస్టీలను పూర్తిగా విస్మరించిందన్నారు. ఇందుకు నైతిక బాధ్యత వహిస్తూ సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కోడికణ్ణూరు నాగరాజ్, హర్జేనహళ్లి కృష్ణప్ప, రవిచంద్రన్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వక్కలేరి శంకరప్ప

గురువు లేనిదే విజయం అసాధ్యం

కోలారు: గురువు లేనిదే జీవితంలో విజయం సాధించడం అసాధ్యమని నివృత్త ఉపాధ్యాయుడు సంగణ్ణ తెలిపారు. తాలూకాలోని బెగ్లి హొసహళ్లి గ్రామ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన గురువందన, స్నేహ సమ్మిలన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. జీవితానికి దారి దీపమైన గురువును స్మరించుకోవడం గొప్ప విషయమన్నారు. నేటి విద్యా వ్యవస్థ దారి తప్పుతోందన్నారు. పిల్లలను దండించరాదు, కోపంగా కూడా చూడరాదు అనే వాతావరణంలో ఉపాధ్యాయులు పాఠాలు బోధించాల్సి పరిస్థితి నెలకొందన్నారు. నివృత్త ప్రధానోపాధ్యాయుడు వెంకటేశప్ప మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంచాలన్నారు. ఉపాధ్యాయులు ఆర్ శ్రీనివాసన్, ముని వెంకటప్ప, రమేష్, చంద్రకాంత, మేరీ ఎలిజబెత్ రాణి తదితరులు పాల్గొన్నారు.

తుంగభద్ర వరద యథాతథం



తుంగభద్ర డ్యాం వద్ద నుంచి దిగువకు నీటిని వదిలిన దృశ్యం

- 10 గేట్ల నుంచి దిగువకు 20 వేల క్యూసెక్కుల విడుదల

హొసపేటె: కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల పలు జిల్లా ప్రజలకు, రైతులకు తాగు, సాగు నీరందించే ప్రధాన జలాశయమైన తుంగభద్ర డ్యాంకు బుధవారం 87,700 క్యూసెక్కుల మేర భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. దీంతో డ్యాం వద్ద 10 గేట్లద్వారా అడుగు మేర పైకెత్తి దిగువకు సుమారు 20 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ప్రస్తుతం డ్యాంలో నీటినిల్వ 96.914 టీఎంసీలకు చేరుకొంది. డ్యాంకు ఎగువన శివమొగ్గ, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబె, చిక్కమగళూరు తదితర ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు తుంగభద్ర జలాశయానికి వరద యథావిధంగా కొనసాగుతోంది. ప్రస్తుతం డ్యాంలో నీటిమట్టం 1630.75 అడుగులకు చేరుకొంది. ఔట్‌ఫ్లో 18,686 క్యూసెక్కులుగా ఉందని మండలి అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఏ సమయంలో అయినా డ్యాంకు సంబంధించిన మరిన్ని క్రస్ట్‌గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

అనాథ పిల్లల పునర్వసతిపై కలెక్టర్ సమీక్ష

కోలారు : ఆరు సంవత్సరాలలోపు నిర్గతిక అనాథ పిల్లల పునర్వసతికి ప్రభుత్వ దత్తు సంస్థ అందిస్తున్న సేవలపై జిల్లా కలెక్టర్ అక్రం పాషా సమీక్ష చేశారు. స్త్రీ శిశు సంక్షేమ శాఖ, పిల్లల రక్షణ నిర్దేశనాలయం, మిషన్ వాత్సల్య పథకం, జిల్లా పిల్లల రక్షణా విభాగం ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన మిషన్ వాత్సల్య వివిధ పథకాల త్రైమాసిక సభకు ఆయన అధ్యక్షత వహించి మాట్లాడారు. ఇలాంటి పిల్లలకు శాశ్వత కుటుంబ వ్యవస్థను చట్టబద్ధంగా కల్పించడానికి దత్తు సంస్థ సహకారి అవుతుందన్నారు. జిల్లాలోని దత్తు సంస్థలలో 52 మంది పిల్లల దాఖలు అయ్యారన్నారు. పీఎం కేర్ ఫర్ చిల్డ్రన్ పథకం కింద 8 మంది పిల్లల సమాచారాన్ని పీఎం కేర్ పోర్టల్‌లో చేర్చినట్లు తెలిపారు. ఈసందర్భంగా జిల్లా కానూను సేవల ప్రాధికార కార్యదర్శి, సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని, జిల్లా ఎస్పీ నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అక్రం పాషా

బైక్ దొంగ అరెస్ట్



పట్టుబడిన దొంగ, పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

శ్రీనివాసపురం: బైక్ చోరీలకు పాల్పడుతున్న దొంగను గౌనిపల్లి పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి వద్దనుంచి రూ.2.75 లక్షల విలువ చేసే 6 బైక్‌లు స్వాధీనం చేసుకున్నారు. బైక్‌లను సొంతదారులకు అప్పగించారు. గౌనిపల్లి పోలీసుల కార్యవైఖరిని ఎస్పీ నిఖిల్ ప్రశంసించారు.